వాకిలి
గత వారం రోజుల్లో జరిగిన విశేషాలు
ఇతర రాష్ట్రాలు, ప్రపంచ దేశాల ముఖ్యమైన పరిణామాలు
సామాజిక, ఆర్థిక, రాజకీయ పుస్తక సమీక్షలు
ప్రతి ఆదివారం 'వార్త' మెయిన్‌లో ఒక పూర్తి పేజీ

తెలుగు జాతీయ దినపత్రిక
# వార్త
epaper.vaartha.com WWW.VAARTHA.COM
రాజమహేంద్రవరం
: fb.com/vaartha Digital
Published from Rajahmundry, Vijayawada, Hyderabad, Visakhapatnam, Guntur, Nizamabad, Ongole, Warangal, Tirupathi, Kadapa, Kurnool, Anantapur, Karimnagar, Mahabubnagar, Khammam, Nellore, Nalgonda, Tadepalligudem, Srikakulam
30-7-2025 బుధవారం సంపుటి: 31 సంచిక: 179 పేజీలు: 12 వెల: 6.50

**చైనాలో భారీ వరదలు.. 34 మంది మృతి** 5లో

**బీహార్ 'సర్'లో తప్పులుంటే జోక్యం తప్పదు: సుప్రీం**

# ఎపికి సింగపూర్ చేయూత

**అమరావతి అభివృద్ధికి భాగస్వామినవుతాం**

**వ్యవసాయం, పునరుత్పాదక ఇంధనం తదితర రంగాలకు సింగపూర్ సాయం**

**పెట్టుబడులపై సిఎం చంద్రబాబుతో చర్చలు: సింగపూర్ మంత్రి టాన్సీలెంగ్**

**ధన్యవాదాలు తెలిపిన ముఖ్యమంత్రి**



సింగపూర్ మంత్రి టాన్సీ లెంగ్‌తో భేటీ అయిన సిఎం చంద్రబాబు

**విజయవాడ జూలై 29,ప్రభాతవార్తప్రతినిధి:** సిఎం చంద్రబాబు సింగపూర్ పర్యటనలో ఉండగానే ఆ దేశ మానవనరులు, సైన్స్ అండ్ టెక్నాలజీ మంత్రి టాన్సీ లెంగ్ కీలక ప్రకటనచేశారు. వివిధ రంగాల్లో ఎపి ప్రభుత్వంతో కలిసి పని చేయడానికి సంసిద్ధతను వ్యక్తం చేయడమే కాకుండా.. గత ప్రభుత్వ విధానాలను ప్రస్తావిస్తూ ఎక్స్ వేదికగా సింగపూర్ మంత్రిచేసిన ప్రకటన ఆసక్తిని రేకెత్తిస్తోంది. ఆంధ్రప్రదేశ్, అమరావతి అభివృద్ధిలో సింగపూర్ భాగస్వామ్యంగా ఉండేందుకు సిద్ధంగా ఉందని ఆ దేశ ట్రేడ్ ఇండస్ట్రీ శాఖలోని మానవ వనరులు, శాస్త్రసాంకేతిక మంత్రి టాన్ సీ లెంగ్ స్పష్టం చేశారు. ముఖ్యమంత్రి చంద్రబాబుతో జరిగిన సమావేశంపై ఎక్స్ హ్యాండిల్‌లో ట్వీట్ చేసిన ఆయన ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని ప్రాజెక్టుల్లో ఎపితో కలిసి పని చేసేందుకు సిద్ధంగా ఉన్నట్లు వెల్లడించారు. వ్యవసాయం, ఫుడ్ ప్రాసెసింగ్, పునరుత్పాదక ఇంధనం లాంటి రంగాలు పెట్టుబడులకు అనుకూలమని టాన్సీ లెంగ్ పేర్కొన్నారు.

భారత్‌లో అత్యంతవేగంగా ఎదుగుతున్న రాష్ట్రాల్లో ఒకటైన ఎపిలో ఫుడ్ ఎంపైర్, ఎవర్ వోల్ట్ లాంటి సింగపూర్ కంపెనీలు ఇప్పటికే ఎపిలో పెట్టుబడులు, కార్యకలాపాల విస్తరణకుఆసంస్థలు ఎదురు చూస్తున్నాయని పేర్కొన్నారు. అలాగే పోర్టులు, గ్రీన్ ఎనర్జీ, డిజిటల్ టెక్నాలజీ, నైపుణ్యాభివృద్ధి రంగాల్లో పెట్టుబడులతో పాటు భాగస్వామ్యాలకు ఉన్న అవకాశాలపై సిఎం చంద్రబాబుతో చర్చించినట్టు సింగపూర్ మంత్రి టాన్ సీ లెంగ్ స్పష్టం చేశారు. మరోవైపు 2014–2019లో చంద్రబాబు అధికారంలో ఉన్నప్పుడు ఎపి రాజధాని అమరావతి అభివృద్ధికి నాటి ప్రభుత్వంతో >>2

**ఎఐ, రిసెర్చి, ఇన్నోవేషన్ సెంటర్ల ఏర్పాటుకు సహకరించండి** 2లో

**ఎఐ సింగపూర్ సంస్థ ప్రతినిధితో సిఎం చంద్రబాబు**


మంగళవారం సింగపూర్ అధ్యక్షుడు థర్మన్ షణ్ముగరత్నంతో సిఎం చంద్రబాబు భేటీ అయిన దృశ్యం

## సింగపూర్ అధ్యక్షుడు షణ్ముగరత్నంతో సిఎం చంద్రబాబు భేటీ

**వివిధ రంగాలలో ఎపితో భాగస్వామ్యంపై చర్చలు**

**విజయవాడ, జూలై 29ప్రభాతవార్తప్రతినిధి:** ఎపి అభివృద్ధిలో సింగపూర్ భాగస్వామ్యాన్ని అన్ని రంగాల్లో అందించాలని రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆ దేశ అధ్యక్షుడు థర్మన్ షణ్ముగరత్నంను కోరారు.అమరావతి రాజధాని నిర్మాణాన్ని సింగపూర్ తరహాలో వ్యాపార, వాణిజ్య, పారిశ్రామికరంగాల్లోను,ఐటి,ఎఐలో విస్తృతంగా రూపొందించాలని భావిస్తున్నామని ఇందుకు సహకరించాలని కోరారు. సింగపూర్ పర్యటనలో భాగంగా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, మంత్రులు నారా లోకేష్, నారాయణ, టిజి భరత్‌లతో ఆదేశ అధ్యక్షుడు థర్మన్ షణ్ముగరత్నంను కలుసుకున్నారు.ఒక విజన్‌తో ఎపిని ముందుకు నడిపిస్తున్నట్లు తెలిపారు. ప్రధాని నరేంద్ర మోడీ నేతృత్వంలో భారత్ అత్యంత బలీయైన ఆర్థిక వ్యవస్థగా ప్రపంచంలో నిలిచిందన్నారు.,2047 వికసిత్ భారత్ లక్ష్యాలకు అనుగుణంగా మరింత శక్తివంతంగా నిలుస్తోందన్నారు. ఎపి సింగపూర్ ప్రభుత్వాలుకలిసి వివిధరంగాల్లో పనిచేసే అంశంపై చర్చించారు. ఈ పర్యటనతో >>2

## తెలంగాణలో చదివినా 'నీట్'లో ఎపి విద్యార్థులు స్థానికులే

**- హైకోర్టు స్పష్టీకరణ**

**విజయవాడ,జూలై29,ప్రభాతవార్తప్రతినిధి:** మెడికల్ సీట్ల భర్తీకి నిర్వహించే కౌన్సెలింగ్‌లో తమను స్థానికులుగా పరిగణించాలంటూ నీట్ పరీక్ష రాసిన పలువురు అభ్యర్థులు హైకోర్టును ఆశ్రయించారు. రాష్ట్రంలో పదో తరగతి వరకు చదివి, ఇంటర్ ఇతర రాష్ట్రాల్లో చదువుకున్న విద్యార్థులను స్థానికులుగా పరిగణించాలంటూ దాఖలైన పిటిషన్‌లపై హైకోర్టు సోమవారం విచారణ చేపట్టింది. నీట్ పరీక్ష రాసేనాటికి విద్యార్థులు వరుసగా నాలుగేళ్ల రాష్ట్రంలో చదివి ఉండాలనే నిబంధన వల్ల తీరని అన్యాయం జరుగుతోందని >>2

## రాజమండ్రి రైల్వే స్టేషన్ అభివృద్ధికి రూ.252 కోట్లు

**గుంతకల్, గుంటూరు డివిజన్లలో కవచ్‌కు రూ. 63 కోట్లు**

**రాజంపేట, జూలై 29 ప్రభాతవార్త :** రాష్ట్రంలోని అతి ముఖ్యమైన రైల్వేస్టేషన్లో ఒకటైన రాజమండ్రి రైల్వే స్టేషన్ సమగ్ర అభివృద్ధికి దక్షిణ మధ్య రైల్వే నిర్ణయం తీసుకుంది. రాజమండ్రి రైల్వే స్టేషన్ రూపురేఖలు మార్చేందుకు కేంద్ర రైల్వే బోర్డు 252 కోట్ల నిధులను మంజూరు చేసింది. రాజమండ్రి ఎంపీ దగ్గుపాటి పురంధరేశ్వరి కృషితో నిధుల కేటాయింపుకు మార్గం సుగమమైంది. అంతేకాకుండా దక్షిణ మధ్య రైల్వే నిర్మాణ విభాగం గురువారం నుంచి టెండర్ల ప్రక్రియ ప్రారంభించేందుకు ఉత్తర్వులు జారీ చేసింది. 252.74 కోట్ల అంచనా వ్యయంతో పనులను చేపట్టనున్నారు. 36 నెలల్లోగా ఈ పనులు పూర్తి చేయాలని దక్షిణ మధ్య రైల్వే టెండర్లలో షరతు విధించింది. వైజాగ్ నుంచి కొత్త రైల్వే జోన్ ప్రారంభం కాక మునుపే దక్షిణ మధ్య రైల్వే రాజమండ్రి రైల్వే స్టేషన్ అభివృద్ధికి నిర్ణయం తీసుకోవడం >>2

## అండమాన్ నికోబార్ దీవుల్లో భూకంపం

**న్యూఢిల్లీ,జూలై 29:** అండమాన్ నికోబార్ దీవుల్లో భారీ భూకంపం వచ్చింది. సోమవారం అర్ధరాత్రి 12.11 గంటల సమయంలో 6.5 తీవ్రతతో భూమి కంపించింది. భూ అంతర్భాగంలో 10 కిలోమీటర్ల లోతులో కదలికలు చోటుచేసుకున్నాయని నేషనల్ సెంటర్ ఫర్ సీస్మాలజీ వెల్లడించింది. నికోబార్ దీవుల్లో భూకంప కేంద్రం ఉన్నదని పేర్కొంది. సునామీ వచ్చే ప్రమాదం ఏమీ లేదని తెలిపింది. భూకంపం వల్ల జరిగిన నష్టానికి సంబంధించిన వివరాలు ఇంకా తెలియరాలేదని అధికారులు చెప్పారు. మరోవైపు బంగాళా ఖాతంలో కూడా భూమి కంపించందని, దీని తీవ్రత 6.3గా నమోదయిందని ఎన్‌సీఎస్ తెలిపింది. దీనిప్రభావంతో సముద్ర తీరంలోని దీవుల్లో ప్రకంపణలు చోటుచేసుకున్నాయని వెల్లడించింది. ఇక ఇండో నేషియాలో కూడా భూకంపం వచ్చింది.

## ఏనుగుల సంచారంపై వాట్సప్ గ్రూపులు

**ప్రజలను అప్రమత్తం చేయండి..**

**డ్రోన్ల ద్వారా ఏనుగుల గుంపుల పరిశీలన**

**అధికారులకు సూచించిన డి.సిఎం పవన్**



**విజయవాడ,జూలై29,ప్రభాతవార్త ప్రతినిధి:** పంటలకు నష్టం కలిగించడంతో పాటు,ప్రజలను తీవ్ర భయాందోళనలకు గురిచేస్తున్న ఏనుగులు సంచరించే మార్గాల్లో ప్రజలను అప్రమత్తం చేసేందుకు ప్రణాళికాబద్ధంగా వ్యవహరించాలని డిప్యూటీ సిఎం పవన్ కల్యాణ్ అధికారులకు సూచించారు. గ్రామాలవారీగా వాట్సప్ గ్రూప్‌లను ఏర్పాటు చేసి వాటికి ఎప్పటికప్పుడు ముందస్తు హెచ్చరికలు పంపించాలని ఆదేశించారు.

ఎపిలోని పలు ప్రాంతాల్లో గజరాజులు అలజడి సృష్టిస్తున్నాయి. ఎప్పుడు ఏ గ్రామంలోకి వెళ్లి దాడులు చేస్తాయోనని ప్రజలు భయాందోళనలకు గురవుతున్నారు. మరోవైపు కొన్నిసార్లు ఆస్తి, ప్రాణ నష్టాన్ని కలిగిస్తున్నాయి. చిత్తూరు, ఈ క్రమంలో అటవీ శాఖ సిబ్బంది గ్రామాల్లో నిరంతర పర్యవేక్షణ చేపట్టాలని ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ అధికారులను ఆదేశించారు. ఈ మేరకు మంగళవారం అటవీ శాఖ ఉన్నతాధికారు >>2



**ప్రపంచం మొత్తం మద్దతిస్తే కాంగ్రెస్ విమర్శిస్తోంది**

**నెహ్రూ తప్పిదాల వల్లనే 33వేల చ.కిమీ కోల్పోయాం**

**కాంగ్రెస్ ఇక హెడ్‌లైన్స్‌కే పరిమితం**

**పాక్‌కు గట్టిగా బుద్ధిచెబుతామని వాన్స్‌కు చెప్పా**

**పార్లమెంటులో ప్రధాని మోడీ**

## 'ఆపరేషన్ సిందూర్'కు ఇది విజయోత్సవం

**న్యూఢిల్లీ,జూలై 29:** ఆపరేషన్ సిందూర్ విజయవంతంతో భారత్ విజయోత్సవాలు జరుపుకుంటున్నదని, ఈవర్షాకాల పార్లమెంటు సమావేశాలు విజయోత్సవాలకు ప్రతీక అని ప్రధానిమోడీ అన్నారు. ఆపరేషన్ సిందూర్‌పై జరిగిన చర్చలో మాట్లాడిన ప్రధానిమోడీ ప్రపంచంమొత్తం భారత్‌కు మద్దతిస్తే కాంగ్రెస్ మాత్రం విమర్శలుచేసిందని మండిపడ్డారు.కేవలం 23 నిమిషాల్లోనే మన సైనికులు ఉగ్రవాదులను, వారి స్థావరాలను మట్టిలో కలిపేసారని, ఈ విజయంతో 140 కోట్లమంది భారతీయులు తనపై ఎంతో నమ్మకం ఉంచారని అన్నారు. ఆపరేషన్ సింధూర్ నిలిపివేయాలని ప్రపంచంలో ఏ దేశాధినేత కూడా నాకు చెప్పలేదని, మే 9వ తేదీ అమెరికా ఉపాధ్యక్షుడు జెడివాన్స్ కూడా ఫోన్‌లోమాట్లాడారని, పాక్ భారీ స్థాయిలో దాడిచేయబోతోందని అలర్ట్‌చేసారని, పాక్ భారీ మూల్యం చెల్లించుకుంటుందని తాను బదులిచ్చినట్లు మోడీ చెప్పారు. పాక్‌కు ఎవరు సాయంచేసినా ఊరుకునేది లేదని స్పష్టంచేసామని, పాక్ ఎలాంటి దాడిచేసినా మేం చూసుకుంటామని జెడివాన్స్‌కు తానుచెప్పినట్లు మోడీ వెల్లడించారు. బుల్లెట్‌కు బుల్లెట్‌తోనే సమాధానం చెపుతామని అందువల్లనే పాక్‌కు చిరకాలం గుర్తుండిపోయేవిధంగా గుణపాఠం చెప్పామన్నారు. పాకిస్తాన్ మిలిటరీ ఆపరేషన్స్ డైరెక్టర్ జనరల్ అర్థరాత్రిఫోన్‌చేసి దాడులు ఆపాలని బతిమిలాడితేనే ఆపరేషన్‌సింధూర్ నిలిపామని మోడీ పార్లమెంటులో చెప్పారు. ప్రపంచంలోని 190 దేశాలు ఆపరేషన్ సిందూర్‌కు మద్దతిచ్చాయన్నారు. అణుబెదిరింపులుచెల్లవని పాక్‌ను హెచ్చరించామని పాకిస్తాన్‌కు కేవలం మూడే మూడుదేశాలు అండగా నిలిచాయన్నారు. పాక్ మళ్లీ ఎలాంటి కుట్రలుచేసినా ఆపరేషన్ సిందూర్‌కొనసాగుతుందన్నారు. ధీటుగా బదులిస్తామన్నారు. పహల్గాంలో దాడిచేసిన ఉగ్రవాదులను కూడా మట్టుబెట్టామని, ఆపరేషన్ మహదేవ్‌తో ఏరివేసామన్నారు.

**కాంగ్రెస్ పత్రికల్లో హెడ్‌లైన్స్‌కే పరిమితం..!**

56 ఇంచ్‌ల చెస్ట్ ప్రధాని ఎక్కడా అంటూ కాంగ్రెస్‌పార్టీ తనపై విమర్శలుచేసిందని, పహల్గాం దాడి విషయంలో కాంగ్రెస్ రాజకీయాలుచేసిందని, ఉగ్రదాడి తర్వాత కాంగ్రెస్ నన్ను విమర్శించడమే పనిగా పెట్టుకుందని ప్రధాని ధ్వజమెత్తారు. ప్రపంచం మొత్తం కాంగ్రెస్‌ను కాదని, దేశానికి మద్దతిచ్చిందని, కాంగ్రెస్ హెడ్‌లైన్స్‌లో ఉండొచ్చేమోకానీ, ప్రజల హృదయాల్లో మాత్రం >>2

**ఆగస్టు 25 నుంచి 31 దాకా**

# రేషన్ కార్డుల పంపిణి

**కొత్తగా 9 లక్షల మందికి పైగా కార్డులు మంజూరు: మంత్రి నాదెండ్ల**

**విజయవాడ,జూలై29,ప్రభాతవార్త ప్రతినిధి:** రాష్ట్రవ్యాప్తంగా ఆగస్టు 25 నుంచి 31 వరకూ రేషన్ స్మార్ట్ కార్డులు పంపిణీ చేయనున్నట్లు పౌర సరఫరాల మంత్రి నాదెండ్ల మనోహర్ ప్రకటించారు. ఎక్కడా అక్రమాలకు ఆస్కారం లేకుండా స్మార్ట్ కార్డులు రూపొందించామని తెలిపారు. కొత్తగా 9 లక్షల మందికిపైగా రేషన్ కార్డులు మంజూరు చేస్తున్నట్లు తెలిపారు. రాష్ట్ర స్థాయిలో సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్‌లు ఈకార్డులు అందిస్తారని, ఇంకా జిల్లాల్లో మంత్రులు, ఎమ్మెల్యేలు ఇస్తారని చెప్పారు. అలానే కొత్తగాఇచ్చే రేషన్‌కార్డులు అన్ని ఉచితంగా అందిస్తామని మంత్రి నాదెండ్ల మనోహర్ వెల్లడించారు.

జాతీయ ఆహార భద్రతా చట్టం ప్రకారం కేంద్రం సాయంతో రాష్ట్ర ప్రభుత్వం రైస్ కార్డులు ఇస్తుందని మంత్రి మనోహర్ తెలిపారు. పాత విధానాన్ని మార్చి స్మార్ట్ రైస్ కార్డులు ఇచ్చేందుకు డిజిటలైజ్ చేశామని, అలానే కార్డులపై ఎక్కడా నాయకుల ఫొటోలు ఉండకుండా డిజైన్ చేశామని వెల్లడించారు. కుటుంబ సభ్యుల ఫొటోలు మాత్రమే ఈ కార్డులో ఉండనున్నాయని అన్నారు. ఈ స్మార్ట్ రేషన్ కార్డులను డెబిట్, క్రెడిట్ కార్డు సైజులలో ఇవ్వబోతున్నామని, ఇంకా కుటుంబ సభ్యుల వివరాలు, కార్డు నెంబర్‌లు బాగా కనిపించేలా చర్యలు తీసుకున్నామని మంత్రి నాదెండ్ల మనోహర్ తెలిపారు. క్యూఆర్ కోడ్ ద్వారా ట్రాన్సక్షన్ జరిగిన వెంటనే సెంట్రల్ ఆఫీసులో తెలుస్తుందని మంత్రి తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా 29,786 రేషన్ షాపులలో ఉదయం 8 గంటల నుంచి 12 గంటల వరకు సాయంత్రం 4 నుంచి 8 గంటల వరకు ఇవ్వాలని ఆదేశిస్తున్నామని మంత్రి తెలిపారు. 65 ఏళ్ల దాటిన వృద్దులకు 26వ తేదీ నుంచి 30వ తేదీల మధ్య సరుకులు హోం డెలివరీ చేస్తామని




అన్నారు. దీపం పథకంలో ఎలాంటి లోపం లేకుండా 3 ఆయిల్ కంపెనీలతో ప్రతి వారం సమీక్షలు చేస్తున్నామని చెప్పారు. రెండవ విడతలో ఈ రోజు వరకూ 93 లక్షల 86 వేల మందికి డెలివరీ ఇచ్చామని అలానే లబ్దిదారులు దీపం 2 పథకాన్ని ఈ నెల 31వ తేదీలోపు వినియోగించుకోవాలని సూచించారు.



**సిఎం సింగపూర్ పర్యటన వ్యక్తిగత ప్రయోజనాలకే**

**మహిళలకు ఇచ్చిన హామీలు విస్మరించిన చంద్రబాబు: మాజీ సిఎం జగన్**

**విజయవాడ,జూలై29,ప్రభాతవార్త ప్రతినిధి:** వ్యక్తిగత ఆర్థిక ప్రయోజనాల కోసమే సిఎం చంద్రబాబు సింగపూర్ పర్యటనకు వెళ్ళారని వైఎస్సార్సీ అధినేత వైఎస్ జగన్ ఆరోపించారు.చంద్రబాబు స్వప్రయోజనాలు,అక్కడి బ్యాంకుల్లో డబ్బు దాచుకోవడానికే సింగపూర్ వెళ్లారన్నారు. సిఎం చంద్రబాబు, మంత్రులబృందం సింగపూర్ పర్యటనపై వైఎస్ జగన్ తీవ్ర ఆరోపణలు చేసారు. మంగళవారం తాడేపల్లిలోని వైఎస్సార్సీ కేంద్ర కార్యాలయంలో జరిగిన పిఎసి సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. కేవలం దోచుకున్న డబ్బులు దాచుకోవడానికి మాత్రమే సింగపూర్ పర్యటన అని ఆరోపించారు. మహిళలకు నెలకు రూ.1500 ఇస్తానని ఎన్నికల సమయంలో హామీ ఇచ్చారు. ఇప్పుడు ఆ పథకాన్ని అమలు చేయాలంటే.. రాష్ట్రాన్ని అమ్మాలి అంటున్నారు.. ఇంత కన్నా పచ్చిమోసం ఉంటుందా? అని జగన్ కూటమి ప్రభుత్వ నేతలను నిలదీశారు. ఫీజు రియింబర్స్‌మెంట్ ఇవ్వకపోవడంవల్ల పిల్లల చదువులు మానేసే పరిస్థితులు వచ్చాయి. గత వైఎస్సార్సీ ప్రభుత్వం ఐదేళ్లలో అన్నిరకాల అప్పులు రూ.3.32 లక్షల కోట్లు చేస్తే.. కూటమి ప్రభుత్వం ఈ 14 నెలల్లో సిఎం చంద్రబాబు అందులో 52శాతం చేశాడు. ఏ పథకం లేదు, ఏ స్కీమూ లేదు.. రాష్ట్రానికి రావాల్సిన ఆదాయాలు రావడం లేదు.. అంతా దోచుకుంటున్నారు.

వైఎస్సార్సీ పార్టీ తరఫున త్వరలో యాప్ విడుదలచేస్తాం. ప్రభుత్వ వేధింపులు జరిగినా, అన్యాయం జరిగినా.. వెంటనే యాప్‌లో నమోదు చేయవచ్చు అని జగన్ అన్నారు. పలానా వ్యక్తి, పలానా అధికారి కారణంగా అన్యాయంగా ఇబ్బంది పడ్డానని చెప్పొచ్చు.. ఆధారాలుకూడా ఆ యాప్‌లో పెట్టొచ్చు.. ఆ ఆధారాలన్నీకూడా అప్‌లోడ్ చేయొచ్చు.. ఆకంప్లైంట్ ఆటోమే >>2

## తెరుచుకున్న 'సాగర్' గేట్లు

**జలాశయంలో పూర్తిస్థాయి నీటిమట్టం**


మంగళవారం నాగార్జున సాగర్‌లో 26 క్రస్టుగేట్ల నుంచి నీటిని విడుదల చేస్తున్న దృశ్యం

**విజయపురిసౌత్, జులై 29 ప్రభాతవార్త:** దాదాపు 18 ఏళ్ల తర్వాత నాగార్జునసాగర్ జలాశయంలో అద్భుతం జరిగింది. ఎగువ రాష్ట్రాల నుంచి వస్తున్న వరద కారణంగా నాగార్జునసాగర్ జలాశయం నిండుకుండలా మారింది. నీటిమట్టం గరిష్ట స్థాయికి చేరుకుంది. దీంతో నాగార్జునసాగర్ డ్యాం క్రస్టుగేట్లు ఇవాళ తెరచుకున్నారు. ఎగువ శ్రీశైలం నుంచి భారీ వరద ప్రవాహం పోటెత్తడంతో మంగళవారం ఉదయం 11 గంటలకు నాగార్జునసాగర్ డ్యాం క్రస్టుగేట్ల ద్వారా తెలంగాణ మంత్రులు నీటిని విడుదల చేశారు. భారీ నీటి పారుదల, పౌరసరఫరాల, ఆహార శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, షెడ్యూలు కులాల, షెడ్యూల్ తెగల, మైనార్టీ శాఖ మంత్రి, నల్గొండ జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి అడ్లూరి లక్ష్మణ్ నీటి విడుదల అనంతరం విలేకరులతో మాట్లాడారు. అనుకున్నదానికంటే ముందే >>2



మంగళవారం శ్రీశైలం డ్యాం 1-7 గేట్ల నుండి దిగువకు నీటిని విడుదల చేస్తున్న దృశ్యం

# శ్రీశైలం జలాశయానికి భారీగా పెరిగిన వరద నీరు

## 7 గేట్లతో దిగువ సాగర్‌కు నీటి తరలింపు

**శ్రీశైలంప్రాజెక్టు,జులై29,ప్రభాతవార్త:** శ్రీశైలం జలాశయంకు భారిగా వరద నీటి ప్రవాహ వేగం ఊపందుకుంది.దీనితో డ్యాం ఇంజనీర్లు రెడియల్ క్రస్ట్‌గేట్ల సంఖ్యాను పెంచి దిగువ సాగర్‌కు నీటిని తరలించడం జరుగుతుంది.నాగార్జునుడి చెంతకు ఉప్పొంగుతూ బిరబిరా సాగిపోతుంది.శ్రీశైలం డ్యాంకు ఉన్న 12 రెడియల్ క్రస్ట్‌గేట్ల కాగా వాటిలో 7 రెడియల్ క్రస్ట్‌గేట్లను తేరచి ఓకొక్క గేటు 10 అడుగుల ఎత్తుమేరకు తేరచి దిగువ సాగర్‌కు స్పిల్ వే గుండా 1,90,099 క్యూసెక్కుల నీటిని విడుదల చేయడం జరుగుతుంది.క్రస్ట్‌గేట్ల నుండి రివ్వున ఎగిసిపడుతూ ముందుకు దూసుకుపోతుంది.జలదారలతో కదం త్రొక్కుతూ మంచు జల్లులతో పర్యాటకులను పలకరిస్తుంది.గంగమ్మ చిరుజల్లుల పలకరింపులతో శ్రీశైలం డ్యాం వద్ద సందర్శకులు సందడి చేస్తున్నారు.కొండకోనల నడుమ కృష్ణమ్మ పరుగులిడుతూ శ్రీశైలం రిజర్వాయర్ వద్దకు చేరుకుంటుంది.ఈ క్రమంలోనే మంగళవారం సాయంత్రం 6 గంటల సమయానికి శ్రీశైలం డ్యాం నీటిమట్టం 882.60 అడుగులుగా ఉండగా నీటినిల్వ సామర్థ్యం 203.8907 టియంసిలుగా ఉంది.ఎగువ పరివాహక ప్రాంతమైన జూరాల క్రస్ట్‌గేట్ల నుండి 1,19,064 క్యూసెక్కుల నీరు,విద్యుత్ ఉత్పత్తి అనంతరం 27,395 క్యూసెక్కుల నీరు,సుంకేసుల నుండి 1,22,326 క్యూసెక్కుల నీరు ఇన్‌ఫ్లోగా శ్రీశైలం డ్యాంకు వచ్చిచేరుతుంది.కాగా శ్రీశైలం కుడిగట్టు జలవిద్యుత్ కేంద్రం నుండి ఉత్పత్తి అనంతరం 30,397 క్యూసెక్కుల నీటిని విడుదల చేయడం జరుగుతుంది.అదే విధంగా ఎడమగట్టు విద్యుత్ కే ంద్రం నుండి ఉత్పత్తి అనంతరం 35,315 క్యూసెక్కుల నీటిని విడుదల చేయడం జరుగుతుంది.

# వాట్సప్ గ్రూపులు

>> లతో టెలీ కాన్ఫరెన్స్ నిర్వహించారు.

మంగళవారం ఉదయం చంద్రగిరి నియోజకవర్గం పరిధిలో గజరాజుల గుంపు తిరుగుతూ పొలాలు ధ్వంసం చేసిన ఘటనపై అధికారులు పవన్ కల్యాణ్‌కు వివరించారు. 11 ఏనుగులు ఒక గుంపుగా తిరుగుతూ కళ్యాణి డ్యామ్ సమీపంలోని సత్యసాయి ఎస్టీ కాలనీ దగ్గర పొలాలు, తోటలు తొక్కివేశాయని తెలిపారు. డ్రోన్ ద్వారా ఏనుగుల గుంపు కదలికలను పరిశీలిస్తున్నట్లు వివరించారు. ఈ నేపథ్యంలో పవన్ కల్యాణ్ అధికారులకు పలు సూచనలు చేశారు. డిఎఫ్ కార్యాలయాలు, పిసిసిఎఫ్ కార్యాలయం పర్యవేక్షించాలన్నారు. గజరాజుల గుంపు పొలాల మీదకి రాకుండా, అటవీ ప్రాంతంలోకి పంపించే చర్యలను పకడ్బందీగా చేపట్టాలని అధికారులకు పవన్ కల్యాణ్ ఆదేశాలిచ్చారు. కర్ణాటకతో మాట్లాడి 4 కుంకీ ఏనుగులను రాష్ట్రానికి తీసుకొచ్చింది. ప్రాణ ఆస్తినష్టం కలిగిస్తున్న గజరాజుల గుంపును అటవీ ప్రాంతాల్లోకి తరిమి కొట్టగలిగేవి కుంకీ ఏనుగులు. ప్రత్యేక శిక్షణ పొందిన వాటిని కుంకీ ఏనుగులుగా పరిగణిస్తారు. అడవిలో తిరిగే గజరాజుల గుంపు నుంచి వేరుపడి ఒంటరైన, కొన్ని ప్రత్యేక లక్షణాలున్న ఏనుగులను గుర్తించి వాటిని బంధిస్తారు. ఇందుకోసం తక్కువ వయసున్న, మగ ఏనుగులనే ఎంపిక చేసుకుంటారు. బంధించి తీసుకొచ్చిన వాటిని శిక్షణ శిబిరాలకు తరలిస్తారు. అక్కడ ప్రత్యేక ఎన్‌క్లోజర్లలో వాటిని పెడతారు. తొలుత ఏనుగులను శాంతింపజేస్తారు. వాటి ప్రవర్తనను బట్టి నెమ్మదిగా శిక్షణ మొదలుపెడతారు. మొదట మావటీలు వాటికి చేరువై వివిధ రకాల సంకేతాల్ని వాటికి అలవాటు చేస్తారు. అలా అలవాటయ్యాక చిన్న చిన్న ఆదేశాలు ఇవ్వడం మొదలుపెడతారు. వాటిని పాటిస్తే చెరకు, బెల్లం అందిస్తూ మచ్చిక చేసుకుంటారు. క్రమంగా మావటీలకు, గజరాజులకు మధ్య అనుబంధం ఏర్పడుతుంది. ఆ తర్వాత కుంకీ ఏనుగులను ఎన్‌క్లోజర్ నుంచి బయటకు తెచ్చి అటవీ ప్రాంతాల్లోకి తీసుకెళ్తారు. అక్కడ అడవి ఏనుగులు వీటిని చూసి కలవరపడుతున్నాయా? లేదా? వాటి ప్రవర్తన ఎలా ఉంది? తదితర అంశాలు గమనించి వెనక్కి తీసుకొస్తారు. శిక్షణలో ఈ కీలక దశ దాటాక వాటిని ఒంటరిగా అడవిలో వదిలేస్తారు. తిరిగి వాటంతట అవే శిక్షణ శిబిరానికి వచ్చేస్తే అవి పూర్తిగా కుంకీ ఏనుగులుగా మారినట్లే. కేరళ, తమిళనాడు, కర్ణాటక,రాష్ట్రాల్లో కుంకీ ఏనుగుల శిక్షణ కేంద్రాలున్నాయి.

# సింగపూర్‌లో అమరావతి స్మార్ట్ సిటీ నిర్మాణంపై మంత్రి నారాయణ అధ్యయనం

## డెల్ టెక్నాలజీస్ ప్రతినిధులతో మంత్రి సమావేశం

**విజయవాడ,జూలై29,ప్రభాతవార్తప్రతినిధి:** అమరావతి నిర్మాణంలో పలు అంశాల్లో సింగపూర్ మోడల్ ను ఫాలో అవ్వాలని ప్రభుత్వం భావిస్తోంది.ఇప్పటికే రాజధాని మాస్టర్ ప్లాన్ సింగపూర్ ప్రభుత్వం అందించింది...దీంతో పాటు ఏపీలో సుస్థిర పట్టణాభివృద్ది సాధించేందుకు అవసరమైన అంశాలపై మంత్రి నారాయణ సింగపూర్ లో అధ్యయనం చేస్తున్నారు...సీఎం చంద్రబాబుతో పాటు మంత్రి నారాయణ సింగపూర్ వచ్చారు.అక్కడి పలు ప్రాంతాలను సందర్శించారు..మంగళవారం ఉదయం సీఆర్డీఏ కమిషనర్ కన్నబాబుతో కలిసి పుంగోల్ పాయింట్ కేవ్ టౌన్ షిప్ ను మంత్రి నారాయణ సందర్శించారు..పుంగోల్ పాయింట్ కేవ్ సింగపూర్ లోని మొట్టమొదటి ఎకో టౌన్...సముద్ర తీరం లో స్మార్ట్ ఇన్ ఫ్రాస్ట్రక్చర్,గ్రీన్ మొబిలిటీ,కమ్యూనిటీ కేంద్రంగా నిర్మించిన భారీ హౌసింగ్ ప్రాజెక్ట్ ఇది...సుస్థిర పట్టణాభివృల్దో నూతన విధానాలను పబ్లిక్ హౌసింగ్ కు అనుసంధానం చేయడానికి అవసరమైన వివరాలను మంత్రి నారాయణ అడిగి తెలుసుకున్నారు..భవిష్యత్తులో అమరావతి స్మార్ట్ సిటీలో ఇంటిగ్రేటెడ్ టౌన్ షిఫ్ అభివృద్ధికి,వాతావరణ అనుగుణమైన ఇళ్ల నిర్మాణాలు,స్మార్ట్ వాటర్ మేనేజ్ మెంట్ కు సంబంధించిన అంశాలను మంత్రి నారాయణ అధ్యయనం చేసారు.పుంగోల్ పాయింట్ కేవ్ హౌసింగ్ ప్రాజెక్ట్ నిర్మాణంలో తీసుకున్న పలు అంశాలను అమరావతి నిర్మాణంలో ఉపయోగపడతాయని మంత్రి నారాయణ అన్నారు.ఇకమధ్యాహ్నం సింగపూర్ లోని డెల్ టెక్నాలసీస్ కార్యాలయాన్ని మంత్రి నారాయణ సందర్శించారు..అమరావతి స్మార్ట్ సిటీని బ్లూ గ్రీన్ సిటీగా నిర్మించాలని ఇప్పటికే ఏపీ ప్రభుత్వం నిర్ణయించింది.దానికి తగినట్లుగానే మాస్టర్ ప్లాన్ కూడా రూపకల్పన చేసి నిర్మాణాలు చేస్తుంది ప్రభుత్వం...అయితే అమరావతిలో నిర్మాణాల విషయంలో తీసుకోవలసిన జాగ్రత్తలు,ఇతర నగరాలతో పోటీపడేలా నిర్మాణంలో తీసుకోవలసిన జాగ్రత్తలపై డెల్ టెక్నాలజీస్ ప్రతినిధులు మంత్రి నారాయణకు వివరించారు.

# సిఎం చంద్రబాబు నేడు 4వ రోజు సింగపూర్ పర్యటన

**విజయవాడ జూలై 29,ప్రభాతవార్తప్రతినిధి:** ఆంధ్రప్రదేశ్‌కు పెట్టుబడులను ఆకర్షించడంలోనూ, రాష్ట్రాభివృద్ధిలో అంతర్జాతీయ సంస్థల భాగస్వామ్యం కోసం సింగపూర్‌లో పర్యటిస్తున్న ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నాల్గోవ రోజైన బుధవారం వివిధ సంస్థలుసింగపూర్ ప్రభుత్వ ప్రతినిధులతో చర్చలు కొనసాగించనున్నారు. ఉదయం 7:30 గంటలకు క్యాపిటాలాండ్ ఇన్వెస్ట్‌మెంట్ (ఇండియా) సీఈవో సంజీవ్ దాస్‌గుప్తాతో రియల్ ఎస్టేట్, అర్బన్ డెవలప్‌మెంట్, ఇండస్ట్రియల్ పార్కులలో పెట్టుబడులపై చర్చిస్తారు. ఉదయం 8 గంటలకు మండాయ్ వైల్డ్‌లైఫ్ గ్రూప్ సీఈవో మైక్ బార్క్లేతో భేటీ కానున్నారు. ఎకోటూరిజం, బయోడైవర్సిటీ పార్కుల అభివృద్ధి, వైల్డ్‌లైఫ్ ఎడ్యుకేషన్ మోడల్స్‌పై చర్చిస్తారు. ఉదయం 8:30 గంటలకు ఎస్ఎంబీసీ బ్యాంక్ఇండియా డివిజన్, మేనేజింగ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ రాజీవ్ కన్నన్‌తో సమావేశమై ఆంధ్రప్రదేశ్‌లో పెట్టుబడులకు గల అవకాశాలు, లిక్విడిటీ మోడల్స్‌పై చర్చిస్తారు. ఉదయం 9 గంటలకు టెమసెక్ కంపెనీ జాయింట్ హెడ్-పోర్ట్‌ఫోలియో డెవలప్‌మెంట్ దినేశ్ ఖన్నాతో భేటీ కానున్నారు. పబ్లిక్ ఇన్‌ఫ్రా ప్రాజెక్ట్స్, ఎడ్యుకేషన్‌హెల్త్ ఫండింగ్‌పై సహకారాన్ని కోరనున్నారు. ఉదయం 10 గంటలకు సింగపూర్ విదేశాంగ మంత్రి డాక్టర్ వివియన్ బాలకృష్ణన్‌తో ముఖ్యమంత్రి సమావేశం అవుతారు. భారత్-సింగపూర్ సంబంధాలు, తెలుగు రాష్ట్రాల్లో పెట్టుబడులకు ప్రోత్సాహం అంశాలు చర్చకు రానున్నాయి. ఉదయం 11 గంటలకు నేషనల్ సెక్యూరిటీ హోం అఫైర్స్ మంత్రి కే. షణ్ముగంతో విందు సమావేశం జరగనుంది. సెక్యూరిటీ కెపాసిటీ బిల్డింగ్, పోలీస్ ట్రైనింగ్, ఇంటర్నేషనల్ కోఆపరేషన్ అంశాలు చర్చకు వస్తాయి. మధ్యాహ్నం 1:30 గంటలకు సెంబ్‌క్రాప్ సీఓఓ చార్లెస్ కోతో ముఖ్యమంత్రి సమావేశం అవుతారు.

# ఎఐ, రిసెర్చి, ఇన్నోవేషన్ సెంటర్ల ఏర్పాటుకు సహకరించండి

**విజయవాడ, జూలై 29,ప్రభాతవార్తప్రతినిధి:** ఆంధ్రప్రదేశ్‌ని ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్స్ హబ్‌గా అభివృద్ధి చేయాలని దృఢ నిశ్చయంతో ఉన్న సిఎం చంద్రబాబు నాయుడు తన సింగపూర్ పర్యటనలో ఇందుకోసం ప్రయత్నాలు ముమ్మరం చేశారు. పర్యటన 3వ రోజైన మంగళవారం ఎఐ సింగపూర్ సంస్థ డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ చైర్మన్ మోహన్ కంకణవల్లితో సమావేశమయ్యారు. రాష్ట్రంలో ఏఐ పరిశోధన, ఇన్నోవేషన్ సెంటర్ల ఏర్పాటుకు సహకారం అందించాలని కోరారు. ఆంధ్రప్రదేశ్‌లోని విశ్వవిద్యాలయాలు, పరిశోధన సంస్థలతో ఎఐ సింగపూర్ భాగస్వామ్యంగా పని చేయడానికి ప్రాధాన్యత ఇవ్వాలని సిఎం అన్నారు. రాష్ట్రంలోని విద్యార్థులకు ఎఐ శిక్షణా కార్యక్రమాలు, ఎక్స్‌చేంజ్ ప్రోగ్రాములు, స్కిల్ డెవలప్‌మెంట్ మాడ్యూల్స్ అమలు చేయాలని సిఎం ప్రతిపాదించారు. ముఖ్యంగా వైద్యం, వ్యవసాయం, విద్య, పౌర సేవల విషయంలో ఏఐ వినియోగంపై ఇరువురి మధ్య చర్చలు జరిగాయి. టెక్నాలజీ ప్రమోషన్, డీప్ టెక్, ఏఐ రంగంలో ప్రస్తుతం ఉన్న అవకాశాలపైనా చంద్రబాబుకంకణవల్లి మధ్య చర్చ జరిగింది.

**ఎంఆర్‌ఓ కేంద్రం ఏర్పాటుపై చర్చలు**

ఎస్ఐఎ ఇంజినీరింగ్ కంపెనీ సీనియర్ వైస్ ప్రెసిడెంట్ ఎన్‌జీ జాన్ లిన్ విలిన్‌తోనూ చంద్రబాబు సమావేశమయ్యారు. రాష్ట్రంలో ఎయిర్ పోర్టుల నిర్మాణం, అభివృద్ధి ప్రణాళికలను జాన్ లిన్ విలిన్‌కు ముఖ్యమంత్రి వివరించారు. ఎంఆర్‌ఓ విధానం ద్వారా కొత్తగా నిర్మించే విమానాశ్రయ ప్రాజెక్టుల్లో భాగస్వామి కావాలని ఆహ్వానించారు. రాష్ట్ర ప్రభుత్వ నూతనంగా తీసుకువచ్చిన పారిశ్రామిక అనుకూల పాలసీల గురించి తెలిపారు. ముఖ్యంగా విమానయాన రంగంలో ఉన్న విస్తృత అవకాశాలను అందిపుచ్చుకోవాలని, ఏపీలో పర్యటించి పెట్టుబడులపై ఆలోచన చేయాలని సీఎం చెప్పారు. దీనికి సానుకూలంగా స్పందించిన ఎస్ఐఎ ఇంజినీరింగ్ కంపెనీ సీనియర్ వైస్ ప్రెసిడెంట్ తర్వలోనే రాష్ట్రానికి తమ కంపెనీ ప్రతినిధులను పంపిస్తామనిచెప్పారు. ఎస్ఐఎ ఇంజినీరింగ్‌వంటి సంస్థల అనుభవం, టెక్నాలజీని ఉపయోగించుకొని ప్రపంచ స్థాయి ఎంఆర్‌ఓ కేంద్రాన్ని రాష్ట్రంలో ఏర్పాటు చేయాలని... ఈ కేంద్రం ఏర్పాటుకు విశాఖపట్నం, కృష్ణపట్నం వంటి ప్రాంతాలు అనుకూలమని రాష్ట్ర ప్రభుత్వం భావిస్తోంది.

# ఎపికి సింగపూర్ చేయూత

>> కలిసి పని చేశామని మాస్టర్ ప్లాన్ రూపకల్పన, నిర్మాణ సహకారాన్ని అందించినట్టు తన ట్వీట్‌లో పేర్కొన్నారు. అమరావతిలో స్టార్టప్ ప్రాంతాన్ని అభివృద్ధి చేసేందుకు సింగపూర్ కంపెనీలు స్విస్ ఛాలెంజ్ విధానంలో టెండర్ కూడా దక్కించుకున్నాయని గుర్తు చేశారు. అయితే 2019లో ప్రభుత్వం మారిన తర్వాత ఈ సహకారం ఆగిపోయిందని అన్నారు. సింగపూర్ కన్సార్టియం కూడా అమరావతి ప్రాజెక్టు నుంచి బయటకు వచ్చేసిందని టాన్ సీ లెంగ్ తనట్వీట్‌లో పేర్కొన్నారు. మళ్లీ ఇప్పుడు ముఖ్యమంత్రి చంద్రబాబుతో సమావేశమై ఎపి అభివృద్ధిపై చర్చించినట్టు ఆయన వెల్లడించారు. సీడ్ క్యాపిటల్ విషయంలో సింగపూర్ కన్సార్టియం పని చేయకున్నా.. ఎపిలో పట్టణాభివృద్ధి సహా వివిధ రంగాల్లో సాంకేతిక సహకారం అందించటంతో పాటు ప్రపంచబ్యాంకు లాంటి భాగస్వాములతో కలిసి ఎపి అభివృద్ధి ప్రణాళికల్లో కలిసి పని చేస్తామని టాన్ సీ లెంగ్ స్పష్టం చేశారు.

**ఎపి అభివృద్ధిలో సింగపూర్ భాగస్వామ్యం విలువైంది**

వివిధ అభివృద్ధి ప్రాజెక్టుల్లో ఎపి ప్రభుత్వంతో కలిసి పని చేసేందుకు సిద్ధమన్న సింగపూర్ మంత్రి టాన్సీ లెంగ్ ప్రకటనకు ముఖ్యమంత్రి చంద్రబాబు ధన్యవాదాలు తెలియచేశారు. ఎపి ప్రజల తరపున సింగపూర్ ప్రభుత్వానికి, ఆ దేశ మంత్రి టాన్ సీ లెంగ్ కు ఎక్స్ వేదికగా సీఎం కృతజ్ఞతలు తెలిపారు. ఏపీ సుస్థిరాభివృద్ధి కోసం ఎపి ప్రభుత్వంతో భాగస్వామిగా ఉండడానికి సింగపూర్ ప్రభుత్వం ముందుకు రావడం సంతోషదాయకమని అన్నారు. వివిధ రంగాల్లో ఎపి సింగపూర్ కలిసి పని చేయడానికి టాన్ సీ లెంగ్‌తో జరిపిన చర్చలు బాటలు వేశాయని సిఎం పేర్కొన్నారు. వ్యవసాయం, ఫుడ్ ప్రాసెసింగ్, ఉత్పాదక రంగం, రెన్యూవబుల్ ఎనర్జీ, పోర్టులు, డిజిటల్, ఇన్నోవేషన్, నైపుణ్యాభివృద్ధి రంగాల్లో కలిసి పని చేసేందుకు ఈ చర్చలు దోహద పడతాయన్నారు. 90వ దశకం నుంచి సింగపూర్ ప్రభుత్వంతో తనకు సత్సంబంధాలు ఉన్నాయని తెలిపారు. ఎపి అభివృద్ధిలో సింగపూర్ భాగస్వామ్యం చాలా విలువై నదని సిఎం తన ట్వీట్‌లో పేర్కొన్నారు. ఎపి అభివృద్ధి ప్రయాణంలో.. ఆధునిక మౌలిక వసతుల కల్పనలో సింగపూర్ ప్రభుత్వం నుంచి సహకారం ఆశిస్తున్నామని స్పష్టం చేశారు. కొన్ని పరిణామాల వల్ల సింగపూర్ భాగస్వామ్యంతో కలిసి చేస్తున్న ప్రయాణంలో ఇబ్బందులు ఎదురయ్యాయని సిఎం అన్నారు. ఎపిలో అద్భుతమైన ప్రజా తీర్పుతో రాష్ట్ర సర్వతోముఖాభివృద్ధికి సంకల్పం తీసుకున్నామన్నారు. స్వర్ణాంధ్ర 2047 సాధన దిశగా అడుగులు వేస్తున్నామని సిఎం వివరించారు. వివిధ రంగాల్లో సింగపూర్ దేశ విధానాలు ఎప్పుడూ స్ఫూర్తినిస్తూనే ఉంటాయని అన్నారు.

# ఇది విజయోత్సవం

>> కాదని గుర్తుచేసారు. ఆపరేషన్ సిందూర్‌లో మన ఎయిర్‌ఫోర్స్ నూరుశాతం విజయం సాధించాయని, సిందూనుంచి సిందూర్‌వరకూ మన పరాక్రమం ప్రదర్శించామన్నారు. సుదీర్ఘకాలం కాంగ్రెస్ దేశాన్ని పాలించిందని, మన దేశ సైనిక సామర్థ్యంపై కాంగ్రెస్‌కు నమ్మకంలేదన్నారు. ఒక్క పాక్ క్షిపణి కూడా భారత్‌ను టచ్‌చేయలేదన్నారు. ఉగ్రవాదులను ఎందుకు చంపారని విపక్షాలు అడిగాయని, ఎన్నిగంటలు ఆపరేషన్ మహదేవ్ చేపట్టారని, అందుకు ముహూర్తం కావాలా ఏంటని ఆయన ప్రశ్నించారు.

**నెహ్రూ తప్పులవల్లే పివోకేను కోల్పోయాం...**

ఆనాడు కాంగ్రెస్ చేసిన తప్పులవల్లనే అత్యధిక విస్తీర్ణం కోల్పోయామని, ప్రధాని నెహ్రూ చేసిన తప్పిదాలకు భారత్ 34వేల చదరపు కిలోమీటర్ల భూభాగాన్ని కోల్పోయామని, పాకిస్తాన్‌కు నెహ్రూ అప్పనంగా అప్పగించారన్నారు. కచ్చతీవును శ్రీలంకకు మాజీ ప్రధాని ఇందిరాగాంధీ బహుమతిగా ఇచ్చిందని, పీవోకేను ఎప్పుడు వెనక్కి తెస్తారని అడుగుతున్నారని, ఎప్పటికయినా పిఓకె భారత్‌లో అంతర్భాగమేనని ప్రధానిమోడీ స్పష్టంచేసారు.

# ఎపి విద్యార్థులు స్థానికులే

>> పిటిషన్లు పేర్కొన్నారు. ఈ మేరకు మెడికల్ కౌన్సెలింగ్‌లో తమను రాష్ట్ర స్థానికులుగా పరిగణించాలన్న వారి వినతిని ఆమోదించింది. పిటిషనర్లను రాష్ట్రంలో స్థానిక (లోకల్) అభ్యర్థులుగా పరిగణించాలని డాక్టర్ ఎన్‌టిఆర్ ఆరోగ్య, విజ్ఞాన విశ్వ విద్యాలం రిజిస్ట్రార్‌ను ఆదేశించింది. సమగ్ర వివరాల తో కౌంటర్ దాఖలు చేయాలని నోటీసులు జారీ చేసింది. తదుపరి విచారణను వచ్చే వారానికి వాయిదా వేస్తూ చీఫ్ జస్టిస్ ధీరజ్ సింగ్ ఠాకుర్, జస్టిస్ చీమలపాటి రవితో కూడిన ధర్మాసనం సోమవారం మధ్యంతర ఆదేశాలు జారీ చేసింది. అడ్మిషన్లు తుది తీర్పుకు లోబడి ఉంటాయని షరతు విధించింది.

# రూ.252 కోట్లు

>> విశేషం. కొత్త జోన్ ప్రారంభమయ్యలోపు రైల్వే స్టేషన్ అభివృద్ధి పనులను పట్టాలెక్కించాలనేది నిర్ణయం అని తెలుస్తోంది. ఏడాదికి 110 కోట్ల రూపాయల ఆదాయం రైల్వేకు అందించే రాజమండ్రి రైల్వే స్టేషన్ అభివృద్ధికి దక్షిణ మధ్య రైల్వే నిర్ణయం తీసుకోవడంతో సర్వత్రా హర్షం వ్యక్తం అవుతుంది. ప్రతిరోజు కనీసం 30 వేల నుంచి 40 వేల మంది ప్రయాణికులు ఇక్కడ నుంచి ప్రయాణం చేస్తుంటారు. మూడు ప్లాట్ఫామ్ లతో ఎనిమిది ట్రాక్లు మాత్రమే ఉన్న రాజమండ్రి రైల్వే స్టేషన్ అభివృద్ధికి రైల్వే బోర్డు కేటాయించిన నిధులతో రూపురేఖలే మారనున్నాయనడంలో సందేహం లేదు.

అలాగే గుంతకల్లు డివిజన్, గుంటూరు డివిజన్లో రైల్వే బోర్డు ప్రతిష్టాత్మకంగా రెండేళ్ల క్రితం ప్రవేశపెట్టిన కవచ్ పథకాన్ని అభివృద్ధి చేసేందుకు, మౌలిక సదుపాయాలు కల్పించేందుకు నిర్ణయం తీసుకుంది. అందుకు 63.40 కోట్ల నిధులను కేటాయించింది. ఈ పనులను రెండేళ్లలోపు పూర్తి చేసేందుకు దక్షిణ మధ్య రైల్వే టెండర్లనుకూడా ఆహ్వానించింది. ప్రమాద రహిత రైల్వే డివిజన్లుగా అభివృద్ధి చేసేందుకు ఈ నిధులు దోహదపడనున్నాయి.

## వారం - వర్జ్యం

30-07-2025, బుధవారం
శ్రీ విశ్వావసు నామ సంవత్సరం,
శ్రావణ మాసం, దక్షిణాయణం
వర్ష ఋతువు, శుక్లపక్షం
షష్ఠి రా.2.43
హస్త రా.9.55
వర్జ్యం : ఉ.6.51-8.38
దు.ఉ.11.49-12.41
రాహుకాలం - మ.12.00-1.30

## వార్తాఫలం

**మేషం :** అకారణంగా వివాదాలు వస్తాయి. ఇతరులతో మాట్లాడేటప్పుడు జాగ్రత్త అవసరం. వస్తు కొనుగోలు.

**వృషభం:** ముఖ్యమైన పనులు సకాలంలో పూర్తి చేస్తారు. రుణాలు కొంతవరకు తీరుస్తారు. అనుకోని ప్రయాణాలు.

**మిథునం:** అప్రయత్న కార్యసిద్ధి పొందుతారు. ప్రముఖుల నుండి శుభవార్తలు అందుకొంటారు. వాహనసౌఖ్యం.

**కర్కాటకం :** సోదరులను కలిసి కష్టసుఖాలను పంచుకొంటారు. జీవిత భాగస్వామి సలహాతో నూతన కార్యక్రమాలకు శ్రీకారం చుడతారు.

**సింహం:** పారిశ్రామిక, సాంకేతిక రంగాలలోని వారికి కొంత అనుకూలంగా వుండును. దూరప్రాంతాల నుండి శుభవార్తలు.

**కన్య :** క్రయవిక్రయాలలో చికాకులు ఎదురైన అధిగమిస్తారు. ఇంటా బయటా ప్రోత్సాహం పొందుతారు.

**తుల :** ఆర్థిక పరిస్థితి అంతంత మాత్రంగావున్న అవసరాలకు డబ్బు అందుతుంది. శుభవార్తలు వింటారు.

**వృశ్చికం:** మీమాటే అందరికి వేదవాక్కు కాగలదు. కొత్తమిత్రులు పరిచయమై నూతన కార్యక్రమాలకు శ్రీకారం చుడతారు.

**ధనుస్సు:** నూతన కార్యక్రమాలకు శ్రీకారం చుడతారు. కీర్తిప్రతిష్ఠలు పెరుగుతాయి. మిత్రుల కలయిక.

**మకరం:** అనుకోని అతిథులను కలిసి ఆనందంగా గడుపుతారు. పెట్టుబడులకు తగిన లాభాలు పొందుతారు.

**కుంభం:** ఆరోగ్య సమస్యలు ఎదురైనా అధిగమిస్తారు. ఆర్థిక పరిస్థితులు అనుకూలంగా వుండును. కాంట్రాక్టులు లాభిస్తాయి.

**మీనం :** చిరకాల ప్రత్యర్థులు మిత్రులుగా మారి సాయం అందిస్తారు. బాధ్యతలు పెరుగుతాయి. వృత్తి, వ్యాపారాలు విస్తరిస్తారు.

- శ్రీమతి ములుగు శివజ్యోతి, కోఠి, హైదరాబాద్



మంగళవారం సింగపూర్‌లోని జురాంగ్ పెట్రోకెమికల్ ఐల్యాండ్ సందర్శిస్తున్న సిఎం చంద్రబాబు

# ఎపి సముద్ర తీరం... అభివృద్ధికి ముఖ ద్వారం

## పోర్టులు, పోర్టు ఆధారిత పరిశ్రమలు, షిప్ బిల్డింగ్ యూనిట్లు, టూరిజంలో అవకాశాలు: సిఎం చంద్రబాబు

## అవకాశాలు పుష్కలం, వచ్చి వినయోగించుకోండి: మంత్రి లోకేష్

**విజయవాడ జులై 29ప్రభాతవార్తప్రతినిధి:** సువిశాలమైన కోస్తా తీరం ఎపిలో పరిశ్రమల పెట్టుబడులకు అత్యంత అనువైందని సిఎం చంద్రబాబు నాయుడు స్పష్టం చేసారు. సింగపూర్ పర్యటనలో ఉన్న ముఖ్యమంత్రి చంద్రబాబు వివిధ కంపెనీల సిఇఒ లతో సమావేశమయ్యారు. రాష్ట్రంలో పెట్టుబడులకు అవకాశాలను వివరిస్తూ.. రాష్ట్రంలో సుదీర్ఘతీరప్రాంతం ఎపికి అతిపెద్ద వనరు అని ప్రత్యేకంగా వివరించారు. రాష్ట్రంలో మారిటైం ఆపరేషన్స్, మౌలిక వసతుల కల్పనపై సమావేశంలో చర్చించారు. రాష్ట్రాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసే ప్రణాళికల్లో భాగంగా..తాము పోర్టుల నిర్మాణం, పోర్ట్ ఆధారిత పరిశ్రమల ఏర్పాటుపై ప్రత్యేక దృష్టి పెట్టామని చెప్పారు. లాజిస్టిక్ ఖర్చులు తగ్గించాలనేది ప్రధాన లక్ష్యంగా పెట్టుకున్నామని సిఎం చెప్పారు. ఇన్ లాండ్ వాటర్ వేస్ ద్వారా కూడా సరుకు రవాణా చేపట్టేలా ఆలోచనలు చేస్తున్నామన్నారు. దీంతోపాటు టూరిజానికి పెద్ద పీట వేస్తున్నామని.. ఈ ప్రణాళికల్లో భాగంగా క్రూయిజ్ టూరిజానికి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో పెద్ద ఎత్తున అవకాశాలు ఉన్నాయని చంద్రబాబు వివరించారు.

**తీర ప్రాంతం... పెట్టుబడులకు గమ్యస్థానం**

రాష్ట్రంలో సుదీర్ఘ తీర ప్రాంతం ఉండడాన్ని తాము ఓ అవకాశంగా మలుచుకునేందుకు అన్ని కోణాల్లో ప్రణాళికలు సిద్ధం చేస్తున్నామని ముఖ్యమంత్రి వివరించారు. తమ రాష్ట్రానికి ప్రకృతి ఇచ్చిన వరాన్ని రాష్ట్ర అభివృద్ధికి ప్రధాన వనరుగా మార్చుకునేలా ఆలోచనలు చేస్తున్నామని సిఎం చెప్పారు. ఈస్ట్ కోస్ట్ ప్రాంతంలో కొత్త పోర్టులతో అనేక అవకాశాలు వస్తాయనే అంశాన్ని సిఇఒల దృష్టికి చంద్రబాబు తీసుకెళ్లారు. స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ విధానాన్ని అమలు చేస్తున్నామని సిఎంవివరించారు.

**ఎపి అన్ని రకాల పరిశ్రమలకు అనుకూలం: నారాలోకేష్**

ఎపి అన్ని విధాలుగా పెట్టుబడులకు అత్యంత ఆశాజనకమైన ప్రాంతమని రాష్ట్ర మానవ వనరుల శాఖా మంత్రి ఈ సమావేశంలో స్పష్టం చేసారు.విస్తారమైన రవాణా వ్యవస్థ ఉందని వివరించారు.ఏ పరిశ్రమకైన తమరాష్ట్రం అనుకూలమన్నారు.దేశంలో అత్యంత ఆధునీక వసతులతో సింగపూర్ తరహాలో అమరావతి రాజధాని నిర్మాణం జరుగుతుందన్నారు. ప్రయోగాత్మకంగా వచ్చే జనవరి నాటికి అమరావతి క్వాంటం వ్యాలీ అందుబాటులోకి వస్తోందని తెలిపారు.ఈ కార్యక్రమంలో మంత్రులు, ఏపీ ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

**జురాంగ్ పెట్రోకెమికల్ ఐల్యాండ్ సందర్శించిన సిఎం చంద్రబాబు**

సింగపూర్ లో మూడో రోజు పర్యటనలో భాగంగా ప్రతిష్టాత్మక జురాంగ్ పెట్రో కెమికల్ ఐ ల్యాండ్ ను ముఖ్యమంత్రి చంద్రబాబు, మంత్రుల బృందం సందర్శించింది. జురాంగ్ ఐల్యాండ్ లో సింగపూర్ సృష్టించిన సమీకృత పారిశ్రామిక ప్రాజెక్టు సహా ఇతర మౌలిక సదుపాయాలను ముఖ్యమంత్రి బృందం పరిశీలించింది. సముద్రాన్ని పూడ్చి నిర్మించిన దీవిలో సమీకృత పెట్రోకెమికల్ ప్లాంట్, ఇంధన కేంద్రాన్ని సింగపూర్ ఏర్పాటు చేసింది. పెట్రో కెమికల్ ఐ ల్యాండ్ సందర్శనకు వచ్చిన ముఖ్యమంత్రి బృందానికి సుర్బానా జురాంగ్ డిప్యూటీ డైరెక్టర్ టియో ఎంగ్ కియాట్, చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆండీలీ మర్యాదపూర్వకంగా స్వాగతం పలికి జురాంగ్ పెట్రో కెమికల్ కేంద్రాన్ని చూపించారు. పెట్రోకెమికల్ కేంద్రంలో ముడి చమురు ప్రాసెసింగ్ ప్రక్రియతో పాటు ఇతర ఉత్పత్తులైన పాలిమర్లు, ఇంధనాలు, స్పెషాలిటీ కెమికల్స్ గురించి ముఖ్యమంత్రి చంద్రబాబుకు, మంత్రులకు వివరించారు.

# వ్యక్తిగత ప్రయోజనాలకే

>> టిక్‌గా మన డిజిటల్ సర్వర్‌లోకి వచ్చేస్తోంది.. మన ప్రభుత్వం అధికారంలోకి రాగానే ఫిర్యాదులపై కచ్చితంగా పరిశీలన చేస్తాం అన్నారు.ఈ ఫిర్యాదులపై పరిశీలన జరిపి చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటాం.. తప్పు చేసిన వారందరికీ సినిమా చూపించడం ఖాయం అని జగన్ హెచ్చరించారు. వచ్చే నెలలో రచ్చబండ కార్యక్రమం ద్వారా గ్రామస్థాయిలో బాబు ష్యూరిటీ - మోసం గ్యారంటీ కార్యక్రమం ఉధృతంగా చేయాలి. క్యూ ఆర్ కోడ్ ద్వారా చంద్రబాబు ఇచ్చిన వాగ్దానాలు, ప్రతి కుటుంబానికీ ఎంత బాకీ పడ్డాడో చెప్పాలి. మంచి ప్రభుత్వాన్ని పోగొట్టుకున్నామన్న భావన ప్రజల్లో బాగా వెల్లడవుతోంది. చంద్రబాబు రాష్ట్రాన్ని పెత్తందారులకు లాభం కలిగించే దిశలో నడిపిస్తున్నారని ఆరోపించారు.

# షణ్ముగరత్నంతో సిఎం చంద్రబాబు భేటీ

>> ఎపిలోని వివిధ రంగాల్లో సింగపూర్‌తో కలిసి పనిచేసేలా కొత్త అధ్యాయానికి నాంది పలికినట్టు అయ్యిందని ఆ దేశ అధ్యక్షుడు షణ్ముగ రత్నంతో ముఖ్యమంత్రి చెప్పారు. నాలెడ్జి ఎకానమీ, మౌలిక సదుపాయాల కల్పన, సెమికండక్టర్లు, అమరావతి అభివృద్ధి, అర్బన్ ప్లానింగ్, పునరుత్పాదక ఇంధన రంగాల్లో సింగపూర్ భాగస్వామ్యంతో ముందుకు వెళ్లే అంశాలపై ఇరువురు నేతలతో ముఖ్యమంత్రి చర్చించారు. ఇక సింగపూర్ మాజీ ప్రధాని, ప్రస్తుత సీనియర్ మంత్రి లీ సైన్ లూంగ్ తో సమావేశమైన సిఎం చంద్రబాబు.. భారత్ సింగపూర్‌ల మధ్య సంబంధాలు మరింత బలోపేతం అయ్యేందుకు తమ పర్యటన ఉపకరిస్తుందని అన్నారు. థర్మన్ షణ్ముగరత్నంను సీఎం చంద్రబాబు ఘనంగా సత్కరించారు.

# తెరుచుకున్న 'సాగర్' గేట్లు

>> క్రస్టుగేట్ల ద్వారా నీటిని విడుదల చేశామన్నారు. సాగర్ నుంచి గేట్లు ఎత్తడం చాలా సంతోషంగా ఉందన్నారు. ఈ ప్రాజెక్టును అప్పటి ప్రధానని జవహర్‌లాల్ నెహ్రూ పునాది వేశారని, ప్రాజెక్టు పూర్తయిన తర్వాత ఆయన కుమార్తె ఆనాటి ప్రధాని ఇందిరాగాంధీ పూర్తిచేసి జాతికి అంకితం చేశారని తెలిపారు. ఈ జలాశయం ద్వారా 26లక్షల ఎకరాల ఆయకట్టుకు నీరు అందుతోందన్నారు. తెలంగాణ వరి పండించడంలో రికార్డుస్థాయిలో ఉందని మంత్రి ఉత్తమ్ సంతోషం వ్యక్తం చేశారు. ఖరీఫ్ పంటకు కాంగ్రెస్ ప్రభుత్వం తోడ్పాటును అందిస్తోందని స్పష్టం చేశారు. జులైలోనే నాగార్జునసాగర్ నిండటం 18 ఏళ్ల తర్వాత ఇదే తొలిసారి కావడం విశేషం అన్నారు. ఈ కార్యక్రమంలో ప్రాజెక్టు చీఫ్ ఇంజినీరు అజయ్‌కుమార్, సూపరింటెండెంట్ ఇంజనీరు, ఎగ్జిక్యూటివ్ ఇంజినీరు మల్లికార్జునరావు, డ్యాం, గేట్స్ డివిజన్ డీఈ కె.శ్రీకాంత్, కేంద్ర బలగాల అధికారులు ఇన్‌ఛార్జి ఇన్‌స్పెక్టర్ అజయ్‌కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

# డేటా సెంటర్ల ఏర్పాటుకు ఎపి అనుకూలం

## సింగపూర్ పారిశ్రామికవేత్తల రౌండ్ టేబుల్ కాన్ఫరెన్సులో సిఎం చంద్రబాబు

**విజయవాడ జూలై 29,ప్రభాతవార్తప్రతినిధి:** రాష్ట్రంలో డేటా సెంటర్ల ఏర్పాటుకు అనుకూలమైన పరిస్థితులు ఉన్నాయని ముఖ్యమంత్రి చంద్రబాబు స్పష్టం చేశారు. ప్రత్యేకించి విశాఖలో దీనికి అవసరమైన ఎకో సిస్టం ఏర్పాటు చేసినట్టు వెల్లడించారు. సింగపూర్ లో మూడోరోజు పర్యటిస్తున్న సీఎం ఆ దేశ పారిశ్రామికవేత్తలు, కంపెనీల ప్రతినిధులతో రౌండ్ టేబుల్ కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ కాన్ఫరెన్స్‌కు సింగపూర్‌లోని ప్రముఖ కంపెనీల సీఈఓలు, ప్రతినిధులు హాజరయ్యారు. మొత్తం 41 కంపెనీలకు చెందిన ప్రతినిధులు ఈ రౌండ్ టేబుల్ కాన్ఫరెన్సుకు హాజరై తమ అభిప్రాయాలను తెలియచేశారు. డేటా సెంటర్లు, ఐటీ కంపెనీల ఏర్పాటుకు విశాఖ అత్యుత్తమ ప్రదేశమని ముఖ్యమంత్రి తెలిపారు. త్వరలోనే గూగుల్ డేటా సెంటర్ విశాఖలో ఏర్పాటు కానుందని ముఖ్యమంత్రి సింగపూర్ పారిశ్రామిక వేత్తలకు తెలియచేశారు. అలాగే టీసీఎస్, కాగ్నిజెంట్ సహా వివిధ ఐటీ దిగ్గజ సంస్థలు విశాఖలో తమ సంస్థలను ఏర్పాటు చేస్తున్నాయని వివరించారు. అలాగే దేశంలోనే తొలి క్వాంటం వ్యాలీ అమరావతిలో ఏర్పాటు చేస్తున్నామని.. 2026 జనవరి నాటికి ప్రారంభమయ్యే క్వాంటం వ్యాలీ ఎకో సిస్టంలో సింగపూర్ కంపెనీలు పెట్టుబడులు పెట్టేందుకు అవకాశముందని సీఎం చంద్రబాబు తెలిపారు.

# తిరుమల సమాచారం

## గరుడపంచమిన గరుడునిపై గోవిందుడు



**తిరుమల,జూలై 29ప్రభాతవార్తప్రతినిధి:** శ్రావణ మాసం పవిత్రమైన గరుడపంచమిరోజు మంగళవారం సాయంత్రం మలయప్పస్వామి గరుడ వాహనాన్ని అధిరోహించి భక్తులకు దర్శనమిచ్చారు. సాయంత్రం నిత్యకైంకర్యాలు ముగించుకుని సహస్రదీపాలంకరణసేవలో వయ్యారంగా పూజలందుకున్న మలయప్ప అక్కడ నుంచి బయలుదేరి వాహనమండపం చేరుకున్నారు. వాహనమండపం వద్ద ఆలయ అర్చకులు విశేష అలంకారభూషితుడైన మలయప్పను కొలువుదీర్చి వేదమంత్రాల నడుమ కర్పూర హారతులిచ్చారు. అనంతరం భక్తుల గోవింద నామస్మరణల మధ్య గరుడవాహనం మెల్లగా ఆలయం ముందునుంచి కదులుతూ మాఢవీధుల్లో ఊరేగారు. ఈ వాహనసేవలో టిటిడి అదనపు ఇఒచిరుమామిళ్ళ వెంకయ్యచౌదరి, ఆలయ డిప్యూటీ ఇఒ లోకనాథం, సివిఎస్ఒ కెవి మురళీకృష్ణ, ఆలయ పేష్కార్ రామకృష్ణ, డిఎఫ్ఒ ఫణికుమార్‌నాయుడు, ఆలయ పారుపత్తేదార్ హిమత్‌గిరి, విఎస్ఒలు నెట్టెంతులను వెంకటరామ్‌కుమార్, అల్లం సురేంద్ర, ఆలయ ఏవిఎస్ఒ రాజశేఖర్, భక్తులు పాల్గొన్నారు. ఈ నెలలో రెండవసారి తిరుమలలో గరుడసేవ జరగడం విశేషం.

## మా సర్వదాస్తి నీకే గోవిందా!

### హైదరాబాద్ దంపతుల భక్తిభావం

## రూ.18.75లక్షలు ఇల్లు టిటిడికి అప్పగింత



**తిరుమల,జూలై 29ప్రభాతవార్తప్రతినిధి:** మాకున్న సర్వదాస్తి నీకే ఇచ్చేస్తున్నాము గోవిందా ఏడు కొండల వేంకటేశ్వర. చివరిరోజుల్లో చల్లగాచూడు స్వామీ అంటూ ఇద్దరు వృద్ధ దంపతులు తమ భక్తిభావాన్ని చాటుకున్నారు. మేము నివాస ముండే ఇల్లు మా తదనంతరం 18.75లక్షలు రూపాయలు విలువచేసేది నీదే తీసుకో స్వామీ అని టిటిడికి రికార్డులను అందజేశారు. తమ ఆస్తి దేవదేవుడు శ్రీవారికి చెందేలా వీలునామా రాసి స్వామీవారిపై అపారమైన భక్తిని ఆ దంపతులు చాటుకున్నారు. హైదరాబాద్ మల్కాజ్‌గిరిలోని వసంతపురికాలనీలో నివాసముంటున్న టి.సునీతాదేవి, టి.కనకదుర్గాప్రసాద్ దంపతులకు సంతానం లేదు. ఇద్దరు వృద్ధ దంపతులు కావడంతో తమ తదనంతరం ఆ ఆస్తి శ్రీవారికి చెందేలా వీలునామా రాశారు. ఆ పత్రాలను తీసుకుని మంగళవారం ఉదయం తిరుమలకు వచ్చారు. తిరుమలలో టిటిడి అదనపు ఇఒ చిరుమామిళ్ళ వెంకయ్యచౌదరికి అందజేశారు. స్వామివారిపై ఆపారమైన భక్తివిశ్వాసాలతోనే ఇంటిని విరాళంగా ఇవ్వడం ఇతర భక్తులకు కూడా స్ఫూర్తిగా నిలుస్తుందని దాతలను అదనపు ఇఒ వెంకయ్యచౌదరి అభినందించారు. ఇటీవలే హైదరాబాద్‌లోని మాజీ ఐఆర్ఎస్ అధికారి స్వర్గీయ భాస్కర్‌రావు వీలునామా టిటిడికి అందడం స్ఫూర్తిగా తీసుకున్నామని తెలిపారు.

## మహిళల ఉచిత బస్సుకోసం ఏర్పాట్లు

### 750 బస్సులు మంజూరు: తిరుమలలో ఆర్టీసి ఎండి ద్వారకాతిరుమలరావు

**తిరుమల,జూలై 29ప్రభాతవార్తప్రతినిధి:** ఆంధ్రప్రదేశ్‌లో మహిళల ఉచిత బస్సు ప్రయాణం కోసం ఏర్పాట్లు జరుగుతున్నాయని ఆర్టీసి ఎండి సిహెచ్.ద్వారకతిరుమలరావు తెలిపారు. ఇందుకు రాష్ట్రవ్యాప్తంగా అన్ని ఆర్టీసి డిపోలకు 1,350 కొత్త బస్సులు కేటాయించనున్నట్లు చెప్పారు. ఇప్పటికే 750 బస్సులు మంజూరు చేశామని, మరో 600 బస్సులకు ప్రతిపాదనలు పంపినట్లు వెల్లడించారు. ఆగస్ట్ 15నుండి ప్రారంభంకానున్న మహిళల ఉచిత బస్సు ప్రయాణంకోసం 11వేల బస్సుల్లో 74శాతం ఉచిత సేవలకు కేటాయిస్తామని తెలిపారు. అలాగే ప్రతి బస్టాండ్‌లో తాగునీరు, కుర్చీలు, ఫ్యాన్లు ఏర్పాటు చేస్తామన్నారు. ఆర్టీసి ఎండి ద్వారకతిరుమలరావు మంగళవారం ఉదయం తిరుమల ఆలయంలోనికి చేరుకున్నారు. ఉదయం విఐపి బ్రేక్‌లో స్వామివారిని దర్శించుకుని ఆశీస్సులందుకున్నారు. ఆలయ అధికారులు శ్రీవారి తీర్థప్రసాదాలు అందజేశారు.



## నైసార్ ఉపగ్రహం విజయవంతంకావాలి

### శ్రీవారి ఆశీస్సులందుకున్న ఇస్రో బృందం



**తిరుమల,జూలై 29ప్రభాతవార్తప్రతినిధి:** నాసో, ఇస్రో ఉమ్మడి ప్రయోగంగా నేడు ప్రయోగించనున్న జిఎస్ఎల్‌వి నైసార్ ఉపగ్రహం విజయవంతం కావాలని ఇస్రో ఛైర్మన్ నారాయణన్, డైరెక్టర్ ఉన్నికృష్ణన్ తెలిపారు. 11,200కోట్ల రూపాయలతో ఈ ప్రయోగం చేపడుతున్నామన్నారు. నేటి సాయంత్రం నింగిలోకి దూసుకెళ్ళనుంది. దానికి ముందుగా మంగళవారం ఉదయం ఇస్రో బృందం తిరుమలకు చేరుకుంది. ఉదయం విఐపి బ్రేక్ దర్శనాల సమయంలో ఉపగ్రహం నమూనాకు శ్రీవారి ఆశీస్సులందుకున్నారు. ఆలయ అధికారులు ఇస్రో ఛైర్మన్ నారాయణన్‌కు బృందానికి స్వామివారి దర్శనం చేయించి తీర్థప్రసాదాలు అందజేశారు.

## సిఎం సింగపూర్ పర్యటన విజయవంతంకావాలి

### శ్రీవారిసేవలో మంత్రి దుర్గేశ్

**తిరుమల,జూలై 29ప్రభాతవార్తప్రతినిధి:** ఆంధ్రప్రదేశ్‌లో పారిశ్రామిక పెట్టుబడులు, పలు రకాల అభివృద్ధికోసం సిఎం చంద్రబాబునాయుడు బృందం సింగపూర్ పర్యటన విజయవంతం కావాలని ఏడుకొండలస్వామిని కోరుకున్నట్లు రాష్ట్రమంత్రి కందుల దుర్గేశ్ తెలిపారు. సింగపూర్‌లో ఆంధ్రప్రదేశ్ బ్రాండ్ ఇమేజ్‌ను పెంచేందుకు సిఎం కృషి శుభపరిణామమన్నారు. మంగళవారం ఉదయం మంత్రి దుర్గేశ్ కుటుంబంతో విఐపి బ్రేక్ దర్శనాల సమయంలో శ్రీవారి ఆశీస్సులందుకున్నారు. ఆలయ అధికారులు స్వామివారి దర్శనం చేయించి తీర్థప్రసాదాలు అందజేశారు.





## రూ.2.40కోట్ల విలువైన బంగారు శంఖుచక్రాలు విరాళం

**తిరుమల.జూలై 29ప్రభాతవార్తప్రతినిధి:** శ్రీవేంకటేశ్వరస్వామికి ఓ దాత భక్తుడు భారీగా బంగారు ఆభరణాలు విరాళంగా ఇచ్చాడు. తమిళనాడు చెన్నైకి చెందిన సుదర్శన్ ఎంటర్ ప్రైజెస్ సంస్థ దేవదేవుడికి దాదాపు 2.50కిలోల బరువుతో తయారుచేయించిన రూ.2.40కోట్ల విలువైన బంగారు శంఖుచక్రాలను విరాళంగా అందజేశారు. ఆ సంస్థ ప్రతినిధులు ఈ విరాళాలను టిటిడి అదనపు ఇఒ వెంకయ్యచౌదరికి మంగళవారం ఉదయం అందించారు.

## ఆగస్ట్ 8 వరలక్ష్మీవ్రతానికి రేపు ఆన్‌లైన్‌లో టిక్కెట్లు

**తిరుమల.జూలై 29ప్రభాతవార్తప్రతినిధి:** తిరుచానూరు పద్మావతిఅమ్మవారి ఆలయంలో ఆగస్ట్ 8వతేదీ నిర్వహించే వరలక్ష్మీవ్రతానికి సంబంధించి ఈనెల 31వతేదీ టిటిడి ఆన్‌లైన్‌లో టిక్కెట్లు విడుదల చేస్తోంది. పద్మావతి అమ్మవారి ఆలయంలో జరిగే వరలక్ష్మీవ్రతంలో పాల్గొనే గృహస్థభక్తులు వెయ్యిరూపాయలు చెల్లించి 31వతేదీ ఉదయం 9గంటలకు ఆన్‌లైన్‌లో 150 టిక్కెట్లు అందుకోవచ్చని తెలిపింది. అలాగే తిరుచానూరు ఆలయం సమీపంలోని కౌంటర్‌లో ఆగస్ట్ 7వతేదీ ఉదయం 9గంటలకు కరెంట్ బుకింగ్‌లో 150 టిక్కెట్లు విక్రయిస్తారు. ఆరోజు ఆలయంలో అమ్మవారికి అభిషేకం, అభిషేకానంతర దర్శనం, లక్ష్మీపూజ, కళ్యాణోత్సవం, ఊంజల్‌సేవ, బ్రేక్‌దర్శనం, ఆశీర్వచనం సేవలు రద్దుచేసింది.

### హంద్రీనీవా ప్రధాన కాలువ పనులు పూర్తి

# 3850 క్యూసెక్కుల నీరు తరలింపు

### మంత్రి నిమ్మల రామానాయుడు



మంగళవారం హంద్రీనీవా, వెలిగొండ ప్రాజెక్టుల పనుల పురోగతి పై సమీక్షిస్తున్న మంత్రి నిమ్మల రామానాయుడు

**విజయవాడ,జూలై29,ప్రభాతవార్తప్రతినిధి:** రాయలసీమ జీవనాడి అయిన హంద్రీనీవా ప్రధాన కాలువ ద్వారా 3850 క్యూసెక్కుల నీరు తరలించే పనులు పూర్తయినట్లు రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు చెప్పారు. హంద్రీనీవా, వెలిగొండ ప్రాజెక్టుల పనుల పురోగతి పై ఆయన మంగళవారం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జగన్ ఐదేళ్ల పాలనలో పూర్తి చేయలేని ఈ పనులను తాము సంవత్సరం వ్యవధిలో పూర్తిచేసినట్లు మంత్రి స్పష్టం చేశారు. హంద్రీనీవా ఫేజ్2లో కూడా 3850 క్యూసెక్కులు తరలించేందుకు హంద్రీనీవా ప్రధాన కాలువ వెడల్పు, లైనింగ్ పనులు పూర్తి కావొచ్చాయని ఆయన వివరించారు. హంద్రీనీవా కాలువ కృష్ణాజలాలతో నిండుగా ప్రవహిస్తుంటే రాయలసీమ ప్రజలు హారతులతో స్వాగతం పలుకుతున్నారని సంతోషం వ్యక్తం చేశారు. పుంగనూరు, కుప్పం బ్రాంచ్‌కెనాల్ పనుల పురోగతి విషయంలో సకాలంలో స్పందించనందుకు ఇద్దరు ఇఇలకు మెమోలు జారీ చేయాలని మంత్రి నిమ్మల ఆదేశించారు. వెలిగొండ ప్రాజెక్టు టన్నెల్స్‌లో లైనింగ్, బెంచింగ్ పనులు ఆలస్యం కాకుండా 2026జూన్ కల్లా పూర్తయ్యేలా పనులు చేయాలని అధికారులు, ఏజెన్సీల ప్రతినిధులను ఆదేశించారు. వెలిగొండ ఫీడర్ కెనాల్, లైనింగ్, రిటైనింగ్‌వాల్ పనులకు వెంటనే టెండర్లు పిలవాలని సంబంధిత అధికారులకు సూచించారు. పూర్తికాని వెలిగొండను జాతికి అంకితం అంటూ గత పాలనలో జగన్ మోసం, దగా చేశాడన్నారు. మనం వెలిగొండ ప్రాజెక్టును పూర్తి చేసి ప్రకాశం జిల్లాకు న్యాయం చేయాలని మంత్రి నిమ్మల రామానాయుడు అధికారులతో అన్నారు. ఈ సమీక్షలో ఇరిగేషన్ స్పెషల్ సెక్రటరీ జి.సాయిప్రసాద్, అడ్వైజర్ ఎం.వెంకటేశ్వర రావు, ఈఎన్సి నరసింహమూర్తి, ఆయా ప్రాజెక్టుల సీఈలు, ఎస్ఇలు, ఇఇలు, ఏజెన్సీల ప్రతినిధులు, ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

## ఉపాధ్యాయులకు బోధనేతర విధులు అప్పగించొద్దు

### ఉత్తర్వులు జారీ చేసిన ప్రభుత్వం

**విజయవాడ,జూలై29,ప్రభాతవార్తప్రతినిధి:** పాఠశాల విద్యాశాఖకు సంబంధం లేని కార్యక్రమాలను ప్రిన్సిపల్స్, ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులకు అప్పగించొద్దని పాఠశాల విద్యాశాఖ ఆదేశాలు జారీచేసింది. ప్రభుత్వ జూనియర్ కళాశాలలు, కెజిబివి, మోడల్, రెసిడెన్షియల్, జిల్లా, మండల, మున్సిపల్ పాఠశాలల్లోని సిబ్బందిని ఉపయోగించొద్దని జిల్లా కలెక్టర్లకు కార్యదర్శి కోన శశిధర్ మెమో జారీ చేశారు. పాఠశాలవిద్యాశాఖ హెచ్ఒడి అనుమతి లేకుండా విద్యేతర కార్యక్రమాలను అప్పగించొద్దన్నారు. విద్యా వ్యవస్థకు ఉపయోగపడేలా ఈ ఉత్తర్వులు జారీ చేశారని ఉపాధ్యాయ సంఘ నాయకులు తెలిపారు. అనవసరమైన యాప్‌లను కూడా తొలగించేందుకు ఉత్తర్వులు విడుదల చేయాలని ఉపాధ్యాయ సంఘ నాయకులు కోరారు.



## రైల్వే డిఆర్ఎం పేషీలో కొత్త నీరు

**గుంతకల్లు రైల్వే, జూలై 29,ప్రభాతవార్త:** రాయలసీమతో పాటు నెల్లూరు, కర్ణాటక, తమిళనాడు, తెలంగాణలోని జిల్లాల పరిధిలో ఉన్న దక్షిణ మధ్య రైల్వేగుంతకల్లు డివిజనల్ రైల్వే మేనేజర్ (డిఆర్ఎం) పేషీలో పాత వారి స్థానంలో కొత్త వారిని నియమించారు. ఖాళీగా ఉన్న డిఆర్ఎం పిఎస్(గెజిటెడ్)గా యం.రమాకుమారిని నియమించారు. అలాగే డిఆర్ఎంపిఎస్‌గా టి.సాయి ప్రసాద్‌రావును, కంప్లైంట్/ప్రోటోకాల్/పిఆర్ఐగా జి.గిరీష్‌లను నియమించారు.

## యూనివర్సల్ సృష్టి సంతాన సాఫల్య కేంద్రానికి తాళాలు

**విజయవాడ,జూలై29,ప్రభాతవార్తప్రతినిధి:** విజయవాడలో యూనివర్సల్ సృష్టి సంతాన సాఫల్య కేంద్రం పేరుతో నడుస్తోన్న ఆస్పత్రికి సిబ్బంది తాళాలువేసి అందుబాటులో లేకుండా పోయారు. పోలీసులు వచ్చిన సమయంలో ఆస్పత్రి గేటుకు తాళాలు వేసి ఉండడంతో బయట నుండి చూసి వెళ్లిపోయారు. ఈ కేంద్రాన్ని ఎన్‌టిఆర్ జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ ఎం.సుహాసిని పరిశీలించారు. ఆస్పత్రి గేటుకు తాళాలు వేసి ఉండడంతో సిబ్బందికి ఫోన్ చేశారు. కిషోర్ అనే వ్యక్తి వచ్చి తాళాలు తీశారు. అయితే, ఆస్పత్రిలో రికార్డులులేవు. యూనివర్సల్ పేరుతో ఆస్పత్రిని నడుపుతు న్నారని, సృష్టితో సంబంధం లేదని సిబ్బంది చెబుతున్నారు. అయితే, సృష్టి పేరుతో ఉన్న రికార్డులను ఎందుకు మాయం చేశారని, ఆస్పత్రికి ఎందుకు తాళాలు వేశారని సిబ్బందిని డిఎం అండ్ హెచ్ఒ సుహాసిని ప్రశ్నించారు. యూనివర్సల్ సృష్టి పేరుతో నడుస్తున్న ఆస్పత్రిపై తమకు ఫిర్యాదులు రాలేదని ఆమె తెలిపారు. అయితే, ఆస్పత్రికి తాళాలు వేయడం, రికార్డులు మాయం చేయడంపై సమగ్ర విచారణ జరిపి కలెక్టర్ దృష్టికి తీసుకెళతామని చెప్పారు. తమ విచారణలో అక్రమాలు జరిగాయని తెలిస్తే బాధ్యులపై చర్యలు తీసుకుంటామని తెలిపారు.

**పేరే వేరు.. అంతా సృష్టి:** ఐదేళ్ల క్రితం సృష్టి పేరుతోనే నిర్వహించిన కేంద్రాన్నే యూనివర్సల్ సృష్టి అంటూ బోర్డు మార్చారు. అయితే, గతంలో సృష్టి పేరుతో ఉన్న సిబ్బందే వ్యవహారం అంతా నడిపిస్తున్నారు. ఆ కేంద్రం వైద్యులు డాక్టర్ నమ్రతపై నిషేధం ఉండటంతోపాటు పలు ఆరోపణలూ ఉన్నాయి. దీంతో, ప్రస్తుతం విజయవాడ సెంటర్‌ను డాక్టర్ కరుణ, వైశాలి పేరుతో నడుపుతున్నారు. వీరిద్దరూ కూడా ప్రస్తుతం అందుబాటులో లేదు. విజయవాడ సూర్యారావుపేటలో సృష్టి టెస్ట్ ట్యూబ్ బేబీ సెంటర్ పేరుతో ఆస్పత్రి ఉండేది. దీనిపై అనేక ఆరోపణలు రావడంతో అప్పట్లోనే వైద్యురాలు నమ్రతపై కేసు కూడా నమోదైంది. కొంతకాలం తర్వాత మళ్లీ విజయవాడ బెంజిసర్కిల్ రామచంద్రనగర్ కంచుకోట వీధిలో యూనివర్సల్ సృష్టి సంతాన సాఫల్య కేంద్రాన్ని ప్రారంభించారు. వాస్తవానికి రిజిస్ట్రేషన్ యూనివర్సల్ పేరు ఉన్నా కార్యకలాపాలన్నీ సృష్టి టెస్ట్ ట్యూబ్ బేబీ సెంటర్ పేరుతోనే డాక్టర్ నమ్రత ఆధ్వర్యంలో నడుస్తున్నాయి.

## విశాఖలో పార్ట్‌నర్ షిప్ సమ్మిట్ నిర్వహణ కమిటీ చైర్మన్‌గా మంత్రి లోకేష్

**విజయవాడ,జూలై29,ప్రభాతవార్తప్రతినిధి:** రాష్ట్రా నికి పరిశ్రమలు, పెట్టుబడులే లక్ష్యంగా ఏపీ ప్రభు త్వం చర్యలు తీసుకొంటుంది. ఈ క్రమంలోనే విశాఖ వేదికగా నవంబరు 14,15 తేదీల్లో పార్ట్ నర్‌షిప్ సమ్మిట్ ఏర్పాటు చేయాలని నిర్ణయిం చింది, సమ్మిట్ నిర్వహణకు పలు కమిటీలు ఏర్పాటు చేస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. ఆరు గురు మంత్రుల బృందంతో కమిటీ ఏర్పాటు చేసింది. ఈ మంత్రుల బృందానికి మంత్రి నారా లోకేష్ చైర్మన్‌గా వ్యవహరించనున్నారు, సభ్యు లుగా మంత్రులు టీజీ భరత్, గొట్టిపాటి రవికుమార్, కందుల దుర్గేష్, పొంగూరు నారా యణ, కొండపల్లి శ్రీనివాస్ ఉన్నారు. వసతుల కల్పన, ఏర్పాట్లుకు సంబంధించి అధికారులతో మరో 9వర్కింగ్ కమిటీలను ప్రభుత్వం ఏర్పాటు చేసింది. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె,విజయానంద్ ఉత్తర్వులు జారీ చేసారు.

## విశాఖపట్నంలో గ్రీన్ ఎనర్జీ డాటా సెంటర్ ఏర్పాటు చేయండి


### ఎస్‌టిటెలీ మీడియా ఇన్వెస్టిమెంట్స్ హెడ్ రీతూ మెహ్లోవత్‌తో లోకేష్ భేటీ

**విశాఖపట్నం ప్రతినిధి, జూలై 29, ప్రభాత వార్త :** ఎస్ టి టెలీమీడియా ఇన్వెస్టిమెంట్స్ (ఇండియా) హెడ్ రీతూ మెహ్లోవత్ తో రాష్ట్ర విద్య, ఐటి, ఎలక్ట్రానిక్స్ శాఖల మంత్రి నారా లోకేష్ సింగపూర్ లో భేటీ అయ్యారు. (సింగపూర్ ప్రధాన కేంద్రంగా కార్యకలాపాలు నిర్వహిస్తున్న ఎస్ టి టెలీమీడియా వ్యూహాత్మక పెట్టుబడి సంస్థ. కమ్యూనికేషన్స్, మీడియా, డేటా సెంటర్లు, ఇన్ ఫ్రాస్ట్రక్చర్ టెక్నాలజీలలో ప్రపంచవ్యాప్త పోర్ట్ ఫోలియోను కలిగి ఉంది.) ఈ సందర్భంగా మంత్రి లోకేష్ మాట్లాడుతూ భారత్ లో కార్యకలాపాలను రెట్టింపు చేయాలని భావిస్తున్నందున డాటా సిటీగా ఆవిష్కృతమవుతున్న విశాఖపట్నంలో ఎస్ టి టెలీమీడియా గ్రీన్ ఎనర్జీ డాటా సెంటర్ ఏర్పాటు చేయండి అని కోరారు. ఉత్తర ప్రదేశ్ తరహాలో అత్యాధునిక డేటా సెంటర్లు, కంప్యూటింగ్ మోలిక సదుపాయాల కల్పన, ఆప్టిమైజేషన్ ద్వారా బలమైన పర్యావరణ వ్యవస్థను ఏర్పాటుచేయడానికి ఎపి ప్రభుత్వంతో కలసి పనిచేయాలని మంత్రి లోకేష్ కోరారు. రీతూ మెహ్లోవత్ స్పందిస్తూ భారత్‌లో తాము ప్రస్తుతం 10 ప్రధాన నగరాల్లో 311 మెగా వాట్ల క్రిటికల్ ఐటి లోడ్ తో 30 డాటా సెంటర్లు నిర్వహిస్తున్నామని తెలిపారు. భారత్‌లో తమ డాటా సెంటర్ల సామర్థ్యాన్ని 550 మెగా వాట్లకు పెంచాలని భావిస్తున్నట్లు చెప్పారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ప్రతిపాదనలను సంస్థ ఉన్నతస్థాయి బృందం దృష్టికి తీసుకెళ్లి, నిర్ణయం తీసుకుంటామని రీతూ మెహ్లోవత్ తెలిపారు.




## సరసమైన ధరలకు సాంప్రదాయ ఆహారం

### తిరుమలలో ఏర్పాటుకానున్న బ్రాండెడ్ హోటళ్లు





**తిరుమల,జూలై 29ప్రభాతవార్తప్రతినిధి:** భక్తుల అవసరాలకు తగ్గట్లు నాణ్యమైన ,రుచితో కూడిన శుచిగా సాంప్రదాయం ఆహారం వడ్డించే పెద్ద హోటళ్ళు తిరుమలలో ఏర్పాటు కానున్నాయి. ఇం దుకోసం కొన్ని నిబంధనలతో ,ఖచ్చితంగా సాంప్ర దాయ వంటకాలనే తయారుచేయాలని టిటిడి అధికారులు టెండర్ల ద్వారా బ్రాండెడ్ హోటళ్ళను ఎంపికచేశారు. ప్రస్తుతం ఐదు హోటళ్ళకు నిబంధనలమేరకు అనుమతించారు. తిరుమలలోని పద్మావతినగర్ ఏరియా, మ్యూజియం ప్రాంతం, కల్యాణకట్టకు సమీపంలోని వాటర్‌ఫౌంటైన్ ప్రాంతంలో గతంలో కొందరు వ్యాపారులు నడిపిన హోటళ్ళు ఇప్పుడు కొత్తగా బ్రాండెడ్ హోటళ్ల యాజమాన్యం చేతిలోకి వెళ్ళాయి. గతంలో శ్రీవత్స హోటల్‌ను ప్రస్తుతం చెన్నై అడయార్ ఆనంద్‌భవన్ యాజమాన్యం, కౌస్తుభం వద్ద టిటిడి స్వాధీనం చేసుకున్న హోటల్‌ను హైదరాబాద్‌కు చెందిన దంతూర్ గ్రూఫ్ ఆఫ్ హోటల్స్‌కు, సందీప్ మయూరా హోటల్‌ను హైదరాబాద్ ప్రెస్ట్ హాస్పిటాలిటీ యాజమాన్యంకు, ఎస్వీగెస్ట్‌హౌస్, సారంగి పేరుతో ఉన్న హోటళ్ళను ముంబైకు చెందిన శ్రీసుఖ్‌సాగర్ హాస్పిటాలిటీ సర్వీసెస్ కు, సప్తగిరి హోటల్‌ను గుజరాత్ సంకల్ప రిక్రియేషన్ యాజమాన్యం చేతికి అప్పగించారు. ఈ హోటళ్ళన్నీ వ్యాపారధోరణితోకాకుండా సేవాభావంతో భక్తులకు సేవలందించాలని టిటిడి అధికారుల సూచన. సాధారణంగానే తిరుమలలో ఏ వ్యాపారాలైన భక్తుల అవసరాలు, వారి కోసం నడుస్తున్నవే. పూర్తిగా భక్తులపైనే ఆధారపడి హోటళ్ళు, టీదుకాణాలు, ఇతరత్రా వ్యాపారాలు జరుగుతాయి. గతంలో తిరుమలలో పెద్దపెద్దహోటళ్ళు ఉన్నా వాటిల్లో నాణ్యమైన ఆహారం లేదని, ధరలు అధికంగా ఉండేవని భక్తులు ఫిర్యాదులు. అంతేగాక టిటిడి అధికారుల తనిఖీల్లోనూ శుచి, రుచి లేదని తేల్చారు. దీంతో కొన్ని హోటళ్ళను మూసివేయగా మరికొన్ని హోటళ్ళు టెండర్లు పూర్తయి తిరిగి స్థానికులకు అప్పగించలేదు. ఆ పెద్ద ఐదు హోటళ్ళను ఇప్పుడు బ్రాండెడ్, విశ్వాసమున్న సాంప్రదాయ భోజనాలు తయారుచేసి అందించాలని సూచనలతో ఏర్పాటుకు ముందుకువచ్చాయి. తిరుమలలో మూడు వరకు పెద్ద హోటళ్ళు, 10వరకు జనతా క్యాంటీన్లు, 20వరకు ఫాస్ట్‌పుడ్ కేంద్రాలు నడుస్తున్నాయి. వీటిల్లో కూడా అధిక ధరలు, ఉత్తరభారతదేశం చైనీస్, గోబీ వంటి ఆహారం పదార్థాలు రంగులతో తయారుచేసి భక్తులకు వడ్డిస్తున్నారనేది ఫిర్యాదులు,. దీనిపై అందిన సమాచారంతో టిటిడి ఇప్పటికే తిరుమలలో చైనీస్ పుడ్స్, గోబీ, నూడిల్స్, ఫ్రైడ్ రైస్‌లకు అనుమతించలేదు. పూర్తిగా శాఖాహారం, దక్షిణబారతదేశ వంటకాలతోనే సేవాభావంతో హోటళ్ళు నడపాలనేది టిటిడి ధ్యేయం. తిరుమలకొండపైకి కూరగాయలు, బియ్యం, పప్పులు, చివరకు పాలు, గాజుసీసాల్లో తాగేనీరు కూడా ఘాట్‌లో రవాణా భారం కూడా భక్తులపైనే మోపుతారు. ఒకలీటర్ మంచినీటి సీసా 20రూపాయలకే లభిస్తుండగా తిరుమలలో గాజుసీసా నీటిని 30-35రూపాయలకు విక్రయిస్తున్నారు. సీసాతో బాటు 65రూపాయలకు భక్తులకు అంటగడుతున్నారు. సీసా తిరిగి ఇస్తే కొన్ని చోట్ల 30 రూపాయలు వెనక్కు ఇస్తారు. దీన్నిబట్టి లీటరునీటి ధర 35రూపాయల వరకు భక్తులకు దోపిడీనే. అలాంటిది అవసరమైన ఆహారపదార్థాల ముడిసరుకులు తిరుమలకు రవాణా చేసుకున్నా మరీ రానున్న రోజుల్లో ఈ పెద్ద హోటళ్ళలో భోజనాలు, అల్పాహారాలు ఏ మేరకు ధరలు నిర్ణయిస్తారనేది చూడాల్సిందే.

## గుర్తు తెలియని వాహనం ఢీకొని వ్యక్తి మృతి

**దగదర్తి (నెల్లూరు), జూలై 29, ప్రభాతవార్త :** దగదర్తి గ్రామానికి చెందిన మారుపూడి భాస్కర్ సున్నబట్టి రాచర్లపాడు హైవే రహదారి మార్గమధ్యంలో గుర్తు తెలియని వాహనం ఢీకొట్టడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. బంధువులు చెప్పిన సమాచారం మేరకు మృతుడు భాస్కర్ బోగోలు మండలం నాగులవరం గ్రామ పంచాయతీ సెక్రటరీగా విధులు నిర్వహిస్తున్నాడు. సోమవారం రాత్రి దగదర్తి నుంచి రాచర్లపాడు మోటార్ బైక్‌పై బంధువుల నివాసానికి వెళ్తుండగా ఈ దుర్ఘటన జరిగిందని, బంధువులు తెలిపారు. దగదర్తి పోలీసులు కేసు నమోదు చేశారు. ఎస్సై జంపని కుమార్ దర్యాప్తు చేస్తున్నామని తెలియజేశారు.


**NOTICE**

**MAHADHAN**

In order to make the Indian Farmers internationally competitive, Mahadhan Agritech Limited, brings to you the following imported & Indigenous 100% Water Soluble Mixture of Fertilisers as per order dated 24.10.2015, issued by Ministry of Agriculture & Farmers Welfare, Govt. of India, New Delhi.

| Sr. No. | Particulars / Grade | NPK 14:25:10 | NPKS 9:6:31:8 | NPK 24:24:0 | NPK 0:40:40 | NPK 12:30:20 |
|---|---|---|---|---|---|---|
| 1 | Moisture percent by weight, maximum | 0.5 | 0.5 | 0.5 | 0.5 | 0.5 |
| 2 | Total Nitrogen percent by weight, minimum | 14 | 9 | 24 | 0 | 12 |
| 3 | Total Phosphorous and water soluble phosphorous (as $P_2O_5$) percent by weight, minimum | 25 | 6 | 24 | 40 | 30 |
| 4 | Water Soluble Potassium (as $K_2O$) percent by weight, minimum | 10 | 31 | 0 | 40 | 20 |
| 5 | Sulphur (as S) percent by weight, minimum | 0 | 8 | 0 | 0 | 0 |
| 6 | Total Chloride per cent by weight, maximum | 1.5 | 1.5 | 1.5 | 1.5 | 1.5 |
| 7 | Matter insoluble in water per cent by weight, maximum | 0.5 | 0.5 | 0.5 | 0.5 | 0.5 |
| 8 | Sodium as NaCl per cent by weight, maximum | 0.5 | 0.5 | 0.5 | 0.5 | 0.5 |
| 9 | Lead (as Pb) per cent by weight, maximum | 0.003 | 0.003 | 0.003 | 0.003 | 0.003 |
| 10 | Cadmium (as Cd) per cent by weight, maximum | 0.0025 | 0.0025 | 0.0025 | 0.0025 | 0.0025 |
| 11 | Arsenic (as As) per cent by weight, maximum | 0.01 | 0.01 | 0.01 | 0.01 | 0.01 |

**Salient Features:**

1. 100% Water Soluble.
2. Improves quality and yield of the produce.
3. Suitable to use through drip irrigation and foliar application.

**Packing :** Available in 500 gm, 1 Kg, 5 Kg, 10 Kg and 25 Kg Packing.

**Supply and sales of above Mahadhan WSF grades will be done after 30-35 days.**

*Manufactured / Imported & Marketed by -*
**MAHADHAN AGRITECH LIMITED**
**Registered Office :** Sai Hira, Survey No. 93, Mundhwa Road, Mundhwa, Pune - 411036, Maharashtra.
**www.mahadhan.co.in**



**నివాస్ హౌసింగ్ ఫైనాన్స్ ప్రైవేట్ లిమిటెడ్**

(పూర్వపు ఇండోస్టార్ హోమ్ ఫైనాన్స్ ప్రైవేట్ లిమిటెడ్‌గా తెలిసినది, NHFPLగా ఇటుపై రిఫర్ చేయబడును)
నమోదిత కార్యాలయం-కార్యాలయం : యూనిట్ నం.305, 3వ అంతస్తు, వింగ్ 2/E, కార్పొరేట్ ఎవెన్యూ అంధేరి ఘట్‌కోపర్ లింక్ రోడ్, చాకల, అంధేరీ (ఈస్ట్), ముంబై-400093

NIWAS HOUSING FINANCE

**సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అసెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంట్రస్ట్ చట్టం, 2002 యొక్క సెక్షన్ 13(2) క్రింద ప్రకటన**

NHFPL ఈ క్రింది రుణగ్రహీతలకు నివాసితగృహాల యొక్క తనఖా పై గృహ రుణం/తనఖా రుణం/నిర్మాణ రుణం మంజూరు చేసింది. నేషనల్ హౌసింగ్ బ్యాంక్/RBI యొక్క మార్గదర్శకాలు మరియు ఆదేశాలను అనుసరించి సదరు రుణాలు తిరిగి చెల్లింపులు సక్రమంగా లేకపోవడంతో వారి ఖాతాలను ఫైనల్‌గా నిరర్థక ఆస్తులుగా వర్గీకరించడమైనది. అందువలన NHFPL సర్ఫాసి చట్టం 2002 యొక్క 13(2) సెక్షన్ క్రింద హక్కులను వినియోగిస్తూ వారికి చట్ట ప్రకారం నోటీస్ జారీ చేస్తూ ఆ రుణగ్రహీతలను రుణబకాయి మొత్తాలను వారికి ఎదురుగా పేర్కొన్న రుణబకాయి మొత్తం డిమాండ్ నోటీస్ తేది నుండి 60 రోజులలోగా తిరిగి చెల్లించవలసినదిగా పిలుపు ఇవ్వడమైనది. ఈ క్రింద పేర్కొన్న రుణగ్రహీతలకు ఇందుమూలముగా ఈ ప్రచురణ ద్వారా పిలుపు ఇవ్వనది ఏమనగా వారికి ఎదుటగా పేర్కొన్న రుణ బకాయి మొత్తాలను తదుపరి ఛార్జీలు మరియు amp తిరిగి చెల్లింపు వరకు అయిన వడ్డీతో సహా సదరు డిమాండ్ నోటీస్ తేదీ నుండి 60 రోజులలోగా చెల్లించవలసినదిగా ఇందుమూలముగా పిలుపు ఇవ్వడమైనది. విఫలమైతే NHFPL చట్టప్రకారం బకాయి మొత్తం రికవరీకి ఆస్తుల స్వాధీనం, డిస్పోజ్/అమ్మకం అన్నీ లేదా ఏదైనా తదుపరి చర్యలకు ఉపక్రమించి చెల్లించవలసిన రుణ బకాయి మొత్తాన్ని రుణ ఒప్పందం యొక్క చట్ట నిబంధనల ప్రకారం తిరిగి వసూలుకు ఉపక్రమిస్తుందని ఇందుమూలముగా హెచ్చరించడమైనది. రుణగ్రహీతలు ఆస్తుల యొక్క ఓనర్‌షిప్‌పై థర్డ్ పార్టీ ఆసక్తి సృష్టించడం లేదా పరాధీనం చేయడం వంటి చర్యలు చేపట్టవద్దని హెచ్చరిస్తూ అడుప్పు చేయడమైనది.

| క్ర. సం. | స్థానం/రుణ ఖాతా నంబర్ | రుణగ్రహీత పేరు/ సహ రుణగ్రహీతలు/ హామీదారు | డిమాండ్ నోటీస్ పంపిన తేది | డిమాండ్ నోటీస్ ప్రకారం మొత్తం |
|---|---|---|---|---|
| 1 | ఏలూరు LNELR0HL-07230033497 | 1. సయ్యద్ బాజీ సయ్యద్ (ఋణగ్రహీత) 2. సూఫియా సయ్యద్ (సహ ఋణగ్రహీత) | 18-జూలై-2025 | రూ.696038/- (రూపాయలు ఆరు లక్షల తొంభై ఆరు వేల ముప్పై ఎనిమిది మాత్రమే) |
| | ఆస్తి కలిగి వున్నది : ఆంధ్రప్రదేశ్, తూర్పు గోదావరి జిల్లా, గోపాలపురం మండలం, గోపాలపురం గ్రామం, గోపాలపురం గ్రామ పంచాయత్, వేగేశ్వరపురం సబ్‌రిజిస్ట్రీ, తూర్పు గోదావరి జిల్లా, ఇం.నం. 11-117, R.S.నం. 218-7 కలిగివున్న ఆస్తి యొక్క మొత్తం అదంతా. ఇంటి స్థలం హౌస్ ఇన్ 77.0చ.గ. యొక్క విస్తీర్ణం ఈజ్‌మెంట్ హక్కులతో సహా. ఈక్రింది సరిహద్దులు ఈ విధంగా : తూర్పు : గట్టి చంద్రకళకు చెందిన ఆస్తి. పడమర : పంచాయత్ రోడ్. ఉత్తరం : ఉచుల వీరాయమ్మకు చెందిన ఆస్తి. దక్షిణం : పంచాయత్ రోడ్. | | | |

ప్రదేశం : ఏలూరు, ఆంధ్రప్రదేశ్
తేదీ : 30.07.2025

సం/- అధీకృత అధికారి
నివాస్ హౌసింగ్ ఫైనాన్స్ ప్రైవేట్ లిమిటెడ్ తరపున

వార్త

నీ గురించి ప్రజలు ఏమనుకోవాలని కోరుకుంటారో అలా కావడానికి ప్రయత్నించడంలోనే జీవితానికి సార్థకత ఉంది.

-గౌతమ బుద్ధుడు

# మహిళల పథకంలో మగాళ్లెలా?

భారతదేశ చరిత్రలో ప్రభుత్వ పథకాలు ఎక్కడా లబ్ధిదారులకు సజావుగా అందిన దాఖలాలు లేవు. ప్రభుత్వ పథకాలన్నాక తప్పుదారి పట్టడాలు, లబ్ధిదారులకు సరిగా అందకపోవడాలు, వంటి వన్నీ సర్వసాధారణమే. అయినా కొంతలో కొంత లబ్ధి దారులకు అందుతున్నాయని, ఉచిత నగదు బదలీలు సైతం జనానికి చేరుతున్నాయని సరిపెట్టుకోవడమే ప్రభుత్వానికి ఊరట కలిగిస్తుంది.ఆ సంతృప్తి మాత్రమే ఆయా ప్రభుత్వాలను బతికిస్తుంది. కానీ ఏకంగా మూలం నుంచే లబ్ధిదారుల కోత, అనర్హుల చేర్పు, మార్పులవంటి తమాషాలు జరిగి చివరికి ఆ పథకంలోని డొల్లతనం బయట పడేసరికి ఆ ప్రభుత్వాలే కించిత్తు విస్మయానికి గురవడం చూస్తుంటారు. ఇలాంటి వాటికి తాజాగా మహారాష్ట్రలో అమలవుతున్న 'లడ్కీ బహెన్ యోజన' పథకంలో కళ్లకు కట్టినట్లు కన్పిస్తున్నాయి. వీటన్నిటినీ సరిచేయకపోతే సామాన్య అతివలు బలైపోతారు. ప్రభుత్వం కల్పించే 'ఆసరా'కి దూరమవుతారు. దానాదీనా, 'మహాయుతి' ప్రభుత్వాన్ని అందలమెక్కించడానికి ఉపయోగపడిన ప్రాయోజిత ప్రతిష్ఠాత్మక పథకం. 'లడ్కీ బహెన్‌యోజన. అప్పట్లో ఇంతటి మంచి పథకం మళ్లీరాదనే అంచనాలతో ప్రభుత్వ నిజాయితీపై నమ్మకంతో ఆ ప్రభుత్వాన్ని మళ్లీ పట్టం కట్టారు. పాలకపెద్దలు అటునిటుగా మారినా 'కూటమి' తన లక్ష్యాన్ని చేరుకోగలిగింది. నిజానికి ఇరుగు పొరుగు రాష్ట్రాలు కూడా మహిళల కోసం వేర్వేరు పేర్లతో విశేషలబ్ధినందించే పథకాలను అందిస్తున్నాయి. అయినా ఎందుచేతనో 'లడ్కీ బెహన్' పథకానికి ఎనలేని ఆదరణ లభించింది. కాగా అక్రమ విధానాలతో ఆ పథకం ఎంత భ్రష్టుపట్టిందో తాజాగా బయటపడింది. అర్హులైన మహిళలకు నెలకు 1500 రూపాయలు అందించే పథకమిది. దీనికి 21 నుంచి 65 సంవత్సరాలున్న మహిళలను ఎంపిక చేసి వారికి మాత్రమే నగదు పథకంగా అందిస్తుండగా అందులో లెక్కకు మించి మగాళ్ల పేర్లు చోటు చేసుకున్నాయి. ఈపథకంలో 24.1 మిలియన్ల మంది మహిళలు అర్హులుగా చేసి ఇంతవరకు రూ. 21.44 కోట్ల మేరకు నగదును వారి ఖాతాల్లోకి బదలీ చేశారు. సాధారణంగా ఒకే ఇంట్లో ఇద్దరు మహిళలుంటే వారిద్దరికీ చెరో 15 వందల రూపాయలు ముట్టచెప్పారు. కాగా చాన్నాళ్లకు ప్రభుత్వానికి జ్ఞానోదమై ఆయా లబ్ధి దారుల చెకింగ్‌లో దాదాపు 14.298 మంది మగాళ్లు తప్పుడు గుర్తింపు ద్వారా నెలనెలా ఆర్థికసాయం పొందా రని తేలింది. మహిళల ఆర్థిక స్వావలంబన కోసం ఈ పథకం ప్రవేశపెట్టినా మగాళ్లు కూడా ఆన్‌లైన్‌లో దర ఖాస్తు చేయడం, ఆ వెంటనే అప్రూవ్ కావడం విశేషం. ఇలా ఎంతో ఆశ్చర్యంగా ఆన్‌లైన్‌లో మగాళ్లు ఆడవారి జాబితాలో ఏకంగా పదినెలలపాటు లబ్ధి పొందారు. ఎవరూ కిమ్మనలేదు. లక్ష్మీదేవి తలుపు తడితే ఆహ్వానిం చకుండా ఉండగలరా! అయితే వారి దరఖాస్తులు ఎలా అనుమతించబడినవో మిలియన్‌డాలర్ల ప్రశ్న. ఈ'మహా' మాయగాళ్లు 'ఫేక్‌ఐడి'లు సృష్టించి ఈ పథకంలో చేరిపో యారు. ప్రతి దరఖాస్తులో జండర్, ఫొటో, పేరు ఉం టాయి. ఏదోఒక 'సెర్చ్'లో అలాంటి ఫేక్ అప్లికేషన్‌లను వడకట్టవచ్చు. కానీ 'మహా'లో ఏం జరిగిందో విశ్లేషించాలంటే ప్రత్యేక దర్యాప్తు అవసరమే. మహిళలుగా తమ పేర్లు నమోదు చేసుకొని లబ్ధిపొందిన మగాళ్లను 'ది ఉమెన్ అండ్ చైల్డ్ డెవలప్‌మెంట్ డిపార్ట్ మెంట్'వారు ఎలాగో పసికట్టారు. వారి గుట్టురట్టు చేశారు. ఇలాంటివి ఒక్కొక్కటిగా బయటపడి ఆ పథకంలోని డొల్లతనం బయటపడింది. పథకం మంచిదే. మహిళల ఆర్థిక స్వావ లంబన కల్పించే మార్గాల అన్వేషణ ఆహ్వానించదగినదే. ఈ నేపథ్యంలోనే మహిళలకు కొద్దో గొప్పో నగదు సహాయం అందించడమూ మంచి ఉద్దేశమే! కానీ ఈ పథకం కింద లబ్ధిపొందే వారిలో ఫోర్ వీలర్‌లు ఉన్నవారు 1.62లక్షల మంది మహిళలు కూడా ఉన్నారు. కేవలం పేదల కోసం నిర్దేశించబడిన ఈ పథకం కింద అధికా దాయాల వారి పేర్లుకూడా అర్హత పొందడం విస్మయం కలిగిస్తోంది. గరిష్ఠ వయోపరిమితిని 65 ఏళ్లని నిర్ణయించినా అంతకన్నా వయసున్న మహిళలు కూడా ఈ పథక లబ్ధిదారుల్లో కనపడతారు. వారి సంఖ్య 2.87 లక్షల మంది. సాఫ్ట్‌వేర్ ప్రోగ్రామింగ్‌లో వడపోతలు సాధ్యమే. కానీ వాటన్నిటినీ దాటుకుని అనర్హులు ఎలా అర్హులయ్యారో తేల్చడం శ్రమతో కూడుకున్న పనే. ఇలా అనర్హుల జాబితాకు ఆర్థిక సహాయం పేరిట రూ. 431.7 కోట్ల నష్టం వాటిల్లుతోందని మహారాష్ట్ర ప్రభుత్వం లెక్క తేల్చింది. ఈ అంశంపై సమగ్ర దర్యాప్తు చేయనున్నట్లు ఉపముఖ్యమంత్రి అజిత్ పవార్ ప్రకటించారు. ఈ పథకమే లోపభూయిష్టమైనదని విపక్షాలు దుమ్మెత్తి పోస్తుండడం ఇప్పుడు ప్రభుత్వానికి తలనొప్పిగా మారింది. ఇవన్నీ విపక్షాల అన్వేషణలో బయటపడినవి కాదు. ఆ రాష్ట్ర మహిళాశిశు అభివృద్ధి శాఖ (డబ్ల్యుసిడి) ఆడిట్‌లో వెల్లడైనందున పూర్తి సాక్ష్యాధారాలు నమోదైనవే కావడం వల్ల ప్రభుత్వ పెద్దలు నోరెత్తలేకపోతున్నారు. 'ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్ వ్యవస్థ'ను తప్పుదారి పట్టించడం సాధ్యమా? లేక ప్రభుత్వాన్ని అప్రతిష్టపాలు చేసే వ్యవహారంలో ఎవరి హస్తమైనా ఉందేమో చిత్తశుద్ధితో తెలుసుకోవాల్సిందే. భారీ సంఖ్యలో పలు రకాలుగా పలు వ్యూహాలతో అనర్హుల జాబితా 'కొండ వీడు చాంతాడు' పెరిగిపోవడంతో ఇంతదాక ప్రభుత్వ ఖజానాకు భారం పడింది. అనర్హులకందిన ఆర్థిక లబ్ధి దుర్వినియోగమే కదా! అనర్హులకు తాత్కాలికంగా నిధుల జమ ఆపివేశారు. అక్రమ మార్గాల ద్వారా ఆర్థిక ప్రయోజనాలు పొందిన మోసపూరిత లబ్ధిదారులపై చర్యలు తీసుకునే బాధ్యత ప్రభుత్వంపై ఉంది.



ప్రతి వాడు ఓర్పుతో ఉండలేడు. అలా ఉన్నవాడే తనను తాను జయించగలడు. ఓర్పు లేకపోవడం ఒకరకమైన దౌర్జన్యం. అది ప్రజాస్వామ్య ప్రగతికి అవరోధం.

మహాత్మా గాంధీ



జీవితంలో సంతృప్తిపడడం నేర్చుకున్న వ్యక్తి ఎప్పుడూ ఆనందంగానే ఉంటాడు. అది చేతకాని వ్యక్తి ఎప్పుడూ దుఃఖానికి గురవుతూనే ఉంటాడు.

జార్జ్ ఇలియట్

## ప్రజావాక్కు



### చర్చలా, కొట్లాటలా?

టి.వీలలో ప్రసారమయ్యే డిబేట్లలో అన్నిపార్టీల ప్రతినిధులు, రాజకీయవిశ్లేషకులు పాల్గొంటారు. యాంకర్లు అడిగే ప్రశ్నలకువారు సమాధానం చెప్పాలి.కానీ వారిలో క్రమశిక్షణ లోపిస్తోంది. ఒకరు మాట్లాడుతుంటే మరోకరు అనవసరంగా కలగజేసుకుని గట్టిగా మాట్లాడుతుంటారు. అప్పుడప్పుడు మూడో వ్యక్తి కూడా తన అభిప్రాయాన్ని వెలుబుచ్చుతుంటారు. ఒకరి తరువాత ఒకరు మాట్లాడాలని తాను వారికి మరల అవకాశమిస్తానని యాంకర్లు మర్యాదగా మందలిస్తున్నా వినిపించుకోరు. టి.వి.ల ముందు కూర్చుని వినేవారికి ఈ గోల భరించ లేనంతగా ఉన్నది.వినేవారి మనోభావాలు యిలా ఉన్నాయని యాంకర్లు ముందుగా ఈ లేఖను వారికి చదివి చెప్పి దారిలోకి తేవటానికి ప్రయత్నించాలి.

- ఎన్. రామలక్ష్మి, సికింద్రాబాద్

### హరిద్వార్ ఘటన బాధాకరం

ఉత్తరాఖండ్‌లోని పవిత్ర నగరం హరిద్వార్‌లోని మానసదేవి ఆలయంలో జరిగిన తొక్కిసలాటలో ఎనిమిది మంది మరణించడం బాధాకరం. అనేక మంది భక్తులు గాయపడడం అందరిని కలచి వేసింది. ప్రధాన ఆలయానికి వెళ్లే ఆలయ రహదారిపై మెట్లపై తొక్కిసలాట జరిగిందని తెలుస్తుంది. విద్యుత్ షాక్ పుకార్లు జనంలో భయాందోళనలకు కారణమయ్యాయని,తొక్కిసలాటకు దారితీసిందని అంటున్నారు. తొక్కిసలాట జరగడానికి ముందే మాన్సాదేవి ఆలయం వద్ద భారీ జనసమూహం గుమిగూడిందని అంటున్నారు. మరో మారు ఇలాంటి ఘటనలు జరగకుండా ప్రభుత్వాలు చర్యలు తీసుకోవాలి.

- కామిడి సతీష్ రెడ్డి, భూపాల్ పల్లి జిల్లా

### వ్యవసాయమే ప్రాణాధారం

ప్రధాన మంత్రి కృషి సించాయ్ యోజనా వాటర్ షెడ్ కార్యక్రమం అనేది బహుళ ఉపయోగకరంగా రైతులకు ఉండనుంది. దీని ముఖ్య ఉద్దేశం నీటీని ఒడిసిపెట్టడమే. దాని ద్వారా దిగుబడిని పెంచడం అయితే నీటిని ఒడిసి పట్టడంతో పాటు రైతులకు ఉపయోగకరమైన పనిముట్లను దీని ద్వారా అందజేయనున్నారు.పైపులైన్‌లతో పాటు మందు పిచికారీ చేసే పంపులు వర్షాల నుండి కాపాడే టార్పాలిన్ కవర్ల వంటివి సబ్సిడీతో అందజేయాలి.

- భారత అవినాష్, జనగామ

### టిక్కెట్లపై రాయితీ పునరుద్ధరణ లేనట్లేనా?

2019వ సంవత్సరం వరకూ భారత రైల్వే శాఖ 60 సంవత్సరాలు నిండిన పురుషులకు 40శాతం, 58 సంవత్సరాలు నిండిన మహిళలకు 50శాతం రాయితీ టికెట్లపై అందించేది. అయితే 2020 సంవత్సరంలో కరోనా మహమ్మారి కారణంగా కేంద్ర ప్రభుత్వం ఈ ప్రయోజనాలను తాత్కాలికంగా నిలిపివేసి ఇంతవరకూ ఆప్రయోజనాలను పునరుద్ధరించలేదు. అప్పట్లో ప్రజలు కరోనా పరిస్థితిని అర్థం చేసుకుని కేంద్ర ప్రభుత్వ నిర్ణయాన్ని అంగీకరించారు.ఇప్పుడు కరోనా మహమ్మారి పూర్తిగా తగ్గినాకూడా రాయితీలను పునరుద్ధరించకుండా ఈ ప్రయోజనాలకు శాశ్వతంగా స్వస్తి పలికేలా కనపడుతుంది. ప్రయాణికుల్లో చాలా మందివృద్ధులు,మధ్యతరగతి ఉద్యోగులు, తక్కువ వేతనదారుల వంటి సామాన్యులే ఎక్కువ. కేంద్రం ఇప్పటికే వందేభారత్, బుల్లెట్ రైళ్ల ప్రాజెక్టుల పేరుతో వేల కోట్లు ఖర్చు చేస్తోంది. 2023- 24 రైల్వే బడ్జెట్లో రూ. 2.4 లక్షల కోట్ల మూలధన వ్యయం కేటాయించారు. అంతటి భారీ బడ్జెట్ ఉన్నప్పుడు, వృద్ధులకు ఇచ్చే రాయితీలను కొనసాగించలేకపోవడం కేవలం నిధుల సమస్య కాదనిపిస్తుంది. ఇప్పటికైనా కేంద్ర ప్రభుత్వం స్పందించి టికెట్ రాయితీలను పునరుద్ధరించాలి.

-దాసం వెంకటరెడ్డి, బెంగళూరు

### శుభ్ర పరుస్తూ ఉండాలి

ప్రజలు సంచరించే ప్రదేశాలను ప్రభుత్వ మున్సిపాలిటీ శాఖలు శుభ్ర పరుస్తూ ఉండాలి. ముఖ్యంగా పాఠశాలలు, దావాఖానాలు, బస్, రైల్వే స్టేషన్‌లు, రైతు మార్కెట్లు , సినిమా హాళ్లు, హోటళ్ళు,దేవాలయాలు,సందర్శనా ప్రదేశాలు,ప్రభుత్వ కార్యాలయాలు, పారిశ్రామిక కర్మాగారాలు, గిడ్డంగులు తదితర ప్రజలు సంచరించే ప్రదేశాలను శుభ్ర పరిచేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి.అప్పుడే స్వచ్ఛ భారత్ సాధ్యమవుతుంది.

-డి చాంద్ బాషా, కర్నూలు

### ఉపాధ్యాయులను నియమించాలి

జూనియర్ కళాశాల, హై స్కూల్ ఒకే చోట ఉన్న ప్రాంతంలో గురుకులాల్లో లెక్చరర్ కు కళాశాల స్థాయిలో మాత్రమే టీచింగ్ చేసే విధంగా ప్రభుత్వం కృషి చేయాలి. లెక్చరర్‌కు చిన్నచిన్న క్లాస్ బోధించడానికి పంపవద్దు. ఉన్నతస్థాయి విద్యార్థులకు బోధించడానికి పంపించాలి. కనుక లెక్చరర్స్‌ను ఇంటర్ చదువుతున్న విద్యార్థుల విద్యాభివృద్ధికి విజ్ఞానం అభివృద్ధికి మాత్రమే వినియోగించాలి.

-రాపాక రవీందర్, జనగాం

మనవి
ఎడిట్ పేజీకి..

ఆర్థిక, సామాజిక, రాజకీయ విశ్లేషణాత్మక రచనలు పంపగోరు రచయితలు మాకు పంపే వ్యాసాలు ఇతర పత్రికలకు కూడా పంపడం సరైన విధానం కాదు. సహకరిస్తారని ఆశిస్తాం. -ఎడిటర్

(e-mail: editpage@vaartha.com)

# విద్యార్థుల మానసిక ఆరోగ్యం పెంచలేమా?

**ఉపాధ్యాయులు, వార్డెన్లు మొదలైనవారు విద్యార్థులలో మానసిక క్షోభను గుర్తించి, సరిగ్గా స్పందించడానికి ఇది కీలకం. తల్లిదండ్రులు, సంరక్షకులను నిరంతరం అవగాహనా కార్యక్రమాలలో పాల్గొనేలా ప్రోత్సహించాలి. విద్యార్థులపై అనవసరమైన విద్యాఒత్తిడిని తగ్గించి ఇంట్లో సహాయక వాతావరణాన్ని ప్రోత్సహించడం ఈ సెషన్ల లక్ష్యం. లైంగిక వేధింపులు, ర్యాగింగ్ కులం, వర్గం, లింగం, లైంగిక ధోరణి, వైకల్యం, మతం లేదా జాతి ఆధారిత బెదిరింపులకు సంబంధించిన సంఘటనలను పరిష్కరించడానికి, గోప్యమైన అందుబాటులో ఉండే సమగ్ర ఫిర్యాదుల పరిష్కార యంత్రాంగాలను ఏర్పాటు చేయాలి. ఫిర్యాదుదారులు లేదా విజిల్ బ్లోయర్‌లపై ప్రతీకార చర్యలకు 'జీరోటాలరెన్స్ విధానం' ఉండాలి. ఇటువంటి కేసులలో మానసిక ఆరోగ్య నిపుణులకు తక్షణ రెఫరల్ తప్పనిసరి. ఫిర్యాదులపై సకాలంలో లేదా తగిన చర్యలు తీసుకోవడంలో విఫలమైతే ప్రత్యేకించి అటు వంటి నిర్లక్ష్యం విద్యార్థి ఆత్మహత్యకు లేదా స్వీయహానికీ దారితీస్తే, అది 'సంస్థాగత దోషం'గా పరిగణించబడుతుంది.**

డి జె మోహన రావు

కళాశాలల్లో, కోచింగ్ సెంటర్లలో మార్కుల కోసం, ర్యాంకుల కోసం జరిగే తీవ్రమైన పోటీలో ఎంతోమంది యువత తమ చిరునవ్వులు పోగొట్టుకుంటున్నారు. వారి మనసులలో పేరుకుపోయిన ఒత్తిడి, బయటకు చెప్పుకోలేని బాధ, చివరికి ప్రాణాలు తీసుకోవడానికి దారితీస్తోంది. ఈ భయంకరమైన పరిస్థితిని గుర్తించిన సుప్రీంకోర్టు 25జూలై 2025 న కీలకమైన తీర్పు ఇచ్చింది. 'నేర్చుకోవడంలో ఆనందం పోయి, ర్యాంకులు, ఫలితాలు, నిరంతర పోటీ ఆందోళనగా మారిపోయింది' అని న్యాయమూర్తులు ఆవేదన వ్యక్తం చేశారు. విద్యార్థులకు మానసిక ఆరోగ్యంపై మద్దతు ఇవ్వడానికి, ఆత్మహత్యలను నివారించడానికి దేశంలో సమగ్రమైన, అమలు చేయదగిన చట్టపరమైన నియంత్రణలు లేవని కోర్టు లోతుగా విశ్లేషించింది. విద్యార్థుల ఆత్మహత్యలను ఆపడానికి 15 ముఖ్యమైన సూత్రాలతో కూడిన ఒక ప్రణాళికను ప్రకటించింది. విద్య అంటే కేవలం చదువు మాత్రమే కాదు, పిల్లల శారీరక, మానసిక ఆరోగ్యం కూడా ముఖ్యమని ఈ తీర్పు తేటతెల్లం చేసింది. జాతీయ నేర గణాంక సంస్థ 2022 నాటి 'యాక్సిడెంటల్ డెత్స్ అండ్ సూసైడ్స్ ఇన్ ఇండియా' నివేదిక మన దేశంలో ఆత్మహత్య చేసుకున్న వారిలో 7.6 మంది విద్యార్థులే అని పేర్కొంది. 2022లో సుమారు 13,044 మంది విద్యార్థులు తమ ప్రాణాలు తీసుకున్నారు. వీరిలో 2,248 మంది కేవలం పరీక్షలలో ఫెయిల్ అవడం వల్లే చనిపోయారని స్పష్టం చేసింది. 2001లో 5,425 మంది విద్యార్థులు ఆత్మహత్య చేసుకోగా 2022 నాటికి ఈ సంఖ్య 13,044కి చేరింది. నియంత్రణ లేని కోచింగ్ పరిశ్రమ ఎలా యువత జీవితాలను ప్రమాదంలో పడేస్తుందో విశ్లేషిస్తుంది. ఈ తీర్పునకు తక్షణ కారణం, సుక్దేబ్ సాహా అనే ఒక తండ్రి తన కుమార్తెకు జరిగిన అన్యాయంపై చేసిన పోరాటం. విశాఖపట్నంలోని ఒక కోచింగ్ సెంటర్‌లో నీట్ కోసం చదువుతున్న అతని 17ఏళ్ల కుమార్తె 2023 జూలై 14న హాస్టల్ పైకప్పు నుండి పడిపోయి అనుమానాస్పదంగా మరణించింది. ఈ సంఘటనపై పోలీసులు సరిగా విచారించడం లేదని కోచింగ్ సెంటర్ యాజమాన్యం నిజాలను దాచిపెడుతోందని ఆరోపిస్తూ సాహా హైకోర్టును ఆశ్రయించారు. అక్కడ న్యాయం జరగకపోవడంతో చివరికి సుప్రీంకోర్టుకు వచ్చారు. ఈ కేసును విచారించిన జస్టిస్ విక్రమ్‌నాథ్, జస్టిస్ సందీప్‌మెహతా ధర్మాసనం, ఆ ఒక్క సంఘటనను కేవలం వ్యక్తిగత విషాదంగా చూడకుండా అది దేశవ్యాప్తంగా విద్యార్థులు ఎదుర్కొంటున్న మానసిక సంక్షోభానికి, విద్యావ్యవస్థలోని 'వ్యవస్థాగత లోపం'కు నిదర్శనంగా విశ్లేషించింది. పోలీసు దర్యాప్తులో 'లోతైన లోపాలు' ఉన్నాయని, 'కీలక ఆధారాలను దాచిపెట్టే అవకాశం' ఉందని గమనించి సీబీఐ విచారణకు ఆదేశించడం ద్వారా వ్యవస్థల మధ్య జవాబుదారీతనం లేకపోవడంపైనా కోర్టు పరోక్షంగా దృష్టి సారించింది. రాజ్యాంగంలోని ఆర్టికల్ 21,జీవించేహక్కు పరిధిలో మానసిక ఆరోగ్యం ఒక అంతర్భాగమని కోర్టు స్పష్టంచేసింది. ఈ హక్కును కాపాడాల్సిన బాధ్యత ప్రభుత్వాలపై ఉందని, అందుకే ఈ ఆదేశాలను జారీచేయాల్సి వచ్చిందని పేర్కొంది. విద్యార్థుల సమస్యలు విద్యా సంస్థలు పట్టించుకోకపోయినా, ఆ నిర్లక్ష్యం ఆత్మహత్యకు దారితీస్తే, ఆ సంస్థలే బాధ్యత



వహించాలని సుప్రీంకోర్టు గట్టిగా హెచ్చరించింది. ఈ తీర్పు విద్యార్థుల మానసిక ఆరోగ్యం శ్రేయస్సును కాపాడటానికి ఒక బహుళరంగ విధానాన్ని ప్రతిబింబిస్తుంది.ప్రతి సూత్రం ఒక నిర్దిష్ట సమస్యను పరిష్కరించడానికి రూపొందించబడింది. అన్ని విద్యాసంస్థలు, కోచింగ్ సెంటర్లు ఒకే రకమైన మానసిక ఆరోగ్య విధానాన్ని పాటించాలి.ఇది దేశవ్యాప్తంగా మానసిక ఆరోగ్యానికి ఒక ప్రామాణిక విధానాన్ని ఏర్పాటు చేయాలి. 100 మందికి పైగా విద్యార్థులున్న ప్రతి విద్యా సంస్థలో కనీసం ఒక అర్హత కలిగిన కౌన్సెలర్, సైకాలజిస్ట్‌ను తప్పనిసరిగా నియమించాలి. చిన్న సంస్థలు తగినంత మంది కౌన్సెలర్‌లు ఉండేలా చూసుకోవాలి. పరీక్షా సమయాల్లో విద్యార్థి బృందాలకు మెంటార్‌లను కేటాయించాలి. మానసిక ఆరోగ్య సేవలు, స్థానిక ఆసుపత్రులు, ఆత్మహత్య నివారణ హెల్ప్‌లైన్‌లకు తక్షణ రెఫరల్ కోసం అన్ని విద్యా సంస్థలు ప్రోటోకాల్‌లను ఏర్పాటు చేయాలి. ఇది అత్యవసర పరిస్థితుల్లో త్వరగా చర్యలు తీసుకోవడానికి సహాయపడుతుంది. టెలిమానస్, ఆత్మహత్యల నివారణ హెల్ప్‌లైన్ నంబర్‌లను హాస్టళ్లు, తరగతి గదులు, సాధారణ ప్రాంతాలు, వెబ్‌సైట్‌లలో పెద్ద అక్షరాలతో ప్రముఖంగా ప్రదర్శించాలి. బోధన, బోధనేతర సిబ్బంది అందరూ కనీసం సంవత్సరానికి రెండుసార్లు ధృవీకరించబడిన మానసిక ఆరోగ్య నిపుణులచే శిక్షణ పొందాలి. ఈ శిక్షణలో మానసిక ప్రథమ చికిత్స, ఆత్మహత్య సంకేతాలను గుర్తించడం, స్వీయహానిని ఎదుర్కోవడం, రెఫరల్ విధానాలు ఉండాలి. ఉపాధ్యాయులు, వార్డెన్లు మొదలైనవారు విద్యార్థులలో మానసిక క్షోభను గుర్తించి, సరిగ్గా స్పందించడానికి ఇది కీలకం. తల్లిదండ్రులు, సంరక్షకులను నిరంతరం అవగాహనా కార్యక్రమాలలో పాల్గొనేలా ప్రోత్సహించాలి. విద్యార్థులపై అనవసరమైన విద్యాఒత్తిడిని తగ్గించి ఇంట్లో సహాయక వాతావరణాన్ని ప్రోత్సహించడం ఈ సెషన్ల లక్ష్యం. లైంగిక వేధింపులు, ర్యాగింగ్‌కులం, వర్గం, లింగం, లైంగిక ధోరణి, వైకల్యం, మతం లేదా జాతి ఆధారిత బెదిరింపులకు సంబంధించిన సంఘటనలను పరిష్కరించడానికి, గోప్యమైన అందుబాటులో ఉండే సమగ్ర ఫిర్యాదుల పరిష్కార యంత్రాంగాలను ఏర్పాటు చేయాలి. ఫిర్యాదుదారులు లేదా విజిల్‌బ్లోయర్ లపై ప్రతీకార చర్యలకు 'జీరోటాలరెన్స్ విధానం' ఉండాలి. ఇటువంటి కేసులలో మానసిక ఆరోగ్యనిపుణులకు తక్షణ రెఫరల్ తప్పనిసరి. ఫిర్యాదులపై సకాలంలో లేదా తగిన చర్యలు తీసుకోవడంలో విఫలమైతే ప్రత్యేకించి అటువంటి నిర్లక్ష్యం విద్యార్థి ఆత్మహత్యకు లేదా స్వీయహానికీ దారితీస్తే, అది 'సంస్థాగత దోషం'గా పరిగణించబడుతుంది. ఇది నిర్వాహకులను నియంత్రణను చట్టపరమైన పరిణామాలకు బాధ్యులను చేస్తుంది. అన్ని హాస్టళ్లు ట్యాంపర్‌ప్రూఫ్ సీలింగ్ ఫ్యాన్‌లు, భద్రతా పరికరాలను అమర్చాలి. అలాగే ఆత్మ హత్యాయత్నాలను నిరోధించడానికి పైకప్పులు, బాల్కనీలు ఇతర ప్రమాదకర ప్రాంతాలకు ప్రవేశాన్ని నియంత్రించాలి. విద్యాసంస్థలలో మానసిక ఆరోగ్యం, శ్రేయస్సు పద్ధతులపై వార్షిక బాహ్యనిపుణులతో నిర్వహించాలి. ఆత్మహత్యాయత్నాన్నిజిల్లా అధికారులకు అధికారికంగానివేదించాలి. సంస్థలు అంతర్గత విచారణలు నిర్వహించి,నివారణ చర్యలను నమోదుచేయాలి. ఇది పారదర్శకతను పెంచుతుంది. బాధ్యతను నిర్ధారిస్తుంది.విద్యార్థుల ఆత్మహత్యలు, మానసిక ఆరోగ్యానికి సంబంధించిన డేటాను సేకరించడానికి, విశ్లేషించడానికి ఒక జాతీయ డేటాబేస్‌ను ఏర్పాటు చేయాలని పరోక్షంగా ఈ తీర్పు సూచిస్తుంది.చివరగా అన్నిరాష్ట్రాలు, కేంద్ర పాలితప్రాంతాలు రెండు నెలల్లోగా ప్రైవేట్ కోచింగ్ సెంటర్ల నమోదు, నియంత్రణ, పర్యవేక్షణకు నిబంధనలను నోటిఫై చేయాలి. ఈ నిబంధనలు విద్యార్థుల భద్రత, మానసిక ఆరోగ్య రక్షణలకు అధిక ప్రాధాన్యత ఇవ్వాలి. ఇది కోచింగ్ సెంటర్ల అదుపులేని వృద్ధిని,వాటిలో నెలకొన్న ఒత్తిడిని పరిష్కరించడానికి ఒక కీలకమైన చట్టపరమైన చర్య.ఈ మార్గదర్శకాల విజయం వాటిని ఎంత పకడ్బందీగా అమలుచేస్తారనే దానిపై ఆధారపడి ఉంటుంది.కేవలం మార్కుల వెనుక పరిగెత్తేధోరణిని వదిలిపెట్టి, మానసిక స్థితిస్థాపకతనుప్రోత్సహించే విద్యవైపు మళ్లినప్పుడే సాధ్యమవుతుంది. •

# ఇజ్రాయెల్‌ను ఒంటరి చేయడమే ఏకైక మార్గం!


మహమ్మద్ ఆరిఫ్

గాజాలో ఇజ్రాయెల్ సామూహిక నరమేధానికి పాల్పడుతున్నది. ఒక జాతి మొత్తాన్ని సంహరించేలా.. చిన్నారులు, మహిళలు, వృద్ధులు అనే తేడా లేకుండా రోజుకు వందలాది మందిని హత్య చేస్తున్నది. మానవతాసహాయం, ఆహారం, వైద్య కోసం ఎదురుచూస్తున్న వారిపై సైతం బుల్లెట్లు, బాంబుల వర్షం కురిపిస్తున్నది. దీంతో 2023 అక్టోబర్ నుంచి సుమారు 6080 వేల మందివరకు మరణించారని గాజా ఆరోగ్యమంత్రిత్వ శాఖ, నేచర్ నివేదికల ద్వారా స్పష్టమవుతున్నది. ఇందులో సుమారు 18 వేల మంది చిన్నారులు ఉండగా, 15 వేల కంటే ఎక్కువ మంది మహిళలున్నారు. రెండు వేల మంది వరకు వృద్ధులు ఉన్నట్టు అంచనా. గాజాలో మరణించిన వారిలో 59.1 శాతం మహిళలు, చిన్నారులు, వృద్ధులు ఉన్నారని లాన్సెట్ ఒక నివేదికలో స్పష్టం చేసింది. ఇజ్రాయెల్ విధించిన బ్లాకేడ్ వల్ల ఆహారం, నీరు, ఇంధనం, వైద్య సామాగ్రి వంటి ప్రాథమిక అవసరాలు కూడా గాజాకు అందడం లేదు. దీని వల్ల ఆకలి చావులు, వ్యాధులు విస్తరిస్తున్నాయి. ఇప్పటికే వందలాది మంది ఆకలితో మరణించినట్టు పలు రిపోర్టుల ద్వారా తెలుస్తున్నది. ఇందులోనూ 80శాతం మంది చిన్నారులు ఉండడం మనసులను కలచివేస్తున్నది. గత కొన్ని రోజుల్లో ఆహార సహాయ కేంద్రాల వద్ద ఇజ్రాయెల్ సైనికులు జరిపిన కాల్పుల్లో 875 సాధారణ మంది పౌరులు మరణించారని ఐక్యరాజ్య సమితి నివేదించింది. అంతేకాకుండా సుమారు 19 లక్షల మంది నిర్వాసితులుగా మారారు. ఈ నేపథ్యంలో యుద్ధాన్ని వెంటనే ఆపాలని, మానవతా సహాయానికి అనుమతించాలని ఇజ్రాయెల్ పై ఒత్తిడి తీసుకొచ్చేందుకు ఇటీవల 28 దేశాలు నిర్ణయించాయి. ఈ మేరకు ఒక సంయుక్త ప్రకటనను విడుదల చేశాయి. ఇందులో ఆస్ట్రేలియా, ఆస్ట్రియా, బెల్జియం తదితర దేశాలు ఉన్నాయి. కాగా, వీరి డిమాండ్‌ను ఇజ్రాయెల్ తిరస్కరించింది. దీన్ని బట్టి చూస్తే ఈ 28 దేశాలు ప్రకటనలకే పరిమితమైతే ఎలాంటి లాభం ఉండదని స్పష్టమవుతున్నది. ఇజ్రాయెల్‌పై తీవ్ర ఒత్తిడి తెచ్చేందుకు ఆ దేశాన్ని ఒంటరిచేసేలా కఠిన ఆంక్షలు విధించాల్సిన అవసరమున్నది. గాజాలో యుద్ధ విరామం, మానవతా సహా యం అందేలా ఇజ్రాయెల్‌పై ఒత్తిడి తెచ్చేలా ఇప్పటికే పలు దేశాలు మెల్లమెల్లగా చర్యలు మొదలుపెట్టాయి. ఇజ్రాయెల్ చర్యల కారణంగా వాణిజ్య ఒప్పందాన్ని సమీ క్షించాల్సిన అవసరముందని ఈయూ విదేశాంగ విధాన ప్రధాని కాజా కల్లాస్ ప్రకటించారు. యూకే ఇప్పటికే ఇజ్రా యెల్‌తో వాణిజ్య చర్చలను నిలిపివేసింది. ఇజ్రాయెల్‌కు ఆయుధ బదలీలు ఆపాలని యూఎన్ నిపుణులు సైతం హెచ్చరించారు. యూకే, మరి కొన్ని దేశాలు ఆయుధ లైసెన్సులను కొంతవరకు నిలిపివేశాయి. బెలిజ్ ఇజ్రాయెల్‌తో దౌత్యసంబంధాలను నిలిపివేసింది. ఐర్లాండ్, నార్వే, స్లోవేనియా,స్పెయిన్ 2024లో పాలస్తీనాను దేశంగా గుర్తించాయి. యూఎన్ జనరల్ అసెంబ్లీలో పాలస్తీనాను ఒక దేశంగా గుర్తిస్తామని ఫ్రాన్స్ అధ్యక్షుడు ఇమ్మాన్యూయెల్ మాక్రోన్ కూడా ఎక్స్‌లో పోస్ట్ చేశారు. గాజాలో యుద్ధాన్ని ఆపడానికి, మానవతా సంక్షోభాన్ని నివారించడానికి ఇది చాలా అవసరమని ఆయన పేర్కొన్నారు.అంటే ఫ్రాన్స్ జీ7దేశాల్లో పాలస్తీనాను దేశంగా గుర్తించే మొట్టమొదటి రాజ్యంగా నిలవనుంది. గాజాలో జెనోసైడ్‌ను నిరోధించేలా చర్యలు తీసుకోవాలని ఇంటర్నేషనల్ కోర్ట్ ఆఫ్ జస్టిస్ ఇప్పటికే ఇజ్రాయెల్‌ను ఆదేశించింది.ఇజ్రాయెల్‌పై కఠినఆంక్షలు విధించడం ద్వారానే ఆ దేశంపై ఒత్తిడి తీసుకురావచ్చు. ముందుగా ఆయుధాల ఎగుమతులపై పూర్తి నిషేధం విధించాలి. ప్రపంచ దేశాలు గాజా పునర్నిర్మాణానికి నిధులను కేటాయించడం ద్వారాదీర్ఘకాలిక సహాయాన్ని అందించవచ్చు. ఇది విద్య,ఆరోగ్యం, జీవనోపాధికి దోహదపడుతుంది. మరోవైపు అన్ని దేశాల ప్రజలు సైతం ఇజ్రాయెల్‌పై ఒత్తిడిపెంచే చర్యలకు సిద్ధం కావాల్సిన అవసరమున్నది. ఇది ఆయా దేశాలుతీసుకునే నిర్ణయాలను ప్రభావితం చేయగలవు. గాజాలో నిరాయుధు లు, చిన్నారులపై జరుగుతున్న దాడులు, ఆకలి చావులు, మానవతా సంక్షోభాన్ని నివారించడానికి ఈ దేశాలు ఇజ్రాయెల్‌పై ఆంక్షలు విధించే ధైర్యం చేయాలి. అప్పుడే గాజా ప్రజలకు న్యాయం సాధ్యమవుతుంది. •

# మనుషుల అక్రమ రవాణా అభివృద్ధికి ముప్పు

రామ కిష్టయ్య సంగన భట్ల

ప్రపంచం నిత్య నూతన ప్రగతిని సాధిస్తున్నా, మానవతను మింగేసే చీకటి కార్యకలాపాలు ఇప్పటికీ సాగుతూనే ఉన్నాయి. వాటిలో అత్యంత భయంకరమైనదిగా గుర్తించదగ్గది మానవుల అక్రమ రవాణా. ఇది కేవలం నేరం మాత్రమే కాదు, మానవ హక్కులపై క్రూరమైన దాడి. ఆధునిక సమాజంలోనూ మనిషిని వస్తువుల్లా కొనుగోలు చేసి, అమ్మేసే తీరును తలచుకుంటే గుండె వేదనతో నిండిపోతుంది. దీనిని అరికట్టే సంకల్పానికి అంకితమైన రోజు - జూలై 30. ప్రపంచ వ్యక్తుల అక్రమ రవాణా నిరోధక దినోత్సవం. ఈ దినోత్సవం 2013లో ఐక్యరాజ్య సమితి ద్వారా అధికారికంగా స్థాపించబడింది. దీని ప్రధాన ఉద్దేశం మానవ రవాణాకు గురైన బాధితుల పట్ల మానవీయ దృక్కోణాన్ని పెంపొందించడం. ఈ నేరాన్ని అరికట్టడంలో అంతర్జాతీయ సమన్వయాన్ని బలోపేతం చేయడం. ప్రతి ఏడాది ఈ రోజు ప్రపంచ వ్యాప్తంగా ప్రభుత్వాలు, స్వచ్ఛంద సంస్థలు, సామాజిక కార్యకర్తలు కలిసి నేరానికి వ్యతిరేకంగా పోరాటాన్ని మరింత ఉధృతం చేస్తారు. మానవ అక్రమ రవాణా అనేది ఆధునిక బానిసత్వపు రూపం. ఇది బలహీనతను ఆయుధంగా మలిచే నేరం. ఆదరణ కరువైన, నిస్సహాయ మహిళలు, బాలికలు, వలస కార్మికులు, శరణార్థులు వంటి వర్గాలు ప్రధానంగా ఈ రకమైన దురాచారానికి గురవుతుంటారు. ఉద్యోగం, వివాహం, సినిమా అవకాశాలు, చదువు వంటి మాయ వాగ్దానాలతో వారినిమోసం చేసి, బలవంతపు శ్రమకు లేదా లైంగిక దోపిడీకి గురిచేస్తారు. యునైటెడ్ నేషన్స్ ఆఫీస్ ఆన్ డ్రగ్స్ అండ్ క్రైమ్ ప్రకారం, ప్రపంచ వ్యాప్తంగా సుమారు 25 మిలియన్ల మంది ఈ నేరానికి గురవుతున్నారు. వారిలో సగానికి పైగా మహిళలు, బాలికలే. ఈ నేరంలో ఉపయోగించే పద్ధతులు అత్యంత కటువైనవి. మొదట మోసపూరితంగా ఉద్యోగం లేదా అవకాశంతో ఆకర్షించడం, తర్వాత వారిని బలవంతంగా తరలించడం, చివరకు వారి గమ్యం వారికి తెలియకుండానే వారిని గృహ దాస్యానికి లేదా వేశ్యావృత్తికి, ఎన్నో రకాల శారీరక, మానసిక దోపిడికి గురిచేయడం జరుగుతుంది. ఇది కేవలం దేశాల మధ్య జరగడం కాదు ఒకే రాష్ట్రం, నగరం, గ్రామంలో కూడా జరుగుతూనే ఉంది. నేరస్తులు ఆర్థికంగా వెనుకబడిన కుటుంబాలను లక్ష్యంగా చేసుకుని, వారు సమాజంలో తమ ప్రాణాలను కాపాడుకునేందుకు ప్రయత్నించే దాకా వారి జీవితాలను నాశనం చేస్తారు. భారత దేశంలో కూడా మానవ అక్రమ రవాణా ఒక తీవ్రమైన సమస్య. ముఖ్యంగా తూర్పు,ఉత్తర భారతంలో వలస జీవనానికి వెళ్ళే బాలికలు, మహిళలు మాయ మాటలకు లోనై బానిసత్వ జీవితానికి బలవుతున్నారు. శిశు కార్మికులుగా, గృహోద్యోగులుగా, వేశ్యావృత్తిలో, మసాజ్ సెంటర్లలో వారి జీవితాలు శ్రమదమాదులను ఎదుర్కొంటున్నాయి. టెక్నాలజీ అభివృద్ధితో ఈ నేరానికి కొత్త మార్గాలు ఏర్పడ్డాయి. సోషల్ మీడియా, డేటింగ్ యాప్స్, ఫేక్‌వెబ్ సైట్ల ద్వారా నేరస్తులు యువతను వలలోవేసి, వారి స్వేచ్ఛ



ను హరిస్తున్నారు. ప్రభుత్వాలు కొన్ని చట్టాలను తీసుకొచ్చినా, అమలులో సమర్థత లోపిస్తుంది.భారత దేశంలో2013 నాటి ఐపీసీ సెక్షన్ 370 ప్రకారం మానవ రవాణాపై తీవ్ర శిక్షలు ఉన్నా, నేరస్థులపై కేసులు నమోదు కావడం, విచారణ జరగడం, తీర్పు రావడం అన్నీ సమర్థవంతంగా జరగడం లేదు. 2018లో ప్రవేశపెట్టిన 'ట్రాఫికింగ్ ఆఫ్‌పర్సన్స్ బిల్లు' ఇంకా పూర్తిస్థాయిలో అమలులోకి రాలేదు. న్యాయ వ్యవస్థలో పటిష్టత లేకపోవడం, బాధితుల పట్ల మానవీయత లేకపోవడం, సమర్థవంతమైన పునరావాస చర్యలలోపం ఇవన్నీ ఈ సమస్యను పెంచుతున్నాయి. ఈ పరిస్థితుల్లో ప్రపంచ వ్యక్తుల అక్రమ రవాణా దినోత్సవం మరింత ప్రాధాన్యం సంతరించుకుంటుంది. ఇది ఒక అవగాహన కార్యక్రమం మాత్రమే కాదు ఓ సంఘటన, ఓ శంకుస్థాపన. బాధితుల పట్ల మానవీయతను పెంపొందించడానికి, సమాజాన్ని చైతన్య పరచడానికి ఇది ఒక అవకాశంగా మారుతుంది. బాధితుల గుర్తింపు, పునరావాసం, శిక్షణ, ఉపాధి కల్పన వంటి అంశాల్లో ప్రభుత్వాలు, స్వచ్ఛంద సంస్థలు, చట్ట అమలు దారులు సమష్టిగా కృషి చేయాలి.ప్రతి ఒక్కరి బాధ్యత ఉందని గుర్తించాల్సిన సమయం ఇది.కుటుంబాల్లో పిల్లలతో బలమైన అనుబంధాన్ని నిర్మించడం, వారిలో భద్రతా భావం కల్పించడం, సోషల్ మీడియా వినియోగంపై జాగ్రత్తగా పర్యవేక్షించడం, సమాజంలో అనుమానాస్పద వ్యక్తులు కనిపించినప్పుడు పోలీసులకు సమాచారం ఇవ్వడం వంటి చర్యలు ప్రతి ఒక్కరూ చేపట్టాలి. బాధితులను చిన్నచూపు చూడకుండా, వారిని తిరిగి సామాజిక జీవనంలో నిలదొక్కుకునేలా చేయడం ఎంతో అవసరం. ఎన్.జి.ఓల భాగస్వామ్యంతో కౌన్సెలింగ్, విద్య,వృత్తి శిక్షణ, ఆశ్రయం వంటి సేవలను మరింత విస్తృతంగా అందించాలి. అంతర్జాతీయ స్థాయిలో సహకారం అవసరం. ఒక దేశంలో ప్రారంభమై, మరొక దేశంలో ముగిసే ఈ నేరాన్ని అరికట్టేందుకు దేశాల మధ్య సమాచారం, నిఘా, చట్టపరమైన సహకారం పెంచాల్సిన అవసరం ఉంది. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం ద్వారా డిజిటల్ ట్రాకింగ్, ఐడెంటిఫికేషన్ టూల్స్ ద్వారా బాధితులను గుర్తించడం, నేరగాళ్లను పట్టుకోవడం మరింత వేగవంతం చేయాలి. ఇది కేవలం ప్రభుత్వాల పని కాదు. మనలో ప్రతి ఒక్కరిలో మానవతా చైతన్యం కలిగితేనే అసలైన మార్పు వస్తుంది. మన చుట్టూ ఉన్న అన్యాయాలను నిశ్శబ్దంగా చూస్తూ ఉండకూడదు. బాధితుల పట్ల మన ఉదాసీనత కూడా ఓ నేరమే అవుతుంది. వాళ్లకి మద్దతు ఇవ్వడం,వారి గౌరవాన్ని పునరుద్ధరించడం మన మానవతా ధర్మం. ఈ దినోత్సవం సందేశం చాలా స్పష్టంగా ఉంది - మనిషి వస్తువు కాదు. అతడి, ఆమె స్వేచ్ఛను కొనలేరు, గౌరవాన్ని అమ్మలేరు. ఆధునిక ప్రపంచం అర్థవంతం కావా లంటే అందులో మానవత్వం ఉండాలి. మానవ అక్రమ రవాణా లాంటి దుర్మార్గాలు ఉండే వరకూ, మన సమాజం అభివృద్ధి చెందిందని చెప్పలేం. మానవ హక్కుల రక్షణకే గాక, మానవ విలువలు నిలబెట్టడానికి ఈ దినోత్సవం ఓ శక్తివంతమైన అవకాశంగా నిలుస్తుంది. ఈ పోరాటం మనం దరిది. ఇది బాధితుల కోసం మాత్రమే కాదు, మానవత్వం కోసం సాగుతున్న యుద్ధం. నిశ్శబ్దంగా బాధపడుతున్న వాళ్ల గళానికి ప్రతిధ్వనిగా మారండి. చీకటిలో చిక్కుకున్న మనుషుల కోసం ఒక వెలుగు రేఖవండి. ఎందుకంటే మనిషి బానిస కాదు. •

# పాక్‌ను వెనకేసుకొస్తే మీకేమొస్తుంది?





## విపక్షాలకు చురకలు వేసిన అమిత్‌షా

**న్యూఢిల్లీ,జూలై 29:** పహల్గాంలో పర్యాటకులను ఉగ్రవాదులు మతం అడిగి మరీ కాల్చి చంపారని కేంద్ర హోంమంత్రి అమిత్ షా లోక్‌సభలో వెల్లడించారు. ఇది అత్యంత దారుణమని ఆయన వ్యాఖ్యానించారు. ఉగ్రదాడి జరిగిన వెంటనే భద్రతాబలగాలు అప్రమత్తమయ్యాయని, ఉగ్రవాదుల కోసం వేట ప్రారంభించడంతో పాటు వారు దేశం దాటకుండా ఎక్కడికక్కడ చర్యలు చేపట్టాయని తెలిపారు. ఆపరేషన్ సిందూర్‌పై లోక్ సభలో చేపట్టిన చర్చలో హోంమంత్రి అమిత్ షా ఈ రోజు మాట్లాడారు. పహల్గామ్ ఉగ్రవాదులను తుదముట్టించేందుకు 'ఆపరేషన్ మహదేవ్' చేపట్టినట్లు వివరించారు. ఈ నెల 22న ఉగ్రవాదుల ఆచూకీ తెలిసిందని, దాచిగామ్ సమీపంలోని మహదేవ్ కొండల్లో ఉగ్రవాదులు దాక్కున్నట్లు గుర్తించామని చెప్పారు. దీంతో మహదేవ్ కొండల్లో గాలింపు చర్యలు చేపట్టి పహల్గాం ఉగ్రదాడి సూత్రధారి సులేమాన్ షా తో పాటు ముగ్గురు ఉగ్రవాదులను మన బలగాలు హతమార్చాయని వివరించారు. ఈ క్రమంలోనే తన ప్రసంగానికి పదేపదే అడ్డువస్తున్న ప్రతిపక్ష ఎంపిలకు అమిత్ షా చురకలంటించారు. సమాజ్ వాదీ పార్టీ అధ్యక్షుడు అఖిలేశ్ యాదవ్‌నుఉద్దేశించి.. 'ఉగ్రవాదుల మతం చూసి బాధపడొద్దు' అంటూ కౌంటర్ ఇచ్చారు. పాకిస్థాన్‌ను వెనకేసుకు వస్తే మీకు ఏమొస్తుందంటూ ప్రతిపక్ష ఎంపీలను నిలదీశారు. పాకిస్థాన్‌తో మీరు చర్చలు జరుపుతారా అని నిలదీశారు. కాంగ్రెస్ సీనియర్ నేత చిదంబరం ఇటీవలి వ్యాఖ్యలను గుర్తుచేస్తూ.. పాక్‌ను రక్షిస్తే మీకు ఏమొస్తుందని ప్రశ్నించారు. ఉగ్రవాదులు పాకిస్థాన్‌కు చెందిన వారేనని తాము వెల్లడిస్తే ఆధారమేంటని చిదంబరం ప్రశ్నిస్తున్నారని షా గుర్తుచేశారు. ఉగ్రవాదుల దగ్గర పాకిస్థాన్‌లో తయారైన చాక్లెట్లు దొరికాయని షా తెలిపారు. ప్రతిపక్ష ఎంపీలు పాకిస్థాన్‌ను ఎందుకు వెనకేసుకు వస్తున్నారని హోంమంత్రి నిలదీశారు. పహల్గాం ఉగ్రవాదులను మట్టుబెడితే దేశ ప్రజలతో పాటు ప్రతిపక్ష నేతలూ హర్షం వ్యక్తం చేస్తారని తాము భావించినట్లు అమిత్ షా పేర్కొన్నారు. అయితే, ప్రస్తుతం ప్రతిపక్ష ఎంపీల ప్రశ్నలు, చర్చలో వారి ప్రవర్తన చూస్తుంటే ఉగ్రవాదులను తుదముట్టించడం వారికి ఎలాంటి సంతోషాన్నికలిగించలేకపోయినట్లు తెలుస్తోందని అమిత్ షా ఆరోపించారు.

**అమిత్‌షా ప్రసంగానికి ప్రధానిమోడీ కితాబు!**

ఆపరేషన్ సిందూర్‌కు సంబంధించి హోంమంత్రి అమిత్ షా లోక్‌సభలో చేసిన ప్రసంగంపై ప్రధాని నరేంద్ర మోడీ స్పందించారు. ఉగ్రవాదులను ఏరివేయడంలో ఆపరేషన్ మహదేవ్, ఆపరేషన్ సిందూర్‌కీలకపాత్ర పోషించాయని ప్రధాని అన్నారు.

ఆపరేషన్ సిందూర్, ఆపరేషన్ మహదేవ్ గురించి హోంమంత్రి అమిత్ షా లోక్‌సభలో సుదీర్ఘ వివరణ ఇచ్చారని ప్రధాని మోడీ చెప్పారు. దేశ భద్రతపై భరోసా కల్పించేందుకు ప్రభుత్వం చేస్తున్న ప్రయత్నాలను ఆయన తన ప్రసంగంలో సవివరంగా చెప్పారని ట్వీట్ చేశారు. అంతకుముందు లోక్‌సభలో అమిత్ షా ప్రసంగిస్తూ ప్రతిపక్షాల తీరుపై ధ్వజమెత్తారు. దేశం అభివృద్ధి చెందకపోవడానికి, పాకిస్థాన్ ఆక్రమిత కశ్మీర్ ఉనికికి నెహ్రూనే కారణమని ఆరోపించారు. 1948లో భారత సైనిక దళాలు పీవోకేను చేజిక్కించుకునే స్థానంలో ఉన్నప్పటికీ అప్పటి ప్రధాని ఏకపక్షంగా కాల్పుల విరమణ ప్రకటించడంవల్ల ఆ అవకాశం చేజారిపోయిందని అమిత్ షా విమర్శించారు. సర్దార్ వల్లభాయ్ పటేల్‌కూడా నెహ్రూ చర్యలను వ్యతిరేకించారని గుర్తుచేశారు. తూర్పు పాకిస్థాన్ విమోచన యుద్ధం సమయంలోనూ పిఒకెను దక్కించుకునే అవకాశం వచ్చినప్పటికీ అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం దాన్ని చేజార్చుకుందని అన్నారు. ఐక్యరాజ్యసమితి భద్రతామండలి లో భారత్ శాశ్వత సభ్యత్వాన్ని పొందలేకపోవడానికి కూడా నెహ్రూనే కారణమని అమిత్ షా ఆరోపించారు. నెహ్రూ నిర్ణయాలవల్లే మనకు ఇంకా భద్రతా మండలిలో శాశ్వత స్థానం దక్కలేదని చెప్పారు. యూఎన్ఎస్‌సిలో శాశ్వత సభ్యత్వం కోసం మోడీ నేతృత్వంలోని తమ ప్రభుత్వం తీవ్రంగా కృషి చేస్తోందని తెలిపారు. దేశంపై ఉగ్రవాదులు కుట్రలకు పాల్పడుతుంటే చూస్తూ కూర్చోవడానికి ప్రస్తుతం ఉన్నది మన్మోహన్ సింగ్ ప్రభుత్వం కాదని, మోడీ ప్రభుత్వమని అమిత్ షా వ్యాఖ్యానించారు



## బీహార్ 'సర్'లో తప్పులుంటే జోక్యం తప్పదు..

### ఇసిని హెచ్చరించిన సుప్రీం కోర్టు

**పాట్నా, జూలై 29:** కేంద్ర ఎన్నికల సంఘం స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (ఎస్ఐఆర్) పేరుతో బీహార్ ఓటర్ల జాబితాను సవరిస్తోంది. అయితే ఈ సవరణ పేరుతో భారీగా ఓట్లను తొలగిసు న్నారని, ఓటు నిలుపుకోవడం కోసం, కొత్తగా ఓటు హక్కు కోసం పౌరులు చూపించాల్సిన డాక్యుమెంట్ల జాబితాలో ఆధార్‌కార్డు, ఓటర్ ఐడి కార్డులను చేర్చలేదని పలువురు సుప్రీంకోర్టులో పిటిషన్లు వేశారు. ఈ పిటిషన్‌లపై సుప్రీంకోర్టు విచారణ జరుపుతోంది. ఓటర్ల జాబితాను స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ పేరుతో సవరించేందుకు కేంద్ర ఎన్నికల సంఘానికి అధికారం ఉన్నదని, ఇసి చట్టప్రకారం పనిచేస్తుందని సుప్రీం కోర్టు వ్యాఖ్యానించింది.

అయితే ఈ సవరణ లక్ష్యం భారీగా కొత్తఓటర్లను జాబితాలో చేర్చ డమే ఉండాలిగానీ, భారీగా ఓటర్లను జాబితా నుంచి తొలగించడం ఉండకూడదని వ్యాఖ్యానించింది. భారీగా ఓట్లు తొలగింపునకు గురైతే మాత్రం తాము జోక్యం చేసుకుంటామని స్పష్టం చేసింది. బీహార్ ఓటర్ల జాబితా సవరణను సవాల్ చేస్తూ దాఖలైన పిటిషన్‌లపై వచ్చే నెల 12, 13 తేదీల్లో విచారిసా ్తమని జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ బాగ్చిలతో కూడిన ధర్మాసనం తెలిపింది. ఆగస్టు 1న ఎన్నికల కమిషన్ సవరించిన ఓటర్ల జాబితాను ప్రచురించనుందని, పాత జాబితాలోఉన్న అనేకమందిఓటర్లను ఈ జాబితా నుంచి తొలగించారని, దాంతో వారంతా తమ ఓటు హక్కును కోల్పోనున్నారని పిటిషనర్లు సుప్రీంకోర్టుకు తెలిపారు.

దానిపై కోర్టు స్పందిస్తూ.. సవరించిన ఓటరు జాబితాలో ఏవైనా తప్పులను గుర్తిస్తే ఆధారాలతోసహా తమ దృష్టికి తీసుకురావాలని పిటిషనర్లకు సూచించింది. మీరు భయపడుతున్నట్లుగా పెద్ద సంఖ్యలో ఓట్ల తొలగింపు జరిగితే వెంటనే తాము జోక్యం చేసుకుంటామని హామీ ఇచ్చింది. జాబితాలో అవకతవకలు ఉంటే ఆగస్టు 8లోగా పిటిషనర్లు తమకు లిఖితపూర్వకంగా తెలియజేయాలని ధర్మాసనం సూచించింది. అదేవిధంగా వెరిఫికేషన్ డాక్యుమెంట్ల లిస్టులో ఆధార్‌కార్డు, ఓటర్‌ఐడికి చోటు కల్పించాలని ఇసిని ఆదేశించింది.



## స్ట్రెచర్‌పై రక్తమోడుతున్న రోగి గాఢనిద్రలో డాక్టర్

**మీరట్,జూలై 29:** ఉత్తరప్రదేశ్ మీరట్‌లో విషాదఘటన చోటు చేసుకుంది. ఓ వైద్యుడి నిర్లక్ష్యానికి నిండు ప్రాణం బలైపోయింది. సమయానికి వైద్యం అందకపోవడంతో తీవ్ర రక్తస్రావంతో అతడు ప్రాణాలు కోల్పోయాడు. సోమవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో సునీల్ అనే వ్యక్తి తీవ్రంగా గాయపడ్డాడు. అతడిని కుటుంబ సభ్యులు లాలా లజపతిరాయ్ మెమోరియల్ ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకెళ్లారు. అయితే, ఆ సమయంలో విధుల్లో ఉన్న జూనియర్ డాక్టర్ వైద్యం చేయకుండా నిర్లక్ష్యంగా వ్యవహరించాడు. ఎసి వేసుకొని నిద్రపోయాడు. బాధితులు ఎంత వేడుకున్నా నిద్రలేవలేదు. దీంతో రాత్రంతా సునీల్ ఎమర్జెన్సీ వార్డులోని స్ట్రెచర్‌పైనే రక్తస్రావంతో అల్లాడిపోయాడు. చివరికి ప్రాణాలు కోల్పోయాడు. వైద్యుడు ఎసి ముందు టేబుల్ మీద కాలు పెట్టుకుని నిద్రిస్తున్న వీడియో ప్రస్తుతం నెట్టింట వైరల్‌గా మారింది. అతడి సమీపంలోనే సునీల్ స్ట్రెచర్‌పై నొప్పిని తట్టుకోలేక అల్లాడుతూ కనిపించాడు. ఇవాళ ఉదయం 7 గంటల సమయంలో అతడు ప్రాణాలు కోల్పోయినట్లు తెలిసింది. ఈ ఘటనపై లాలా లజపతిరాయ్ మెమోరియల్ మెడికల్ కాలేజీ ఉన్నతాధికారులు తీవ్రంగా స్పందించారు. విధుల్లో నిర్లక్ష్యంగా వ్యవహరించిన ఆ జూనియర్ రెసిడెంట్ డాక్టర్ భూపేశ్ కుమార్ రాయ్‌ను విధుల నుంచి సస్పెండ్ చేశారు.

## గాల్లో ఇంజిన్ వైఫల్యంతో పైలట్ల మేడే కాల్..

### ఇంధనం ఖాళీచేసి సురక్షితంగా ల్యాండ్ అయిన విమానం

**డల్లాస్,జూలై 29:** యునైటెడ్ ఎయిర్‌లైన్స్‌కు చెందిన బోయింగ్ 7878 డ్రీమ్‌లైనర్ గాల్లో ఉండగానే ఇంజిన్ విఫలం కావడంతో పైలట్ మేడే కాల్ ప్రకటించాడు. వాషింగ్టన్ డల్లాస్ ఎయిర్‌పోర్టు నుంచి బయలుదేరిన విమానం 5 వేల అడుగుల ఎత్తుకు చేరుకున్న తర్వాత ఎడమవైపు ఇంజిన్ విఫలైమంది. దీంతో వెంటనే అత్యవసర పరిస్థితిని ప్రకటించిన సిబ్బంది.. అది సురక్షితంగా వెనక్కి మళ్లించేందుకు ఎయిర్ ట్రాఫిక్ కంట్రోలర్ (ఎటిసి)కి సమాచారం ఇచ్చారు. అనంతరం ఇంధనం ఖాళీ చేయడానికి దాదాపు 3 గంటల పాటు విమానం గాల్లోనే చక్కర్లు కొట్టింది. ఇంధనం ఖాళీ అయిన తర్వాత సురక్షితంగా ల్యాండ్ చేశారు. జులై 25న జరిగిన ఈ ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది.

## 'ఉగ్రవాదుల అంతంతో మాకు కొంత న్యాయం జరిగింది'

**ముంబయి,జూలై 29:** పహల్గాం ఉగ్రదాడిలో ప్రాణాలు కోల్పోయిన సంతోష్ జగ్దాలే భార్య ప్రగతి జగ్దాలే ముగ్గురుఉగ్రవాదుల హతంపై స్పందించారు. ఆ ముగ్గురు ఉగ్రవాదులను మట్టుబెట్టడంతో తమకు కొంత న్యాయం జరిగిందని అన్నారు. భారత సైన్యానికి ఆమె కృతజ్ఞతలు తెలియజేశారు. గడిచిన మూడు నెలలుగా తాను ఎంతక్షోభను అనుభవిస్తున్నానో మాటల్లో చెప్పలేనని ఉబికివస్తున్న దుఃఖాన్ని ఆపుకుంటూ గద్గదస్వరంతో చెప్పారు. నువ్వు పహల్గాంకు ఎందుకు వెళ్లావు? నువ్వు తప్పకుండ ఇంటికి తిరిగి రావాలి'అని తాను తరచూ ఆయన ఫొటోతో మాట్లాడుతున్నానని మీడియా ప్రతినిధులతో చెబుతూ ప్రగతి జగ్దాలే ఏడ్చారు.

# ఆకస్మికంగా కాల్పుల విరమణ దేనికి?

## లోక్‌సభలో సిందూర్‌పై చర్చలో ఎంపి అఖిలేష్ యాదవ్



**న్యూఢిల్లీ,జూలై 13:** విజయవంతంగా మిలటరీ ఆపరేషన్ నిర్వహించి అకస్మాత్తుగా కాల్పుల విరమణ జరపడం వెనుక లాజిక్ ఏమిటని సమాజ్‌వాది పార్టీ అధ్యక్షుడు అఖిలేష్ యాదవ్ కేంద్రాన్ని నిలదీశారు. పాకిస్థాన్‌కు గట్టి సందేశం ఇచ్చే అవకాశాన్ని వదులుకున్నారని, వాళ్లకు ఒక గుణపాఠం చెప్పి ఉండాల్సిందని అన్నారు. ఆపరేషన్ సిందూర్, పహల్గాం ఉగ్రదాడిపై లోక్ సభలో రెండో రోజు మంగళవారం జరిగిన ప్రత్యేకచర్చలో అఖిలేష్ మాట్లాడారు. ముందుగా ఇండియన్ ఆర్మీకిధన్యవాదాలు తెలియజేస్తున్నా. ప్రపంచంలోనే మన ఆర్మీ ముందంజలో ఉంది. వారి ధైర్యసాహసాలకు అందరం గర్విస్తున్నాం. ఆర్మీ ఈ ఆపరేషన్ చేపట్టినప్పుడు పాకిస్థాన్ ఉగ్రవాద స్థావరాలపై విరుచుకుపడింది. దీనితో పాటు పాకిస్థాన్ ఎయిర్‌బేస్‌లను ధ్వంసం చేసింది. ఛానెల్స్ చూస్తున్నప్పుడు కరాచీ మనది, లాహోర్ మనది, ఇప్పుడు పాక్ కూడా మనదే అనిపించింది. అలాంటి తరుణంలో ప్రభుత్వం ఎందుకు ఆపరేషన్‌ను వెనక్కి లాగిందనేది తెలుసుకోవాలనుకుంటున్నాం. కాల్పుల విరమణ ప్రకటనకు కారణం ఏమిటి, ప్రభుత్వమే ప్రకటన చేస్తుందని అంతా ఆశించాం. కానీ వాళ్లకున్న లోతైన మిత్రత్వం కారణంగా ప్రభుత్వం వాళ్ల మిత్రుడిని కాల్పుల విరమణ ప్రకటన చేయమని అడిగింది అని పరోక్షంగా తానే యుద్ధాన్ని ఆపానంటూ డొనాల్డ్‌ట్రంప్ ప్రకటించుకోవడాన్ని ప్రస్తావించారు. నిర్లక్ష్యంకారణంగానే అమాయకులైన ప్రజలు ప్రాణాలు కోల్పోయారని పహల్గాం ఉగ్రదాడి నిరూపిస్తోందని అఖిలేష్ విమర్శించారు. దేశాన్ని పాలించేందుకు ప్రజల భావోద్వేగాలను తమకు ప్రయోజనకారిగా ప్రభుత్వం మార్చుకుంటోందని ఆరోపించారు. ఆపరేషన్ మహదేవ్ టైమింగ్‌నుకూడా అఖిలేష్ ప్రశ్నించారు. ఉగ్రవాదులు హతమైనందుకు మాకు సంతోషమే. కానీ దీనిని ప్రతిచోటా రాజకీయ ప్రయోజనాల కోసం వాడుకుంటున్నది ఎవరు, సపోర్ట్ అవసరమైనప్పుడు అన్ని రాజకీయ పార్టీలు మీతో కలిసివచ్చాయి.

అదలా ఉంచితే, ఎన్‌కౌంటర్ నిన్ననే ఎందుకు జరిగింది, టెక్నాలజీ గురించి మీకు అంతగా తెలిసినప్పుడు పుల్వామాలో ఆర్డీఎక్స్‌ను తీసుకెళ్తున్న వాహనాన్ని ఇంతవరకూ ఎందుకు పట్టుకోలేదు ఇవాల్టికీ బిజెపి అనుకుంటే పుల్వామాకి ఏ మార్గం గుండా వాహనం వచ్చిందో తెలుసుకోగలదని అఖిలేష్ అన్నారు.

# చిదంబరంజీ.. పాక్‌ను ఎందుకు కాపాడాలనుకుంటున్నారు?

## లోక్‌సభలో అమిత్‌షా గుస్సా

**న్యూఢిల్లీ, జూలై 29:** పహల్గాం దాడిల్లో 26 మందిని బలిగొన్న ఉగ్రవాదులు స్వదేశీ వ్యక్తులంటూ కాంగ్రెస్ నేత పి.చిదంబరం చేసిన వ్యాఖ్యలపై కేంద్ర హోం మంత్రి అమిత్‌షా తీవ్రంగా స్పందించారు. ఆయన పాకిస్థాన్‌ను రక్షించేందుకు ప్రయత్నిస్తున్నట్లు ఉందని వ్యాఖ్యానించారు. ఆ ఉగ్రవాదులు పాకిస్థాన్‌కు చెందిన వారేనని రుజువు చేసే ప్రూఫ్స్ తమ వద్ద ఉన్నాయని షా స్పష్టం చేశారు. పహల్గాం ఉగ్రదాడికి ప్రతీకారంగా భారత్ చేపట్టిన ఆపరేషన్ సిందూర్‌పై లోక్‌సభలో రెండో రోజు చర్చ కొనసాగుతోంది. ఈ చర్చ సందర్భంగా ఇవాళ అమిత్ షా మాట్లాడారు. ఈ మేరకు కీలక ప్రకటన చేశారు. పహల్గాం దాడికి ఆపరేషన్ మహదేవ్ ద్వారా ప్రతీకారం తీర్చుకున్నట్లు ప్రకటించారు. ఈ ఆపరేషన్ ద్వారా పహల్గాం దాడికి పాల్పడిన ముగ్గురు ఉగ్రవాదులను హతమార్చినట్లు సభలో ప్రకటించారు. ఇక ఈ సందర్భంగా దాడికి పాల్పడిన ఉగ్రవాదులు పాకిస్థాన్‌కు చెందిన వారేనని రుజువు చేసే ప్రూఫ్స్ ఉన్నాయని వెల్లడించారు. 'చిదంబరం జీ నిన్న ఓ ప్రశ్న లేవనెత్తారు. ఉగ్రవాదులు పాకిస్థాన్ నుంచి వచ్చారని రుజువు ఏమిటని? అడుగు తున్నారు. ఆయన ఎవరిని కాపాడాలనుకుంటున్నారు? పాకిస్థాన్‌ను సమర్థించడం ద్వారా ఆయనకు ఏం వస్తుంది? ఆపరేషన్ మహదేవ్‌లో హతమైన ముగ్గురు పాక్‌కు చెందిన ఉగ్రవాదులే. అందుకు సంబంధించిన ఆధారాలు మా దగ్గర ఉన్నాయి.

వారి దగ్గర పాక్‌లో తయారైన చాక్లెట్లు దొరికాయి. ఆ ముగ్గురి ఉగ్రవాదుల ఓటర్ వివరాలూ ఉన్నాయి. చిదంబరం పాక్‌కు క్లీన్‌చిట్ ఎందుకుఇచ్చారు..? పాకిస్థాన్‌ను కాపాడేందుకు వారు చేస్తున్నకుట్రను 130 కోట్ల మంది ప్రజలు చూస్తున్నారు' అంటూ అమిత్ షా ఆగ్రహం వ్యక్తం చేశారు.

# పాక్ అణు బెదిరింపులకు భారత్ బెదరదు.. అదరదు!



## రాజ్యసభలో రాజ్‌నాథ్‌సింగ్

**న్యూఢిల్లీ,జూలై 29:** ఆపరేషన్ సింధూర్‌పై ఇవాళ రాజ్యసభలో రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్‌చర్చను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పాకిస్థాన్ చేపడుతున్న అణ్వాయుధ బెదిరింపులకు భారత్ తలవంచదు అని పేర్కొన్నారు. ఎటువంటి యుద్ధ వ్యూహాలనైనా తిప్పికొడుతుందన్నారు. ఉగ్రవాదానికి భారత్ వ్యతిరేకమన్న ఉద్దేశాన్ని చాటేందుకు ఆపరేషన్ సింధూర్ సంకేతంగా నిలుస్తుందని, కానీ గత ప్రభుత్వాలు దశాబ్ధాల క్రితమే ఇలాంటి చర్యలను చేయాల్సి ఉండే అని అన్నారు.

ఒకవేళ పాకిస్థాన్ ఉగ్రవాదాన్ని రూపుమాపాలనుకుంటే, ఆ దేశానికి సహకారం అందించేందుకు భారత్ సిద్ధంగాఉన్నట్లు ఆయన తెలిపారు. భారత్, పాకిస్థాన్ దేశాలు ఒకేసారి స్వాతంత్ర్య దినోత్సవాన్ని జరుపుకుంటాయని, కానీ పాకిస్థాన్‌ను ఉగ్రవాద కేంద్రంగా భావిస్తున్నారని, ఇండియాను మాత్రం ప్రజాస్వామ్యానికి తల్లిగా భావిస్తున్నట్లు ఆయనచెప్పారు. ఉగ్రవాదం నుంచి ఎటువంటి విప్లవం పుట్టదు అని, దాని వల్ల కేవలం విధ్వంసం, ద్వేషమే మిగులుతుందన్నారు. ఉగ్రవాదులేమీ ఫ్రీడం ఫైటర్లు కాదన్నారు. ఆపరేషన్ సిందూర్ సమయంలో పాకిస్థాన్ ఎన్ని యుద్ధ విమానాలను కోల్పోయిదన్న విషయాన్ని విపక్షాలు ఎందుకు అడగడం లేదన్నారు. కానీ భారతీయ యుద్ధ విమానాల గురించి మాత్రమే ప్రశ్న వేస్తోందని విమర్శించారు. ఏదోఒకరోజు పీవోకే ప్రజలు ఇండియాతో కలుస్తారని, భారతీయులమని చెప్పుకునేందుకు వాళ్లు గర్వపడుతారని రాజ్‌నాథ్ అన్నారు. ఆపరేషన్ సిందూర్‌కు కేవలం కామా మాత్రమే పెట్టామని, ఫుల్ స్టాప్ పెట్టలేదన్నారు. కాల్పుల విరమణకు ఎందుకు అంగీకరించారని వస్తున్న ఆరోపణలపై స్పందిస్తూ.. ఆపరేషన్ సింధూర్ లక్ష్యం కేవలం పాకిస్థాన్‌ను శిక్షించడమే అని, కానీ ఆ దేశంపై యుద్ధం చేయడం తమ ఉద్దేశం కాదన్నారు.

పాకిస్థాన్‌లో ఉన్న 9 ఉగ్ర స్థావరాలపై ఇండియా దాడి చేసిందని, ఆ దాడిలో ఒక్క పాకిస్థానీ పౌరుడు కూడా మరణించలేదని మంత్రి రాజ్‌నాథ్ పేర్కొన్నారు. మరో వైపు లోక్‌సభలో హోంశాఖ మంత్రి అమిత్ షా చేసిన ప్రసంగంపై ప్రధాని మోడీ తన ఎక్స్ అకౌంట్లో ట్వీట్ చేశారు. ఆపరేషన్ సింధూర్, ఆపరేషన్ మహదవ్‌పై ఆ ప్రసంగంలో పూర్తి వివరాలు ఉన్నట్లు పేర్కొన్నారు.

# ఉక్రెయిన్ జైలుపై రష్యా వైమానిక దాడులు

## 17 మంది మృతి.. 80 మందికి గాయాలు

**కీవ్, జూలై 29:** రష్యా-ఉక్రెయిన్‌ల మధ్య పోరు కొనసాగుతోంది. తాజాగా సోమవారం అర్ధరాత్రి తమ దేశంలోని జైలుపై మాస్కో వైమానిక దాడులకు పాల్పడిందని ఉక్రెయిన్ అధికారులు ఆరోపించారు. ఈ దాడిలో 17 మంది ప్రాణాలు కోల్పోగా.. 80మందిగాయపడినట్లు తెలిపారు. ఉక్రెయిన్‌లోని ఆగ్నేయ జపోర్జియా ప్రాంతంలోని జైలుపై ఈ దాడి జరిగినట్లు అధికారులు తెలిపారు. బిలెన్‌కివ్స్కాలోని మరో కాలనీపై కూడా ఈదాడుల ప్రభావం కన్పించిందని పేర్కొన్నారు. ఈ ఘటనలో 17 మంది చనిపోగా.. 42 మంది ఖైదీలు తీవ్రంగా గాయపడ్డారని వివరించారు. సిబ్బందిలో ఒకరితోపాటు మరికొందరు గాయపడ్డారని తెలిపారు. జైలు డైనింగ్ హాలుతో సహా పరిపాలనా, క్వారంటైన్ భవనాలు పూర్తిగా దెబ్బతిన్నాయన్నారు. మరో మూడంతస్తుల భవనం పాక్షికంగా దెబ్బతిన్నదని, ప్రసూతి ఆస్పత్రి సహా పలు ఆస్పత్రుల్లోని వైద్య సౌకర్యాలు నాశనమయ్యాయని వెల్లడించారు. ఈ దాడుల నేపథ్యంలో ఖైదీలు ఎవరూ జైలు నుంచి తప్పించుకోలేదని స్పష్టం చేశారు. ఈ దాడిని తాము తీవ్రంగా ఖండిస్తున్నట్లు కీవ్ అధికారులు పేర్కొన్నారు. జైళ్ల వంటి పౌరుల మౌలిక సదుపాయాలను లక్ష్యంగా చేసుకోవడం అంతర్జాతీయ చట్టాలకు విరుద్ధమన్నారు. ఇక, రష్యా ప్రయోగించినవాటిల్లో 32 డ్రోన్లను అడ్డుకున్నామని ఆదేశ వైమానిక దళం తెలిపింది. రష్యా-ఉక్రెయిన్‌ల మధ్య సుదీర్ఘకాలంగా యుద్ధం కొనసాగుతోంది. ఇటీవల పరస్పరం డ్రోన్ల దాడులతో పరిస్థితులు ఉద్రిక్తంగా మారాయి. ఉక్రెయిన్‌తో యుద్ధం ఆపి శాంతి నెల కొల్పేందుకు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తీవ్రంగా ప్రయత్నిస్తున్నారు.

## కన్వరియాల బస్సు.. గ్యాస్ సిలిండర్ల ట్రక్కు ఢీ

### 18 మంది మృతి, మరికొందరికి తీవ్ర గాయాలు

**దేవఘర్,జూలై 29:** జార్ఖండ్‌లో ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. కన్వరియాలతో వెళ్తున్న బస్సు గ్యాస్ సిలిండర్ల వాహనాన్ని ఢీకొన్నది. మంగళవారం ఉదయం 4.30 నిమిషాలకు దేవఘర్‌లో ఈ దుర్ఘటన జరిగింది. ఈ ప్రమాదంలో సుమారు 18 మంది మృతిచెందారని బిజెపి ఎంపీ నిశికాంత్ దూబే పేర్కొన్నారు. దుమ్కా జోన్ ఐజీ శైలేంద్ర కుమార్ సిన్హా మాట్లాడుతూ.. 32 సీట్లు ఉన్న బస్సులో కన్వరియాలు వెళ్తున్నట్లు తెలిపారు. మోహన్‌పురా పోలీసుస్టేషన్ పరిధిలోని జామునియా అటవీ ప్రాంతంలో ఈ ప్రమాదం జరిగింది. ట్రాఫిక్ డిప్యూటీ ఎస్పీ లక్ష్మణ్ ప్రసాద్ మాట్లాడుతూ ప్రమాదంలో కనీసం 9 మంది మృతిచెందారని, గాయపడ్డవారిని ఆస్పత్రికి తరలించినట్లు చెప్పారు. తన లోక్‌సభ నియోజకవర్గం దేవఘర్‌లో శ్రావణమాసం సందర్భంగా కన్వర్ యాత్ చేస్తున్న 18 మంది భక్తులు రోడ్డు ప్రమాదంలో ప్రాణాలు కోల్పోయినట్లు ఎంపీ దూబే తెలిపారు. గాయపడ్డవారిని తొలుత మోహన్‌పుర కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌కు, ఆ తర్వాత దేవఘర్ సదర్ ఆస్పత్రికి తరలించారు. ప్రమాదంలో కనీసం 20 మంది యాత్రికులకు తీవ్ర గాయాలైనట్లు చెబుతున్నారు.

# సంక్షిప్తంగా..

## డాక్టర్‌నుంచి సైబర్ నేరగాళ్లు రూ.19 కోట్లు స్వాహా

**సూరత్, జూలై 29:** దేశంలోనే అత్యంత పెద్ద డిజిటల్ అరెస్టు పేరిట స్కాం జరిగింది. గుజరాత్‌లోని గాంధీనగర్‌కు చెందిన ఓ డాక్టర్‌ను సైబర్ క్రిమినల్స్ మోసం చేశారు. ఆ డాక్టర్ వద్ద నుంచి సుమారు 19 కోట్లు కాజేశారు. మూడు నెలల వ్యవధిలో ఆ మొత్తాన్ని డిజిటల్ అరెస్టు రూపంలో దోచేశారు. అధికారులమని చెబుతూ కొందరు వ్యక్తులు ఫోన్‌లో బెదిరించి ఆ డబ్బును తమ అకౌంట్లలోకి మళ్లించుకున్నారు. ఈ కేసులో సూరత్‌కు చెందిన ఓ వ్యక్తిని అదుపులోకి తీసుకున్నారు. అతని అకౌంట్‌లో రూ.కోటి ఉన్నట్లు గుర్తించారు. అయితే సీనియర్ డాక్టర్‌ను 19 కోట్ల మేర మోసం చేసిన వ్యక్తులకు చెందిన నెట్వర్క్ గుట్టు విప్పేందుకు పోలీసులు ప్రయత్నిస్తున్నారు. తొలుత మార్చి 15వ తేదీన ఓ లేడీ డాక్టర్‌కు ఫోన్ కాల్ వచ్చింది. ఫోన్‌లో అభ్యంతరకరమైన కాంటెంట్ ఉన్నట్లు ఆమెను బెదిరించారు. ఫోన్‌ను డిస్‌కనెక్ట్ చేసి, మనీల్యాండరింగ్ కేసు నమోదు చేయనున్నట్లు ఆ ఫోన్‌కాల్‌లో బెదిరించారు. ఆ తర్వాత వేర్వేరు వ్యక్తుల నుంచి అధికారులమని ఫోన్ కాల్స్ వచ్చాయి. సబ్ ఇన్‌స్పెక్టర్, పబ్లిక్ ప్రాసిక్యూటర్ అంటూ ఆమెను బెదిరించారు. దీంతో ఆ డాక్టర్ డిజిటల్ అరెస్టు అయ్యింది. ఆ భయంలో ఆమె సుమారు 19 కోట్లు ట్రాన్స్‌ఫర్ చేసింది.

## చైనాలో భారీ వరదలు.. 34 మంది మృతి



**బీజింగ్, జూలై 29:** చైనాను భారీ వరదలు ముంచెత్తుతున్నాయి. వీటి కారణంగా బీజింగ్‌లో ఇప్పటివరకు 34 మంది ప్రాణాలు కోల్పోయారు. దాదాపు 80వేల మంది సురక్షిత ప్రాంతాలకు తరలిపోయారు. ఈ మేరకు అక్కడి మీడియా కథనాలు వెల్లడిస్తున్నాయి. రాజధాని బీజింగ్‌లో భారీగా వర్షాలు కురుస్తున్నాయి. దీంతో పలు ప్రాంతాలు జలమయమయ్యాయి. మియున్ జిల్లా వరదల కారణంగా తీవ్రంగా దెబ్బతిన్నది. ఇక్కడ 28 మంది, యాంకింగ్ జిల్లాలో మరో ఇద్దరు ప్రాణాలు కోల్పోయారు. పొరుగునున్న హెబీ ప్రావిన్స్‌లో కొండచరియలు విరిగిపడి నలుగురు మరణించారు. ఈ క్రమంలో పలువురి ఆచూకీ గల్లంతయ్యింది. ఇక, బీజింగ్‌లోని 80 వేల మందికిపైగా ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించారు. వీరిలో మియున్‌కు చెందిన వారే 17 వేల మంది ఉన్నారు. లువాన్‌పింగ్ కౌంటీలోని గ్రామీణ ప్రాంతంలోకూడా కొండచరియలువిరిగిపడ్డాయి.

## భారత్ సంతతి కోపైలట్ అమెరికాలో అరెస్టు

**వాషింగ్టన్, జూలై 29:** భారత్ సంతతికి చెందిన కోపైలట్ రుస్తుం భగ్వాగర్ అమెరికాలో అరెస్టయ్యాడు. శాన్‌ఫ్రాన్సిస్కో విమానాశ్రయంలో అతడిని కాక్‌పిట్ నుంచే పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. డెల్టా ఎయిర్‌లైన్స్‌లో విధులు నిర్వర్తిస్తోన్న అతడిపై చిన్నారులపై లైంగిక వేధింపులకు పాల్పడిన ఆరోపణలు ఉన్నాయి. డెల్టా సంస్థకు చెందిన బోయింగ్ విమానం మిన్నియాపోలిస్ నుంచి బయల్దేరి, శాన్‌ఫ్రాన్సిస్కోలో ల్యాండ్ అయింది. అది దిగిన పది నిమిషాల వ్యవధిలోనే పోలీసులు కాక్‌పిట్‌లోకి దూసుకువచ్చారు. విమానం నుంచి దిగాలని ఎదురుచూస్తున్న ప్రయాణికులు ఆ పరిణామంతో ఒక్కసారిగా ఆశ్చర్యపోయారు. లోపలికి వెళ్లిన భద్రతా సిబ్బంది కోపైటల్ భగ్వాగర్‌ను అదుపులోకి తీసుకున్నారు. 'వేర్వేరు సంస్థలకు చెందిన దుస్తులు ధరించిన అధికారులు తుపాకులతో లోపలికి వచ్చారు. అతడికి బేడీలు వేసి తీసుకెళ్లారు' అని ఓ ప్రయాణికుడు మీడియాకు వెల్లడించారు. ఈ అరెస్టుతో భగ్వాగర్ షాక్‌కు గురయ్యాడు. దీని గురించి తనకు ముందుగా తెలియదని చెప్పాడు.

## వాళ్లెవరో..ఏందో..నాకైతే తెల్వదు: ఫరూక్ అబ్దుల్లా

**న్యూఢిల్లీ,జూలై 29:** పహల్గాంలో దాడికి పాల్పడిన ముగ్గురు ఉగ్రవాదులను భద్రతాబలగాలు మట్టుబెట్టాయని కేంద్ర హోంమంత్రి అమిత్ షా మంగళవారం మధ్యాహ్నం లోక్‌సభలో ప్రకటించడంపై నేషనల్ కాన్ఫరెన్స్ (ఎన్‌సీ) పార్టీ అధ్యక్షుడు ఫరూఖ్ అబ్దుల్లా తనదైన శైలిలో స్పందించారు. పహల్గాం ఉగ్రదాడికి పాల్పడింది ఆ ముగ్గురు ఉగ్రవాదులేనో లేదంటే మరొకరో అని అనుమానిస్తున్నట్లుగా ఆయన వ్యాఖ్యలు ఉన్నాయి. 'ఎన్‌కౌంటర్‌లో హతమైన ఆ ముగ్గురు ఉగ్రవాదులు ఎవరో.. ఏందో.. నాకైతే తెలియదు' అని ఫరూక్ అబ్దుల్లా వ్యాఖ్యానించారు. 'పహల్గాం దాడికి పాల్పడింది హతమైన ఆ ముగ్గురు ఉగ్రవాదులేనని కేంద్ర హోంమంత్రి చెప్పారు. అదే నిజమైతే ప్రభుత్వానికి నా అభినందనలు' అని అన్నారు. కాగా పహల్గాం దాడికి పాల్పడిన ఉగ్రవాదులు శ్రీనగర్‌లో ఉన్నారనే సమాచారం అందడంతో సోమవారం భద్రతాదళాలు ఆ ఏరియాను చుట్టుముట్టి ముగ్గురిని హతమార్చాయి.



మంగళవారం జెయన్‌టియు వైస్ ఛాన్సలర్ సుదర్శన్ రావును సత్కరిస్తున్న ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి

## ఆగస్టు 10నుంచి స్కిట్ ఇంజినీరింగ్ కళాశాల ప్రారంభం

### ఏర్పాట్లు పరిశీలించిన జెయన్‌టియు వైస్ ఛాన్సలర్

**శ్రీకాళహస్తి,జూలై 29 ప్రభాతవార్త:** శ్రీకాళహస్తీశ్వ రాలయానికి అనుబంధంగా సుమారు 25 సంవత్సరాలు నిర్వహించి మూడేళ్ళ క్రితం మూత పడిన స్కిట్ ఇంజనీరింగ్ కళాశాలను ప్రభుత్వం జేయన్‌టియు అనంతపురానికి లీజుకు అప్పగించింది. మూడేళ్ళ పాటు ప్రభుత్వం ప్రతి ఏటా రూ.40కోట్లు చొప్పున మూడేళ్ళు ఆదుకొనుటకు ఉత్తర్వులు జారి చేసారు. ఈనేపధ్యంలో మంగళవారం జేయన్‌టియు వైస్ ఛాన్సలర్ సుదర్శన్‌రావు, స్థానిక శాసనసభ్యుడు సుధీర్‌రెడ్డి, ఇఒ డి.బాపిరెడ్డిలు కలిసి ఏర్పాట్లును పరిశీలించారు. సుమారు 15రోజులుగా జేయన్ టియు అనంతపురం స్కిట్ ఇంజనీరింగ్ కళాశాలను ముస్తాబు చేస్తున్నారు. కంప్యూటర్ లాబ్‌లు,గ్రంధాలయాలు,క్లాస్‌రూములతో పాటు కళాశాల ఆవరణలను పరిశీలించారు. ఈ సందర్భంగా వైస్ ఛాన్సలర్ సుదర్శన్‌రావు మాట్లాడుతూ స్కిట్‌కు పూర్వ వైభవం తీసుకురావటంలో ప్రభుత్వం,విద్యాశాఖ మంత్రి ఎంతో చొరవ తీసుకున్నారన్నారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు కళాశాలను ప్రారంభానికి సిద్దం చేస్తున్నట్లు మీడియా సమావేశంలో తెలిపారు. రానున్న రోజుల్లో చైనాకు చెందిన సెమి కండక్టర్ పరిశ్రమ ఇండియాలో ఏర్పాటు చేయనున్నారని దాంతో ఈసిఇకి మంచి రోజులు వస్తాయని వివరించారు. డిమాండ్ ఉన్న కోర్సులను స్కిట్‌లో అడ్మిషన్స్‌కు అవకాశం కల్పించినట్లు వైస్ ఛాన్సలర్ సుదర్శన్‌రావు తెలిపారు.

**మారిన కళాశాల కోడ్:** 1997 నుంచి 2021 వరకు స్కిట్‌గా కొనసాగిన శ్రీకాళహస్తీశ్వరాలయానికి అనుబంధంగా నిర్వహించిన ఇంజనీరింగ్ కళాశాలను ఇక మీదట 'జేయన్‌టిఎస్‌కెఎస్‌ఎఫ్'గా కళాశాల కోడ్‌ను రూపొందించామని వైస్ ఛాన్సలర్ తెలిపారు.

**ఐదు కోర్సుల కు ప్రవేశాలు:** స్కిట్ ఇంజనీరింగ్ కళాశాలలో ప్రవేశాలకు రెండవ కౌన్సిల్‌లో అనుమతిలభించిందని వైస్ ఛాన్సలర్ సుదర్శన్‌రావు తెలిపారు. ఈ మేరకు సోమవారం ఉత్తర్వులు వెలువడినట్లు సమాచారం. వెబ్ ఆప్షన్లలో ఇంజనీరింగ్ కళాశాల పేరును పొందుపరచారు.ఇక్కడి ఐదు కోర్సుల్లోనూ పీజు రూ.70వేలుగా ఖరారు చేసారు. ఇక్కడ మంజూరు చేసిన సీట్లలో ఒక్కొక్క కోర్సులో 66 మందిని అనుమతిస్తారు. మంజూరు చేసిన కోర్సులను పరిశీలిస్తే కంప్యూటర్ సైన్సు అండ్ ఇంజనీరింగ్ (డేటా సైన్స్) కంప్యూటర్ సైన్స్ ఇంజనీరింగ్ (సిఎస్‌సి) ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్స్ అండ్ మెషిన్ లర్నింగ్(సిఎస్‌ఎం) ఎలక్ట్రికల్ మరియు కమ్యూనికేషన్ ఇంజనీరింగ్(ఇసిఇ) ట్రిబుల్‌ఇలకు అనుమతి లభించింది.

## 9 ఇళ్లలో చోరీలు: రూ.27 లక్షల విలువైన నగలు స్వాధీనం

**శ్రీకాళహస్తి,జూలై 29 ప్రభాతవార్త:** తిరుపతి జిల్లాలో పలు చోట్ల చోరీలకు పాల్పడ్డ దొంగను అరెస్టు చేసి ఆతనినుంచి రూ.27 లక్షల విలువైన 248.7 గ్రాముల బంగారం స్వాధీనం చేసుకున్నట్లు జిల్లా ఎస్‌పి హర్షవర్ధన్‌రాజు మంగళవారం వివరించారు. నెల్లూరుకు చెందిన మీదూరి సునీల్ (29)ని నెల్లూరుటౌన్‌లోని వెంకటేశ్వరపురం, జనార్ధన్‌రెడ్డికాలనీ పెన్నానది బ్రిడ్జి దగ్గర అదుపులోకి తీసుకున్నట్లు వివరించారు. ఇతనిపై శ్రీకాళహస్తి టౌన్, నెల్లూరుటౌన్, బియన్ కండ్రిగ, నాయుడుపేట, గూడూరు పోలీసుస్టేషన్ పరిధిలో 9 కన్నపు నేరాలకు పాల్పడినట్లు ఎస్‌పి వివరించారు. ఇవికాక నెల్లూరు, తిరుపతిజిల్లాలో 28కేసుల్లో నిందితునిగా జైలుశిక్ష అనుభవించినట్లు నెల్లూరులో ఇతనిపై డిసి షీట్ ఉన్నట్లు తెలిపారు. మూడు మోటార్‌సైకిల్ దొంగతనాలు కేసులు ఉన్నట్లు వివరించారు. చెడు వ్యసనాలకు బానిసై రాత్రివేళల్లో తాళాలువేసిన ఇళ్ళను టార్గెట్ చేసుకొని బంగారం,విలువైన వస్తువుల్ని దొంగతనం చేసేందుకు అలవాటు పడ్డాడని ఎస్‌పి వివరించారు.ఈ కేసులను ఛేదించటంలో శ్రీకాళహస్తి డివైయస్‌పి నరసింహామూర్తి పర్యవేక్షణలో టౌన్ సిఐ డి.గోపి, తొట్టంబేడు ఎస్‌ఐ రామాంజనేయులు సిబ్బంది చాకచక్యంగా వ్యవహరించినట్లు ఎస్‌పి తెలిపారు. వారికి రివార్డులు ప్రకటించారు. వారిచొరవను ఎస్‌సి అభినందించారు.



మంగళవారం మీడియాకు వివరాలు వెల్లడిస్తున్న ఎస్‌పి హర్షవర్ధన్‌రాజు

## ఎపిలో శాంతి భద్రతలు క్షీణిస్తున్నాయి

### పార్లమెంట్‌లో ఎంపీ గురుమూర్తి ఆందోళన


**వెంకటగిరి, జూలై 29 ప్రభాతవార్త:** ఆంధ్రప్రదేశ్‌లో క్షీణించిన శాంతి భద్రతల అంశాన్ని వైఎస్సార్ కాంగ్రెస్‌పార్టీ ఎంపీ మద్దిల గురుమూర్తి మంగళవారం మేటర్ అండర్ రూల్ 377 ద్వారా కేంద్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లారు. ఆంధ్రప్రదేశ్‌లో శాంతి భద్రతలు క్షీణించాయని, పరిస్థితి విషమంగా మారిందని, ప్రజాస్వామ్య వ్యవస్థపై ప్రమాదకరమైన దాడి జరుగుతోందని ఆయన పేర్కొన్నారు. ఇందుకు ఉదాహరణగా ఈ సమావేశాలలో తనతో పాటు ఉండాల్సిన తన సహచరుడు, రాజంపేట ఎంపీ, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఫ్లోర్ లీడర్ పి.వి.మిథున్‌రెడ్డిని అక్రమ కేసులో అరెస్టు చేయడం గురించి ప్రస్తావించారు. ఇదొక్క సంఘటనే కాదని, ఇవన్నీ కుట్రల శ్రేణిలో భాగమని సభ దృష్టికి తీసుకెళ్లారు. ప్రతిపక్ష నాయకులను లక్ష్యంగా చేసుకోవడం, ప్రభుత్వంపై విమర్శలు చేసిన వారిని బెదిరించడం, పోలీసు యంత్రాంగాన్ని రాజకీయ ప్రయోజనాలకు వాడుకోవడం, ఇవన్నీ రాజ్యాంగ విలువలకు వ్యతిరేకంగా జరుగుతున్న చర్యలుగా భావించాలని ఎంపీ మద్దిల గురుమూర్తి కోరారు. ఇలాంటి చర్యలు ప్రజాస్వామ్య వ్యవస్థను బలహీనపరచడం మాత్రమే కాకుండా, న్యాయం, సమానత్వం, ప్రాతినిధ్య పరంగా పాలన అనే సూత్రాల ఉల్లంఘన అని ఆయన పేర్కొన్నారు. ఈ చర్యలను కేంద్ర ప్రభుత్వం పరిశీలించి, రాజ్యాంగం అమలులో ఉండేలా చర్యలు తీసుకోవాలి ఎంపీ కోరారు.



## మహిళల ఉచిత బస్సు సౌకర్యంలో భద్రతకు ప్రాధాన్యం

### ఏపిఎస్‌ఆర్టీసి జోనల్ ఛైర్మన్ పూలనాగరాజు

**తిరుపతిరవాణ,జూలై29ప్రభాతవార్త:** ఆంధ్రప్రదేశ్‌లో గత ఎన్నికల సమయంలో కూటమి పార్టీల నేతలు, సిఎం చంద్రబాబునాయుడు ఇచ్చిన మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం హామీ తీసుకోవాల్సిన ఏర్పాట్లుపై మంగళవారం ఉదయం తిరుపతిలో రవాణామంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి, ఆర్టీసి ఎండి ద్వారకాతిరుమల రావు, కడప జోనల్ ఛైర్మన్ పూలనాగరాజు, తిరుపతి జిల్లాప్రజా రవాణా అధికారి జగదీశ్, ఏపిఎస్‌ఆర్టీసి ప్రధాన కార్యాలయం నుండి ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్స్ ఎ.అప్పలరాజు, టి.చంగల్‌రెడ్డి, పి.చంద్ర శేఖర్, ఎనిమిది జిల్లాల ప్రజారవాణా అదికారులు,డిపో మేనేజర్లు పాల్గొన్నారు. ప్రస్తుతం ఆర్టీసి ప్రయాణీకులలో మహిళా ప్రయాణీకుల బాగం సుమారు 30నుండి 35శాతం వరకుఉ ందని, ఈ పథకం ప్రారంభం తరువాత సుమారు 60శాతం వరకు పెరిగే అంచనా వేస్తున్నామన్నారు.



ఉచిత ప్రయాణంపై సమీక్షిస్తున్న మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి


రానున్న ఆగస్ట్ 15నుండి అమలులోకి రానున్న ఉచిత బస్సు ప్రయాణ పథకాన్ని మహిళలకు పూర్తిగా లబ్ధిదాయకంగా మార్చేందుకు అన్ని ఏర్పాట్లు చేయాలన్నారు. ప్రతి బస్సు షెడ్యూల్, రూట్ మ్యాపింగ్, టికెట్ విధానం, డిజిటల్ ట్రాకింగ్ వంటి అంశాలపై పూర్తి క్లారిటీ ఉండాలన్నారు. మహిళలకు భద్రతతోబాటు వినూత్న సౌకర్యాలు కల్పించేందుకు తగిన చర్యలు తీసుకోవాలన్నారు.

నెరవేరనుందని ఏపిఎస్‌ఆర్టీసి కడప జోనల్ మేనేజర్ పూలనాగరాజు తెలిపారు. ఇందుకోసం ఆగస్ట్ 15వతేదీ స్వాతంత్ర్యం దినోత్సవాన్ని శుభదినంగా ముఖ్యమంత్రి నిర్ణయించారన్నారు. రవాణాలో మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం వినూత్నమన్నారు. పక్కరాష్ట్రాల్లో అమలవుతున్న విధానాన్ని మనరాష్ట్రంలో కూడా అమలుచేసే దిశగా కార్యాచరణ సిద్ధమైందన్నారు. మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం ,వారికోసం బస్సులు సకాలంలో నడపడం, ఇతరులకు అసౌకర్యం లేకుండా చూడటం ,ఆర్టీసి అధికారులు

# ఆర్థికలోటు ఉన్నప్పటికి అభివృద్ధి సంక్షేమ పథకాలు

### మంత్రి కొల్లు రవీంద్ర

**కావలి (నెల్లూరు), జూలై 29, ప్రభాతవార్త :** రాష్ట్రంలో రూ. 16 వేల కోట్లు ఆర్థిక లోపు వున్నప్పటికి ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు రాష్ట్రంలోని ప్రజలకు అభివృద్ధి,సంక్షేమ పథకాలను ముందుకు తీసుకువెల్తున్నట్లు రాష్ట్ర గనులు, భూగర్బ,ఎక్సైజ్ శాఖా మంత్రి కొల్లు రవీంద్ర తెలిపారు. మంగళవారం ఆయన కావలి ఎమ్మెల్యే దగుమాటి వెంకట క్రిష్ణా రెడ్డి, ఎమ్మెల్సీ బీదా రవిచంద్రాతో కలసి పలు అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపన నిర్వహించారు. తుమ్మలపెంట పంచాయితీలో ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం సుపరిపాలనలో తోలి అడుగు కార్యక్రమం నిర్వహించారు. ఇంటింటికి తిరుగుతూ కరపత్రాలను పంచి ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. తుమ్మలపెంట లోని పట్టపుపాళెం వద్ద రూ.42.6 లక్షల వ్యయంతో అంతర్గత సిసి రోడ్లకు, తుమ్మలపెంట పల్లిపాళెం వద్ద రూ.44 లక్షల వ్యయంతో జల జీవన్ మిషన్ కింద త్రాగునీటి వసతికి, రూ. 27.4 లక్షల వ్యయంతో సీసి రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. ఓట్లూరు వద్ద రూ.25 లక్షల వ్యయంతో సిసి రోడ్లు నిర్మాణం, రూ. 55 లక్షలతో వ్యయంతో రక్షిత మంచినీటి పథకం శంకుస్థాపనలు ఎమ్మెల్యే దగుమాటి వెంకట క్రిష్ణా రెడ్డి, ఎమ్మెల్సీ బీదా రవిచంద్రలతో కలసి నిర్వహించారు. ఈ సందర్బంగా మంత్రి కొల్లు రవింద్ర మాట్లాడుతూ ఎన్నికలకు ముందు ఇచ్చిన పలు హామిలలో పలు హామీలలో 95 శాతం పూర్తి చేయడం జరిగిందన్నారు. ప్రభుత్వం ఏర్పడగానే ఫించన్లను పెంచి అరియర్స్‌తో పాటు ఒకే సారి ఫించన్‌దారులకు చెల్లించడం జరిగిందన్నారు. నేడు రాష్ట్రంలో 64 లక్షల మంది ఫించన్ దారులు వున్నారని, నెలకు రూ. 4వేలు ఫించన్ ఇచ్చే ఎకైక రాష్ట్రంగా ఆంధ్రప్రదేశ్ వుందన్నారు. తల్లికి వందనం కింద కుటుంబంలో చదువు కుంటున్న పిల్లలందరికి ఇంటర్మీడియట్ వరకు రూ. 13 వేలు వంతున చెల్లించడం జరుగుతుందన్నారు. శాసనమండలి సభ్యులు బీదా రవిచంద్ర మాట్లాడుతూ మత్సకారుల సమస్యలు తెలిసిన వ్యక్తి మంత్రి కొల్లు రవింద్రా అని కోనియాడారు. తమ ప్రభుత్వ హాయంలో మోడల్ స్కూల్ ఏర్పాటు చేయడంతో పాటు అత్యదిక నిధులతో సిసి రోడ్డు కూడా ఏర్పాటు చేయడం జరిగిందన్నారు.అవసరం మేరకు అంగన్వాడీ కేంద్రాలు తీసుకురావడం జరిగిందన్నారు. గ్రామీణ సమస్యలు తెలుసుకునేందుకు మంత్రి తుమ్మలపెంటకు వచ్చారని ఆయన తెలిపారు. ప్రభుత్వం కాపుల అభ్యున్నతికి, మత్సకారుల అభివృద్ధికి కృషి చేయడం జరుగుతుందన్నారు. స్థానిక ఎమ్మెల్యే దగ్గుమాటి వెంకట క్రిష్ణా రెడ్డి మాట్లాడుతూ ప్రతి గ్రామంలోని సమస్యలను తెలుసుకోని రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలు ప్రతి ఇంటికి అందుతున్నాయా లేదా అని తెలుసుకోని పథకాలు అందని వారికి అవి అందే విధంగా చర్యలు తీసుకునేందుకు ఈ కార్యక్రమం చెప్పట్టినట్లు తెలిపారు. ఓట్టూరు అంటే తనకు ప్రత్యేక అభిమానం అని ఆయన అన్నారు. ఈ రోజు సీసి రోడ్డుతో పాటు, మంచి నీటిని అందించే విదంగా చర్యలు తీసుకోవడం జరిగిందన్నారు. రానున్న రోజులలో డ్రైనేజిలు కూడా ఏర్పాటు చేయడం జరుగుతుందని, స్మశాన వాటికకు వెల్లే రోడ్లను పూర్తిగా వేయడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో టిడిపి కావలి రూరల్ మండల అధ్యక్షులు అవుల రామకృష్ణ, ప్రధాన కార్యదర్శి ఉప్పాల వెంకట్రావు, మార్కెటింగ్ కమిటీ ఛైర్మన్ అలేఖ్య, బీదా గిరిదర్, పలగాటి శ్రీనివాసుల రెడ్డి, అప్కాబ్ మాజీ ఛైర్మన్ పాల్ శెట్టి,నూడా మాజీ డైరెక్టర్ పాలడగు రంగారావు, మాజీ జడ్‌పిటీసి సభ్యులు నాయుడు రాంప్రసాద్, టిడిపి నాయకులు, కార్యకర్తలు వున్నారు.



పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తున్న మంత్రి కొల్లు రవీంద్ర, ఎమ్మెల్యే తదితరులు

# పెట్టుబడులకు ఎపి అత్యంత సానుకూలం

### రాష్ట్రాభివృద్ధికి గ్రోత్ ఇంజిన్‌గా విశాఖ, కెప్పెల్, జీఐసీ, విల్మార్ ప్రతినిధులతో భేటీలో సిఎం చంద్రబాబు

**విజయవాడ,జూలై 29,ప్రభాతవార్తప్రతినిధి:** ఏపీ ప్రపంచంలో అత్యంత ఆధునీక సాంకేతికాభివృద్ధి సాధిస్తుందని సీఎం చంద్రబాబు స్పష్టం చేసారు.ఆర్థికాభివృద్ధికి పెట్టుబడిదారులకు ఏపీ అత్యంత సానుకూలమన్నారు. నగరాభివృద్ధి, వాణిజ్య సదుపాయాలు, మౌలిక వసతుల రంగాల్లో అంతర్జాతీయ స్థాయి గుర్తింపు పొందిన సింగపూర్‌కు చెందిన కెప్పెల్ కార్పొరేషన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ లిమ్ యాంగ్ వియ్‌తో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సమావేశమయ్యారు. సింగపూర్ లో మూడో రోజు పర్యటనలో భాగంగా సీఎం వివిధ పారిశ్రామిక దిగ్గజ కంపెనీలతో బేటీ అయ్యారు. అమరావతి నగర అభివృద్ధిలో కెప్పెల్ భాగస్వామ్యంపై ప్రధానంగా ఇరువురి మధ్య చర్చ జరిగింది. రాష్ట్రాభివృద్ధి కోసం విశాఖను గ్రోత్ ఇంజిన్‌గా మార్చే లక్ష్యంతో ఐటీ, వాణిజ్యం, గృహ నిర్మాణ రంగాల్లో ప్రాజెక్టుల అభివృద్ధికి కెప్పెల్‌ను ఆహ్వానించారు. అమరావతి నగర అభివృద్ధి, రాష్ట్రంలో రియల్ ఎస్టేట్, పరిశ్రమల రంగం అభివృద్ధి, మౌలిక సదుపాయాల రంగాలలో పెట్టుబడులకు ఉన్న అవకాశాలపై గవర్నమెంట్ ఆఫ్ సింగపూర్ ఇన్వెస్ట్ మెంట్ కార్పోరేషన్ (జీఐసీ) సంస్థ చీఫ్ ఇన్వెస్ట్‌మెంట్ ఆఫీసర్ బ్రాన్ యోతోనూ ముఖ్యమంత్రి భేటీ అయ్యారు. ఆంధ్రప్రదేశ్‌లోని విశ్వవిద్యాలయాలు, పరిశోధన సంస్థలతో ఏఐ సింగపూర్ భాగస్వామ్యంగా పని చేయడానికి ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. ఎస్‌ఐఎ ఇంజినీరింగ్ కంపెనీ సీనియర్ వైస్ ప్రెసిడెంట్ ఎన్‌జీ జాన్ లిన్ విలిన్‌తోనూ సీఎం చంద్రబాబు సమావేశమయ్యారు. రాష్ట్రంలో ఎయిర్ పోర్టుల నిర్మాణం, అభివృద్ధి ప్రణాళికలను జాన్ లిన్ విలిన్‌కు సీఎం వివరించారు. దీనికి సానుకూలంగా స్పందించిన ఎస్ఐఎ ఇంజినీరింగ్ కంపెనీ సీనియర్ వైస్ ప్రెసిడెంట్ తర్వలోనే రాష్ట్రానికి తమ కంపెనీ ప్రతినిధులను పంపిస్తామని చెప్పారు. అలాగే, విల్మార్ ఇంటర్నేషనల్ సంస్థ గ్రూప్ హెడ్ రాహుల్ కలేతో భేటీ అయిన ముఖ్యమంత్రి చంద్రబాబు... సమావేశంలో ఫుడ్ ప్రాసెసింగ్, ఎడిబుల్ ఆయిల్స్, అగ్రి ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ వంటి రంగాల్లో పెట్టుబడి అవకాశాలపై చర్చించారు. రైతులకు విలువ ఆధారిత మార్కెట్‌ను కల్పించేందుకు ఫుడ్ ప్రాసెసింగ్‌లో సహకరించాలని ముఖ్యమంత్రి ప్రతిపాదించగా విల్మర్ టెక్నాలజీ అందుకు ఆసక్తి వ్యక్తం చేసింది. వైద్య, విద్య, పట్టణ ప్రణాళిక, పౌర సదుపాయాలు వంటి రంగాల్లో జీఐసీ పెట్టుబడులు పెట్టేలా అనువైన వాతావరణం కల్పించేందుకు రాష్ట్ర ప్రభుత్వం సిద్ధంగా ఉందని హామీ ఇచ్చారు. డేటా సెంటర్లకు విశాఖ అత్యుత్తమమని సీఎం చంద్రబాబు సింగపూర్ లోని పారిశ్రామికవేత్తలకు స్పష్టం చేశారు. విశాఖలో ఐటీ కంపెనీల స్థాపనకు అవసరమైన ఎకో సిస్టంను ఇప్పటికే ఏర్పాటు చేశామని తెలిపారు. ఏపీలో పెట్టుబడి అవకాశాలపై జరిగిన రౌండ్ టేబుల్ కాన్ఫరెన్స్ లో సీఎం చంద్రబాబు, మంత్రులు నారా లోకేశ్, టీజీ భరత్, నారాయణ, సింగపూర్‌కు చెందిన పారిశ్రామిక వేత్తలు, వివిధ సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు. డేటా సెంటర్ల ఏర్పాటుకు విశాఖ అత్యుత్తమ ప్రదేశమని సీఎం వివరించారు. అమరావతిలో దేశంలోనే తొలి క్వాంటమ్ వ్యాలీ ఏర్పాటు చేస్తున్నట్టు వెల్లడించారు. 2026 జనవరి నాటికల్లా ప్రారంభం అయ్యే క్వాంటమ్ వ్యాలీ ఎకో సిస్టమ్ లో సింగపూర్ కంపెనీల పెట్టుబడులకు అవకాశం ఉందన్నారు. సింగపూర్ కంపెనీలు క్వాంటమ్ వ్యాలీ ప్రాజెక్ట ప్రయోజనాలు పొందటంతో పాటు పరిశోధనలు చేయొచ్చని తెలిపారు. ఏపిలో పెట్టుబడులకు గల అవకాశాలను, ప్రభుత్వ పాలసీలను ఈ సందర్భంగా సీఎం వివరించారు.





సింగపూర్‌లో పారిశ్రామికవేత్త రాహుల్ కాలేతో చంద్రబాబు భేటీ

# ఆగస్టు 2న అన్నదాత సుఖీభవ-పియం కిసాన్ నిధులు జమ

### ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి విజయానంద్

**విజయవాడ,జూలై29, ప్రభాతవార్తప్రతినిధి:** అర్హులైన రైతులందరికీ ఆగస్టు 2వ తేదీన అన్నదాత సుఖీభవ పియం కిసాన్ నిధులు జమ చేసేందుకు ప్రభుత్వం ఏర్పాట్లు చేస్తోందని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్ వెల్లడించారు. ఈ అంశంపై మంగళవారం రాష్ట్ర సచివాలయంలో ఆయన సంబంధిత శాఖల అధికారులతో సమీక్షించారు.ఈసందర్భంగా సిఎస్ మాట్లాడుతూ రైతులకు ఆర్ధికంగా మరింత చేయూతను అందించే లక్ష్యంతో సూపర్ సిక్స్ కార్యక్రమంలో భాగంగా అర్హులైన ప్రతి రైతుకు ఏడాదికి 20వేల రూ.లు వంతున అన్నదాత సుఖీభవపియం కిసాన్ కింద సహాయం అందించడం జరుగుతోందని తెలిపారు.ఈపథకానికి సంబంధించి ఇంకా ఇకెవైసి మరియు ఎన్పిపిఐ మ్యాపింగ్ కానివారు వెంటనే సమీపంలోని రైతు సేవా కేంద్రాలను సంప్రదించి ఇకెవైసి మరియు మ్యాపింగ్ ప్రక్రియను పూర్తి చేయించుకోవాలని చెప్పారు. ఈపథకం అమలుకు ఇంకా మరో మూడు రోజులు వరకూ సమయం ఉన్నందున ఈరెండు అంశాలు పెండింగ్‌లో ఉన్న రైతులందరూ తప్పనిసరిగా రైతు సేవా కేంద్రాలను సంప్రదించాలని ఆయన సూచించారు. ఈపథకం వర్తించలేదని రైతుల నుండి ఫిర్యాదులు వస్తుంటాయని కావున వాటిపై రెవెన్యూశాఖ అధికారులు వెంటనే తగిన చర్యలు తీసుకోవాలని సిఎస్ ఆదేశించారు.దీనిపై గురువారం నిర్వహించే కలక్టర్ల వీడియో సమావేశంలో కూడా చర్చించడం జరుగుతుందని సిఎస్ విజయానంద్ పేర్కొన్నారు. అంతకు ముందు వ్యవసాయశాఖ సంచాలకులు ఢిల్లీ రావు పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా ఈపథకం అమలుకు సంబంధించిన వివరాలను తెలియజేస్తూ ఈపథకం కింద లబ్ది పొందాలంటే ఇకెవైసిలో నమోదు తప్పనిసరని స్పష్టం చేశారు. ఈసమావేశంలో రాష్ట్ర వ్యవసాయ, పశుసంవర్ధక,మత్స్యశాఖల ప్రత్యేక ప్రధాన కార్యదర్శి బి.రాజశేఖర్, ఆర్థిక శాఖ కార్యదర్శి వి.వినయ్ చంద్,అదనపు సిసిఎల్ఏ ప్రభాకర్ రెడ్డి,ఆర్టీజిఎస్ సిఇఒ ప్రఖర్ జైన్,యుబిఐ ఎజియం శ్రీనివాస్ పాల్గొన్నారు.అలాగే వర్చువల్ గా సిసిఎల్ఏ జయలక్ష్మి,సియం కార్యదర్శి రాజమౌళి, పలువురు బ్యాంకరులు పాల్గొన్నారు.



అన్నదాత సుఖీభవ-పియం కిసాన్ నిధులు జమపై సమీక్షిస్తున్న ఏపీ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి విజయానంద్

#### విద్యుత్ ఉత్పత్తి ప్రాజెక్టుల పనులు నిర్దిష్ట సమయానికి పూర్తి చేయాలి

రాష్ట్ర విద్యుత్ అవసరాలు పెరుగుతున్న నేపథ్యంలో, విద్యుత్ ఉత్పత్తి ప్రాజెక్టుల కార్యనిర్వహణ సామర్ధ్యం, నిర్దిష్ట సమయానికి పనులను పూర్తి చేయటం , ఆర్థిక నిర్వహణ వంటివి అత్యంత కీలకమని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె విజయానంద్ పేర్కొన్నారు. విజయవాడలోని విద్యుత్ సౌధాలో నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఏ పీ జెన్కో , ఏపీపీడీసిఎల్ ప్రాజెక్టుల పురోగతి, విద్యుత్ ఉత్పత్తి పనితీరును సిఎస్ సమీక్షించారు. ఈ సమావేశంలో ఏపీట్రాన్స్కో జెఎండీ కీర్తి చెకూరి,ఏపీజెన్కో డైరెక్టర్లు పి. అశోక్ కుమార్ రెడ్డి, శ్రీ ఎం. సుజయ కుమార్, ఏపీట్రాన్స్కో డైరెక్టర్లు ఏకేవీ భాస్కర్, శ్రీ జె.వి. రావు, ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సిఎస్ మాట్లడుతూ ఏపీజెన్కో, ఏపీపీడీసిఎల్ సంస్థలు 2025 ఆర్థిక సంవత్సరంలో థర్మల్ విద్యుత్ ఉత్పత్తిలో 10 వృద్ధిని నమోదు చేసాయని, గత ఆర్థిక సంవత్సరంలో 32,219 మిలియన్ యూనిట్ల (బీగ్) ఉత్పత్తి ఉండగా, ఈ ఆర్థిక సంవత్సరంలో అది 35,547 మిలియన్ యూనిట్లకు చేరిందని వెల్లడించారు. జల విద్యుత్ ఉత్పత్తిలో 95 వృద్ధి నమోదు కావడాన్ని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ప్రశంసించారు. ఇదే స్ఫూర్తి తో విద్యుత్ ఉత్పత్తి కొనసాగించేలా సమర్ధవంతమైన ప్రణాళిక, సమయపాలనలో విద్యుత్ ప్లాంట్ల నిర్వహణ చేయవలసిందిగా అధికారులను ఆదేశించారు. ప్రతి ఉత్పత్తి కేంద్రం తన అత్యధికంగా ఉత్పత్తి చేసిన స్థాయిని బెన్చ్‌మార్క్‌గా తీసుకుని, అలాంటి రికార్డును కొనసాగించేందుకు కోసం కృషి చేయాలని సూచించారు.

## హౌస్ హోల్డ్ మ్యాపింగ్‌తో లబ్దిదారులకు ఇబ్బందులు

**చంద్రగిరి/పాకాల, జూలై 29 ప్రభాతవార్త:** రేషన్ కార్డులో హౌస్ హోల్డ్ మ్యాపింగ్‌తో లబ్దిదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. రేషన్ కార్డుల్లో తలెత్తుతున్న సాంకేతిక లోపాలను సరిదిద్దడంలో ప్రభుత్వం మీనమేషాలు లెక్కిస్తుండటంతో రాష్ట్ర వ్యాప్తంగా నిరుపేదలు రేషన్ బియ్యం అందుకోలేక పడుతున్న ఇబ్బందులను వివరిస్తూ ప్రత్యేక కథనం. వైసిపి అధినేత వైఎస్ జగన్మోహన్ రెడ్డి పాలనలో (2019 -2024) ప్రవేశపెట్టిన సచివాలయ వ్యవస్థ అనేక మార్పులు తీసుకువచ్చినప్పటికీ నాటి సచివాలయ యంత్రాంగం, వాలంటీర్ల నిర్లక్ష్యవైఖరితో ప్రజలు నేటికీ ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. అధికారం మారినప్పటికీ కూటమి ప్రభుత్వం ఏడాది కాలంలో తమ ఇబ్బందులు ఏ మాత్రం తొలగించడం లేదని లబ్దిదారులు వాపోతున్నారు. గత వైసిపి ప్రభుత్వ పాలనలో రేషన్ కార్డుల్లో ఈకెవైసి, హౌస్ హోల్డ్ మ్యాపింగ్, సిక్స్ స్టెప్, విధానాన్ని తీసుకురావడం ద్వారా ప్రజలకు నాణ్యమైన సేవలందించతలపెట్టినప్పటికీ ఆచరణలో అనేక వైఫల్యాలను లబ్దిదారులు ఎదుర్కొంటున్నారు. వేర్వేరు ప్రాంతాలలో వుంటున్న కుటుంబ సభ్యులను ఒకే కార్డులో మ్యాపింగ్ చేయడంతో వాటిని తొల గించడం నేటికీ సాధ్యపడలేదు. గత ప్రభుత్వ పాలనలో పించన్ల కోసం, రైతు భరోసా కోసం ఇష్టారాజ్యంగా ఒకే కుటుంబంలో అనేక రేషన్ కార్డులు మంజూరు చేసుకున్నారు. ఇందుకు కొంత మంది వాలంటీర్లు తమ హవా కొనసాగించారనే ఆరోపణలు వున్నాయి.

# బిజెపిని బలోపేతం చేయడమే ధ్యేయం

### రాష్ట్ర అధ్యక్షుడు పివిఎన్ మాధవ్

**కర్నూలు విద్య, జూలై 29, ప్రభాతవార్త:** రాష్ట్రంలో బిజెపి బలోపేతమే లక్ష్యంగా అడుగులు వేస్తున్నామని బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు పివిఎన్ మాధవ్ పేర్కొన్నారు. కర్నూలు జిల్లా పర్యటనలో ఆయన పాల్గొని నగరంలోని స్టేడియం వద్ద వాకర్స్‌తో ఛాయ్ పే చర్చ నిర్వహించారు. స్థానికులు మాధవ్‌తో కలిసి టీ తాగుతూ అనేక సమస్యలు ఆయన దృష్టికి తెచ్చారు. దేశ ప్రధాని మంత్రి నరేంద్రమోడీ ఆధ్వర్యంలో దేశంలోని అన్ని సమస్యలు పరిష్కారం అవుతాయని ఆయన తెలిపారు. చిన్న సమస్యలే పెద్ద యుద్దానికి దారితీస్తాయని అదేవిధంగా చిన్నమార్పులతో పెద్ద విజయాలు సాధిస్తామని బిజెపి బలోపేతానికి చిన్న చిన్న మార్పులతో ఇలాంటి కార్యక్రమాలు చేస్తున్నా మని మాధవ్ తెలిపారు. ఈసందర్బంగా బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు పివిఎన్ మాధవ్ కార్యకర్తల సమావేశంలో మాట్లాడుతూ బిజెపి జెండా గ్రామ గ్రామాన ఎగరాలి, ప్రపంచంలో ఏవరు సాధించని ఘనత బిజెపి సాధించిందన్నారు. వాజ్‌పేయి, నరేంద్రమోడీలు సాధారణ కుటుం బాల నుంచి వచ్చి దేశ ప్రధానులయ్యారంటే బిజెపి ఘనతే. నాలాంటి వాళ్లు రాష్ట్ర అధ్యక్షులు కావడం బిజెపిలోనే సాధ్యం. 21 రాష్ట్రాల్లో భాగస్వామ్య పార్టీలతో కలిసి బిజెపి సిఎంలు ఉన్నారు. ప్రపంచమంతా నరేంద్రమోడీని ఆదర్శంగా తీసుకుంటున్నారు. వివిధ దేశాల్లో ఉన్న భారతీయ మూలాలు ఉన్న వారు సగర్వంగా బ్రతికేలా మోడీ చేశారు. ఆర్థికంగా భారత్ 11వ స్థానంలో ఉండగా మోడీ ప్రధాని అయ్యాక నాల్గవ స్థానానికి చేరింది. భారత్ మేక్ ఇన్ ఇండియాగా మారి ఎగుమతిస్థాయికి చేరింది. గత ప్రభుత్వం పంచాయితీ నిధులు దారి మళ్లించిందని కూటమి ప్రభుత్వం వచ్చాక నేరుగా పంచాయితీలకు నిధులు వస్తున్నాయి. రాయలసీమ డిక్లరేషన్ అమలుచేస్తామని, శ్రీబాగ్ ఒప్పందం ప్రకారం హైకోర్టు కర్నూలు ఏర్పాటు చేయాల్సింది. రాయలసీమపై ప్రత్యేక అలోచన చేయాలని బిజెపి కోరింది. రాయలసీమ సాగునీటిప్రాజెక్టులు, పరిశ్రమలు కూటమి ప్రభుత్వం మాత్రమే చేయగలదు. తుంగభద్ర ఎల్ఎల్‌సి నుండి లక్షా యాభై వేల ఎకరాలకు సాగునీరు అందాల్సి ఉండగా 70వేల ఎకరాలకు మాత్రమే నీరు అందుతుంది. అరాచక పాలనకు చరమగీతం పాడి కూటమిని గెలిపించారు. టెంపుల్ టూరిజం అభివృద్ధి చేస్తామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో బిజెపి ఎమ్మెల్యే పార్థ సారధి, బిజెపి జిల్లా అధ్యక్షులు రామకృష్ణలు పాల్గొన్నారు.





కర్నూలు జిల్లా కార్యకర్తల సమావేశంలో మాట్లాడుతున్న పివిఎన్ మాధవ్

# కోనసీమలో కొబ్బరి ఉత్పత్తి సంస్థలు నెలకొల్పండి..పార్లమెంట్ లో కోరిన ఎంపీ హరీష్ బాలయోగి



**ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా బ్యూరో , జులై 29 , ( ప్రభాతవార్త ) :**

డాక్టర్ బీ ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లాలో జీవనోపాధిగా సాగుతున్న కొబ్బరి పంటల ఉత్పత్తుల ద్వారా రైతులకు మేలు చేసేందుకు జిల్లాలో కొబ్బరి ఉత్పత్తి సంస్థలు నెలకొల్పాలని అమలాపురం పార్లమెంట్ సభ్యులు గంటి హరీష్ బాలయోగి కోరారు.నియమం 377 ప్రకారం పార్లమెంట్ లో సభాపతిని కోరినట్లు ఆయన తెలిపారు.ఆంధ్రప్రదేశ్ లో అనేక జిల్లాల్లో ముఖ్యంగా కోనసీమలో కొబ్బరి సాగు గ్రామీణ ప్రజలకు జీవనోపాధికి వెన్నెముక లాంటిదనారు.ఆంధ్ర రాష్ట్రంలో మొత్తం కొబ్బరి ఉత్పత్తిలో దాదాపు సగం వాటా కోనసీమదేనని చెప్పవచ్చన్నారు.అనేక జిల్లాల్లో గణనీయ స్థాయిలో ఉత్పత్తి ఉన్నప్పటికీ రైతులు తమ ఉత్పత్తులను పూర్తి విలువను పొందడానికి స్థానికంగా అవసరమైన మద్దతు లేదన్నారు.కొబ్బరి అభివృద్ధి బోర్డు ఆధ్వర్యంలో ఏర్పాటైన కొబ్బరి ఉత్పత్తిదారుల సంఘాలు, సమాఖ్యలు, మరియు కంపెనీలు,సామూహిక మార్కెటింగ్,వ్యయ సామర్థ్యం, ఉత్పత్తి విలువను ప్రోత్సహించడానికి చర్యలు తీసుకోవాలని కోరారు.గత అయిదు సంవత్సరాలలో కేవలం సీపీఎస్ లు మాత్రమే నమోదు చేయబడ్డాయని ప్రస్తుతం వాటిలో ఒక్కటి కూడా పనిచేయడం లేదన్నారు.2019 నుండి ఒక్క సీపీఎఫ్,సీపీసీ కూడా ఏర్పాటు చేయలేదని చెప్పారు.అందుచేత కొబ్బరి రైతులు పూర్తి స్థాయిలో ఆదాయం పొందలేక పోతున్నారని అన్నారు.ఆంధ్రప్రదేశ్ లోని కొబ్బరిచెట్ల పైనే ఆధారపడి జీవనం సాగిస్తున్న వేల మంది డాక్టర్ బీ ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లాలో కొబ్బరి అభివృద్ధి బోర్డు సంస్థలను ఏర్పాటు చేసి విధంగా చర్యలు తీసుకుంటే కొబ్బరి రైతుల ఆదాయం పెంచడంతో పాటుగా ఉపాధి, ఉద్యోగ అవకాశాలు కల్పించేందుకు వీలుంటుందని సభాపతిని ఎంపీ హరీష్ బాలయోగి కోరారు.

## ప్రధానమంత్రి జీవనజ్యోతి బీమా యోజన ద్వారా రూ 2 లక్షలు చెక్కు పంపిణీ : ఎస్‌బిఐ,డిప్యూటీ మేనేజర్ కె.శ్రీనివాసరావు

**ఆత్రేయపురం , జులై 29 , ( ప్రభాతవార్త ) :**

మండల కేంద్రమైన ఆత్రేయపురంలో గల స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా బ్రాంచ్ ఖాతాదారులకు ఎనలేని సేవలు అందిస్తోందని ఎస్ బి ఐ,డిప్యూటీ మేనేజర్ కె. శ్రీనివాసరావు అన్నారు.ఇటీవల కాలంలో పలువురు లబ్ధిదారులకు ప్రధానమంత్రి జీవన్ జ్యోతి బీమా యోజన పథకంలో పేద కుటుంబాలకు ఆర్థికంగా నిలదొక్కుకోవడానికి విశేషంగా సహాయం అందించింది. కుటుంబ యజమానిని కోల్పోయిన కుటుంబానికి ఆర్థిక చేయూత నందించి ఆదుకు కుంటోంది. కాగా మంగళవారం కత్తుల మౌనిక కు ఆత్రేయపురం స్టేట్ బ్యాంకు డిప్యూటీ మేనేజర్ కే. శ్రీనివాసరావు 2 లక్షల రూపాయల చెక్కును అందజేశారు.బ్యాంకు ఖాతాదారుడు కత్తుల రాజశేఖర్ మద్రాసులో మృతి చెందగా నామిని భార్యకు ఈ చెక్కును అంద జేశారు. సుమారు 6 దశాబ్దాలుగా ఈ బ్యాంకు ద్వారా పూతరేకులు, పచ్చళ్ళు, కుటీర పరిశ్రమలు, చిన్న వ్యాపారులకు, రైతులకు బహుముఖ సేవలు అందిస్తోంది. ఈ ప్రాంతంలో స్టేట్ బ్యాంక్ అందిస్తున్న సేవలు ప్రజల మన్ననలు పొందాయి, ఖాతాదారులకు ఆర్థిక



సహకారంతోపాటు అనేక రకాల ఇతర సేవలు అందిస్తూ ప్రశంసలు అందు కుంటోంది. ఈ బ్యాంకు సిబ్బంది ఎక్కడో మృతి చెందిన ఖాతాదారుకు సంబంధించి అత్యంత త్వరగా సాంకేతిక పనులను పూర్తి చేసి కేవలం 7 రోజులలో బాధితురాలికి ఈ చెక్కు అందించడం విశేషం.

ఈ బ్యాంకులో ఖాతా దారులకు ఇటువంటి సౌలభ్యం ఉండటం పట్ల ఈ ప్రాంత ప్రజలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ఈ కార్యక్రమాల్లో బ్యాంక్ మేనేజర్ ప్రవీణ్ కుమార్, డిప్యూటీ మేనేజర్ కే శ్రీనివాసరావు, అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## పంట బీమా పథకంతో రైతులకు మేలు మండల వ్యవసాయ అధికారి గాంధీ



**శంకవరం , జులై 29 , ( ప్రభాతవార్త ) :**

పంట బీమా పథకంతో రైతులకు మేలు చేకూరుతుందని మండల వ్యవసాయ అధికారి పి గాంధీ రైతులకు సూచించారు.అన్నవరం,మండపం గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమ%శీ%లో భాగంగా రైతులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. వరి సాగు చేస్తున్న బ్యాంకులో రుణం లేని రైతులు పంట బీమా పథకంలో భాగంగా ఎకరాకు 760 రూపాయలు చెల్లించి తమ పేర్లు నమోదు చేసుకోవాలని వివరించారు.పంట నమోదు,వరి సాగులో పొటాష్ ఎరువు ప్రాధాన్యత, పొలం గట్లపై కంది సాగు,నానో యూరియా,నానో డి ఏ పి,ప్రకృతి వ్యవసాయ పద్ధతులు,80 శాతం రాయితీపై డ్రోన్లు,ఉద్యాన పంటల యాజమాన్యం వంటి అంశాలపై రైతులకు సూచనలు ఇచ్చారు.అనంతరం వరి నారుమడులు,ప్రత్తి పంటను రైతులతో పరిశీలించి సూచనలు ఇచ్చారు.రైతులకు రాయితీపై రాగి విత్తనాలు అందజేసి సాగులో తీసుకోవాల్సిన జాగ్రత్తలు గూర్చి వివరించారు. వి ఆర్ ఓ,సెక్రటరీ,ఎం. పి టీ సి,ఉద్యాన సహాయకుడు సురేష్,రైతులు,మహిళలు పాల్గొన్నారు.

## విద్యార్థులకు శుద్ధమైన తాగునీరు అందేలా చర్యలు : ఎమ్మెల్యే గిడ్డి

**అంబాజీపేట , జులై 29 , ( ప్రభాతవార్త ) :**

గ్రామ ప్రజల అభిప్రాయం మేరకే రహదారుల నిర్మాణం చేవడతామని పి.గన్నవరం ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ చెప్పారు. ఇసుకపూడిలో నాబార్డు నిధులు రూ.1.25 కోట్ల వ్యయంతో నిర్మించనున్న రహదారికి ఈనెల 25న ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ భూమి పూజ చేశారు. తమ గ్రామంలో నిర్మించనున్న రోడ్ల అవసరాన్ని వివరించి గ్రామాన్ని సందర్శించాలని ఇసుకపూడి వాసులు ఎమ్మెల్యేను కోరారు. దాంతో ఎమ్మెల్యే మంగళవారం ఇసుకపూడిలో పర్యటించి గ్రామస్తులతో మాట్లాడారు. గ్రామస్తుల అవసరాలకు అనుగుణంగా ఉండేలా అందరి ఆమోదయోగ్యంతో రహదారులు నిర్మిస్తామని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను సందర్శించారు. డొక్కా సీతమ్మ మధ్యాహ్నం



భోజనం పథకం పై విద్యార్థులను అడిగి తెలుసు కున్నారు. వారితో కలిసి సహపంక్తి భోజనం చేశారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఎ.ఎల్. వరప్రసాద్ పాఠశాలలో ఎదు ర్కొంటున్న తాగునీటి సమస్యను ఎమ్మెల్యే దృష్టికి తీసుకు వచ్చారు. విద్యార్థులకు శుద్ధమైన తాగునీరు అందించేలా చర్యలు తీసుకుంటానని ఎమ్మెల్యే ఉపాధ్యాయులతో పాటు పాఠశాల యాజమాన్యంకు హామీ ఇచ్చారు. ఈ కార్య క్రమంలో సర్పంచ్ తరపట్ల మోహన్ సింగ్ బాబురావు, ఎంపీటీసీ సభ్యుడు ముత్తాబత్తుల ప్రశాంత్, ఎస్ఎంసి చైర్మన్ పళ్ళ స్వామినాయుడు,మైపాల తాతాజీ, రవణం రాము,పళ్ళ శ్రీనివాసరావు (కాంట్రాక్టర్), యనమదల సాయిబాబా, పళ్ళ శ్రీనివాసరావు, పళ్ళ రామమూర్తి తదితరులు పాల్గొన్నారు.

## పేకాట ఆడుతున్న వారిపై పోలీసులు దాడులు. రూ.10760 లు నగదు స్వాధీనం




**ప్రత్తిపాడు , జులై 29 , ( ప్రభాతవార్త ) :**

మండలంలో పేకాట ఆడుతున్నవారిపై ప్రత్తిపాడు ఎస్సై లక్ష్మీకాంతం, దాడులు నిర్వహించారు.పోలీసులకు రాబడిన ముందస్తు సమాచారం మేరకు ప్రతిపాడు మండలం వొమ్మంగి శివారు పేకాట ఆడుతున్న వారిపై ఎస్సై లక్ష్మి కాంతం తన సిబ్బందితో దాడి చేశారు. ముగ్గురిని అదుపులోకి తీసుకుని వారి వద్ద నుండి రూ 10760 రూపాయల నగదు స్వాధీనం చేసుకున్నారు. ప్రత్తిపాడు పోలీస్ స్టేషన్ పరిధిలో పేకాట గుండాట కోడిపందాలు వంటి, జ్యూదాలకు, అసాంఘిక కార్య కలాపాలకు ఎవరు పాల్పడిన, ఉపేక్షించేది లేదని వారిపై చట్టపరమైన కఠిన చర్యలు చేపట్టడం జరుగుతుందని ఎస్సై లక్ష్మికాంతం తెలిపారు.

## సీఎం రిలీఫ్ ఫండ్ చెక్ పంపిణీ చేసిన మంత్రి సుభాష్

**కె.గంగవరం , జులై 29 , ( ప్రభాతవార్త ) :**

గంగవరం గ్రామానికి చెందిన గుబ్బల శ్రీనివాస్ గత కొన్ని సంవత్సరాలుగా కిడ్నీ సంబంధిత వ్యాధితో బాధపడుతున్నారు. నిరుపేద కుటుంబమైన శ్రీనివాస్ కు వైద్య ఖర్చుల నిమిత్తం మంత్రి వాసంశెట్టి సుభాష్ చేతుల మీదుగా ముఖ్యమంత్రి సహాయ నిధి నుండి రూ 1,13,793లు చెక్కును అందించారు.ఇందుకు సహకరించిన మంత్రి వాసంశెట్టి సుభాష్ ,పిఎసిఎస్ చైర్మన్ నేమాని సత్యనారాయణ కు కృతజ్ఞతలు తెలిపారు.ఈ కార్య



క్రమంలో జనసేన మండల అధ్యక్షుడు చిర్రా రాజకుమార్, సిహెచ్ రాజేష్, వెంకట రమణ ,తాడాలరాంబాబు, కూటమి నాయకులు నాయకులు పాల్గొన్నారు.

## పిఠాపురంలో తుక్కుపోగుల స్థలం 61 సెంట్లు ఆక్రమణ..అడ్డు చెప్పని మున్సిపల్ అధికారులు

**పిఠాపురం , జులై 29 , ( ప్రభాతవార్త ) :**

పిఠాపురంలో 1927 నాటి సమయంలో పంచాయతీ అధికారులు శుభ్రం చేసే పనులలో భాగంగా ప్రజల ఇండ్ల నుండి వీధులలో పారిశుద్ధ్య కార్మికుల ద్వారా సేకరించిన చెత్తాచెదారాలను బండ్లపై వేసుకుని తుక్కు పోగుల స్థలాల్లో వేసేవారు. ఆ క్రమంలో పిఠాపురం పంచాయతీ 1957 మున్సిపాలిటీగా ఏర్పడిన తర్వాత వాటిని కొనసాగించేవారు. చెత్తాచెదారం వేయడానికి ప్రాంతాలవారీగా విభజన చేసి అప్పట్లో మూడు ప్రధాన ప్రాంతాలలో వేయడానికి స్థలాలను కేటాయించారు. వాటిలో భాగంగా స్థానిక అగ్రహారం పశువుల సంత దగ్గర ఒకటి, ప్రస్తుతం వెంకట కుమార ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల వెనుక మున్సిపాలిటీ ట్రాక్టర్లు నిలుపు స్థలము మరొకటి, కాకినాడ వెళ్లే మార్గంలో సా మిల్లులు ఎదురుగా త్రికోణముఖంలో ఇంకొక స్థలాన్ని అనువైన ప్రాంతాలుగా గుర్తించారు. అయితే ఈ స్థలాలలో పారిశుధ్య నిర్వహణ చేసి ప్రాంతాల వారిగా సేకరించిన చెత్తాచెదారాలను అధికంగా ఈ ప్రదేశాలలో వేసేవారు. కాకినాడ రోడ్డులో గల తుక్కుపోగుల స్థలంలో అప్పటి కమిషనర్ మాగాపు రామ్మోహన్ రావు పర్యవేక్షణలో వర్మీ కంపోస్ట్ యార్డ్ నిర్మించారు. 1957 పిఠాపురం మున్సిపాలిటీ ఏర్పాటు తర్వాత నుండి తుక్కు పోగులు వేసే స్థలముగా గుర్తింపు పొందిన కాకినాడ రోడ్డు సా మిల్లులు ఎదురుగా ఉన్న స్థలం గురించి ఇప్పుడు అత్యంత చర్చనీయాంశంగా మారింది. సర్వే నంబర్ 1031లో అక్షరాల 61 సెంట్లు భూమిని తుక్కు పోగుల స్థలం మున్సిపాలిటీకి చెందిన ప్రభుత్వ భూమిగా ఆన్



లైన్ లో రికార్డులలో నేటికీ తెలుపుతుంది. ఇక అసలు విషయానికి వస్తే అక్షరాల 61 సెంట్లు భూమి తుక్కు పోగులు వేసే స్థలము మున్సిపాలిటీకి దఖలు పడిన ప్రభుత్వ స్థలం. రూ. కోట్ల విలువ చేసే ప్రజల ఆస్తి నేడు పరుల పాలవుతుంది. కావాలనే కొంతమంది అక్రమార్క పెద్దలు ఆక్రమించుకుని ఎటువంటి ఆధారాలు లేకుండా క్రయ, విక్రయాలు జరగని ప్రభుత్వ స్థలంలో వ్యాపార సముదాయాలుగా చేసుకున్నారు. పెద్దలమని చెప్పుకుంటున్న వారు రాజకీయాలను అడ్డుపెట్టుకుని నెలవారి అద్దెలను, మామూళ్లను తీసుకుంటూ అజమాయిషి చేస్తున్నారు. వాస్తవానికి ఈ స్థలం మున్సిపాలిటీది అయినప్పటికీ చుట్టుపక్కల రైతులకు ఈ స్థలం నుంచి వెళ్లే మార్గం లేదని, సరిహద్దుదారునికి మాత్రమే నడిచి వెళ్ళడానికి అవకాశం ఉన్నట్లు తెలుస్తుంది. కాగా అంతంతమాత్రంగా ఉన్న భూముల విలువలు ఒక్కసారిగా పెరుగుతుండడంతో తుక్కు స్థలమైనా ,చెత్తకుప్పలైనా ఆక్రమించుకోవడానికి అడ్డు ఆపు లేకుండా అడ్డదారులు తొక్కుతున్నారు అక్రమార్కులు. పూర్తిగా మున్సిపాలిటీకి సంబంధించిన ఈ స్థలం ప్రస్తుతం ప్రభుత్వ విలువ ప్రకారం సుమారు రూ 10 కోట్లు విలువ చేస్తుందని మేధావి వర్గం వారు చెబుతున్నారు. ప్రభుత్వ స్థలాలు కబ్జాకు గురై అన్యాక్రాంతం అవుతుంటే కన్నెత్తి చూడకుండా కన్నేసిన వారికి కాపు కాస్తు వదిలేయడం ఎంతవరకు సమంజసమని ప్రజలు ముక్కున వేలేసుకుంటున్నారు. రాష్ట్ర ఉపముఖ్యమంత్రి కొణిదెల పవన్ కళ్యాణ్ నియోజకవర్గంగా పేరొందిన ఈ పిఠాపురం మున్సిపాలిటీ ఆస్తుల రక్షణకు ఉన్నతాధి కారులు చొరవ చూపి ఆక్రమణలపై విచారణ చేసి మున్సిపాలిటీ స్థలానికి సరిహద్దులను నిర్ణయించాలని భవిష్యత్తు కార్యక్రమాలకు అను గుణంగా గల ఈ ప్రాంతాన్ని స్వాధీనం చేసుకుని ప్రజల ఆస్తిని ప్రభుత్వ స్థలాన్ని కాపాడాలని పిఠాపురానికి చెందిన మాజీ కౌన్సిలర్లు సీనియర్ సిటిజనులు కోరుతున్నారు. రూ. కోట్లు విలువ గల స్థలాన్ని కొట్టేస్తున్న మున్సిపల్ అధికారులు కన్నెత్తి చూడకూడదు... కళ్ళకు కనిపించదు అన్నట్లు ఎలా కూర్చున్నారని పట్టణవాసులకు ఒకింత ఆశ్చర్యానికి గురిచేస్తుంది. ఇదే అంశంపై ప్రభాతవార్తకు సమాచారం అందడంతో విషయ సేకరణ చేసి ప్రజల ఆస్తి అన్యాక్రాంతం కాకుండా కాపాడే ప్రయత్నంలో భాగంగా ప్రభుత్వ భూమి వివరాలు ప్రజల ముందు ఉంచే ప్రయత్నం చేస్తుంది. కాపాడాల్సిన అధికారులు పరిరక్షించాల్సిన పాలకులు ఏం చేస్తారనేది వేచి చూడాల్సింది. వాస్తవానికి సర్వేనెంబర్ 1031 లో 61 సెంట్లు ప్రభుత్వ భూమా.. పరుల భూమా.. అనే దానిపై పిఠాపురం మున్సిపల్ కమిషనర్ నామ కనకారావును ప్రభాతవార్త వివరణ కోరగా కమిషనర్ మాట్లాడుతూ కచ్చితంగా మున్సిపాలిటీ స్థలమేనని ఆక్రమణలు ఉంటే తొలగిస్తామన్నారు. ప్రజా ఉపయోగార్థం ప్రభుత్వ స్థలాలను కాపాడాల్సిన బాధ్యత అందరికీ ఉందన్నారు. అప్పట్లో ఇదే స్థలములో వేల రూపాయలు ఖర్చు చేసి కంపోస్ట్ యార్డ్ ని కూడా కట్టడం జరిగిందన్నారు. ఇదే విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తెలియజేసి తదుపరి కార్యాచరణకు ప్రణాళికలు వేయడం జరుగుతుందన్నారు.


## ఘనంగా కత్తి పద్మారావు పుట్టినరోజు వేడుకలు



**మామిడికుదురు,జులై 29 , ( ప్రభాతవార్త ) :**

విప్లవకవి,రచయిత,పోరాట యోధుడు కత్తి పద్మారావు 72వ.పుట్టినరోజు వేడుకలను మామిడికుదురులో మంగళవారం ఘనంగా జరుపుకున్నారు.ఈ సందర్భంగా స్థానిక ఎస్సీ నాయకుడు భూపతి వెంకటపతి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో కేక్ ను కట్ చేసి అభిమానులకు పంచారు.ఈ కార్యక్రమంలో నల్లి శ్రీనివాస్,కలిగితి పల్లంరాజు,బొంతు మణిరాజ్,మట్టా సత్తిబాబు,పిల్లి శ్రీనివాస్, బత్తుల జనార్ధనరావు, విప్పర్తి లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా కత్తి పద్మారావు పుట్టినరోజు వేడుకలు



**జగ్గంపేట , జులై 29 , ( ప్రభాతవార్త ) :**

స్థానిక సముద్ర ఫ్లెక్సీ ప్రింటింగ్ కార్యాలయం వద్ద సముద్ర ఫ్లెక్స్ అధినేత గణేష్ ఆర్థిక సాయంతో పేద కుటుంబానికి నిత్యవసర వస్తువులు సమకూర్చగా ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా భారతీయ ధర్మ పరిషత్ రాష్ట్ర కార్యనిర్వాహక అధ్యక్షులు, తెలుగుదేశం పార్టీ యువ నాయకులు పాలచర్ల నాగేంద్ర చౌదరి ముఖ్య అతిథిగా హాజరై శ్రీను కుటుంబానికి నిత్యవసర వస్తువులు అందజేశారు. ఈ సందర్భంగా గణేష్ మాట్లా డుతూ ఆధ్యాత్మిక కార్యక్రమాలతో పాటు, మానవసేవే మాధవ సేవగా భావించి అనేక సేవా కార్యక్రమాలు కూడా నిర్వహిస్తున్న యువ నాయ కులు, ఆధ్యాత్మిక సేవకులు పాలచర్ల నాగేంద్ర చౌదరిని స్ఫూర్తిగా తీసుకుని ఈరోజు చిరు ప్రయత్నం గా ఈ పేద కుటుంబానికి అన్ని రకాల నిత్యవ సరస్తులు నాగేంద్ర చౌదరి చేతుల మీదుగా అందజేయడం జరిగిందని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో సుంకర సతీష్, సీనియర్ రిపోర్టర్ రాజు, సముద్ర ఫ్లెక్స్ ప్రింటింగ్ స్టాఫ్, గణేష్ ట్రెండ్ సర్కిల్ తదితరులు పాల్గొన్నారు.

## నాకు, నా పంటకు రక్షణ కల్పించండి

### బాధిత రైతు సత్తి వినోద్ కుమార్‌రెడ్డి రిలే నిరాహారదీక్ష

**ప్రత్తిపాడు , జులై 29 , ( ప్రభాతవార్త ) :**

మండలంలో ఇ.గోకవరంలో తన సాగు చేస్తున్న వ్యవసాయానికి తనకు రక్షణ కల్పించాలని డిమాండ్ చేస్తూ బాధిత రైతు సత్తి వినోద్ కుమార్ రెడ్డి తన పొలంలో మంగళవారం రిలే నిరాహారదీక్ష చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మీడియా తో మాట్లాడుతూ మండలంలోని ఇ.గోకవరంలో 2016లో కుచుమంచి ఉమామహేశ్వరరావు వద్ద 10 ఎకరాల పొలాన్ని కొనుగోలు చేసి ప్రత్తిపాడు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో రిజిస్ట్రీ చేసుకున్నట్లు తెలిపారు. తన భూమికి సంబంధించి క్రయదస్తావేజు, 1బీ, అడంగల్, హైకోర్టు ఆర్డర్లు ఉన్నాయన్నారు. అయినప్పటికీ నా భూమికి తనకు ఎటువంటి సంబంధం లేనప్పటికీ చింతాకుల భాస్కరరావు, కుమారుడు చింతాకుల ధర్మాజీ లు నిత్యం తను సాగు చేసే పంటలను ధ్వంసం చేస్తూ తనకు



భారీ నష్టాన్ని చేకుర్చుతున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. పోలీసు ఎయిడ్ కల్పించమని గౌరవ హైకోర్టు ఆదేశించిన ప్రత్తిపాడు పోలీసులు పట్టించుకోకపోవడం వల్లే నా పంటలను ధ్వంసం చేస్తూ,తనను హత మార్చేందుకు దాడులకు తెగిస్తు న్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికి తన పంటను పలుమార్లు ధ్వంసం చేశారని తెలి యజేశారు. దాడి చేసిన ప్రతిసారీ ప్రత్తిపాడు పోలీస్ స్టేషన్లో కేసు నమోదు చేస్తున్నారే తప్ప పంటను ధ్వంసం చేసిన వారిపై చర్యలు తీసుకోవడంలేదని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇప్పటికైన ఎస్సై తన తీరు మార్చుకని తన ప్రాణాలకు రక్షణ కల్పించి, తన పంటను మరో సారి ధ్వంసం చెయ్యకుండా చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు.

## ప్రకృతి వ్యవసాయం వైపు రైతులు మొగ్గు చూపాలి : ఏడిఏ నాగ కుమార్



**కె.గంగవరం , జులై 29 , ( ప్రభాతవార్త ) :**

మండలంలోని బాలాంత్రం,పేకేరు గ్రామాల్లో మంగళవారం పొలం పిలుస్తుంది కార్యక్రమాన్ని మండల వ్యవసాయ అధికారి ఏ సద్గురు మూర్తి నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా రామచంద్రపురం వ్యవసాయ సహాయ సంచాలకులు బి. నాగ కుమార్ హాజరై రైతులు ప్రకృతి వ్యవసాయం వైపు మొగ్గు చూపాలని తద్వారా భవిష్యత్ తరాలకు ఆరోగ్యకరమైన జీవితాన్ని, ఆహారాన్ని అందించవచ్చని పేర్కొన్నారు. ఏవో సద్గురుమూర్తి మాట్లాడుతూ ఖరీఫ్ -2025 ఈ పంట నమోదు ప్రారంభమైందని ప్రతి ఒక్క రైతు సంబంధిత రైతు సేవా కేంద్రాల్లో నమోదు చేసుకోవాలని అలాగే ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజన కింద ఇన్సూరెన్స్ ఎకరానికి వరి పంటకు గాను 76 రూపాయలు నామమాత్రపు ప్రీమియంతో మీసేవలో రిజిస్ట్రేషన్ చేసుకుని ప్రకృతి వైపరీత్యాల నుంచి పంటను సంరక్షించుకోవాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమాల్లో పేకేరు,బాలాంత్రం కూటమి నాయకులు చల్లగాల్ల నాగేశ్వరరావు, మల్లిపూడి బుజ్జి , కోలేటి కృష్ణమూర్తి, సర్పంచ్ చాగంటి సాంబశివరావు, వి ఏ లు సత్యనారాయణ,సాయిశ్రీ రైతులు పాల్గొన్నారు.

## ప్రాథమిక పాఠశాలల విద్యార్థులకు విద్యా సామగ్రి పంపిణీ

**అంబాజీపేట , జులై 29 , ( ప్రభాతవార్త ) :**

ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయుడుగా పని చేసి ఉద్యోగ విరమణ పొందిన ఆ ఉపాధ్యాయుడు విద్యార్థులకు రూ.50 వేలు విలువ చేసే విద్యా సామాగ్రిని తన స్వచ్ఛంద సంస్థ ద్వారా మంగళవారం పంపిణీ చేసారు. మండలంలోని పుల్లేటికుర్రుకు చెందిన కత్తుల ఆనందరావు ప్రాథమిక పాఠశాల ప్రధానో పాధ్యాయుడుగా పనిచేసి విజయానంద స్వచ్ఛంద సంస్థ ను ఏర్పాటు చేశారు.ఆ సంస్థ ద్వారా పుల్లేటికుర్రు పంచాయతీ పరిధిలోని నెహ్రూ నగర్, పుల్లేటికుర్రు మెయిన్, చీకట్లవారిపేట, వ్యాఘ్రేశ్వరం, కొల్లి వారిపేట ,కదలివారిపాలెం పాఠశాలలకు చెందిన 143 మంది విద్యార్థులకు వ్రాత పుస్తకాలు, పల



కలు,పరీక్ష అట్టలుఅందచేశారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ జిల్లా డిసిఇబి సెక్రెటరీ అసిస్టెంట్ కమిషనర్ బీర హనుమంతరావు,ఎం.ఈ.ఓ లు, కె.వెంకటేశ్వరరావు,ఎం. ప్రకాష్,ఆయా పాఠ శాలల హెచ్.ఎం.లు గుబ్బల శ్రీనివాసరావు, డి.వి. నారా యణ, పుల్లేటికుర్రు క్లస్టర్ జాయింట్ సెక్రెటరీ కె.వి.ఎస్ కుమార్, ఎస్ఎంసి.చైర్మన్ఎస్.వీరవేణి,ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# కోనసీమ తిరుమల పై దుష్ప్రచారం తగదు : పాలూరి సత్యానందం



**ఆత్రేయపురం , జులై 29 , ( ప్రభాతవార్త ) :**

వాడపల్లి వేంకటేశ్వరస్వామి ఆలయానికి దేశవిదేశాలనుండి,ఇతర రాష్ట్రాలనుండి లక్షలాదిమంది భక్తులు వచ్చి వారి కోరికలు తీర్చేస్వామి స్వామిదర్శనం చేసుకొని తరిస్తున్నారని ఇంతటి ప్రఖ్యాతిపొందిన ఆలయం పై దుష్ప్రచారం తగదని రాష్ట్ర బీజేపీ కార్యవర్గ సభ్యులు పాలూరి సత్యానందం అన్నారు. కూటమి ప్రభుత్వం వచ్చాక కొత్తపేట శాసనసభ్యులు బండారు సత్యానందరావు భక్తులు లక్షల్లో రావడంతో భక్తులకు ఏవిధమైన అసౌకర్యాలు కలగకుండా నిత్యాన్నదానం, నిత్యం ఆలయంపై దృష్టి పెట్టి వివిధరకాల అభివృద్ధికి సహకరిస్తున్నారు. పవిత్రపుణ్యక్షేత్రమైన వాడపల్లి ఆలయంపై కొంతమంది నాయకులు రాజకీయాలుచేస్తు నకిలీలు దుష్ప్రచార వార్తలు సామాజికమాధ్యమాల్లో పెడుతున్న విషయం అందరికీ తెలిసిందే. అయితే కాలం ఎవ్వర్నివదలదు, భగవంతునిపై అవాకులు చవాకులు పేలుతున్నవార్ని శక్తివంతమైన వెంకన్నవదలదని పాలూరి హెచ్చరించారు. ఇంత విశిష్ట మైన దేవాలయం మన కోనసీమ లో ఉండటం ప్రతీ హిందువు ఆనందించవలసిన విషయం అని సత్యానందం అన్నారు. ఆలయ విశిష్టత, అభివృద్ధి ఓర్వలేక హిందూ వ్యతిరేకులు దుష్ప్రచారం లో ముందు ఉంటున్నారు అని వారికి ఆ అవకాశం ఇవ్వకూడదు అని సత్యానందం అన్నారు.

# మూల భావనారాయణుడికి 10 కిలోల రజిత మకర తోరణం విరాళం



**కాకినాడ రూరల్ , జులై 29 , ( ప్రభాతవార్త ) :**

సర్పవరం క్షేత్రంలో కొలువుతీరిన శ్రీ రాజ్యలక్ష్మి సమేత శ్రీ భావనారాయణ స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు అందుకుంటున్న శ్రీ మూల భావనారాయణుడికి సుమారు 12 లక్షలు విలువ చేసే పది కిలోల వెండి మకర తోరణాన్ని విశాఖపట్నం కు చెందిన సాతులూరి గోపాలకృష్ణమాచార్యులు ఆలయ కార్యనిర్వాహణాధికారి తలాటం వెంకట సూర్యనారాయణకు అందజేశారు. ఆలయ అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించి వెండి మకర తోరణాన్ని స్వామివారికి అలంకరించారు. అనంతరం వేద ఆశీర్వచనం చేసి స్వామి వారి చిత్రపటాన్ని, ప్రసాదాన్ని దాతలకు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఉత్సవ కమిటీ చైర్మన్ పుల్ల శ్రీరాములు, మామిడాల శ్రీనివాసరావు, ఆలయ సిబ్బంది, అర్చకులు పాల్గొన్నారు.

# అవాస్తవాలు మాట్లాడడం చిర్ల' కు తగదు : కూటమి నాయకులు

**ఆత్రేయపురం , జులై 29 , ( ప్రభాతవార్త ) :**



ఇసుకలో అయినా మద్యం షాపులో అయినా తాడేపల్లి ప్యాలెస్ కి స్వయంగా పట్టుకెళ్లిన వాస్త వాలు ఆంధ్ర రాష్ట్ర ప్రజలందరికీ తెలుసు, వారికి వ్యతిరేకంగా నడు చుకునే వారికి తాడేపల్లి ప్యాలెస్ లో ఏ విధంగా కోటింగ్ జరిగిందో మాకు తెలుసునని కూటమి నాయ కులు విమర్శించారు. వైఎస్ఆర్ జిల్లా పార్టీ అధ్యక్షులు మాజీ శాసన సభ్యులు చిర్ల జగ్గిరెడ్డి, సోమ వారం,ఆత్రేయపురం మండలంలో, పర్యటిస్తూ వాస్త వాలు మాట్లాడ కుండా అవాస్తవాలు మాట్లాడు తున్నారని మంగళవారం ఆత్రే యపురం టిడిపి మండల మాజీ అధ్యక్షులు ముదునూరి వెంకట రాజు ఇంటి వద్ద ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో కూటమి నాయకులు పేర్కొన్నారు. ఈ సందర్భంగా మండల టిడిపి అధ్యక్షులు కునపురెడ్డి రామకృష్ణం రాజు, ముదునూరి వెంకటరాజు, ప్రాజెక్ట్ కమిటీ వైస్ చైర్మన్ కరుటూరి నరసింహారావు , మాట్లాడుతూ వాస్తవానికి అవస్త వారికి తేడా ఉందని 30 సంవత్స రాల అనుభవం ఉన్న మాజీ శాసన సభ్యులు గోపాలపురంలో ఇసుక పై విజిలెన్స్ ఎన్ఫోర్స్మెంట్ అధికారులు రైడ్ చేయడం ఎంత అవినీతి జరిగిందో వివరించడం మాకు తెలుసు. దెయ్యాలు వేదాలు వల్లించినట్లు మీరు మాట్లాడే తీరు ఉంది. కూటమి ప్రభుత్వం వచ్చి సంవత్సరం కాలంలో సూపర్ సిక్స్ పథకాలన్నీ ఒకదాని తర్వాత ఒకటి అమలు కావడంతో పెన్షన్ పథకం, తల్లికి వందనం పథకాలు ఎంతమంది పిల్లలు ఉంటే అంతమందికి పిల్లలకు అమలు జరగడంతో ప్రతిపక్షాలు ఓర్వలేక ఆవాస్తవాలు పలుకుతున్నారని,అన్నారు. బండారు సత్యానందరావు నాయకత్వంలో కొత్తపేట నియోజకవర్గం అభివృద్ధి పరుగులు పెడుతుందని అన్నారు. 30 సంవత్సరాలుగా ఎన్నడు జరిగిన సైఫాన్ పనులను బండారు సత్యానందరావు, హయంలో జరిగాయన్నారు. ముర్రుగు డ్రైనేజీ వ్యవస్థను మెరుగుపరచడానికి పిలిచేల 14 లక్షల వ్యయంతో గ్రాండ్ తీసుకొచ్చి త్వరలో ప్రారంభిస్తామని మువ్వ అనేది లేకుండా రైతులకు మేలు చేసే కార్యక్రమం కొంతమంది రాజకీయ పబ్బం గడుపుకోవడం తప్ప వేరే పని ఏమీ లేదని అన్నారు. దేవాలయం మీద ఇష్టమొచ్చి విమర్శలు చేయడం తప్పుడు సంస్కృతికి నిదర్శనమన్నారు. ఈ కార్యక్రమంలో మండల టిడిపి అధ్యక్షులు కునపురెడ్డి రామకృష్ణంరాజు,ముదునూరి వెంకటరాజు,కరుటూరి నరసింహారావు వెచ్చా అనిల్, ముదునూరి సనేంద్ర వర్మ,తోట వెంకట రమణ గుడెల నాగేంద్ర గౌడ, నాగిరెడ్డి సత్యనారాయణ,కాళిలేటి వెంకట్రావు, దొడడ నేని త్రినాద్ రావు, కూటమి నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# పాట్లు పడుతున్న ప్రజలు..పక్కనపడిన ట్రాక్టర్లు!?



**రాజమహేంద్రవరం , జులై 29 , ( ప్రభాతవార్త ) :**

రాజమండ్రి రూరల్, హుకుంపేట పంచాయతీ పరిధిలో పరిస్థితి చూస్తే, పాలన ఉంది కానీ బాధ్యత లేదు అన్నట్టు కనిపిస్తోంది. గత ఆరు నెలలుగా పంచాయతీలో తుప్పలు, చెత్తాచెదారం, విష జంతువుల ఆవాసాలు చేస్తూ గ్రామ ప్రజలు నరకయాతన అనుభవి స్తున్నారు. దీనికి కారణం ఏంటి అనుకుంటే, అధికారుల నిర్లక్ష్యం. మిగిలినవన్నీ అద్భుతం మీదే.పంచాయతీలో ఐదు ట్రాక్టర్లు ఉండగా, ఒక్కదాన్ని తప్ప మిగిలినవన్నీ వినియో గానికి అత్యంత అనర్హంగా మారాయి. ఒక ట్రాక్టర్‌కి చిన్నపాటి మరమ్మతులే కావలసి ఉన్నా, నెలలుగా దాన్ని పక్కన పెట్టేశారు. ఇంకో ట్రాక్టర్‌కి బ్యాటరీ చోరీకి గురైం దని తెలిసి, అదే ట్రాక్టర్‌ని తిరిగి ఉపయోగించాలంటే పక్క ట్రాక్టర్ నుండి బ్యాటరీ తీసి పెట్టే అతి చౌక, తాపీ విధానం అవలంబించారు. ఈ పరిస్థితిలో 'ఒకటే ట్రాక్టర్ – అందరికీ పరమేశ్వరుడు' అన్నట్టుగా వాడుతూ, అది కూడానడిచేది నడవక పోయే స్థితికి చేరింది. ఇప్పటికే మూడు ట్రాక్టర్లు అసలు పని చేయని స్థితిలో ఉండగా, మిగిలిన రెండు ట్రాక్టర్ల స్థితి కూడా ప్రశ్నార్థకంగా మారింది. మొన్నటి వరకూ మిగిలిన ట్రాక్టర్లు కూడా ఉదయం స్టార్ట్ అయ్యి, సాయంత్రానికి డౌన్ కావడమే పరిపాటిగా మారిపోయింది. పనికిరాని ట్రాక్టర్లను చూస్తుంటే, ఇవి మున్సిపాలిటీకి చెందినవో లేక తుక్కు షాప్‌కి అప్పగించాల్సినవో అన్న సందేహాలు ప్రజల్లో మొదలయ్యాయి. పంచాయతీ కార్యదర్శి లేకపోవడంతో ప్రస్తుతం స్వర్ణ పంచాయతీకి చెందిన గుమస్తా హుకుంపేట బాధ్యతలు చేపట్టిన సంగతి తెలిసిందే. అయితే, ఆయన చేతిలో పరిపాలన బాధ్యతలన్నీ ఉండటంతో, ఓ కార్యదర్శి చేసే పనులన్నీ ఆయనే చేస్తున్నారని తెలుస్తోంది. అధికారులు పనితనం చూపుతున్నా, పారదర్శకంగా వ్యవహరించాల్సిన అవసరం ఉందని ప్రజలు అభిప్రాయ పడుతు న్నారు. పంచాయతీ నిధులు వాహనా మరమ్మ త్తులకు వినియోగి ంచకుండా, అవినీతికి తలవంచినట్టు వదంతులు వస్తుండటంతో, ప్రజల్లో అసహనం పెరిగి పోతోంది. రోజురోజుకీ చెత్త మళ్లించేందుకు ట్రాక్టర్లు లేకపో వడంతో, పలు కాలనీలు వాసనలతో జబ్బుపడుతున్నాయని ఆరోపిస్తున్నారు. ప్రజల ఆరోగ్య భద్రత మీద ఎంతమాత్రం శ్రద్ధ లేకుండా, చెత్త పక్కనే ప్రయాణించాల్సిన పరిస్థితి బాధాకరమని స్థానికులు అంటున్నారు.

# పోలీసు బాధ్యతాయుతంగా పనిచేసి ప్రజల మనసుల్ని పొందాలి : డిఎస్.పి విద్య

**ఉమ్మడి తూర్పు గోదావరి**
**జిల్లా బ్యూరో , జులై 29 , ( ప్రభాతవార్త ) :**

పోలీసు బాధ్యతాయుతంగా పనిచేసి ప్రజల మనసుల్ని పొందాలని డిఎస్.పి బి విద్య సూచించారు.బొమ్మూరు పోలీస్ స్టేషన్ పరిధిలో సచివాలయ పోలీసులు వివిధ సచివాలయాలకు బదిలీ అయ్యి సిఐకి రిపోర్ట్ చేయడానికి బొమ్మూరు పోలీస్ స్టేషన్కు వచ్చారు.ఈ కార్యక్రమంలోడీఎస్పీ విద్య పాల్గొని వారికి పలు సూచనలు ఇచ్చారు. సచివాలయ పరిధిలో సమస్యలు గుర్తించి ఉన్నతాధికారులకు తెలియజేయాలన్నారు.ఉద్యోగాలు బాధ్య తాయుతంగా పనిచేసి ప్రజలు మన్నన్లు పొందాలన్నారు.పోలీసు ప్రజలతో స్నేహపూర్వక సంబంధాలు పెట్టుకోవడం తో వారి సమస్యలు తెలుసుకునే వీలుంటుందన్నారు.ఈ కార్యక్రమంలో




సీఐ కాశీ విశ్వనాథం, ఎస్ఐలు కె. రమేష్, ఆర్. అంకారావు, సిహెచ్ రమేష్, కె. మురళీమోహన్ సచివాలయ పోలీసులు పాల్గొన్నారు.

# అంతరిక్ష విజ్ఞానం పట్ల అవగాహనే 'స్పేస్ స్కిల్' లక్ష్యం : ఎమ్మెల్యే అయితాబత్తుల

**కోనసీమ బ్యూరో , జులై 29 , ( ప్రభాతవార్త ) :**

అంతరిక్ష విజ్ఞానం పట్ల విద్యార్థులకు అవగాహన కల్పించడమే లక్ష్యంగా సైన్స్ సిటీ ఆధ్వర్యంలో 'స్పేస్ స్కిల్' కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు అమలాపురం ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావు చెప్పారు. సైన్స్ సిటీ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ ఆధ్వర్యంలో అమలాపురం బాలుర ఉన్నత పాఠశాలలో మంగళవారం నాడు "స్పేస్ స్కిల్" కార్యక్రమం నిర్వహించి విద్యార్థులకు అంతరిక్ష పరిశోధనల పట్ల అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే ఆనందరావు ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడుతూ చదువు అంటే సాఫ్ట్ వేర్ ఉద్యోగం ఒకటే కాదు.. సాంకేతిక విజ్ఞానం ద్వారా అనేక అవకాశాలు ఉన్నాయని తెలిపారు. డ్రోన్ టెక్నాలజీకి పెరుగుతున్న ప్రాధాన్యతను ఆయన వివరించారు. సైన్స్ విజ్ఞానాన్ని విద్యార్థులకు చేరువ చేసేందుకు సైన్స్ సిటీ సీఈఓ వెంకటేశ్వర్లు చేస్తున్న కృషిని అభినందించారు. అంబేద్కర్ కోనసీమ జిల్లా కేంద్రం అమలాపురంలో సైన్స్ సెంటర్ ఏర్పాటుకు చర్యలు తీసుకుంటామని ఎమ్మెల్యే ప్రకటించారు. విద్యార్థుల భవిష్యత్ ఆకాంక్షలకు అనుగుణంగా వారిని తీర్చిదిద్దేందుకు ఉపాధ్యాయులు కృషి చేయాలని ఎమ్మెల్యే కోరారు. ఎమ్మెల్సీ కుడుపూడి సూర్యనారాయణరావు మాట్లాడుతూ అంతరిక్ష విజ్ఞానానికి ప్రస్తుతం పెరిగిన ప్రాధాన్యతను వివరించారు. రాజకీయాలకు అతీతంగా అమలాపురం అభివృద్ధికి ఎమ్మెల్యే ఆనందరావు చేస్తున్న కృషిని




అభినందించారు. అమలాపురం హైస్కూల్ 300 సంవత్సరాల చరిత్ర ఉందని, ఈ పాఠశాల అభివృద్ధికి తగిన నిధులు కేటాయించాలని ఎమ్మెల్యే ఆనందరావుకు విజ్ఞప్తి చేశారు. సైన్స్ సిటీ సీఈఓ ఎస్. వెంకటేశ్వర్లు మాట్లాడుతూ అంతరిక్ష ప్రయోగాల పట్ల విద్యార్థులకు అవగాహన కల్పించేందుకు సర్వశిక్షాభియాన్– ముస్కాన్ సంయుక్త ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం చేపట్టినట్లు తెలిపారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, విద్యా మంత్రి నారా లోకేష్ సాంకేతిక పరిజ్ఞానం వినియోగానికి పెద్దపీట వేస్తున్నారని, విద్యార్థి దశ నుండి సాంకేతిక అవగాహన పెంపొందించుకోవాలని సూచించారు. సైన్స్ సిటీ స్టేట్ కోఆర్డినేటర్ శ్రీకాంత్, సర్వ శిక్షాభియాన్ అసిస్టెంట్ ప్రాజెక్ట్ కోఆర్డినేటర్ మమ్మీ, ముస్కాన్ సిఓఓ ప్రణేష్ దేబ్ నాథ్, జడ్పీ బాలుర ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు భమిడిపాటి రామకృష్ణ, మున్సిపల్ మాజీ చైర్ పర్సన్ పెచ్చెట్టి విజయలక్ష్మి, మున్సిపల్ కౌన్సిలర్ సంసాని నాని, మాజీ ఎంపీపీ బొర్రా ఈశ్వరరావు, పిఏసిఎస్ అధ్యక్షులు మట్టా మహాలక్ష్మి ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

## పీఎం రిలీఫ్ ఫండ్ చెక్కు అందజేత



**సీతానగరం , జులై 29 , ( ప్రభాతవార్త )**

సీతానగరం గ్రామానికి చెందిన ఏలూరి రత్నం అనారోగ్యంతో బాధపడుతున్నారు. ఆమెకు పీఎం రిలీఫ్ ఫండ్ నుండి మంజూరైన మూడు లక్షల రూపాయల చెక్కును బీజేపీ మండల అధ్యక్షు రాలు రాపాక వెంకటలక్ష్మి మంగళవారం అందజేశారు. గత రెండేళ్లుగా అనారోగ్యం భాదపడుతున్న రత్నం పరిస్థితిని స్థానిక బీజేపీ నాయకులు పార్లమెంట్ సభ్యురాలు దగ్గుబాటి పురందేశ్వరి దృష్టికి తీసుకెళ్లారు. ఆమె చొరవతో పీఎం రిలీఫ్ ఫండ్ నుండి ఈ ఆర్థిక సాయం మంజూరైంది. ఈ సందర్భంగా ఏలూరి రత్నం మాట్లాడుతూ పీఎం రిలీఫ్ ఫండ్ ద్వారా ఆర్థిక సహాయం అందించడానికి సహకరించిన పార్లమెంటు సభ్యురాలు దగ్గుబాటి పురందేశ్వరికి, రాజానగరం నియోజకవర్గ కన్వీనర్ నీరుకొండ వీరన్న చౌదరికి కృతజ్ఞతలు తెలిపారు. సామాన్య ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు పొందేందుకు పీఎం రిలీఫ్ ఫండ్ ఎంతగానో సహాయప డుతుందని మండల అధ్యక్షురాలు రాపాక వెంకటలక్ష్మి అన్నారు. ఈ కార్యక్రమంలో మట్టడి వెంకట రమణ, జి.సూర్యవతి, నాగమణి, తదితరులు పాల్గొన్నారు.

## చైతన్య స్కూల్ నాసా విద్యార్థులకు రాష్ట్ర స్థాయి బహుమతులు

**కోనసీమ బ్యూరో**
**( మండపేట ) , జులై 29 , ( ప్రభాతవార్త )**

ఈ విద్యా సంవత్సరం నాసా స్పేస్ రీసెర్చ్ సెంటర్ కి తాపేశ్వరం శ్రీ చైతన్య స్కూల్ తరుపున పంపిన 3 ప్రాజెక్ట్స్ లో గలాక్టిక్ ఫాం (స్పేస్ ఎన్విరాన్మెంట్ లో వ్యవసాయం) అనే ప్రాజెక్టు కు రాష్ట్ర స్థాయిలో ఉత్తమ ప్రాజెక్టు అవార్డు వచ్చింది. జోనల్ లెవెల్ లో రెండవ స్థానం వచ్చిందని స్కూల్ ప్రిన్సిపాల్ లక్ష్మీనారాయణ తెలిపారు.ఈ ప్రాజెక్ట్స్ లో పాల్గొన్న విద్యార్థులకు సర్టిఫికెట్లు,బంగారు పతకాలు జ్ఞాపికలు అందచేసారు. సామాజిక అవసరాలకి అనుగుణంగా విద్యార్థుల నైపుణ్యాన్ని పెంపొందించు కోవడానికి అడుగులు వేయాలని రీజనల్ ఇంఛార్జి నరేష్ అన్నారు. విద్యార్థి దశ నుండి శాస్త్ర,సాంకేతిక విద్య పై ఆసక్తి పెంచుకొని భవిషత్తు లో రానించాలనే ఉద్దేశం తో ప్రతీ విద్యా సంవత్సరం నాసా కు ప్రాజెక్ట్స్ తయారు చేసి పంపుతున్నట్లు కో ఆర్డినేటర్ అరుణ్ చెప్పారు. ఈ విద్యా సంవత్సరం తమ విద్యార్థులు నాసా కు 3 ప్రాజెక్ట్స్ పంపారన్నారు. ఈ కార్యక్రమంలో కో ఆర్డినేటర్ అరుణ్, డీన్ రాజు,ఇంఛార్జి మల్లికార్జున,చారి ఉపాధ్యాయ సిబ్బంది పాల్గొన్నారు.

# వాడపల్లి క్షేత్రానికి వేలాదిగా తరలివచ్చిన భక్తులు

- అష్టోత్తరపూజ, నిత్యాకల్యాణంలో పాల్గొని తరించిన భక్తులు
- స్వామి వారి ఒక్కరోజు ఆదాయం రూ,4.11లక్షలు



**ఆత్రేయపురం , జులై 29 , ( ప్రభాతవార్త ) :**

ప్రముఖ పుణ్యక్షేత్రం కోనసీమ తిరుమల వాడపల్లి శ్రీ వేంకటేశ్వర స్వామివారి ఆలయానికి మంగళవారం వేలాది మంది భక్తులు విచ్చేసి స్వామివార్ని దర్శించుకున్నారు. భక్తుల గోవిందనామ స్మరణతో ఆలయ పరిసరాలు మార్మోగాయి.ఏడు వారలు పూర్తి అయిన భక్తులు అష్టోత్తరపూజలు, నిత్య కళ్యాణం లో పాల్గొని తరించారు. ఉదయం శ్రీ వేంకటేశ్వర సహిత ఐశ్వర్య లక్ష్మీ హెూమం,అష్టోత్తర శతనామావళి,నిత్యాకల్యాణం, గోపూజ, బాల భోగం, నివేదన తదితర కార్యక్రమాలు జరిగాయి. అనంతరం భక్తులు స్వామివారి దర్శించుకుని అన్నప్రసాదాలు స్వీకరించారు.దీంతో వివిధ సేవలద్వారా స్వామివారికి రూ,4,11,958 లు ఆదాయం సమాకూరినట్లు దేవస్థానం అధికారులు ఒక ప్రకటన ద్వారా తెలిపారు.వచ్చిన భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా దేవస్థానం ఉప కమీషనర్, ఈఓ నల్లం సూర్య చక్రధరరావు తగు ఏర్పాట్లు చేశారు.

# జగనన్న లేఔట్ లో అనధికార గ్రావెల్ త్రవ్వకాలు



- పట్టించుకోని రెవెన్యూ అధికారులు
- కోట్ల రూపాయలకు తూట్లు
- పునాదుల పేరుతో ప్రైవేటు వెంచర్లకు తోలకాలు

**రౌతులపూడి , జులై 29 , ( ప్రభాతవార్త ) :**

రౌతులపూడిలో మూడు పువ్వులు,ఆరు కాయలు వలే గ్రావెల్, మట్టి వ్యాపారం కొనసాగుతుంది. పగలు, రాత్రి అనే తేడా లేకుండా ఈ వ్యాపారాన్ని జోరుగా సాగిస్తున్నారు. గ్రామం లో అడపాదడపా పునాదులు నిర్మిస్తే, వాటి పేరుతో ప్రైవేట్ వెంచర్లకు తోలకాలు చేస్తున్నారు. వాటిని లక్షల రూపాయలకు అమ్మకాలు చేసుకోవడానికి చదును చేస్తున్నారు. వ్యవసాయ భూమిని వ్యవసాయేతర భూమిగా మార్చిన తర్వాత భూమిని చదును చేయాల్సి ఉంది. అటువంటి నిబంధనలు ఏవి పట్టించు కోకుండా వ్యాపారాలు సాగిస్తున్నారు. గత ప్రభుత్వం రౌతులపూడి గ్రామ శివారు సర్వేనెంబర్100లో య 8.95 లు భూమిని కోట్ల రూపాయలకు కొనుగోలు చేసి జగనన్న లేఔట్ గా అభివృద్ధి పరిచి 610 మంది లబ్ధిదారులకు పట్టాలిచ్చారు. ఈ లేఔట్ ను అభివృద్ధి పరచడానికి ఎంజిఎన్ఆర్ఇజిఎస్ నిధుల ద్వారా లక్షల రూపాయలు ఖర్చు పెట్టారు. నేటికీ ఇక్కడ ఒక ఇంటి నిర్మాణం జరగలేదు. దీంతో ఇక్కడ గ్రావెల్ పై అక్రమార్కుల కన్ను పడింది. గత నాలుగు రోజుల నుండి 3 జెసిబి లు, ట్రాక్టర్లు, లారీలతో గుమ్మరేగుల, ఏ.మల్లవరం, రౌతులపూడిలోని ప్రైవేట్ వెంచర్లకు ఈ గ్రావెల్ను యదేచ్ఛగా తరలించి సొమ్ములు చేసుకుంటున్నారు. జగనన్న లేఔట్ ను కొల్లగొడుతున్నా, మెయిన్ రోడ్ అంతా ఎర్రబారినప్పటికీ రెవిన్యూ అధికారులు కన్నెత్తిచూడని పరిస్థితి ఉంది.కోట్ల రూపాయల ప్రభుత్వ ఆదాయానికి అక్రమార్కులు గండి కొడుతున్న చూసి చూడనట్టు వ్యవహరించడంపై పలు విమర్శలు వెలువడుతున్నాయి. ఇంటి నిర్మాణ పునాదులకని ఎమ్మెల్యే దృష్టికి స్థానికులు తీసుకెళ్తున్నట్టు అధికారులు చెప్తున్నారు. అయితే ఇక్కడ వాటికి భిన్నంగా ప్రైవేటు వెంచర్లకు తరలించి సొమ్ములు చేసుకోవడంపై యధాతదా ప్రజారాజా పాలన సాగుతుందని పలువురు బహిరంగంగా వెల్లడిస్తు న్నారు. ఈ త్రవ్వకాలపై జిల్లా ఉన్నతాధికారులు స్పందించాలని పలువురు కోరుతున్నారు.

# మున్సిపల్ కమిషనర్ బాహ్య పర్యటన

**కోనసీమ బ్యూరో , జులై 29 , ( ప్రభాతవార్త ) :**

అమలాపురం మున్సిపల్ కమీషనర్ వి. నిర్మల్ కుమార్ ఈరోజు ఉదయం అమలాపురం పురపాలక సంఘం పరిధిలోని 7,8 వార్డుల్లో పర్యటించారు.స్థానిక జనసేన నాయకులు గండి స్వామి తమ వార్డులో డ్రైనేజ్, రోడ్లు, శానిటైజేషన్ సంబంధించిన విషయాలు కమిషనర్ కు వివరించారు. చేయాల్సిన పనులు పై కౌన్సిలర్ హారిక చర్చించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్



ఏఇ,డిఇలతో పాటు స్థానిక నాయకులు చిక్కం శ్రీనివాస రావు, ఖాతా లక్ష్మణరావు, తిక్కిరెడ్డి త్రినాధ రావు, ఎం .గంగాధర్, సాధనాల మురళి వార్డ్ సచివాలయం సెక్రటరీ శామ్యూల్ శానిటైజేషన్ సెక్రెటరీ, ప్లానింగ్ సెక్రటరీ తదితరులు పాల్గొన్నారు.

# కట్టుకుంది పసుపు రంగు చీర..అవ్వనంది వైసిపి అబద్ధాలకు ఎర

- బాబు షూరిటీ-మోసం గ్యారంటీ కార్యక్రమంలో వైసీపీ నాయకులకు షాక్

**అంబాజీపేట , జులై 29 , ( ప్రభాతవార్త ) :**

రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏడాది పాలనపై విమర్శలు గుప్పిస్తూ, ప్రభుత్వం వైఫల్యం చెందిందని ప్రజలకు వివరించేందుకు వైసీపీ నిర్వహిస్తున్న బాబు షూరిటీ–మోసం గ్యారంటీ కార్యక్రమంలో వైసీపీ నాయకులకు షాక్ తగిలింది. మండలంలోని వక్కలంక గ్రామంలో సోమవారం నిర్వహించిన బాబు షూరిటీ– మోసం గ్యారెంటీ.. కార్యక్రమంలో ఒక మహిళ నుండి వచ్చిన సమాధానంతో వైసిపి నాయకులకు కళ్ళు బైర్లు కమ్మాయి. ఆ మహిళ ఇచ్చిన సమాధానాలకు మరో ప్రశ్న లేకపోవడంతో అక్కడ నుండి వైసీపీ నాయకులు చల్లగా జారుకున్నారు. వైసిపి ప్రభుత్వంలో ఇంటింటికి వచ్చి వాహనం ద్వారా రేషన్ ఇచ్చే పథకం బాగుందా.. కూటమి ప్రభుత్వంలో రేషన్ షాపునకు వెళ్లి నిత్యవసర సరుకులు తెచ్చుకునే పథకం బాగుందా అంటే షాపునకు వెళ్లి తెచ్చుకొనే పద్ధతి బాగుందని, రేషన్ షాపు తీసే సమయాల్లో ఎప్పుడైనా వెళ్లి తెచ్చుకోవచ్చని



ఆ మహిళ సమాధానం ఇచ్చింది. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు మిమ్మల్ని మోసం చేశాడా? అని ప్రశ్నించిన పి. గన్నవరం నియోజ వర్గ కో–ఆర్డినేటర్ గన్నవరపు శ్రీనివాసరావుకు ఆ మహిళ ఇచ్చిన సమాధానంతో పట్టపగలే చుక్కలు కనిపించాయి. చంద్రబాబు మమ్మల్ని మోసం చేయలేదని ఇంటిలో ఎంతమంది విద్యార్థులు ఉంటే అంతమందికి 'తల్లికి వందనం' డబ్బులు అందించారని ఆ మహిళ చెప్పడంతో వైసిపి నాయకులు నోరెళ్ళబెట్టారు. ఆ మహిళ (ఏ రాజకీయ పార్టీకి చెందిన మహిళ కాదు) కట్టుకున్న పసుపు రంగు చీరనైనా చూసి వైసిపి నాయకులకు జ్ఞానోదయం కలగాలని మండల టిడిపి నాయకులు హితబోధ చేస్తున్నారు. కూటమి ప్రభుత్వంపై అసత్య ప్రచారం చేయడానికి వైసీపీకి చెందిన వాళ్ళని ఎంచుకుని, ప్రత్యేక శిక్షణ ఇప్పించుకోవాలని ఎద్దేవా చేశారు. టిడిపి సూపర్ సిక్స్ మేనిఫెస్టోలో ఇప్పటికే ఎన్టీఆర్ భరోసా పింఛన్లు, తల్లికి వందనం, దీపం పథకం, డీఎస్సీ నియామకాలతో యువతకు ఉద్యోగాలు అమలు జరిపామని, ఆగస్టు 2న అన్నదాత సుఖీభవ,15న మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం పథకాలను ప్రారంభిస్తున్నామని, దీంతో సూపర్ సిక్స్ హామీలను పూర్తిస్థాయిలో అమలు చేసిన ఘనత కూటమి ప్రభుత్వానికే దక్కుతుందని టిడిపి నాయకులు చెప్తున్నారు. ఇదిలా ఉండగా పి.గన్నవరం ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ ఇసుకపూడి గ్రామంలో మంగళవారం పర్యటించారు. ఆ కార్యక్రమంలో పాల్గొన్న వైసీపీకి చెందిన ఎంపీటీసీ సభ్యుడు ముత్తాబత్తుల ప్రశాంత్ ఐదేళ్ల వైసీపీ ప్రభుత్వంలో ఏమాత్రం అభివృద్ధి జరగలేదని బహిరంగంగా చెప్పడం విశేషం.

Print and Published by Gireesh Sanghi, CMD and Managing Editor on behalf of AGA Publications Ltd., at 11-37, Morampudi, Rajamahendravaram-533 103. Phone : 2469407, 2469408.
RNI No.64863/96,"Editor : *Damerla Sai Baba, *Responsible for s election of News-under the PRB Act. Regd.: No.H/SD/337/09-11 Air Surcharge: Delhi : 40Ps

# పుస్తకాల ఏటీఎమ్



అపార జ్ఞాన సంపదకు భాండాగారం. మూడక్షరాల పుస్తకం.. చారిత్రక ఆధారాల్ని సాంస్కృతిక వారసత్వాన్ని కాపాడటంలోనే కాదు.. మనిషి వ్యక్తిత్వాన్ని మార్చగల శక్తీ పుస్తకానికి ఉందంటారు ఏలూరు జిల్లా జాయింట్ కలెక్టర్ ధాత్రిరెడ్డి. అందుకే, ఈ తరంలో తగ్గుతున్న పఠనాసక్తిని తిరిగి పెంపొందించడానికి ప్రయోగాత్మకంగా సొంత డబ్బుతో 'ఏలూరు బుక్ నూక్స్' కార్యక్రమాన్ని ప్రారంభించారు. అది విజయవంతం కావడంతో త్వరలోనే మరో 100 ప్రదేశాలకు విస్తరించ నున్నారు. పుసనతకాలు చదవాలనే ఆసక్తి ఉన్నా.. అందరికీ లైబ్రరీకి వెళ్లే తీరిక ఉండదు. అందుకే, రోడ్డువారన ఎళ్తూనే కాసేపు ఆగి పుస్తకాలు చదివేలా నగరంలో బుక్ బాక్స్‌లను ఏర్పాటుచేశాం. భద్రత లేకుండా బహిరంగంగా పుస్తకాలు పెడితే ఉంటాయా? అసలు ఎవరు చదువుతారు? అన్నారు కొందరు. అదీ నిజమే! ఎంతని కాపలా కాస్తాం. ప్రజలు మనది అనుకోవాలి. నిజానికి పుస్తకాలు పెట్టిన తొలిరోజు రాత్రే కొందరు వాటిని మాయం చేశారు. బాధనిపించినా వెనక్కి తగ్గలేదు. తిరిగి మరికొన్నికొత్త బుక్స్ పెట్టాం. దాతలు ముందుకు రావడంతో మరికొన్ని చోట్లా ఏర్పాటుచేశాం. ఇందులో కథలు స్ఫూర్తి పుస్తకాలతోపాటు అకడమిక్, కాంపిటీటివ్ బుక్స్ కూడా ఉన్నాయి. ఇప్పుడు విద్యార్థులు, బాటసారులు.. ఇలా చాలామందే వాటినిఉపయోగించుకుంటున్నారు. ప్రజల సలహాతో ప్రస్తుతం ఇది 'ఎనీ టైమ్ బుక్' కార్యక్రమంగా మారింది. త్వరలోనే జిల్లాలోని మరో 100 ప్రదేశాల్లో వీటిని ఏర్పాటుచేయ నున్నాం అంటారు ధాత్రిరెడ్డి. □



## కేక పెట్టించిన కెక్ చీర!



పెళ్లంటేనే ఒక అద్భుతం. పెళ్లికి ముందు, తర్వాత కూడా బోలెడన్ని ఆచారాలూ, ఆర్భాటాలూ ఉంటాయి. రంగురంగుల పట్టు వస్త్రాలు, ఆహా అనిపించే విందు భోజనాలతో కనువిందుగా, కోలాహలంగా ఉంటుంది. ఆ వైభవానికి ఇంకాస్త కళాత్మకత జోడించాలనుకున్నారు అబ్బాయి తరుపువారు. కోనసీమ జిల్లా అమలాపురంలో ఒక నిశ్చయ తాంబూల వేడుకలో మగపెళ్లివారు వధువుకు అచ్చం పట్టుచీర లాంటి కేక్‌తో స్వీట్ సర్‌ప్రైజ్ ఇచ్చారు. ఎరుపు, జరీ బోర్డరుతో ఆకుపచ్చ చీర భేషుగ్గా ఉందనుకుంటే. దాని మీద అదనపు హంగులుగా జాకెటు ముక్క, తాంబూలం,గాజులు, గొలుసు, పసుపు, కుంకుమ భరిణెలు- టాపింగ్‌తో అబ్బురపరిచేలా ఉంది. అచ్చం పట్టుచీరను పోలిన కేకు అందర్నీ ఆకట్టుకుంది. చక్కటి మధుర జ్ఞాపకంగా, మనసులో నిలిచిపోయేలా ఉంది' అంటూ అమ్మాయి తరపువారు సంబరపడిపోతున్నారు. □

# చాకెట్లూ.. పురస్కారాలు



**చాక్లెట్.. చాలామంది చిన్ననాటి జ్ఞాపకాల్లో భాగం. బాగా నచినచందనుకోండి.. భిన్న రకాల్నీ రుచి చూడాలనుకుంటాం. అపర్ణ గొర్రెపాటి కూడా అంతే! అయితే ఆమె రుచిని ఆస్వాదించడానికే పరిమితం కాలేదు. కొత్తవాటిని సృష్టించి ఇతరులు ఆస్వాదించేలా చేయాలనుకున్నారు. అంతేనా చాక్లెటీర్‌గా విదేశాల్లోనూ గుర్తింపు పొందారు. ఈ తొలి తరం వ్యాపారవేత్త గూర్చి తెలుసుకుందాం.**

చాక్లెట్లు, క్యాండీలంటే ఇష్టపడని అమ్మాయి ఉంటుందా? నేనూ అంతే అన్నీ ప్రయత్నించేదాన్ని. బంధువుల్లో ఎవరైనా విదేశాలకు వెళ్లొస్తే చాక్లెట్లు తెచ్చే వాళ్లు. వాటి రుచి, ఫ్లేవర్లు మనకు దొరికే వాటితో పోలిస్తే భిన్నంగా తోచేవి. అయితే తయారీ ప్రయత్నించాలనుకున్నది మాత్రం మా బాబుకోసం.



మార్కెట్‌లో దొరికేవి అంతగా సంతృప్తి ఇవ్వక పోయేసరికి తయారీలో శిక్షణ తీసుకున్నా. మాది హైదరాబాద్ కుటుంబంలో అందరూ డాక్టర్లు, ప్రొఫెసర్లు, రైటర్లు, లాయర్లే. నేనూ వాళ్ల బాటలోనే నడుస్తా అనుకున్నారు. కానీ సాఫ్ట్‌స్కిల్స్ ట్రైనర్‌నయ్యా. కార్పొరేట్ ఉద్యోగులకు కమ్యూనికేషన్, లీడర్‌షిప్, టీమ్ బిల్డింగ్.. వంటి అంశాల్లో శిక్షణ ఇచ్చేదాన్ని. ఖాళీ సమయంలో చాక్లెట్ తయారీ నేర్చుకునేదాన్ని. ఎంతగా నచ్చిందంటే సంబంధిత కోర్సులన్నీ చేయాలనిపించింది. ముంబయి, ఫ్రాన్స్‌ల్లో ప్రొఫెషనల్ కోర్సులే చేశా. ఫ్రాన్స్‌లో వంద ఏళ్లనాటి ప్రముఖ సంస్థలోనూ, బెల్జియం, అమెరికాల్లో ప్రముఖ మాస్టర్ షెఫ్‌లతోనూ పనిచేశా. ఈ అనుభవంతో సొంత సంస్థను స్థాపించాలని హైదరాబాద్‌కి వచ్చా. నా లక్ష్యం స్వచ్ఛమైన చాక్లెట్ కదా.. అందుకే ఆ అర్థమొచ్చేలా నా సంస్థకు 'జుకి' అని పేరు పెట్టా.

వ్యాపారానికి కొత్త. ప్రతిదీ నేర్చుకోవాల్సిందే. మెటీరియల్ సమకూర్చుకోవడం, మార్కెటింగ్, రిటైలింగ్ వంటివన్నీ అవగాహన తెచ్చుకోవడం అంత సులవు కాలేదు. దీనికితోడు మే సంస్థ స్థాపించగానే కొవిడ్. భవిష్యత్తేంటన్న భయం మామూలే. కానీ వెంటనే తేరుకుని ఆన్‌లైన్ సేవలు మొదలుపెట్టాం ఈ విషయంలో మా బృందం నా వెన్నంటే నిలిచింది. కాబట్టే, నిలదొక్కుకోగలిగాం. చాక్లెట్ నా దృష్టిలోఓ భావోద్వేగం, వేడుక, కళాఖండం.. అందుకే ఫ్లేవర్లు, దాని రూపరేఖలు, వాడే పదార్థాలు, బ్రెడ్, డెజర్ట్‌ల్లో వేటితో జత చేయాలి.. ఇలా ప్రతిదానిలో ప్రయోగాలు చేస్తుంటా. కేవలం తయారీ, డెజర్ట్‌లు, పేస్ట్రీల మెనూ సిద్ధం చేయడం, ప్రెజెంటేషన్‌పై దృష్టి పెట్టడమే కాదు. మా చాక్లెట్లు, ఉత్పత్తుల గురించి వినియోగదారులకు పరియం చేస్తుంటా. ఎప్పటికప్పుడు వాళ్ల నుంచి ఫీడ్‌బ్యాక్‌నీ తీసుకుంటా. కాబట్టే, గ్లోబల్ లీడర్స్ సమిట్‌లో జుకి 'వరల్డ్ బెస్ట్ ఎమర్జింగ్ బ్రాండ్స్' పురస్కారం దక్కించుకుంది. 'టైమ్స్' నుంచి 2021-24 వరకు వరుసగా బెస్ట్ చాక్లెటీర్ అవార్డునీ అందుకున్నా. ఎంటర్‌ప్రెన్యూర్ ఆఫ్ ద ఇయర్, విమెన్ అచీవర్, విమెన్ ఎంపవర్‌మెంట్ లీడర్‌షిప్ సహా ఎన్నో పురస్కారాలూ వరించాయి.

**తిరిగి ఇవ్వాలనీ...** నా ప్రయాణమేమీ సులువు కాదు. ఏళ్ల అభ్యాసం, ఎన్నో ప్రయోగాలు, వైఫల్యాలు.. ఇవన్నీ దాటుకుంటూ ముందుకుసాగా. అందుకే నాలా చాక్లెట్ల తయారీ, బేకింగ్ మీద ఆసక్తి ఉన్నవారికోసం ఏదైనా చేయాలనుకున్నా. '100 ఫోల్డ్స్ అకాడమీ' ప్రారంభించి శిక్షణనిస్తున్నా. ఆరోగ్యకరమైన, విలువలతో కూడిన నిపుణులను తయారు చేయడం నా ఉద్దేశం. దీన్ని ఇంకా ముందుకు తీసుకెళ్లడం, జుకిని విస్తరించడం.. భవిష్యత్ లక్ష్యాలు. ఒక్కోసారి వెనక్కి చూసుకున్నప్పుడు నచినచంది చేయాలనిపించినప్పుడు వెంటనే ధైర్యంగా చేయాల్సింది అనిపిస్తుంటుంది. అందుకే ఈ తరానికి నచ్చితే తప్పక ప్రయత్నించమని చెబుతా. అలాగే, నేర్చుకోవడానికీ.. నేర్చుకుంది మర్చిపోయి, తిరిగి కొత్తది నేర్చుకోవడానికీ ఎప్పుడూ సిద్ధంగా ఉండండి. సానుకూలమైన వ్యక్తులు మీ చుట్టూ ఉండేలా చూసుకోండి. కానీ మిమ్మల్నే మీరు నమ్మడి. వైఫల్యాలు వస్తాయి. అలాగని ఆగొద్దు. వాటిని పాఠాలుగా తీసుకుంటూ ముందుకే సాగండి. అప్పుడే అసలైన విజయాలు పరిచయమవుతాయనీ సలహానిస్తుంటా.



చాక్లెట్ తయారీ ఫ్యాక్టరీల్లో ప్రొడక్షన్, ప్యాకేజింగ్ సేల్స్ అన్నింటినీ ఎక్కువగా మహిళలే చేస్తారు. అంతేకాదు, అందరికీ అందుబాటులో ఉండాలన్న ఉద్దేశంతో చాక్లెట్లన్నీ శాకాహార పదార్థాలతో తయారుచేస్తారట. □

# ఇంట్లో మొక్కలకు వాన నీరు

**ఇంట్లో డైనింగ్ టేబుల్ లేదా కిటికీలో ఉండే ఇండోర్ మొక్కలకు ఈ సీజన్‌లో వర్షపు నీటిని అందేలా చేయొచ్చు. అలాగని భారీ వర్షంలో కాకుండా చిన్న చిన్నకులు పడే చోట వీటిని ఉంచితే అవి చక్కగా పెరుగుతాయి.**

వర్షపునీరు మొక్కలకు పలు ప్రయోజనాలనిస్తుంది. సాధారణంగా పంపు నీటిలో లవణాలు, ఖనిజాలుంటాయి. ఈ నీటిని మొక్కలకు పోయడంవల్ల ఇవన్నీ తొట్టెలలోని మట్టిలో కరిగి ఉంటాయి. ప్రత్యేకంగా కాల్షియం,



మెగ్నీసియం ఎక్కువగా చేరిపోతయాఇ. దాంతో మట్టిపై కాల్షియం కార్బొనేట్ పొర ఏర్పడుతుంది. ఫలితంగా మట్టి ఎండిపోయినట్లు అయ్యి నీటిని పీల్చుకోదు. మొక్కకు ఆక్సిజన్ అందనివ్వదు. అయితే వర్షపునీరు సహజంగా మృదువైంది. ఇది తొట్టెలో పేరుకున్న ఖనిజాలను బయటకు పంపడంలో సహచపడి, మొక్క ఆరోగ్యంగా పెరిగేలా చేస్తుంది. ఆకులపై ఉండే రంధ్రాలను వర్షపునీరు తెరిచేలా చేస్తుంది. దీంతో కిరణజన్య సంయోగక్రియ కోసం కార్బన్ డయాక్సైడ్, పోషకాలను తీసుకునే సామర్థ్యాన్ని మెరుగుపడేలా చేస్తుంది. దీంతో మొక్క ఎదుగుదల బాగుంటుంది.

**.. ఏం చేయాలి....** సాధారణంగా ఇండోర్ మొక్కల తొట్టెల్లోని మట్టి చెమ్మగా ఉంటుంది. వీటిని గాలి ఎక్కువగా వీచకుండా చిన్నగా పడుతున్న వర్షంలో ఉంచితే దెబ్బ తినవు. వర్షపునీరులో ఎక్కువ ఆక్సిజన్ ఉంటుంది. దీంతో తొట్టెలో నీరు నిండపోయినా మొక్కకు అంతగా ప్రమాదం ఉండదు. అలాగని ఎక్కువ వర్షంలో లేదా ఎక్కువ సేపు మాత్రం ఇండోర్ మొక్కలను ఉంచకూడదు. అలాగేరాత్రి సమయాల్లో బయట వదిలేయకుండా ఇంట్లోకి తేవడం మంచిది. పగటిపూట వర్షం వెలిసిన తర్వాత కూడా మొక్కను బయట ఉంచకూడదు. వర్షం తర్వాత వచ్చే ఎండ తీవ్రత ఎక్కువగా ఉండటంవల్ల మొక్క దెబ్బతినే ప్రమాదం ఉంటుంది. ఈ వర్షాకాలంలో తగినంత వర్షపాతాన్ని గుర్తించి మీ ఇండోర్ మొక్కలనూ మరింత ఆరోగ్యంగా ఎదిగేలా చేయండి. □

## నువ్వులడ్డు కుదురుగా !

**ఈ లడ్డూలు చలిలో** ఆరోగ్యాన్నీ, రుచినీ ఇస్తాయి. వీటిల్లో క్యాల్షియం, ఐరన్, పొటాషి యం, పీచు ఉంటాయి. కాబట్టి పిల్లల ఆరోగ్యానికి చాలా మంచిది. వీటి కోసం పావు కప్పు పల్లీలు, మూడోవంతు కప్పు తెల్ల నువ్వులు, పావు కప్పు కొబ్బరిపొడి, అర కప్పు బెల్లం తురుము, పావుచెంచా యాలకులపొడి, రెండు చెంచాల నెయ్యి తీసుకోవాలి. మందపాటి అడుగున్న కడాయిలో మొదట నువ్వులు , తర్వాత పల్లీలు దోరగా వేయించుకోవాలి. వాటిని చల్లారనిచ్చి.. ఈ లోపు కొబ్బరి పొడిని బంగారు రంగు వచ్చేంతవరకూ వేయించు కోవాలి. పల్లీల పొట్టు తీసి బరకగా మిక్సీ పట్టుకోవాలి. ఒక పాత్రలో యాలకుల పొడి, పల్లీల పొడి, నువ్వులు వేసి కలపాలి. స్టౌపై కడాయి పెట్టి దానిలో బెల్లం తురుము వేసి నాలుగు చెంచాల నీళ్ల పోసుకోవాలి. బెల్లం పూర్తిగా కరిగే సమయానికి నువ్వులు, ల్లీలు, కొబ్బరి, యాలకులపొడి వేసుకొని బాగా కలపాలి. చేతికి నెయ్యి రాసుకుని పొయ్యిమీద పెట్టండి. పాకం ముదిరి చక్కని లడ్డూలు వేయించిన జీడిపప్పు పలుకులు కలిపినా కూడా కరకలాడుతూ రుచిగా ఉంటాయి. □



## తేమకు బూజు పట్టనీయద్దు !

వర్షకాలంలో తడితనం, గాలిలో తేమ ఎక్కువగా ఉంటుంది. దీనివల్ల కొన్ని రకాల పదార్థాలు బూజు పడుతుంటాయి. ఇలా జరగకూడదంటే వాటిని నిల్వ చేసే విషయంలో కొన్ని జాగ్రత్తలు తీసుకోవాలంటున్నారు నిపుణులు

- వంటింట్లో నీటి వినియోగం ఎక్కువగా ఉంటుంది, తడిదనం వల్ల ఆ వాతావరణం ఎప్పుడూ తేమగా ఉంటుంది. క్రిములు, ఫంగస్, వంటివి వృద్ధి చెందే ప్రమాదం ఉంది. కాబట్టి నిత్యావసరసరుకులు మొదలైన వాటిని తేమ లేని చోట భద్రపరచాలి అలాగే తేమ చేరకుండా మధ్యమధ్యలో, కప్‌బోర్డ్ మూలల్లో సిలికాజెర్ ప్యాకెట్లను ఉంచాలి.
- గోధుమ పిండి, శనగపిండి వంటివి తేమ తగిలితే పాడవుతాయి.కాబట్టి వాటిని గాలి చొరబడని గాజు సీసాలో భద్రపరిచి అందులో కొన్ని బిర్యానీ ఆకుల్ని వేయాలి. ఈ ఆకులు ఏమాత్రం తేమ ఉన్నా పీల్చేసు కుంటాయి.



- బియ్యం, గోధుమలు, ఇతర ధాన్యాలను కూడా గాలి చొరబడని డబ్బాల్లో నిల్వ చేయవలసి ఉంటుంది. అలాగే వాటిలో కొన్ని వేపాకులు వేయడం వల్ల తేమ చేరకుండా ఉండటంతో పాటు పురుగులు పట్టకుండా కాపాడుకోవచ్చు..
- . నట్స్ డ్రైఫ్రూట్స్ మొదలైన గాలి చొరబడని, పొడిగా ఉంటే గాజు జార్లలో నిల్వ చేయాలి. ఒకవేళ ఫ్రిజ్‌లో ఉంచాలనుకునే వారు జిప్‌లాక్ బ్యాగ్‌లో వేసి ఫ్రీజర్‌కి దగ్గరగా అమర్చండి. □

## అలసట తగ్గేదిలా!



**ఉదయాన్నే నిద్ర లేచింది మొదలు.. ఊపిరి సలపని పనులు.. క్షణం తీరి కుండదు.. ఒత్తిడి, అలసట.. ఈ విధంగా అలసట రాకుండా ఉండాలంటే శరీరంలో తగినంత శక్తి ఉండాలి. మరి ఆ శక్తి రావాలంటే ఏం చేయాలి?**

ప్రొటీన్లు మెండుగా ఉండే ఆహార పదార్థాలను ఎక్కువగా తీసుకోవాలి. ఇలా చేయడం వల్ల శరీర కండర వ్యవస్థ దృఢమవుతుంది. దీంతో ఎలాంటి అలసట లేకుండా సునాయాసంగా పనులు చేసుకోవడం సాధ్యమవుతుంది. అలాగే ప్రొటీన్లు గుండె బలంగా ఉండేందుకు, రోగ నిరోధకశక్తిని పెంపొందిం చేందుకూ దోహదం చేస్తాయి. అవసరమైన మేరకు ప్రొటీన్లు లభించే ఆహారం తీసుకుంటే తక్కువ క్యాలరీలతోనే కడుపు నిండిన భావన కూడా కలుగుతుంది.



**నట్స్...** ప్రొటీన్లతో నిండిన బాదం పప్పు, పిస్తా, అక్రోట్ వంటి గింజలను ప్రతిరోజూ పరిమితంగా తీసుకోవడం మంచిది. అవి గుండెకు మేలు చేస్తాయి. సలాడ్లు కూరగాయలతో కూడా వీటిని కలుపుకొని తినొచ్చు. అయితే నట్స్‌లో క్యాలరీలు కూడా ఎక్కువగానే ఉంటాయి కాబట్టి మితంగానే తీసుకోవాలి.

**పాలు, పాట పదార్థాలు ...** ...కండరాల నిర్మాణానికి తోడ్పడే ప్రొటీన్లు పాల పదార్థాల్లో పుష్కలంగా ఉంటాయి. ఇవి రక్తపోటు తగ్గటానికి తడ్పడతాయి. ఈ క్రమంలో తక్కువ కొవ్వు ఉండే పాల పదార్థాలను తీసుకోవాలి.



**సోయాబీన్స్..** సోయాబీన్స్‌లో ప్రొటీన్ల మెతాదు ఎక్కువ. వీటిని సోయా పాలు, సోయా పేస్ట్, టోఫూ రూపంలోనూ తీసుకోవచ్చు. మామూలు పాలలో మాదిరిగానే సోయా పాలలోనూ ప్రొటీన్ ఉంటుంది. అయితే ఇవి కొంతమంది పడకపోవచ్చు. అలాంటి తీసువకునే విషయంలో వైద్యులను సంప్రదించాలి.

- . అలాగే బఠానీలు, రాజ్మా, బీన్స్, చిక్కుళ్లు, ఇతర కూరగాయల్లోనూ ప్రొటీన్ ఉంటుంది.
- చేపల్లో ప్రొటీన్లతో పాటు గుండెకు మేలు చేసే ఒమేగా కొవ్వు ఆమ్లాలూ ఎక్కువగానే ఉంటాయి.
- ఇతర మాంసాహార పదార్థాల్లో కూడా ప్రొటీన్లు దండిగా ఉంటాయి. అయితే వీటిల్లో కొవ్వు కూడా ఎక్కువగా ఉంటుంది. కాబట్టి మితంగానే తినాలి. ఈ క్రమంలో చర్మం తీసేసిన చికెన్ తీసుకోవడం మంచిది. అలాగే కోడి గుడ్డులో కూడా ప్రొటీన్ ఉంటుంది.కానీ కొలెస్ట్రాల్ ఎక్కువగా ఉన్నవారు, గుండెజబ్బు, మధుమేహం వంటి సమస్యలు ఉన్నవారు డాక్టర్ల సలహా మేరకే ఎన్ని గుడ్లను తినొచ్చో నిర్ణయించుకోవాలి. □



# అందచందాలకు బాదం!



**బాదం పప్పులు శరీరానికి ఎంతో మేలు చేస్తాయి. అలాగే బాదం నూనెలో కూడా అందానికి మేలు చేసే గుణాలెన్నో ఉన్నాయి. ఇందులో ఉండే విటమిన్'ఇ' మెనోశ్చాచురేటెడ్ ఫ్యాటీ ఆమ్లాలలు, మాంసకృత్తులు, పొటాషియం, జింక్.. వంటి పోషకాలు అందాన్ని ఇనుమడింపజేస్తాయి. మరి బాదం నూనె వల్ల కలిగే సౌందర్య ప్రయోజనాలేంటో తెలుసుకుందాం..**

- జుట్టు చివర్లు చిట్లడం, పొడిబారడం వంటి సమస్యలు కొందరిని ఇబ్బంది పెడుతుంటాయి. ఇలాంటప్పుడు బాదం నూనె, ఆముదం, ఆలివ్ నూనెల్ని సమపాళ్లలో తీసుకొని కలిపి.. ఈ మిశ్రమంతో కుదుళ్లను మర్దనచేసుకోవాలి. ఇలా కనీసం వారంలో రెండుసార్లు చేస్తే జుట్టు ఆరోగ్యంగా పెరుగుతుంది.



- స్నానం చేయడానికి ముందు శరీరానికి బాదం నూనె రాసుకొని బాగా మర్దన చేసుకోవాలి. ఇందులోని పోషకాలు చర్మానికీ తేమనందిస్తాయి.
- కళ్ల కింద నల్లటి వలయాలు ఇబ్బంది పెడుతున్నాయా? అయితే రాత్రి పడుకునే ముందు కొన్ని చుక్కల బాదం నూనెనుకళ్ల కింద అప్లై చేసుకొని మృదువుగా మర్దన చేసుకోవాలి. ఇలా రోజూ చేస్తుంటే మార్పుక కనిపిస్తుంది.
- . చిన్న వయసులోనే వృద్ధాప్య ఛాయలు ఇబ్బంది పెట్టే వారికి బాదం నూనె మేలు చేస్తుంది. ఇందులోని పోషకాలు యాంటీ ఏజింగ్ కారకాలుగా పనిచేస్తాయి. దీన్ని తరచూ రాసుకోవడం వల్ల ముడతలు కూడా మాయమవుతాయి.
- దుమ్ము, ధూళి వంటివి చర్మాన్ని నిర్జీవంగా మారుస్తాయి. రెండు చెంచాల పెసరపిండిలో సరిపడా బాదం నూనె కలుపుకొని పేస్ట్‌లా చేసుకోవాలి. దీన్ని చర్మానికి నలుగులా రాసుకుంటే మృతకణాలు తొలగిపోతాయి. చర్మం తాజాగా మారుతుంది
- బాదం నూనె సహజసిద్ధమైన సన్‌స్క్రీన్‌లా పనిచేస్తుంది. ఎండ వల్ల కమిలిన చర్మాన్ని సహజ రంగులోకి తీసుకొస్తుంది. పొడిబారి గరుకుగా మారిన చర్మానికి, పగిలిన మడమలకు ఈ నూనెను పట్టించి బాగా మర్దన చేస్తే మార్పు కనిపిస్తుంది. □

ఆధ్యాత్మికం



## తులసి దళం విశిష్టత!

మహిళలు భక్తి శ్రద్ధలతో తులసి మాతను పూజిస్తారు. ఈ తులసి శ్రీ మహావిష్ణువుకు ప్రీతికరమైనది. అందుకే శ్రీ మహా విష్ణువును పూజించడానికి తులసిదళం ఉపయోగిస్తారు. దేవతారాధనలో తులసి ఎంతో విశిష్టమైన స్థానం వున్నది. తులసి మొక్కలు పెరటిలో పెంచుతారు. అక్కడ పవిత్రంగా ఉంచాలి. అపరిశుభ్రత ఉండరాదు. తులసి ఆకులను మాత్రమే తుంచాలి. కొమ్మలను విరువకూడదు. పవిత్రమైన మొక్క తులసి మొక్కగా భావించాలి. సమస్త తీర్థాలు, పవిత్ర నదులు, దేవతలు అందరూ తులసి దళాల్లోనే నివసిస్తారు. అనిపురాణాలు చెబుతున్నాయి. గోదాదేవి కళ్యాణం తులసి అలంకరణతోనే జరగడం విశేషం. గంగానదిలో స్నానం చేస్తే ఎంత ఫలితం కలుగుతుందో అంతట ఫల తులసిని పూజిస్తే కలుగుతుంది. పెళ్లికాని యువతులు తులసికోటని ప్రతి నిత్యం పూజిస్తే చక్కటి ఫలితం లభిస్తుంది. తులసి పరిమళం పవిత్రంగా ఉంటుంది. భక్తి శ్రద్ధలతో తులసిని పూజిస్తే చేసిన పాపాలన్నీ పోతాయి ఓమ్‌నమో నారాయణాయ అని తలచి తులసి ఆకు తుంచాలి. తులసి కోట వద్ద సంధ్యా దీపం వెలిగిస్తే శివకేశవులు కొలువుంటారు. శ్రీ కృష్ణుడు, శ్రీ మహావిష్ణువు ఆరాధనలో తులసి దళం వాడకం విశిష్టమైనది. తులసి దళం ప్రాముఖ్యత గురించి విష్ణుపురాణంలో వివరించడం జరిగింది. అనవసరంగా ఎప్పుడు పడితే అప్పుడు తులసి దళాలు తుంచరాదు. పవిత్రమైన తులసి దళాలు తిరుమల శ్రీవారి అలంకారములలో తులసి దళం ఉపయోగిస్తాం. ఇంటి వాకిట తులసి కోట కళకళలాడుతూ ఉండాలి. ప్రతి నిత్యం అలికి ముగ్గు వేసి పరిశుభ్రత పాటించాలి. ఆయుర్వేదంలో తులసి ప్రాముఖ్యత అద్భుతంగా వివరించారు. రోజూ రెండు తలసి ఆకులనుతింటే మంచిది ఆరోగ్యకరం.




- ఎల్. ప్రఫుల్ల చంద్ర.

# తెర

## రంగంలోకి బ్రహ్మాస్త్ర టీమ్

ప్రముఖ దర్శకుడు అయాన్ ముఖర్జీ తెరకెక్కించిన బ్రహ్మాస్త్ర సినిమాలోని కేసరియా పాట దేశాన్ని ఊపేసింది. మరోసారి అయాన్ తన టీంను వార్ 2 కోసం రంగంలోకి దించారు. ఇండియన్ ఐకానిక్ స్టార్స్ అయిన హృతిక్ రోషన్, ఎన్టీఆర్, కియారా అద్వానీ కాంబోలో వార్ 2 సినిమాని యష్ రాజ్ ఫిల్మ్స్ భారీ ఎత్తున నిర్మించింది. ఆగస్ట్ 14న రాబోతోన్న ఈ చిత్రానికి సంబంధించిన ట్రైలర్ ఇప్పటికే సోషల్ మీడియాలో హల్చల్ చేస్తోంది. తాజాగా ఈ మూవీలోని ఓ డ్యూయెట్ సాంగ్ అప్డేట్ వచ్చింది. హృతిక్, కియారా మీద చిత్రీకరించే ఈ పాట కోసం తన బ్లాక్ బస్టర్ కేసరియా సంగీత బృందాన్ని రంగంలోకి దించారు అయాన్ ముఖర్జీ. వార్ 2లోని ఈ యుగళ గీతం కోసం ప్రీతమ్, అరిజిత్ సింగ్, అమితాబ్ భట్టాచార్య మళ్ళీ ఒకే చోటకు చేరారు. బ్రహ్మాస్త్రలో ఆ పాటను అలియాభట్, రణబీర్ కపూర్ మీద చిత్రీకరించారు.

త్వరలోనే వార్ 2లోని ఈ పాటను సోషల్ మీడియాలో రిలీజ్ చేసి మరింత హైప్ పెంచాలని చిత్రయూనిట్ భావిస్తోంది. వార్ 2లో హృతిక్, కియారా పాత్ర మధ్య ప్రేమను చూపించే అందమైన



ట్రాక్‌గా ఈ పాటను కంపోజ్ చేస్తున్నారట. ఇదే వార్ 2 నుంచి వచ్చే మొదటి పాట అవుతుందన్న సంగతి తెలిసిందే. థియేట్రికల్ యాక్షన్ ప్యాక్డ్ వార్ 2 ఆగస్టు 14న ప్రపంచవ్యాప్తంగా హిందీ, తెలుగు, తమిళ భాషలలో థియేటర్లలో విడుదల కానుంది.

## నెట్ వర్క్ మిస్ అయితే..

ఇరవై యేళ్ళు క్రితం ప్రేమికులు సినిమాతో టాలీవుడ్ ఎంట్రీ ఇచ్చింది కామ్నా జఠల్మాని. కాస్తంత గ్యాప్ తర్వాత ఇప్పుడు కామ్నా నెట్ వర్క్ వెబ్ సీరిస్ లో ఓ కీలక పాత్రను



పోషించింది. ఇది ఆహాలో స్ట్రీమింగ్ కాబోతోంది. ప్రముఖ నటుడు శ్రీరామ్, శ్రీనివాస సాయి, ప్రియా వడ్లమాని, జామ్నా జఠల్మానీ ప్రధాన పాత్రలు పోషించిన వెబ్ సీరిస్ నెట్ వర్క్. ఈ నెల 31 నుండి ఆహాలో ఇది స్ట్రీమింగ్ కాబోతోంది. సతీశ్ చంద్ర నాదెళ్ళ దర్శకత్వంలో లావణ్య ఎన్.ఎస్., జంగం ఎం గ్రేస్ నిర్మించిన ఈ వెబ్ సీరిస్ కు శేఖర్ చంద్ర సంగీతం అందించారు. ఒక్క రోజులో జరిగే నాలుగు కథల సమాహారం ఇది. ఓ క్లిష్టమైన పరిస్థితుల్లో నెట్ వర్క్ మిస్ అయితే... ఎలాంటి పరిణామాలు చోటు చేసుకుంటాయో తెలియచెప్పే వెబ్ సీరిస్ ఇది. తాజాగా దీని ట్రైలర్‌ను మేకర్స్ రిలీజ్ చేశారు.



## మిఠాయి పొట్లమే..

విజయ్ సేతుపతి, నిత్యా మీనన్ జంటగా తమిళంలో రీసెంట్‌గా వచ్చిన చిత్రం తలైవన్ తలైవి. ఇప్పుడీ సినిమాను సర్ మేడమ్అనే పేరుతో తెలుగులోకి అనువదించి రిలీజ్ చేస్తున్నారు. గత వారమే రిలీజ్ కావాల్సి ఉన్న ఈ సినిమా హరిహర వీరమల్లు రిలీజ్ నేపథ్యంలో వాయిదా వేసి ఆగష్టు1న థియేటర్లకు తీసుకు వస్తున్నారు. ఈక్రమంలో ఇప్పటికే విడుదల చేసిన టీజర్, ట్రైలర్ సినిమాపై మంచి స్పందనను తీసుకు వచ్చాయి. ఈ నేపథ్యంలో.. తాజాగా ఈచిత్రం నుంచి గంటల వ్యవధిలోనే రెండు పాటలను యూ ట్యూబ్ లో రిలీజ్ చేశారు. అందులో ఒకటి మెలోడీ కాగా, మరోటి ఎమోషనల్ సాంగ్. ఈ రెండు పాటలకు రాంబాబు గోసాల సాహిత్యం అందించగా సంతోష్ నారాయణన్సంగీతం అందించారు. మిఠాయి పొట్లమే అంటూ సాగే పాటను శ్రీధర్ రమేశ్, పవిత్రా చారి ఆలపించగా, కన్నా నీ చూపే ఊపిరిలే అంటూ సాగే పాటను శరత్ సంతోష్ ఆలపించాడు.



## రేయింబవళ్లు ఉస్తాద్ పరుగులు

పవర్ స్టార్ పవన్ కళ్యాణ్ రేయింబవళ్ళు పనిచేస్తున్నారు. ఓ పక్క ఏపీ డిప్యూటీ సీఎంగా బాధ్యతలు నిర్వర్తిస్తూనే కమిట్ అయిన సినిమాను పూర్తి చేసే పనిలో బిజీగా ఉన్నారు. పవన్ కళ్యాణ్ నటించిన ఖిహరిహర వీరమల్లుఖి సినిమా ఈ నెల 24న విడుదలై థియేటర్లలో సందడి చేస్తుండగానే... ఆయన ఓజీ సినిమా షూటింగ్‌ను పూర్తి చేశారు. తాజాగా ఖిఉస్తాద్ భగత్ సింగ్ సినిమా క్లయిమాక్స్ నూ కంప్లీట్ చేశారు. భావోద్వేగాలు, యాక్షన్‌తో కూడిన ఈ క్లయిమాక్స్ ను దర్శకుడు హరీశ్ శంకర్ అద్భుతంగా తెరకెక్కించాడని నిర్మాతలు, మైత్రీ మూవీస్ అధినేతలు నవీన్ ఎర్నేని, రవిశంకర్ చెబుతున్నారు. ఈ క్లయిమాక్స్ కు నబకాంత కొరియోగ్రఫీ అందించారు. ఈ సీక్వెన్స్ అద్భుతంగా రావడంత పవన్ కళ్యాణ్ సైతం హర్షం వ్యక్తం చేశారు. షూటింగ్ పూర్తి అయిన తర్వాత నబకాంత టీమ్ లోని అందరికీ ఆయన ఫోటోగ్రాఫ్స్ ఇచ్చారని చిత్రబృందం తెలిపింది. గబ్బర్ సింగ్ లాంటి సూపర్ డూపర్ హిట్ సినిమా తర్వాత పవన్ కళ్యాణ్, హరీశ్ శంకర్ కాంబోలో రాబోతున్న ఈ సినిమా మీద కూడా భారీ అంచనాలే ఉన్నాయి. ఈ మూవీలో శ్రీలీల, రాశీఖన్నా హీరోయిన్లుగా నటించారు. ఇందులో ఇతర ప్రధాన పాత్రలను పార్థిబన్, కె. ఎస్. రవికుమార్, రాంకీ, నవాబ్ షా, కేజీఎఫ్ ఫేమ్ అవినాష్, నాగ మహేష్, టెంపర్ వంశీ తదితరులు పోషిస్తున్నారు. ఈ సినిమాకు అత్యున్నత సాంకేతిక బృందం పనిచేస్తోంది. రాక్‌స్టార్ దేవిశ్రీ ప్రసాద్ సంగీతం అందిస్తున్నారు. యువ ప్రతిభావంతుడు ఉజ్వల్ కులకర్ణి ఎడిటింగ్ బాధ్యతలు నిర్వహిస్తున్నారు. రామ్‌లక్ష్మణ్ ద్వయం, నబకాంత మాస్టర్ యాక్షన్ సన్నివేశాలకు కొరియోగ్రఫీ చేస్తున్నారు. ఈ చిత్రానికి ఛాయాగ్రాహకుడిగా అయనంక బోస్, కాస్ట్యూమ్ డిజైనర్‌గా నీతా లుల్లా, కళా దర్శకుడిగా ఆనంద్ సాయి వ్యవహరిస్తున్నారు.



## రగిలే రగిలే మొదలయ్యే యుద్ధాలే


విజయ్ దేవరకొండ, భాగ్య శ్రీ భోర్సే జంటగా జర్సీ ఫేం గౌతమ్ తిన్ననూరి దర్శకత్వంలో సితార ఎంటర్ టైన్‌మెంట్స్ నిర్మాణంలో రూపొందిన చిత్రం కింగ్డమ్. అనిరుద్ రవిచందర్ సంగీతం అందించాడు. ఇప్పటికే ఈ చిత్రం నుంచి విడుదల చేసిన పాటలు, టీజర్, ట్రైలర్ సినిమాపై అంచనాలను రెట్టింపు చేసి ఓ రేంజ్‌లో నిల బెట్టాయి. జూలై 31న ప్రపంచ వ్యాప్తంగా ఈ సినిమా ప్రేఓకుల ఎదుటకు రాబోతుంది.

ఈ నేపథ్యంలో ఇటీవల తిరుపతి, హైదరాబాద్‌లలో ప్రత్యేక ఈవెంట్లు నిర్వహించి సినిమాకు మరింత బజ్ తీసకు వచ్చారు. కాగా తాజాగా మేకర్స్ ఈ చిత్రం నుంచి రగిలే రగిలే అంటూ సాగే థీమ్ సాంగ్‌ను విడుదల చేశారు. ఈ పాటకు కృష్ణకాంత్ సాహిత్యం అందించగా సిద్ధార్థ్ బస్రూర్ ఆలపించారు. హైదరాబాద్ లోని యూసఫ్‌గూడ పోలీస్ గ్రౌండ్స్‌లో "కింగ్‌డమ్ ప్రీ రిలీజ్ వేడుక అంగరంగ వైభవంగా జరిగింది.



## మాస్ జాతరకు ఫినిషింగ్ టచ్


మన టాలీవుడ్ మోస్ట్ ఎనర్జిటిక్ స్టార్ హీరో మాస్ మహారాజ రవితేజ హీరోగా శ్రీలీల హీరోయిన్ గా దర్శకుడు బాను భోగవరపు తెరకెక్కిస్తున్న అవైటెడ్ మాస్ చిత్రమే "మాస్ జాతర". మళ్ళీ క్రాక్ సినిమా తర్వాత తన నుంచి వస్తున్న ప్రాపర్ కమర్షియల్ సినిమాగా మంచి అంచనాలు దీనిపై ఉన్నాయి. ప్రామిసింగ్ గ్లింప్స్ సహా మంచి ఫస్ట్ సింగిల్‌లో ప్రామిసింగ్ ఎంటర్టైన్మెంట్ ని అందించడానికి రెడీ అవుతున్న సినిమాకి మాస్ మహారాజ ఫినిషింగ్ టచ్ ఇచ్చే పనిలో ఉన్నారు. లేటెస్ట్‌గా సినిమా డబ్బింగ్‌ని ముగించేందుకు రవితేజ ఇప్పుడు డబ్బింగ్ స్టూడియోలో ఎంటర్ అయ్యారు. సో ఇవి అయ్యిపోతే ఇక అసలు మాస్ జాతర దగ్గరలోనే ఉందని చెప్పవచ్చు. ఇక ఈ చిత్రానికి భీమ్స్ సంగీతం అందిస్తుండగా సితార ఎంటర్టైన్మెంట్స్ అలాగే ఫార్చ్యూన్ ఫోర్ సినిమాస్ వారు నిర్మాణం వహిస్తున్నారు. అలాగే ఈ ఆగస్ట్ 27న సినిమా గ్రాండ్ గా విడుదలకి సిద్ధం అవుతోంది.



## నవ్వులపల్లకిలో భార్యభర్తల బాట



లావణ్య త్రిపాఠి కొణిదెల, దేవ్ మోహన్ ప్రధాన పాత్రల్లో తెరకెక్కుతోన్న చిత్రం సతీ లీలావతి. ప్రముఖ నిర్మాణ సంస్థ ఆనంది ఆర్ట్స్ సమర్పణలో దుర్గాదేవి పిక్చర్స్ బ్యానర్‌పై నాగమోహన్ ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. భీమిలీ కబడ్డీ జట్టు, ఎస్.ఎం.ఎస్(శివ మనసులో శృతి) ఫేమ్ తాతినేని సత్య దర్శకత్వం వహిస్తున్నారు. భార్య, భర్త మధ్య ఉండే అనుబంధాన్ని ఎమోషనల్‌గానే కాకుండా ఎంటర్‌టైనింగ్‌గానూ తెరకెక్కించిన ఫన్నీ ఎంటర్‌టైనర్ సతీ లీలావతి. మంగళవారం మేకర్స్ మూవీ టీజర్‌ను విడుదల చేశారు. టీజర్‌ను గమనిస్తే లావణ్య, దేవ్ మోహన్ జంట పెళ్లి చేసుకుని ఆనందంగా ఉంటుంది. కానీ నెక్స్ట్ సీన్‌లోనే దేవ్ మోహన్‌ను లావణ్య కొట్టి కట్టేసుంటుంది. వారి మధ్య జరిగే గొడవకు సంబంధించిన కొన్ని సన్నివేశాలను టీజర్‌లో మనం గమనించవచ్చు. అలాగే భార్య భర్తల మధ్య జరిగే గొడవలో వి.కె.నరేష్, వి.టి.వి.గణేష్, సప్తగిరి, జాఫర్, మొట్ట రాజేంద్రన్ ఎందకు ఇన్ వాల్వ్ అయ్యారు. అసలు గొడవేంటి? అనే విషయాలను తెలుసుకోవాలంటే సినిమా చూడాల్సిందేనంటున్నారు దర్శక నిర్మాతలు. షూటింగ్ పూర్తి చేసుకున్న సతీ లీలావత్తి సినిమా పోస్ట్ ప్రొడక్షన్ కార్యక్రమాలు శరవేగంగా జరుగుతున్నాయి. అనుకున్న ప్లానింగ్ ప్రకారం మేకర్స్ సినిమాను శరవేగంగా పూర్తి చేసి సినిమాను విడుదల చేయటానికి సన్నాహాలు చేస్తున్నారు. ఫీల్ గుడ్ మూవీగా అందరినీ ఆకట్టుకునేలా, అన్ని వర్గాల ప్రేక్షకుల్ని మెప్పించేలా ఈ చిత్రాన్ని రూపొందిస్తున్నారు. ఈ మూవీకి సంగీత దర్శకుడిగా మిక్కీ జే మేయర్, కెమెరామెన్‌గా బినేంద్ర మీనన్, ఎడిటర్‌గా సతీష్ సూర్య పని చేస్తున్నారు.



## కింగ్‌కు అరుదైన గౌరవం

అక్కినేని నాగార్జునను తెలుగు ప్రేక్షకులు నాగ్ అని, మన్మథుడు అని, కింగ్ అని ముద్దుగా పిలుచుకుంటూ ఉంటారు. ఇప్పుడు పాన్ ఇండియా సినిమాల ప్రభావం వల్ల పాన్ ఇండియా ప్రేక్షకులూ అలానే అంటున్నారు. అయితే ఓ దేశంలో మాత్రం నాగార్జునను నాగ్ సమా అని పిలుస్తున్నారు. దీని వెనుక పెద్ద కథే ఉంది. కుబేర సినిమా విడుదల సందర్భంగా ఈ విషయం బయటకు వచ్చింది. కుబేర సినిమా ఇటీవల ఓటీటీలో విడుదలైన తర్వాత ప్రపంచం మొత్తం ఆసక్తిగా చూస్తోంది. అలా జపాన్ వాసులు సినిమాను చూసి తమ ఆనందాన్ని సోషల్ మీడియాలో వెలిబుచ్చుతున్నారు. సినిమా గురించి, అందులో దీపక్ పాత్రలో నాగార్జున నటన గురించి, నాగ్ గురించి ప్రత్యేకంగా రాసుకొస్తున్నారు. ఈ క్రమంలో నాగ్ సమా అని పిలుస్తుండటం గమనార్హం. దీంతో అసలు ఈ"సమా ఏంటి అని ఆరా తీస్తే ఆసక్తికర విషయం ఒకటి బయటికొచ్చింది. మన గౌరవం, మర్యాద ఇచ్చేటప్పుడు గారు అని అంటుంటాం కదా అలా జపనీయులు సమా అని అంటారట. జపాన్లో దేవుళ్లు, రాజులను, గొప్పవాళ్ల గురించి మాట్లాడేటప్పుడు ఆఖరులో సమా అనే పదం జోడిస్తారు. ఆ గౌరవం ఇప్పుడు నాగార్జునకు దక్కింది. దీనికి సంబంధించి జపనీయుల సోషల్ మీడియా పోస్టులు సోషల్ మీడియాలో వైరల్‌గా మారాయి. ఇదంతా ఎక్కడ మొదలైందా అని చూస్తే.. రణబీర్ కపూర్ బ్రహ్మాస్త్ర సినిమాలో అక్కినేని నాగార్జున ఓ ప్రధాన పాత్ర పోషించారు. ఆ సినిమా జపాన్ ప్రేక్షకుల్ని కూడా ఆకట్టుకుంది. అప్పటి నుండి నాగార్జునకు అక్కడ ఫ్యాన్ బేస్ పెరిగింది. అలా"సమా అనే గౌరవం కూడా యాడ్ అయింది. ఇప్పుడు కుబేర సినిమాలో నటన చూసిన తర్వాత ఆ ప్రేమ, అభిమానం, సమా ఇంకా పెరిగాయన్నమాట. రజనీకాంత్ కూలీ సినిమాలోనూ నాగార్జున నటిస్తుండటంతో ఆ సినిమా గురించి మాట్లాడుతున్నప్పుడు కూడా నాగ్ సమా అనే రాస్తున్నారు జపనీయులు.

## భయపెడుతున్న సంజు బాబా

పాన్ ఇండియా స్టార్ ప్రభాస్ హీరోగా నిధి అగర్వాల్, మాళవిక మోహనన్ అలాగే రిద్ధి కుమార్ లు హీరోయిన్స్‌గా దర్శకుడు మారుతీ తెరకెక్కిస్తున్న భారీ పాన్ ఇండియా చిత్రమే ది రాజా సాబ్ కోసం అందరికీ తెలిసిందే. హారర్ అండ్ కామెడీ ఎంటర్టైనర్ గా ప్లాన్ చేస్తున్న భారీ చిత్రం టీజర్ తర్వాత మాత్రం మరిన్ని అంచనాలు సెట్ చేసుకుంది. మరి ఈ సినిమాలో బాలీవుడ్ స్టార్ నటుడు సంజయ్ దత్ కూడా పవర్ఫుల్ రోల్ చేస్తున్న సంగతి తెలిసిందే. టీజర్‌లో తనపై విజువల్స్ కూడా అందరినీ ఆశ్చర్యపరిచాయి. ఇక నేడు సంజయ్ పుట్టినరోజు కానుకగా మేకర్స్ ఓ ఇంట్రెస్టింగ్ పోస్టర్‌ని విడుదల చేశారు. మరి ఇందులో సంజయ్ సంజు బాబాగా ఒక వయసు మళ్ళిన ముసలి రాజుగా మీసం మెలేస్తూ, సాలీడు గూళ్ళ నడుమ భయానకంగా కనిపిస్తున్నాడు.




ఇలా మేకర్స్ స్పెషల్ విషెస్ ని అందించారు. ఇక ఈ చిత్రానికి థమన్ సంగీతం అందిస్తుండగా టీజీ విశ్వ ప్రసాద్ అలాగే ఇషాన్ సక్సేనాలు నిర్మాణం వహిస్తున్నారు.

## ఎప్పటికీ నేను తెలుగోళ్ల బక్కోడినే

అభిమానులందు తెలుగు అభిమానులు వేరయా అని చెప్తే అతిశయోక్తి అస్సలు అనిపించదు. భాషా బేధం లేకుండా.. రంగురూపు చూడకుండా.. చిన్నా పెద్ద అస్సలు పట్టించుకోకుండా కథ నచ్చితే హిట్ చేస్తారు. హీరో నచ్చితే గుండెల్లో పెట్టుకుంటారు. ఒక్కసారి కనుక అభిమానిగా మారితే పోయేవరకు వారి గుండెల్లోనే ఉంచుకుంటారు. అది తెలుగువారి అభిమానం. అందుకే ఎన్ని ఇండస్ట్రీలో ఉన్న ఏ ఒక్క స్టార్ ను అడిగినా చెప్తారు.. తెలుగువారి అభిమానం గురించి. కేవలం హీరోలను మాత్రమే అభిమానిస్తారేమో అనుకుంటారు.

తెలుగువారికి ఎవరైనా నచ్చారు అంటే.. వారిని సింహాసనం మీద కూర్చోబెడతారు. ఒకప్పుడు మ్యూజిక్ డైరెక్టర్స్ అంటే అప్పుడప్పుడు కనిపించడం తప్ప ప్రమోషన్స్‌లో కనిపించేవారు కాదు. కానీ, ఇప్పుడు అలా కాదు.. మ్యూజిక్ డైరెక్టర్స్ డైరెక్ట్‌గా మ్యూజిక్ కన్సర్ట్ ఏర్పాటుచేసి సినిమాలోని సాంగ్స్‌ను పాడి వినిపిస్తున్నారు. అలా ప్రమోషన్స్‌లో ఎక్కువ కనిపించే మ్యూజిక్ డైరెక్టర్ అనిరుధ్. కోలీవుడ్‌ను తన మ్యూజిక్‌తో షేక్ ఆడించిన అనిరుధ్ ఈ మధ్య తెలుగు సినిమాలతో బిజీగా మారాడు. తెలుగువారు అనిరుధ్‌కు ముద్దుగా బక్కోడు అని పేరు పెట్టిన విషయం కూడా తెల్సిందే. ప్రస్తుతం అనిరుధ్ మ్యూజిక్ అందిస్తున్న చిత్రాల్లో కింగ్డమ్ ఒకటి. విజయ్ దేవరకొండ, భాగ్యశ్రీ బోర్సే జంటగా గౌతమ్ తిన్ననూరి దర్శకత్వంలో తెరకెక్కిన ఈ సినిమా జూలై 31న ప్రేక్షకుల ముందుకు రానుంది. రిలీజ్ డేట్ దగ్గర పడుతుండడంతో ప్రమోషన్స్ షురూ చేసిన మేకర్స్ కింగ్డమ్ ప్రీ రిలీజ్ ఈవెంట్‌ను హైదరాబాద్‌లో నిర్వహించారు. ఇక ఈ ఈవెంట్‌లో బక్కోడు.. తన హిట్ సాంగ్స్ పాడి రచ్చ రేపాడు. ఇక ఈ ఈవెంట్‌లో అనిరుధ్.. తెలుగువారు తనపై చూపిస్తున్న ప్రేమకు కృతజ్ఞతలు తెలిపాడు. అది కూడా తెలుగు నేర్చుకొని మరీ అనిరుధ్.. వారి ప్రేమకు థాంక్స్ చెప్పుకొచ్చాడు. కింగ్డమ్ సినిమా కోసం అందరూ చాలా కష్టపడ్డాం. ముఖ్యంగా నాగవంశీ.. నా నుంచి వచ్చే ప్రతి సాంగ్ కోసం నాగవంశీ ఎదురుచూస్తూ ఉంటాడు. ఈ సినిమాలో నటించిన భాగ్యశ్రీ, సత్యదేవ్, వెంకటేష్ అందరూ చాలా బాగా చేశారు. ఇక రౌడీ హీరో విజయ్ గురించి చెప్పాలి. సాధారణంగా ఏ హీరో అయినా రిలీజ్ ఇంకో వారంలో ఉంది అంటే



వర్క్ ఫినిష్ చెయ్ అని చెప్తారు. కానీ, వీడీ నాకు పెద్ద మెసేజ్ చేశాడు. వర్క్ తో పాటు హెల్త్ కూడా ముఖ్యమే. రెస్ట్ తీసుకో అని పంపాడు. అది విజయ్ పెద్ద మనసు. కింగ్డమ్ సినిమా.. నాకే కాదు గౌతమ్‌కు, విజయ్ కు, నాగవంశీకి కెరీర్ మైల్డ్ స్టోన్ సినిమా అని చెప్పొచ్చు. ఇక ఇక్కడకు వచ్చిన అభిమానుల గురించి చెప్పాలి. 13 ఏళ్ల క్రితం నా మొదటి సినిమా 3 రిలీజ్ అయ్యింది. అప్పటినుంచి వారు నాపై ప్రేమను చూపిస్తూనే ఉన్నారు. నా తెలుగు ఫ్యామిలీ నన్ను మీ అబ్బాయిగా దత్తత తీసేసుకున్నారు. నన్ను మీ వాడిని చేసుకున్నారు. మీరు నా వాళ్లు అయ్యిపోయారు. ఎప్పటికీ నేను మీ అనిరుధ్ నే.. బక్కోడినే అంటూ చెప్పుకొచ్చాడు. ప్రస్తుతం అనిరుధ్ వ్యాఖ్యలు నెట్టింట వైరల్ గా మారాయి. ఇక ఈ వ్యాఖ్యలు విన్న తెలుగు అభిమానులు బక్కోడా.. ఒక్క మాటతో గుండెలను పిండేశావ్ కదరా అంటూ కామెంట్స్ పెడుతున్నారు.

## రొమాంటిక్‌గా తెలుసు కదా

యూత్ ఐకాన్ స్టార్ సిద్ధు జొన్నలగడ్ హీరోగా రాశీఖన్నా, శ్రీనిధి శెట్టి హీరోయిన్లుగా తెరకెక్కుతున్న చిత్రం తెలుసు కదా. ఈ సినిమాతో కాస్ట్యూమ్ డిజైనర్ నీరజ కోన దర్శకురాలిగా ఇండస్ట్రీకి పరిచయం కాబోతున్నారు. ఈ సినిమాను దీపావళి కానుకగా అక్టోబరు 17న రిలీజ్ చేయబోతున్నారు. మూవీ ప్రమోషన్ లో భాగంగా తాజాగా మల్లిక గంధ అంటూ సాగే పాటను రిలీజ్ చేశారు. ఈ పాటకు కృష్ణకాంత్ లిరిక్స్ రాయగా తమన్ సంగీతం అందించాడు. సింగర్ సిద్ శ్రీరామ్ మరోసారి తనమార్క్ చూపించారు. పాటను అద్భుతంగా పాడాడు. థమన్ మ్యూజిక్, సిద్ శ్రీరామ్ వాయిస్ పాటను ఎక్కడికో తీసుకువెళ్లింది. తంబురా, ఫ్లూట్ లాంటి ట్రెడిషనల్ వాయిద్యాలను మోడ్రన్ టచ్ లో వినిపించడం అదిరిపోయింది. సిద్ శ్రీరామ్ లిస్టులో మరో హిట్ పడినట్టే అని మ్యూజిక్ లవర్స్ అంటున్నారు. ఈ మెలోడీ సాంగ్‌లో సిద్ధు, రాశీఖన్నా మధ్య రొమాంటిక్ సీన్స్ ఆకట్టుకుంటున్నాయి. కాగా ఈ చిత్రాన్ని పీపుల్ మీడియా ఫ్యాక్టరీ బ్యానర్‌పై టిజి విశ్వ ప్రసాద్, కృతి ప్రసాద్ నిర్మిస్తున్నారు.



## మూడు ముక్కల పవర్ పేట నుంచి నితిన్ ఔట్





పెద్ద హీరోతో సినిమా కాకపోయినా.. టాలీవుడ్‌లో గత కొన్నేళ్లుగా మాట్లాడిన, ఇప్పుడు పెద్దగా మాట్లాడని సినిమా పవర్ పేట. గుర్తొచ్చిందా ఈ సినిమా అప్పుడెప్పుడో నితిన్ – కృష్ణ చైతన్య కాంబినేషన్‌లో అనౌన్స్ అవ్వడానికి అంతా రెడీ చేసుకున్న సినిమా ఇది. చాలా రోజులు ఈ సినిమా గురించి చర్చలు జరిగాయి. ఎందుకంటే సగటు తెలుగు సినిమా స్టైల్‌కు చాలా దూరంగా ఈ సినిమా ఉంటుంది అని అప్పట్లో చెప్పుకొచ్చారు. ఇప్పుడు వివిధ పరిస్థితుల నేపథ్యంలో ఈ సినిమా చేతులు మారింది అని అంటున్నారు. అలాగే నిర్మాత కూడా మారారు అని సమాచారం. రౌడీ ఫెలో, చల్ మోహనరంగా, గ్యాంగ్స్ ఆఫ్ గోదావర్థి సినిమాలతో డిఫరెంట్ దర్శకుడు అనే పేరు తెచ్చుకున్నారు కృష్ణ చైతన్య. అయితే విజయం విషయంలో మాత్రం ఇంకా ఆశించిన ఫలితం అందుకోవడం లేదు. ఈ క్రమంలో పవర్ పేట పేరుతో ఒక కథ రాసుకున్నారు. నితిన్ హీరోగా తెరకెక్కించాలని ప్లాన్ చేశారు. బడ్జెట్ కారణాలు, నితిన్‌కు వరస ఫ్లాపులు, కృష్ణ చైతన్య సినిమాల ఫలితాలు ఇలా కొన్ని కారణాల వల్ల అది కార్యరూపం దాల్చలేదు. ఇప్పుడు వేరే హీరో, నిర్మాతతో పట్టాలెక్కించే పనిలో ఉన్నారని సమాచారం. యాత్ర, ఆనందో బ్రహ్మ లాంటి సినిమాలు తీసిన 70 ఎంఎం ఎంటర్ టైన్మెంట్స్ నిర్మాణంలో ఈ సినిమా స్టార్ట్ అవుతుంది అని చెబుతున్నారు. హీరోగా సందీప్ కిషన్ నటిస్తాడని సమాచారం. గతంలో వచ్చిన సమాచారం ప్రకారం అయితే పవర్ పేట సినిమా మూడు భాగాలుగా రావాలి. కానీ ఇప్పుడు ఒక్క పార్ట్‌గానే తీద్దాం అనుకుంటున్నారట. గుంటూరు నగరం నేపథ్యంలో ఒక గ్యాంగ్ స్టర్ బాల్యం నుంచి వయసు మళ్లే దాకా జరిగిన పరిణామాలు సినిమాలో చూపిస్తారట.. 70 ఎంఎం టర్‌టైన్మెంట్స్ టీమ్ ఐదుగురు యువ హీరోలతో సినిమా అనౌన్స్ చేసి రీఎంట్రీ స్ట్రాంగ్‌గా ఇచ్చే ఉద్దేశంలో ఉందని సమాచారం. ఈ సినిమా ఆ ఐదులో ఒకటి అని చెబుతున్నారు.



### అవతార్ 3 ట్రైలర్ ఆగయా

అవతార్ ఫైర్ అండ్ యాష్ ట్రైలర్ విడుదలైంది, విజువల్ ఎఫెక్ట్స్, యుద్ధ సన్నివేశాలతో ప్రేక్షకులను ఆకట్టుకుంటోంది. అయితే ఈ మూవీ డిసెంబర్ 19, 2025న ప్రపంచవ్యాప్తంగా విడుదల కానుంది

# డబుల్ బెడ్ ఇళ్లలో ఉండని వారికి నోటీసులు

## వాటి రద్దుకు ఆదేశాలు ఇచ్చే యోచనలో ప్రభుత్వం

**హైదరాబాద్, జూలై 29, ప్రభాతవార్త:** తెలంగాణలో డబుల్ బెడ్రూం ఇళ్ల లబ్ధిదారులకు కాంగ్రెస్ ప్రభుత్వం షాక్ ఇవ్వనుంది. ఇళ్లు పొంది నివాసం ఉండని వారి కేటాయింపులు రద్దు చేయాలని యోచిస్తోంది. దాదాపు 37 శాతం మంది లబ్ధిదారులు ఇళ్లలో ఉండటం లేదు. నగరం వెలుపల ఉపాధి లేక కొందరు ఆసక్తి చూపడం లేదు. గ్రేటర్ హైదరాబాద్‌లో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణంతో పాటు, ఖాళీ ఇళ్ల కేటాయింపులు రద్దు చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. దీనికి సంబంధించిన పూర్తి వివరాలు మీకోసం..డబుల్ బెడ్రూం ఇళ్లు పొందిన లబ్ధిదారులకు తెలంగాణలోని కాంగ్రెస్ ప్రభుత్వం భారీ షాక్ ఇచ్చేందుకు రెడీ అవుతోంది. ఇప్పటికే డబుల్ బెడ్రూం ఇల్లు అద్దెకు ఇచ్చిన వారిపై చర్యలకు సిద్ధమైన సర్కార్.. ఇప్పుడు మరో కీలక నిర్ణయం తీసుకోబోతుంది. డబుల్ బెడ్రూం ఇళ్లు తీసుకుని దానిలో నివాసం ఉండని వారిపై ప్రభుత్వం చర్యలకు సిద్ధమయ్యిందని సమాచారం. డబుల్ ఇళ్లు పొందిన తర్వాత దానిలో నివాసం ఉండని వారి ఇళ్లు రద్దు చేసేందుకు ప్రభుత్వం రెడీ అవుతోంది.డబుల్ బెడ్రూం ఇళ్లు పొంది వాటిల్లో నివాసం ఉండకుండా.. ఖాళీగా ఉంటున్న ఇళ్లను రద్దు చేయాలని ప్రభుత్వ విభాగాలు భావిస్తున్నాయి. అర్హులైన లబ్ధిదారులకు ఇళ్లు కేటాయించి రెండు సంవత్సరాలు కావొస్తున్నా ఇప్పటికీ దాదాపు 37 శాతం ఇళ్లలో లబ్ధిదారులు నివాసం ఉండటం లేదని అధికారుల దృష్టికి వచ్చింది. వీరిలో కొందరికి అప్పటికే సొంతిళ్లు ఉండటంతో వారు డబుల్ బెడ్రూం ఇళ్లలో నివాసం ఉండటం లేదు. ఇక మరికొందరికేమో నగర శివారు ప్రాంతాల్లో ఇళ్లు వచ్చాయి. దీంతో అక్కడకు వెళితే ఉపాధి లభిస్తుందో లేదోనని కొందరు లబ్ధిదారులు.. వారికి కేటాయించిన డబుల్ బెడ్రూం ఇళ్లలో నివాసం ఉండటానికి ఆసక్తి చూపడం లేదని సమాచారం.గ్రేటర్ హైదరాబాద్‌లో ఇందిరమ్మ ఇళ్లు నిర్మించాలని ప్రభుత్వం భావిస్తోంది. దీనిపై ఇటీవల నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఈ విషయం చర్చకు వచ్చినట్టు సమాచారం. ఈక్రమంలో అధికారులకు కీలక ఆదేశాలు జారీ చేశారు. లబ్ధిదారులకు ఇళ్లు ఇచ్చినప్పటికీ వారు వాటిల్లో ఉండటం లేదని.. అలాంటి వారి ఇళ్లను గుర్తించి కేటాయింపు రద్దు చేయాలని ప్రభుత్వం సూచించినట్టు తెలిసింది. ఇందుకు సంబంధించి చర్యలు ప్రారంభించాలని హైదరాబాద్, దాని పరిసర జిల్లాల కలెక్టర్లకు ఆదేశాలు జారీ అయ్యాయి. ఇప్పటికే కొందరు లబ్ధిదారులకు మొదటి విడత నోటీసులు జారీ చేసినట్లు రెవెన్యూ విభాగం వర్గాలు చెబుతున్నాయి.నిర్ణీత గడువులోగా ఇళ్లలోకి వెళ్లకపోతే కేటాయింపు రద్దు చేస్తామని నోటీసుల్లో పేర్కొంటున్నారు. ఇక డబుల్ బెడ్రూం ఇళ్లకు ఎంపికైన లబ్ధిదారుల్లో చాలా మంది రోజువారి కూలి పని చేసుకునే వారు.. ఇళ్లలో పని చేసుకునే వారే ఉన్నారు. వీరికి శివారు ప్రాంతాల్లో ఇళ్లను కేటాయించడంతో.. నగరం విడిచి వెళితే ఉపాధి దొరకదనే ఆందోళనతో ఆ ఇళ్లలో ఉండటం లేదు. అలాంటి డబుల్ ఇళ్లను అద్దెకివ్వడం, అమ్మడమూ నిబంధనల ఉల్లంఘన కిందకు వస్తుందని, అలాంటి కేటాయింపులనూ రద్దు చేసే విషయాన్ని పరిశీలిస్తున్నట్లు అధికారులు తెలిపారు.



మంగళవారం మీడియా సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ లక్ష్మీశ

## దసరా ఉత్సవాలకు పటిష్ట ఏర్పాట్లు : కలెక్టర్ లక్ష్మీశ ఆదేశాలు

**ఇంద్రకీలాద్రి, జూలై 29, ప్రభాతవార్త:** దుర్గమ్మవారి ఆలయంలో ఈసంవత్సరం సెప్టెంబర్ 22నుండి ప్రారంభమయ్యే దసరా ఉత్సవాలకు పటిష్ట ఏర్పాట్లు చేయాలని జిల్లా కలెక్టర్ లక్ష్మీషా అధికారులను ఆదేశించారు. విజయవాడలో దసరా ఉత్సవాల ఏర్పాట్లపై జిల్లాస్థాయి అధికారులతో మంగళవారం జరిగిన మొదటి సమన్వయ సమావేశంలో ఆయన మాట్లాడుతూ సామాన్య భక్తులకు సంతృప్తికర దర్శనం లక్ష్యంగా అధికారులంతా సమన్వయంతో పనిచేయాలన్నారు. పటిష్టమైన కమాండ్ కంట్రోల్‌రూంను ఏర్పాటు చేసి నిరంతర పర్యవేక్షణ చేయాలని, ప్రత్యేక యాప్, టెక్నాలజీ తో కూడిన డ్రోన్ల ద్వారా ఉత్సవ ప్రాంతాన్ని నిరంతరం పర్యవేక్షించాలన్నారు. భక్తుల సౌకర్యార్థం క్యూలైన్లు, తాగునీరు, ప్రసాదం కౌంటర్లు, తాత్కాలిక మరుగుదొడ్లు ఏర్పాటు చేయాలన్నారు. ట్రాఫిక్ నియంత్రణకు, పారిశుద్ధ్య నిర్వహణకు ప్రత్యేక యాప్ ద్వారా చర్యలు తీసుకోవాలన్నారు. నిరంతర విద్యుత్ సరఫరా చేయాలన్నారు. ప్రమాద నివారణకు తగినవిధంగా ఏర్పాట్లు చేయాలన్నారు. కొండచరియలు విరిగిపడకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలు చర్చించారు. మూలా నక్షత్రం రోజున అధిక సంఖ్యలో భక్తులు వస్తారని ఆమేరకు చర్యలు తీసుకోవాలన్నారు. ఈ సమావేశంలో శ్రీ దుర్గామల్లేశ్వర స్వామివార్ల దేవస్థానం ఇఓ వికె శీనా నాయక్, ఆలయ ప్రధాన అర్చకులు, వైదిక కమిటీ, ఆలయ అధికారులు, అదనపు డిప్యూటి పోలీస్ కమీషనర్, వెస్ట్‌జోన్ ఏసిపి, దేవదాయ శాఖాధికారులు, దేవస్థానం అధికారులు పాల్గొన్నారు.

**దుర్గమ్మ ఆలయానికి భక్తుల విరాళం:** దుర్గమ్మ ఆలయంలో జరిగే స్వర్ణతాపడం పనులకు విజయవాడకు చెందిన తులసీల వెంకటరమణ చౌదరి తమ కుటుంబీకులతో కలిసిరు.1,00,116ల విరాళాన్ని మంగళవారం అందించారు.విజయవాడకు చెందిర గుడిపాటి సుదర్శన్ రు.1,00,116ల విరాళాన్ని మంగళవారం అందించారు.దాతలకు, వారి కుటుంబసభ్యులకు దుర్గమ్మవారి దర్శనం ఏర్పాటుచేసిన అధికారులు, దుర్గమ్మవారి ప్రసాదం, శేష వస్త్రం,మెమొంటోలుఅందించారు.వేదపండితులు వేదాశీర్వచనాలు పలికారు.

## మోడీ ప్రసంగాలు ఇస్తుంటే.. రాహుల్‌గాంధీ ఆశలు నింపుతున్నారు

### పిసిసి అధ్యక్షుడు మహేష్‌కుమార్‌గౌడ్

**హైదరాబాద్, జూలై 29, ప్రభాతవార్త :** ప్రధానమంత్రి నరేంద్రమోడీ ప్రసంగాలు ఇస్తుండగా, రాహుల్‌గాంధీ ఆశను నింపుతున్నారు టిపిసిసి అధ్యక్షులు మహేష్ కుమార్‌గౌడ్ అన్నారు. ఈ మేరకు మంగళవారం ట్వీట్ చేశారు. పూంచ్‌లో సరిహద్దు హింసలో అనాథలైన 22 మంది అమాయక పిల్లలు రాహుల్ గాంధీకి విషాదకరమైన శీర్షిక మాత్రమే కాదు... వారు ఆయన బాధ్యత అంటూ పేర్కొన్నారు. ఆయన కెమెరాలు టిఆర్‌పిని కోరుకోలేదు అంటూ ట్వీట్టర్‌లో పేర్కొన్నారు. ఆయన విద్య, గౌరవం, భవిష్యత్తును అందించారని, వ్యవస్థ విఫలమైనప్పుడు, ఆయన పక్క నుండి చూడలేదని, ఆయన కుటుంబంలాగా రంగంలోకి దిగారంటూ పేర్కొన్నారు.పాలకుడికి, నాయకుడికి మధ్య ఉన్న తేడా ఇదే.మోడీ మీరు చాలా ప్రచారం చేసిన సీమ సురక్ష వాగ్దానం ఎక్కడ? మీ మానవత్వం ఎక్కడ ఉంది, రాహుల్ గాంధీ ధైర్యంతో, కరుణతో, నిబద్ధతతో భారత్ భవిష్యత్తును రూపొందిస్తున్నారు అంటూ ట్వీట్ చేశారు.

**బిసిలకు న్యాయం చేసేది కాంగ్రెస్ పార్టీ**

బిసిలకు న్యాయం చేసేది కాంగ్రెస్ పార్టీ అని టిపిసిసి అధ్యక్షులు మహేష్‌కుమార్‌గౌడ్ అన్నారు. మంగళవారం ఎమ్మెల్యే క్వార్టర్స్‌లో ఆయన మీడియాతో మాట్లాడారు. చలో ఢిల్లీ కార్యక్రమం గురించి సిఎం రేవంత్ రెడ్డితో చర్చిస్తామని పేర్కొన్నారు. పది ఉమ్మడి జిల్లాల ఇంచార్జ్‌లు, ఉపాధ్యక్షులు, ప్రధాన కార్యదర్శిలతో సమావేశం జరిగిందన్నారు. నామినేటెడ్ పోస్టులకోసం సుదీర్ఘ చర్చ జరిగిందని, కార్పొరేషన్‌ల పోస్టులు, డైరెక్టర్ల కోసం సిఎంతో చర్చించి నిర్ణయం తీసుకుంటాం అన్నారు. బిసిలపట్ల కవిత పది సంవత్సరాలు అధికారంలో ఉండి బిసిల గురించి ఎందుకు మాట్లాడలేదు అంటూ ప్రశ్నించారు. ఇప్పుడు బిసిల గురించి వల్కబోసినా కవితను ఎవరు నమ్మరు అన్నారు. మేము అధికారంలోకి వచ్చాక రెండు చట్టాలు తీసుకొచ్చామని, ఎవరెన్ని చెప్పినా బిసిలకు కాంగ్రెస్ న్యాయం చేస్తుంది అనడానికి నేను, భట్టి ఉదాహరణ అన్నారు. గంగుల కమలాకర్ పది సంవత్సరాలుగా మంత్రిగా ఉండి బిసిల రిజర్వేషన్‌ను తగ్గిస్తే ఎందుకు మాట్లాడలేదు అన్నారు. ముఖేష్ గౌడ్ హైదరాబాద్ కాంగ్రెస్ పార్టీకి సేవ చేసారని, ముఖేష్ గౌడ్,శివ శంకర్ విగ్రహం పెట్టాలని అడుగుతున్నారు. సిఎం రేవంత్ రెడ్డితో మాట్లాడి విగ్రహాలు పెడతామన్నారు.



ప్రముఖ అస్సామీ కవి నీలిమ్‌కుమార్‌కు పురస్కారం ప్రదానం చేస్తున్న గవర్నరు జిష్ణుదేవ్‌వర్మ, రఘురామకృష్ణరాజు, ఆంజనేయరెడ్డి, చెన్నయ్య, పత్తిపాక మోహన్, గంగ తదితరులు

## 'జ్ఞానపీఠం' ఎక్కిన ప్రజాకవి సినారె

### భారతీయ సంస్కృతికి ఆయన ప్రతీక: గవర్నర్ జిష్ణుదేవ్‌వర్మ

### ఘనంగా నారాయణరెడ్డి 94వ జయంత్యుత్సవం

### ప్రముఖ అస్సామీ కవి నీలిమ్‌కుమార్‌కు సినారె జాతీయ సాహిత్య పురస్కారం ప్రదానం

**హైదరాబాద్ (రవీంద్రభారతి), జూలై 29, ప్రభాతవార్త :** పద్మభూషణ్ డా. సి.నారాయణరెడ్డి జ్ఞానపీఠ పురస్కార గ్రహీతేకాదు గొప్ప ప్రజాకవి అని ప్రశంసించిన గవర్నరు జిష్ణుదేవ్‌వర్మ కవిత్వం మన సమాజ హృదయ స్పందన అని, అందుకు సి.నారాయణరెడ్డి కవిత్వం, సాహితీ రచనలు నిలువెత్తు నిదర్శనమన్నారు. ఆయన భారతీయ సంస్కృతికి ప్రతీకని, విశ్వంభర కావ్యం మన నాగరికత, బుద్ధుడి నుండి గాంధీవరకు జరిగిన పరిణామ క్రమాన్ని ప్రస్ఫుటం చేస్తుందని చెప్పారు. శ్రీమతి సుశీలా నారాయణరెడ్డి ట్రస్టు హైదరాబాద్ ఆధ్వర్యంలో సి.నారాయణరెడ్డి 94వ జయంత్యుత్సవాన్ని పురస్కరించుకొని మంగళవారం రాత్రి రవీంద్రభారతిలో ఆంధ్రప్రదేశ్ శాసనసభ ఉపసభాపతి కనుమూరి రఘురామకృష్ణరాజు సభాధ్యక్షతన జరిగిన కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా వచ్చిన గవర్నర్ జిష్ణుదేవ్‌వర్మ, విశిష్ట అతిథి చెన్నూరి ఆంజనేయరెడ్డి, ట్రస్టు అధ్యక్షురాలు గంగ, ప్రధాన కార్యదర్శి డా. జుర్రు చెన్నయ్య, డా. పత్తిపాక మోహన్, లయ చరణ్‌రెడ్డి, వరేణ్య, మనస్విని తదితరులతో కలిసి ముందుగా సి.నారాయణరెడ్డి కొత్త పుస్తకం భలేశిష్యులును ఆవిష్కరించారు. తర్వాత ప్రముఖ అస్సామీ కవి నీలిమ్‌కుమార్‌ను సి.నారాయణరెడ్డి జాతీయ సాహిత్య పురస్కారం, రూ. 5 లక్షల నగదు, ప్రశంసాపత్రం, శాలువాతో సత్కరించి ప్రసంగించారు. కవిత్వం, సాహిత్యం లయబద్ధమైన మన హృదయ స్పందనని, సినారె మానవీయ, సకుటుంబ విలువలతో కూడిన కవిత్వం అందించారని పేర్కొన్నారు. రఘురామకృష్ణరాజు నారాయణరెడ్డి క్రమశిక్షణకు మారుపేరని, ఆయన గొప్ప సాహితీవేత్త, అధ్యాపకుడు, పార్లమెంటేరియన్, కార్యనిర్వాహకుడైన బహుముఖ ప్రజ్ఞాశీలి అని కొనియాడారు. తర్వాత పురస్కార గ్రహీత నీలిమ్‌కుమార్ స్పందనలో ఇలాంటి గొప్ప కార్యక్రమంలో పాల్గొనడం, మహోన్నతవ్యక్తి పేరున జాతీయ సాహిత్య పురస్కారం అందుకోవడం భాగ్యంగా భావిస్తున్నానని అన్నారు.

## జల విద్యుత్‌పై ఏపి, టిజి వివాదం

### ఆగస్టు 19కి వాయిదా వేసిన సుప్రీం

**హైదరాబాద్, జూలై 29, ప్రభాతవార్త:** ఉభయ రాష్ట్రాల మధ్య నెలకొన్న జల విద్యుత్ వివాదం సుప్రీం కోర్టుకు చేరింది. జల విద్యుత్‌పై ఇరు రాష్ట్రాల మధ్య ప్రతిష్టంభన ఏర్పడడంతో ఈ విషయమై సుప్రీంకోర్టులో పిటీషన్ దాఖలైంది. ఈ నేపథ్యంలో విచారణ చేసిన అత్యున్నత న్యాయస్థానం ఆగస్టు 19కి వాయిదా వేసింది. తెలంగాణ ప్రభుత్వం అనుమతులు లేకుండా విద్యుత్ ఉత్పత్తి చేస్తోందని ఆరోపిస్తూ ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం 2021లో కేంద్రానికి ఫిర్యాదు చేసింది. అదే ఏడాది జూలై 14న ఈ అంశంపై సుప్రీం కోర్టులో పిటిషన్ దాఖలు చేసింది. అలాగే, జీవో 34ను రద్దు చేయాలని కోరుతూ 2024 సెప్టెంబర్ 7వ తేదీన ఆంధ్రప్రదేశ్ మరో పిటిషన్ దాఖలు చేసింది. ఈ రెండు పిటిషన్లను కలిపి జస్టిస్ రాజేశ్ బిందాల్, జస్టిస్ మన్మోహన్‌లతో కూడిన ద్విసభ ధర్మాసనం విచారణ చేసింది. ధర్మాసనం తదుపరి విచారణను ఆగస్టు 19కి వాయిదా వేసింది.

## డిప్యూటీ కలెక్టర్లకు స్పెషల్‌గ్రేడ్‌తో పదోన్నతులు



### రెవెన్యూ జెఎసి ఛైర్మన్ లచ్చిరెడ్డి హర్షం

**హైదరాబాద్, జూలై 29, ప్రభాతవార్త :** రాష్ట్రంలో44 మంది డిప్యూటీ కలెక్టర్లకు స్పెషల్ గ్రేడ్ డిప్యూటీ కలెక్టర్లుగా ప్రభుత్వం పదోన్నతి కల్పించింది.ఈ సందర్భంగా రెవెన్యూ ఉద్యోగ సంఘాలు, జేఏసీ చైర్మన్, డిప్యూటీ కలెక్టర్ల సంఘం రాష్ట్ర అధ్యక్షులు వి.లచ్చి రెడ్డి ఆధ్వర్యంలో రెవెన్యూ సంఘాల నాయకులు రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డిని మంగళవారం కలిసి కృతజ్ఞతలు తెలిపారు. పదోన్నతులకు ప్రత్యక్ష్యం గా, పరోక్షంగా సహకారం అందించిన సిఎం రేవంత్‌రెడ్డి, రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, సిసిఎల్‌ఏ ప్రిన్సిపల్ సెక్రటరీ (రెవెన్యూ) లోకేష్ కుమార్‌కు, ఇతర ప్రభుత్వ పెద్దలకు పేరుపేరున రెవెన్యూ ఉద్యోగుల సంఘాల నాయ కులు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఈ సందర్భంగా రెవెన్యూశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ.. ప్రభుత్వ పరిపాలన లో కీలకమైన రెవెన్యూ శాఖను బలోపేతం చేయడానికి తమ ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. ప్రభుత్వ పథకాల అమలులో అన్ని స్థాయిలలోని రెవెన్యూ ఉద్యోగులు కృషి చేయాలన్నారు. అన్ని క్యాడర్ల ఉద్యోగులకు పదోన్నతులు కల్పించడానికి ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని మంత్రి హామీ ఇచ్చారు.ఈ పదోన్నతులు రెవెన్యూ శాఖలో ఉద్యోగుల నైతిక స్థైర్యాన్ని పెంచి,ప్రభుత్వ సేవలను మరింత సమర్థవంతంగా ప్రజలకు చేరువ చేయడానికి దోహద పడతాయ న్నారు. అనంతరం రెవెన్యూ ఉద్యోగ సంఘాల జేఏసీ అధ్యక్షుడు లచ్చిరెడ్డి మాట్లాడుతూ.. ప్రజా ప్రభుత్వం ఏర్పడినప్పటి నుంచి రెవెన్యూ శాఖలో పదోన్నతుల శకం మొదలైందన్నారు. చరిత్రలోనే తొలిసారిగా 33 సెలక్షన్ గ్రేడ్ డిప్యూటీ కలెక్టర్ పోస్టులను రాష్ట్ర ప్రభుత్వం అందు బాటులోకి తెచ్చిందన్నారు. ప్రస్తుతం 44 మంది డిప్యూటీ కలెక్టర్లకు స్పెషల్‌గ్రేడ్ డిప్యూటీ కలెక్టర్లుగా పదోన్నతి కల్పించిందన్నారు.ఇదే కాకుండా సీని యర్ అసిస్టెంట్ నుంచి నయాబ్ తహాశీల్దార్ వరకు పదోన్నతులను కల్పించిందన్నారు. ఈ విధంగా అన్నిస్థాయిలలో పదోన్నతులను కల్పిస్తూ రెవెన్యూ శాఖను ప్రభుత్వం బలోపేతం చేస్తుందన్నారు. రాష్ట్రంలోని 10,954 గ్రామాలలో జీపీఓల నియామకం చేపడుతుందన్నారు. ప్రభుత్వం రెవెన్యూ ఉద్యోగులకే కాకుండా ప్రజలకు,రైతులకు కూడా రెవెన్యూ సేవలు సులభంగా, వేగంగా అందేలా చూస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ కలెక్టర్ల సంఘం ప్రధాన కార్యదర్శికె. రామకృష్ణ, తహాసీల్దార్ సంఘం రాష్ట్ర అధ్య క్షుడు రాములు, ప్రధాన కార్యదర్శి రమేష్ పాక తదితరులు పాల్గొన్నారు.

## కవిత బిసి రిజర్వేషన్లపై దీక్ష ఢిల్లీలో చేయాలి

### పిసిసి జనరల్ సెక్రటరీ చనగాని దయాకర్

**హైదరాబాద్, జూలై 29, ప్రభాతవార్త:** బిసి రిజర్వేషన్లపై ఎమ్మెల్సీ కవిత 72 గంటల దీక్షను గల్లీ కాదు ఢిల్లీలో చేయాలి పిసిసి జనరల్ సెక్రటరీ చనగాని దయాకర్ అన్నారు. మంగళవారం గాంధీభవన్‌లో మీడియాతో మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రాగానే బిసి రిజర్వేషన్ బిల్లును అసెంబ్లీ తీర్మానం చేసిందన్నారు. బిసి రిజర్వేషన్ల పైన గత పాలకుల కనీస ప్రయత్నం చేయలేదని అన్నారు. 75 ఏళ్ల స్వాతంత్ర భారత దేశ చరిత్రలో తెలంగాణలో రాష్ట్రంలో బిసి హక్కులకు పెద్ద పీట వేసిన తెలంగాణ ప్రభుత్వం అన్నారు. కవిత బిసి పట్ల నిజమైన ప్రేమ గౌరవం ఉంటే ఢిల్లీలో మోడీ పైన బిజెపిపైన పోరాటం చేయాలని హితవు పలికారు. బిసి బిల్లు రిజర్వేషన్లను చట్ట బద్దంగా, రాజ్యాంగ బద్ధంగా అమలు చేయాలని ప్రభుత్వం, డెడికేషన్ కమిషన్ వేసింది అన్నారు. బిసి రిజర్వేషన్లపై బిఆర్ఎస్, బిజెపిలు సరైన అవగాహన లేకుండా వ్యావరిస్తున్నారని విమర్శించారు. బిఆర్ఎస్ హయాంలో 23 శాతం రిజర్వేషన్లను స్థానిక సంస్థల ఎన్నికల్లో ఇచ్చారు అని, సుప్రీం కోర్టు తీర్పు సాకుతో బిఆర్ఎస్ ప్రభుత్వం ఆనాడు తప్పించుకుందన్నారు. కవిత దీక్ష చేస్తామనడం అర్థం లేని పోరాటం అన్నారు. పది సంవత్సరాలు అధికారంలో ఉండి కవితమ్మ బిసి రిజర్వేషన్ల పైన ఏ రోజు నోరుమెదపని కవితమ్మకు తన రాజకీయ అవసరాలకు బిసి వాదం ఎత్తుకున్నారని అన్నారు. తెలంగాణలో కాంగ్రెస్ పార్టీ బిసి రిజర్వేషన్ల పట్ల కాంగ్రెస్ పార్టీకి నిజాయితో నిబద్ధత ఉందని అన్నారు. ఊరంతా వడ్లు ఆరబెడితే, నక్క తోక ఎండబెట్టుకుందని అనే చందంగా బిజెపి వ్యవహారం మారిందన్నారు. బిసి బిల్లు పైన కులగణన పైన బిఆర్ఎస్ పార్టీ వైఖరి ప్రకటించలేదు అన్నారు. రిజర్వేషన్లను సాధించుకునే వరకు కాంగ్రెస్ పార్టీ పోరాటం కొనసాగిస్తుందని, తెలంగాణ రాష్ట్రంలో సామాజిక విప్లవం తెచ్చిన తెలంగాణ కాంగ్రెస్ పార్టీకి తెలంగాణ సామాజిక శక్తులు అండగా, నిలవాలని కోరుతున్నామని అన్నారు. ఢిల్లీలో జరిగే పోరాటంలో బిసిల గర్జనలో మోడీ ప్రభుత్వానికి చలనం రావాలని అన్నారు.

## బిసి బిల్లు సాధన కోసం 72 గంటల నిరాహార దీక్ష

### ఆగస్టు 4, 5, 6 తేదీల్లో ఇందిరాపార్కు వద్ద కార్యక్రమం

### తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు, ఎమ్మెల్సీ కవిత వెల్లడి





**హైదరాబాద్,జూలై 29,ప్రభాతవార్త:** బీసీ బిల్లు సాధన కోసం దీక్ష చేసి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలపై ఒత్తిడి తీసుకు రానున్నట్లు ఎమ్మెల్సీ కవిత తెలిపారు. కాంగ్రెస్ పార్టీ ధోరణిపై విరుచుపడిన ఆమె.. ప్రభుత్వానికి చిత్తశుద్ధే లేదంటూ విమర్శించారు. ఈమేరకు మంగళవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో జరిగిన కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ బిహార్ ఎన్నికల కోసం కాంగ్రెస్ పార్టీ ఢిల్లీలో ధర్నా చేపట్టిడ్రామా చేసిందని.. నిజంగా చిత్తశుద్ధి ఉంటే అఖిలపక్షం ఏర్పాటు చేసి తెలంగాణ మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎంపీలను ఢిల్లీకి తీసుకెళ్లాలని డిమాండ్ చేశారు. అలాగే అంబేడ్కర్ విగ్రహం సాధించడానికి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో 72 గంటల పాటు తాను దీక్ష చేసిన విషయాన్ని ఆమె గుర్తు చేశారు. అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం నుంచి ఎంత ఒత్తిడి వచ్చినప్పటికీ తలొగ్గకుండా దీక్ష చేశామని తాను దీక్ష విరమించిన తర్వాత అప్పటి ముఖ్యమంత్రి కిరణ్ కుమార్ రెడ్డి ఒత్తిడికి తలొగ్గి అసెంబ్లీ లో అంబేడ్కర్ విగ్రహాన్ని ఆవిష్కరించారన్నారు. అలాగే మంత్రి పొన్నం ప్రభాకర్ తీరును కవిత తప్పుబట్టారు. ఢిల్లీలో ధర్నా చేస్తామన్న వ్యాఖ్యలపై మాట్లాడుతూ ఆనాడు చేసిన ధర్నాకే రాహుల్ గాంధీ హాజరు కాలేదన్నా కవిత ధర్నా కోసం తెలంగాణ వాదులను పిలిచే విధానం ఎంతో అవహేళనగా ఉందన్నారు. మర్యాద పాటించాలని, పద్ధతి పాటించాలంటూ కవిత ఘాటు వ్యాఖ్యలు చేశారు. కాంగ్రెస్ పార్టీ సాగదీత ధోరణి అవలంబిస్తోందన్న కవిత బీసీలకు అండగా ఉండాల్సిన సమయంలో బీజేపీ నేతలు తప్పించుకుని తిరుగుతున్నారంటూ విమర్శించారు. బీసీలు బాగుండాలని.. రాజ్యాధికారంలో బీసీలకు వాటా రావాలని ఆమె ఆకాంక్షించారు.

# పులితోనే జీవవైవిధ్యం

### ప్రపంచ పులుల దినోత్సవంలో నేషనల్ కన్సర్వేషన్ అథారిటీ మాజీ సభ్యుడు అనూప్‌కుమార్ నాయక్

**హైదరాబాద్, జూలై 29, ప్రభాతవార్త:** జీవ వైవిధ్యానికి ప్రధాన ఆధారంగా నిలుస్తున్న పులులను సంరక్షించుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉందని ఎన్‌టి సిఏ (నేషనల్ కన్సర్వేషన్ అథారిటీ) మాజీ సభ్యుడు, రిటైర్డ్ ఐఎఫ్ఎస్ అధికారి అనూప్‌కుమార్ నాయక్ అన్నారు. ప్రపంచ పులుల దినోత్సవం సందర్భంగా దూలపల్లిలోని తెలంగాణ ఫారెస్ట్ అకాడెమీలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాటాడుతూ.. పర్యావరణవ్యవస్థలలో పులులు పోషించే కీలక పాత్రను గుర్తించాల్సిన అవసరం ఉందన్నారు. పెద్దపులి అంటే శక్తి, అందం వంటి చిహ్నాలు మాత్రమే కాదు, అవి ప్రకృతి సమతుల్యతను కాపాడుకోవడానికి సహాయపడే కీస్టోన్ జాతులని మనమందరం గ్రహించాలన్నారు. ప్రత్యక్షంగా, పరోక్షంగా ఒక పులిమీద అడవి, పర్యావరణం, ప్రకృతి, జంతుజాలం, గడ్డి భూములు, జీవవైవిధ్యం వంటివి ఆధారపడి ఉండటంతో పులుల మనుగడ అనేది మానవాళి మనుగడకు ప్రధానమన్న విషయాన్ని ప్రజలు తెలుసు కోవాలన్నారు. అటవీదళాల ప్రధాన సంరక్షిణాధికారిణి డాక్టర్ సువర్ణ మాట్లా డుతూ.. పెద్దపులుల సంరక్షణపై ప్రజలల్లో అవగాహన కల్పించడంతో పాటు వారిని భాగస్వామ్యం చేయాలనే ఉద్దేశ్యంతో ప్రతీ ఏటా జూలై 29న ప్రపంచ పులుల దినోత్సవాన్ని నిర్వహించుకుంటు న్నామన్నారు. పులుల ఆవాసాల సంరక్షణ, విస్తరణకు ప్రజల మద్దతు అవసరమని,పులుల సంరక్షణ గురించి అవగాహన కల్పించడానికి ఇలాంటి కార్యక్రమాలు ఎంతగానో ఉపయోగ పడుతాయన్నారు. పెద్దపులుల సంరక్షణకు రాష్ట్రప్రభుత్వం తీసుకుంటున్న చర్యలు మంచి ఫలితాలను ఇస్తున్నాయన్నారు.అమ్రాబాద్ టైగర్ రిజర్వ్ (ఏటీఆర్), కవ్వాల్ టైగర్ రిజర్వ్ (కేటీఆర్)లను చాలా బాగా నిర్వహించడంతో పులుల సంఖ్య గణనీయంగా పెరుగుతోందన్నారు. ప్రత్యేకించి అమ్రాబాద్ అడవుల్లో పులుల సంఖ్య గణనీయంగా పెరిగిందని వాటి సంఖ్య 36కు చేరుకుందని తెలిపారు. తెలంగాణలో మెరుగైన అటవీ విస్తరణ, వేటకు తగినసంఖ్యలో జంతు వులు, నీటివనరులు వంటివి ఉండడంతో పొరుగున మహారాష్ట్రలోని తిప్పేశ్వర్, తడోబాల్లో పులుల ఇక్కడకు తరలివస్తున్నా యన్నారు. గడ్డిభూముల పెంపకంతో శాకాహార జంతువుల సంఖ్యపెరగడం ఇందుకు కలిసివస్తుందన్నారు. చీఫ్ వైల్డ్‌లైఫ్ వార్డెన్ ఈలు సింగ్‌మేరు మాట్లా డుతూ వన్యప్రాణులు మానవుల మధ్య సంఘర్షణ నివారించేందుకు పకడ్బందీ చర్యలు తీసుకుంటున్నామని, పులులకు భద్రత,వాటి సహజ ఆవాసాల సమీప ప్రాంతాలలో నివసించే ప్రజల శ్రేయసుకు ప్రాధాన్యమిచ్చే విధంగా టైగర్ ప్రాజెక్ట్‌ను పునరావిష్కరించుకునే దిశగా అడుగులు వేస్తున్నామని పేర్కొన్నారు.కవ్వాల్ టైగర్ ప్రాజెక్ట్ డైరెక్టర్ శాంతారాం.నాగర్ కర్నూల్ దీఎఫ్ఓ రోహిత్ కవ్వాల్, అమ్రాబాద్ టైగర్ రిజర్వ్ కు సంబందించిన అన్ని వివరాలను పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వెల్లడించారుఈ సందర్భంగా ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు చిత్రలేఖనం పోటీలు నిర్వహించి వాటిలో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు.ఈ కార్యక్రమలో వైల్డ్‌లైఫ్‌కు విశేషసేవలు అందించిన అటవీ అధికారిశంకరన్‌ను అధికారులు ఘనంగా సత్కరించారు.ఈ కార్యక్రమలో పిసిసిఎఫ్(ఐటి వింగ్) జవహరి,టిజిఎఫ్‌డిసి ఛైర్మన్ ఛైర్మన్ సునీత ఎం భాగవత్ తెలంగాణ ఫారెస్ట్ అకాడమీ డైరెక్టర్ ఎస్‌జే ఆశ ఇతర ఉన్నతాధి కారులు పాల్గొన్నారు.


## గోవా మద్యం పట్టివేత

### కారుతోపాటు 162 మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్న ఎక్సైజ్ అధికారులు

**హైదరాబాద్, జూలై 29, ప్రభాతవార్త:** నల్గొండ జిల్లాలోని పద్ద అడిషర్ల పల్లికి చెందిన కొంతమంది కుటుంబసభ్యులో గోవా విహారయాత్రకు వెళ్లారు.తిరుగు ప్రయాణంలో వారు తమ వెంట 162 మద్యం బాటిళ్లను కొనుగలోలు చేసుకుని కారులో తీసుకు వస్తున్న పక్కా సమాచారం అందుకున్న డిటిఫ్ ఎస్ఐహన్మంతు సిబ్బంది కలిసి జహీరాబాద్ చీరాగ్‌పల్లి ఎక్సైజ్ చెక్‌పోస్టు తనిఖీలు నిర్వహించి మద్యాన్ని స్వాధీనం చేసుకున్నారు.పట్టుకున్న మద్యం విలువ రూ. 1.50 లక్షల విలువ ఉంటుందని అంచనా వేశారు.మద్యంతో పాటు కారును ఏక్సైజ్ అధికారులు సీజ్ చేశారు. వీటిలో 112 ఫుల్ మద్యం బాటిళ్లు, 50 బాటిళ్లు 330 ఎంఎల్ బీరు బాటిళ్ల ఉన్నట్లు వారు తెలిపారు. ఈ దాడిలో డీటీఎఫ్ సంగారెడ్డి టీమ్, జహీరాబాద్ ఎక్సైజ్ స్టేషన్ టీమ్, జహీరాబాద్ చెక్‌పోస్టు టీమ్ పాల్గొన్నారు.గోవా మద్యం బాటిళ్లను పట్టుకున్న టీమ్‌ను ఎన్‌ఫోర్స్‌మెంట్ డెరెక్టర్ షానవాజ్ ఖాసీం,మెదక్ డిప్యూటీ కమిషనర్ జె.హరి కిరణ్, ఎక్సైజ్ సూపరిండెంట్ నవీన్‌చంద్‌లు అభినందించారు.

## తెలుగు ఫిలిం ఛాంబర్ వద్ద తెలంగాణవాదుల ఆందోళన

**హైదరాబాద్, జూలై 29 ప్రభాతవార్త:** హైదరాబాద్‌లోని తెలుగు ఫిలిం ఛాం బర్ వద్ద తెలంగాణవాదులు ఆందోళనకు దిగారు. తెలంగాణ నటుల విష యంలో వివక్ష చూపుతున్నారని సీనియర్ జర్నలిస్ట్ పాశం యాదగిరితో సహా తెలంగాణవాదులు నిర్మాతల మండలి లోపలికి చొచ్చుకుని పోయేందుకు ప్రయత్నించారు. ఫిలిం ఛాంబర్ సెక్రటరీ ప్రసన్నకుమార్‌తో పాశం యాదగిరి వాగ్వాదానికి దిగారు. చాంబర్‌లో పైడి జయరాజ్ ఫొటో చిన్నదిగా పెట్టారని, సినారే ఫోటో ఎందుకు లేదని తెలంగాణ వాదులు ప్రశ్నించారు. ఓ హీరోయిన్ ఫోటో కింద పైడి జయరాజ్ ఫోటో పెట్టారంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. దీంతో ఇరు వర్గాల మధ్య ఘర్షణ వాతావరణం నెలకొంది. పోలీసుల జోక్యంతో వ్యవహారం సద్దుమణిగింది. ఈ సందర్భంగా సీనియర్ జర్నలిస్టు పాశం యాదగిరి మాట్లాడుతూ ఆంధ్రా గో బ్యాక్ అంటూ నినాదాలు ఇచ్చారు. తెలంగాణ వాళ్ల ఫోటోలు చిన్నవిగా ఉన్నాయని అడిగితే తమను లాగిపారేస్తున్నారని మండిపడ్డారు. తాము దాడి చేయలేదని దాడి చేస్తే చాంబర్ తగలబడిపోయిందా? పగిలిపోయిందా? అని ప్రశ్నించారు. తెలంగాణ వాళ్ల పట్ల వివక్ష చూపితే దాడి చేయడంకాదు మిమ్మల్ని ఇక్కడ బతకనివ్వమని హెచ్చరించారు. ఇండస్ట్రీలో కులతత్వం, ప్రాంతీయతత్వం ఉందన్నారు. చంద్రబాబు ఏజెంట్లు తెలంగాణలో ఉండటానికి వీల్లేదన్నారు.



ప్రసంగిస్తున్న భద్రాచలం మాజీ ఎంపి డాక్టర్ మిడియం బాబురావు

## ఆదివాసులను హిందూమతంలో విలీనం చేసే కుట్ర

### భద్రాచలం మాజీ ఎంపి డాక్టర్ మిడియం బాబురావు

**హైదరాబాద్ (చిక్కడపల్లి), జూలై 29, ప్రభాతవార్త:** ఆదివాసులను హిందూ మతంలో విలీనం చేయాలన్న ప్రయత్నం పూర్తిగా రాజకీయ లక్ష్యాలతో కూడినదనే విషయాన్ని ఆదివాసులు గ్రహించాలని, కేంద్ర ప్రభుత్వం చేపడుతున్న 2027 జనాభా లెక్కల మతం కాలంలో షెడ్యూల్ ట్రైబ్ లేక ప్రకృతి ఆరాదకులుగా ప్రత్యేక క్యాటగిరిగా గిరిజన తెగలను గుర్తించాలని భద్రాచలం మాజీ పార్లమెంట్ సభ్యుడు తెలంగాణ ఆదివాసీ గిరిజన సంఘం రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ మిడియం బాబురావు అన్నారు. సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో జనగణనలో షెడ్యూల్ ట్రైబ్స్ కాలం కేటాయించాలానే అంశంపై సెమినార్ తెలంగాణ ఆదివాసి గిరిజన సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సంఘం పూసం సచిన్ అధ్యక్షతన జరిగింది. బాబురావు మాట్లాడుతూ.. ఆదివాసులను హిందూ మతంలో విలీనం చేయాలన్న ప్రయత్నం పూర్తిగా రాజకీయ లక్ష్యాలతో కూడినదనే విషయాన్ని ఆదివాసులు గ్రహించారన్నారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ ఆదివాసి గిరిజన సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సంఘం పూసం సచిన్, రాష్ట్ర ఉపాధ్యక్షులు బందారు రవి కుమార్, ఎర్మ పున్నం, సహాయ కార్యదర్సులు ఆత్రం తనుష్, తొడసం శంబు, కోరెంగా మాలశ్రీ, దుగ్గి చిరంజీవి, అశోక్, భాగల రాజన్న తదితరులు పాల్గొన్నారు.


# ఐదో టి20లో వెస్టిండీస్ చిత్తు

## సిరీస్ వైట్‌వాష్ చేసిన ఆస్ట్రేలియా

న్యూఢిల్లీ: వెస్టిండీస్ పర్యటనను ఆస్ట్రేలియా అద్భుతమైన విజయంతో ముగించింది. సెయింట్ కిట్స్ వేదికగా మంగళవారం వెస్టిండీస్‌తో జరిగిన ఐదో టీ20లో 3 వికెట్ల తేడాతో ఆస్ట్రేలియా గెలుపొందింది. దీంతో ఐదు టీ20ల సిరీస్‌ను కంగారులు వైట్ వాష్ చేశారు. ఆఖరి టీ20లో టాస్ ఓడి తొలుత బ్యాటింగ్ చేసిన కరేబియన్ జట్టు



19.4 ఓవర్లలో 170 పరుగులకు ఆలౌట్ అయింది. విండీస్ బ్యాటర్లలో విధ్వంసకర బ్యాటర్ షిమ్రాన్ హెట్‌మైర్ (31 బంతుల్లో 3 ఫోర్లు, 3 సిక్స్‌లతో 52) టాప్ స్కోరర్‌గా నిలవగా, షెర్ఫేన్ రూథర్ ఫర్డ్ (35) హోల్డర్ (20) రాణించారు. ఆసీస్ బౌలర్లలో ద్వార్షుయిస్ 3 వికెట్లు పడగొట్టగా, నాథన్ ఎల్లిస్ 2 వికెట్లు సాధించారు. వీరిద్దరితో పాటు, మాక్స్‌వెల్, జంపా, అబాట్, హార్డీ తలా వికెట్ దక్కించుకున్నారు. అనంతరం 171 పరుగుల లక్ష్యాన్ని ఆస్ట్రేలియా 7 వికెట్లు కోల్పోయి 17 ఓవర్లలోనే ఛేదించింది. ఆస్ట్రేలియా బ్యాటర్లలో మిచెల్ ఓవెన్ (37) టాప్ స్కోరర్‌గా నిలవగా, గ్రీన్ (32), హార్డీ (28 నాటౌట్), డేవిడ్ (30) రాణించారు. విండీస్ బౌలర్లు మరోసారి ఆస్ట్రేలియా బ్యాటర్లను కట్టడి చేయలేకపోయారు. అకీల్ హోస్సేన్ ఒక్కడే 3 వికెట్లు పడగొట్టి ఫర్వాలేదనిపించాడు. హోల్డర్, జోషఫ్ తలా 2 వికెట్లు సాధించినప్పటికీ భారీగా పరుగులు సమర్పించుకున్నారు. కాగా ఆస్ట్రేలియా చేతిలో వెస్టిండీస్ టెస్టు టీ20 సిరీస్‌లోనూ వైట్ వాష్ అయింది.




# ఫైనల్‌కు హార్దీప్

న్యూఢిల్లీ: అండర్ 17 ప్రపంచ రెజ్లింగ్ ఛాంపియన్‌షిప్-2025లో భారతదేశానికి చెందిన హార్దీప్ 110 కిలోల గ్రీకోరోమన్ విభాగంలో ఫైనల్‌కు చేరుకుని, భారతదేశానికి తొలి పతకాన్ని ఖాయం చేసుకున్నాడు. గ్రీస్‌లోని ఏథెన్స్‌లో జరిగిన ఈ టోర్నమెంట్‌లో 16 ఏళ్ల భారత ఆటగాడు సెమీఫైనల్లో టర్కీకి చెందిన ఎముల్లా కప్లాన్‌ను 4-2 తేడాతో ఓడించి బంగారు పతక పోరులో తన స్థానాన్ని సంపాదించుకున్నాడు. హార్దీప్ అంతకుముందు క్వాలిఫికేషన్ రౌండ్‌లో కజకిస్తాన్‌కు చెందిన బక్నూర్ సోవెత్కాన్‌పై 2-0 తేడాతో విజయం సాధించి తన ప్రచారాన్ని ప్రారంభించాడు. ఆ తర్వాత అతను 16వ రౌండ్‌లో పోలాండ్‌కు చెందిన మాట్యూజ్ జరోస్లా టోమెల్కాను 4-2 తేడాతో ఓడించి, క్వార్టర్ ఫైనల్స్‌లో ఉక్రెయిన్‌కు చెందిన అనటోలి నోవాచెంకోపై టెక్నికల్ ఆధిపత్యం ద్వారా 9-0 తేడాతో విజయం సాధించాడు. ఇక భారతికి చెందిన ఆదిత్య గుప్తా (55 కిలోల గ్రీకోరోమన్) మరియు అనుజ్ (65 కిలోల గ్రీకోరోమన్) వారి వారి వెయిట్ కేటగిరీలు కాంస్య పతక పోటీల్లోకి ప్రవేశించారు. వారిద్దరూ తమ తమ సెమీ ఫైనల్స్‌లో ఓడిపోగా, ఇప్పుడు పోడియంపై మూడవ స్థానం కోసం పోరాడనున్నారు. కిర్గిజిస్తాన్‌కు చెందిన అల్మజ్ అబ్దిరసులోవ్‌తో మంగళవారం జరిగిన హోరాహోరీ పోరులో గుప్తా 5-6 తేడాతో ఓడిపోగా, జార్జియాకు చెందిన ఎరెక్లే టాబెలిడ్జే చేతిలో అనుజ్ 1-9 తేడాతో ఆధిపత్యాన్ని సాధించాడు. ఈ ఛాంపియన్‌షిప్ ప్రారంభ రోజున పోటీలో ఉన్న ఇతర భారతీయులలో, ఆదిత్య జావద్ 48 కిలోల గ్రీకో రోమన్ క్వార్టర్ ఫైనల్స్‌లో జపాన్‌కు చెందిన కైసీ యమమోటో చేతిలో 0-8 తేడాతో ఓడిపోయాడు. మరోవైపు, పురుషుల 80 కిలోల గ్రీకోరోమన్ విభాగంలో సమర్థ్ గోవేకర్, టర్కీకి చెందిన ఇస్మాయిల్ బెకిటిస్ చేతిలో 0-11 ఓటమితో అర్హత రౌండ్‌లోనే తన ప్రచారాన్ని ముగించాడు.

# చివరి మ్యాచ్ డ్రా అయితే..

## టెస్ట్ ట్రోఫీ విజేత?

### లాస్ట్ టైమ్ విన్నర్‌కే ఛాన్స్

### 31న ఇంగ్లండ్‌తో భారత్ తుది పోరు



న్యూఢిల్లీ: భారత పర్యటన ఇంగ్లాండ్ మధ్య అండర్సన్ టెండూల్కర్ ట్రోఫీ 5 మ్యాచ్‌ల టెస్ట్ సిరీస్ జరుగుతోంది. రెండు జట్ల మధ్య ఈ సిరీస్ చాలా ఉత్కంఠ దశకు చేరుకుంది. ఇప్పటి వరకూ జరిగిన 4 మ్యాచ్‌లలో ఇంగ్లాండ్ సిరీస్‌లో 2-1తో ఆధిక్యంలో ఉంది. ఇప్పుడు చివరి మ్యాచ్ ఈ నెల 31 నుంచి లండన్‌లోని కెన్నింగ్టన్ ఓవల్ స్టేడియంలో జరుగుతుంది. ఈ మ్యాచ్ ఫలితం సిరీస్‌ను నిర్ణయిస్తుంది. కానీ ఈ సిరీస్ డ్రాగా ముగిస్తే, ట్రోఫీ ఎవరికి లభిస్తుందనేది ఆసక్తికరమైంది. ఈ సిరీస్‌లో ఇప్పటివరకు నాలుగు మ్యాచ్‌లూ ఉత్కంఠభరితంగా సాగాయి. సిరీస్‌లోని మొదటి మ్యాచ్‌ను ఇంగ్లాండ్ గెలుచుకుంది. రెండవ మ్యాచ్‌లో, టీమ్ ఇండియా విజయం సాధించింది. కానీ ఇంగ్లాండ్ మూడవ మ్యాచ్‌ను గెలిచి 2-1 ఆధిక్యంలో ఉంది. టీమిండియా నాల్గవ మ్యాచ్‌ను డ్రా చేసుకుని ఉండవచ్చు. కానీ, అది ఇంకా వెనుకబడి ఉంది. ఇటువంటి పరిస్థితిలో, ఇంగ్లాండ్ జట్టు సిరీస్ గెలవడానికి ఇంకా ఒక డ్రా మాత్రమే అవసరం. మ్యాచ్ గెలిస్తే, విజయ తేడా 3-1 అవుతుంది. మరోవైపు, టీం ఇండియా ఇప్పుడు ఈ సిరీస్ గెలవడు. కానీ, డ్రా చేసుకునే అవకాశం చాలా ఎక్కువ. 5వ టెస్ట్ మ్యాచ్‌లో భారత జట్టు గెలిస్తే, సిరీస్ డ్రాగా ముగుస్తుంది. కానీ మ్యాచ్ డ్రా అయినప్పటికీ, టీం ఇండియా సిరీస్‌ను కోల్పోతుంది. ఇటువంటి పరిస్థితిలో, రెండు జట్ల మధ్య సిరీస్ 2-2తో డ్రాగా ముగిస్తే, ట్రోఫీ ఇంగ్లాండ్‌లోనే ఉంటుందా లేదా టీం ఇండియాతో కలిసి భారతకు వస్తుందా అనేది ప్రశ్న. రెండు జట్ల మధ్య టెస్ట్ సిరీస్ డ్రా అయినప్పుడు, చివరిసారి ఈ ట్రోఫీని గెలుచుకున్న జట్టుకు ట్రోఫీని అందజేస్తారు. ఇటువంటి పరిస్థితిలో, భారత పర్యటన ఇంగ్లాండ్ మధ్య జరిగిన అండర్సన్ టెండూల్కర్ ట్రోఫీ గురించి మాట్లాడుకుంటే, దీనిని గతంలో పటౌడి ట్రోఫీ అని పిలిచేవారు. ఈ సిరీస్ చివరిసారిగా 2021-22 సంవత్సరంలో జరిగింది. అప్పుడు ఈ సిరీస్ డ్రాగా ముగిసింది. గతంలో ఈ సిరీస్ 2018లో జరిగింది. అప్పుడు ఇంగ్లాండ్ 4-1తో గెలిచింది. అప్పటి నుంచి ఈ ట్రోఫీ ఇంగ్లాండ్ వద్దే ఉంది. ఈసారి కూడా సిరీస్ డ్రా అయితే, అది ఇంగ్లాండ్ వద్దనే ఉంటుంది. అలా కాకుండా, ఈ లెక్కన ఈ 5వ మ్యాచ్‌లో గెలిచినా, ఓడినా ఇంగ్లండ్‌కే ట్రోఫీ దక్కుతుంది.

## మహిళల యూరో ఫుట్‌బాల్..

# విజేతగా ఇంగ్లండ్



### 3-1తో స్పెయిన్‌పై గెలుపు

న్యూఢిల్లీ: యూరో ఫుట్‌బాల్ ఛాంపియన్‌షిప్‌లో డిఫెండింగ్ ఛాంపియన్ ఇంగ్లాండ్ మహిళల జట్టు టైటిల్‌ను నిలబెట్టుకుంది. హోరాహోరీ తుది పోరులో ఇంగ్లాండ్ జట్టు పెనాల్టీ షూటౌట్‌లో 3-1తో స్పెయిన్‌పై విజయం సాధించింది. చివరి వరకూ పోటా పోటీగా పోరాడిన స్పెయిన్ పెనాల్టీ షూటౌట్‌లో అనూహ్యంగా చిత్తయింది. కేవలం ఒకే ఒక్క ప్లేయర్ గోల్ చేయడ గమనార్హం. మరోవైపు ఇంగ్లాండ్ బృందంలో ఇద్దరు బంతిని లక్ష్యాన్ని చేర్చడంలో విఫలంకాగా, ముగ్గురు గోల్స్ చేశారు. అంతకు ముందు నిర్ణీత సమయం ముగిసే సరికి ఇంగ్లాండ్, స్పెయిన్ జట్లు 1-1 స్కోరుతో సమ ఉజ్జీలుగా నిలిచాయి. ముందుగా స్పెయిన్ శిబిరం నుండి గోల్ నమోదైంది. తొలి అర్ధభాగంలోనే మరియానా కాల్డెంటె (25వ నిముషంలో) గోల్ చేసి జట్టుకు శుభారంభాన్ని అందించింది. 1-0తో ఆధిక్యంతోనే ప్రథమార్ధాన్ని ముగించింది. ద్వితీయార్ధం మొదలవగానే ఇంగ్లాండ్ ప్లేయర్లు దాడులకు పదును పెట్టారు. ఈ క్రమంలో అలెసియా రుసో (57వ నిముషంలో) గోల్ చేసి స్కోరును 1-1తో సమం చేసింది. తర్వాత ఇరుజట్ల ప్లేయర్లు ఎంతగా శ్రమించినా ఒక్క గోల్ కూడా నమోదు కాలేదు. నిర్ణీత సమయంలో ఫలితం తేలకపోవడంతో అదనపు సమయం ఆడించారు. అయినా స్కోరులో ఏ మార్పు లేకపోవడంతో పెనాల్టీ షూటౌట్ అనివార్యమైంది. ఇక్కడ తొలి షాట్ నుంచే డ్రా మొదలైంది. స్పెయిన్ ఒకటే గోల్ చేసినా, మొదట కిక్ మొదలుపెట్టిన ఇంగ్లాండ్ జట్టులో బెతన మీడ్ విఫలం కావడంతో గెలిచేందుకు ఆఖరి షాట్ గోల్ దాకా వేచి చూడక తప్పలేదు. స్పెయిన్ తరఫున ఫ్రాన్సియా గుజారో గోల్ కొట్టడంతో నిర్ణీత సమయం మ్యాచ్‌లానే 1-0తో షూటౌట్‌లోనూ తొలుత పై చేయి సాధించింది. అయితే ఇంగ్లాండ్ ప్లేయర్లు అలెక్స్ గ్రీన్‌వుడ్, నియామి చార్లెస్‌లు వరుసగా పాట్లు కొట్టడంతో రేసులో పడింది. మరోవైపు స్పెయిన్ మరియానా, ఐతానా బోన్‌మతి విఫలం కావడంతో ఇంగ్లాండ్ అనూహ్యంగా 2-1తో ఆధిక్యంలోకి దూసుకెళ్లింది. చివరకు 3-1తో ఫలితం రావడంతో స్పెయిన్ చివరి షాట్ తీసుకోలేదు. కాగా 2022లో జరిగిన అమ్మాయిల యూరోలోనూ ఇంగ్లండే ఛాంపియన్‌గా నిలిచింది.

## మహిళల వన్డే ర్యాంకింగ్స్‌లో..

# అగ్రపీఠంలో ఇంగ్లండ్ కెప్టెన్ సీవర్

### దిగజారిన టీమిండియా స్టార్ స్మృతి



న్యూఢిల్లీ: మహిళల వన్డే ర్యాంకింగ్స్‌లో ఇంగ్లాండ్ కెప్టెన్ నాట్ సీవర్ బ్రంట్ అగ్రస్థానానికి ఎగబాకింది. గత ర్యాంకింగ్స్‌లో మూడో స్థానంలో ఉన్న సీవర్ రెండు స్థానాలు మెరుగుపర్చుకుని టాప్ ప్లేస్‌కు చేరింది. ఇంటర్నేషనల్ క్రికెట్ కౌన్సిల్ (ఐసీసీ) మంగళవారం విడుదల చేసిన ర్యాంకింగ్స్‌లో పలు కీలక మార్పులు చోటు చేసుకున్నాయి. ఇంత వరకూ టాప్ ర్యాంక్‌లో ఉన్న టీమిండియా స్టార్ బ్యాటర్ స్మృతి మంధన ఈ ర్యాంకింగ్స్‌లో కిందికి పడిపోయింది. భారత్‌తో ముగిసిన సిరీస్‌లో రాణించడంతో సీవర్ అత్యున్నత స్థానానికి చేరింది. ఈ సిరీస్‌లో ఇంగ్లాండ్ భారత్ చేతిలో 1-2 తేడాతో ఓడినా, సీవర్ 3 మ్యాచ్‌ల్లో 53.33 సగటున 160 పరుగులు చేసి సత్తా చాటింది. మూడో వన్డేలో సీవర్ ఆడిన 98 పరుగుల ఇన్నింగ్స్ ఆమెకు టాప్ ర్యాంక్‌ను కట్టబెట్టింది. ఇక సీవర్ కంటే మెరుగ్గా రాణించకపోవడంతో స్మృతి టాప్ ప్లేస్‌ను కోల్పోయింది. ఈ సిరీస్‌లో 3 ఇన్నింగ్స్‌ల్లో 115 పరుగులకే పరిమితమై రెండో స్థానానికి దిగజారింది. ఇక టీమిండియా కెప్టెన్ హర్మన్ ప్రీత్ కౌర్ భారీ జంప్ కొట్టింది. ఇంగ్లాండ్‌తో మూడో వన్డేలో రికార్డు సెంచరీ బాదిన ఆమె ఏకంగా 10 స్థానాలు మెరుగుపరుచుకుని 11వ స్థానానికి ఎగబాకింది. అలాగే భారత్ బ్యాటర్లలో జెమిమా రోడ్రిగ్జ్ కూడా రెండు స్థానాలు మెరుగుపరుచుకుని 13వ స్థానానికి చేరింది. ఇక బౌలర్ల విషయానికి వస్తే ఈ ర్యాంకింగ్స్‌లో భారత్ బౌలర్లకు సానుకూల ఫలితాలు రాలేదు. స్పిన్నర్ దీప్తి శర్మ నాల్గవ స్థానాన్ని నిలబెట్టుకోగా, ఆమె తర్వాత స్నేహ రాణా మెరుగైన స్థానంలో (21) ఉంది. సోఫీ ఎక్లెస్టోన్, యాష్ గార్డనర్, మెగన్ షట్ టాప్-3 బౌలర్లుగా కొనసాగుతున్నారు.

# టిసిఎస్‌లో సీనియర్ల నియామకాల్లేవ్..

ముంబై, జూలై 29: టెక్ దిగ్గజం టీసీఎస్ సీనియర్ల నియామకాలను నిలిపివేసినట్లు వార్తలొస్తున్నాయి. దీంతోపాటు వార్షిక వేతనాల పెంపును ఆపినట్లు కూడా కొన్ని కథనాలు వెలువడ్డాయి. వ్యయ నియంత్రణ చర్యల్లో భాగంగానే ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది. ఇప్పటికే 12,000 మంది ఉద్యోగులను తొలగించనున్నట్లు సంస్థ సీఈవో కె.కృతివాసన్ ప్రకటించిన సమయంలో ఈ విషయం ప్రచారంలోకి రావడం గమనార్హం. ప్రస్తుతం ఐటీ రంగంలో డిమాండ్ తగ్గడం, కృత్రిమ మేధ నుంచి ముప్పు పొంచి ఉండటం వంటి అంశాలు ఉద్యోగాలపై ప్రభావం చూపిస్తున్నాయి. పరిశ్రమలో పెద్ద కంపెనీగా ఉన్న టీసీఎస్ పాటించే వ్యూహాలను సాఫ్ట్‌వేర్ రంగంలోని ఇతర సంస్థలు కూడా అనుసరించే అవకాశం ఉందని విశ్లేషకులు చెబుతున్నారు. ఇప్పటికే నియమించుకొన్న సీనియర్లను కూడా జాయిన్ చేసుకోవడంలో జాప్యం చేస్తోంది. ఇక పుణె, హైదరాబాద్, చెన్నై, కోల్‌కతాల్లోని బెంచ్‌పై నియమిత కాలం కంటే ఎక్కువగా ఉన్న సిబ్బందిని తొలగించే ప్రక్రియను మొదలుపెట్టింది. ఇప్పటికే ఉద్యోగులు 35 రోజులకు మించి బెంచ్‌పై ఉండ కూడదనే నియమాన్ని అమలుచేస్తోంది.ఇక కంపెనీ లోని పరిణామాలపై ఆ సంస్థ ఎటువంటి వ్యాఖ్యలు చేయలేదు. టీసీఎస్ చేపట్టిన తొలగింపుల్లో మధ్య, సీనియర్ స్థాయి లేఆఫ్ కంపెనీకి రూ.2,400నుంచి రూ.3,600 కోట్ల వరకు ఆదా చేయను న్నాయి. కాకపోతే ఈ లేఆఫ్‌లు ఒక్కసారిగా కాకుండా.. మెల్లగా ఒక క్రమపద్ధతిలో అమలు చేస్తామని సీఈవో వెల్లడించారు. టీసీఎస్ కంపెనీ ఉద్యోగుల్లో 2 శాతం ఉద్యోగులను తొలగించాలని నిర్ణయించిన విషయం తెలిసిందే. దాదాపు 12వేలకు పైగా ఉద్యోగాలకోత నిర్ణయంపై కేంద్ర ఐటీ మంత్రిత్వశాఖ దృష్టిసారించినట్లు తెలుస్తోంది. మొత్తం పరిస్థితిని కేంద్రం నిశితంగా గమనిస్తోందని, టెక్‌కంపెనీతో టచ్‌లో ఉన్నట్లు సంబంధిత వర్గాలు పేర్కొన్నాయి. గతవారమే ఈ వ్యవధిలో కంపెనీషేరు 30శాతం కుంగింది. నిఫ్టీ‌ఐటీ లోని ఐటీషేర్లలో ఇదే బలహీనంగా ఉందని విశ్లేషకులు చెబుతున్నారు.



# దివాలాకు 'బ్లూస్మార్ట్'

ముంబయి, జూలై 29: విద్యుత్ ట్యాక్సీ ఆపరేటర్ బ్లూస్మార్ట్ దివాలా ప్రక్రియను ప్రకటించింది. సుపరిపాలన, భద్రతాపూర్వక నిర్వహణపై లోపాలు తలెత్తడంతో సంస్థ దివాలాను ప్రకటించింది. సెండింట్ దయిన సహ వ్యవస్థాపకుడు వాహన కొనుగోళ్లకు సంబంధించిన నిధులు దుర్వినియోగంచేసిన ఆరో పణలు రావడం, ఆపై చట్టపరమైన దర్యాప్తులు జరగడంతో సంస్థ ఆర్థికపరిస్థితి దెబ్బతిన్నది. నేషనల్ కంపెనీ లా ప్రణాళిక పూర్తిగా అధారపడ్డంత వరకూ నిపుణులకు సహ కరించాలని ఆదేశించింది. జగ్గీ బ్రదర్స్ ఆధ్వర్యంలోబ్లూస్మార్ట్ మొబిలిటీ ఏర్పాటయింది. ఇదే కంపెనీ జెన్‌సోల్ ఇంజనీరింగ్‌ను కూడా ప్రమోట్‌చేసింది. ఒక పబ్లిక్ లిస్టెడ్ సోలార్ ఇంజనీరింగ్ సంస్థ అయిన బ్లూస్మార్ట్ దివాలాకు రావడం కూడా కార్పొరేట్ వర్గాల్లో చర్చనీయాంశం అయింది. ఎన్‌ఎస్‌ఈ బీఎస్‌ఈ కూడా జెన్సోల్ ఇంజనీరింగ్‌పై దివాలాప్రక్రియకు గత జూన్‌లోనే ఆమోదం తెలిపింది. జెన్సోల్‌కోసం పరిష్కార నిపుణుడిని కూడా నియమించారు. జెన్‌సోల్



ఐటీవలే ఢిల్లీ, ఎన్‌సిఆర్, బెంగళూరు నగరాల్లో సుమారు నాలుగువేల వాహనాలను లీజుప్రాతిపదికన నడుపుతోంది. వాటిని నెలవారీ అద్దెప్రాతిపదికన నామమాత్రపు బేస్‌ధరను చెల్లించేవిధంగా ఒప్పందం కింద వాహనాలు నడుపు తోంది. 2023లో బ్లూస్మార్ట్ మొబిలిటీ 15 కోట్ల నిధులు ఎన్సీ లీడ్వాగా సమీకరించింది. మార్చి 31నాటికి 64 లక్షల బకాయిలు ఉన్నాయి. ఏప్రిల్ 30వ తేదీనాటికి బకాయి చెల్లింపులు 63 లక్షలు కూడా చెల్లించలేక పోయింది. వివిధ ఫిన్‌టెక్ ప్లాట్‌ఫామ్‌ల ద్వారా సుమారు రూ.100 కోట్ల నిధులను సమీకరణ చినట్లు తెలుస్తోంది. చెల్లింపుల్లో బ్లూస్మార్ట్ నుంచి వస్తున్న విపరీత జాప్యం, ఆర్థికపరమైన అడ్డంకులు, కార్పొరేట్ దివాలాకు దారితీసాయనే కార్పొరేట్ వర్గాల్లో చర్చనడుస్తోంది. ట్రిబ్యునల్ ఐటీవల తన రూలింగ్‌లో ఎన్సీఎల్ దివాలా నిపుణులు, తాత్కాలిక పరిష్కార వృత్తినిపుణులు కూడా బ్లూస్మార్ట్ ఆపరేషన్ల తీసుకోవాలని ఆదేశించడంతో ఇప్పుడు కంపెనీ దివాలాప్రక్రియ వేగవంతం అయింది. అలాగే కంపెనీ ప్రమోటర్లు, యాజ మాన్యం కూడా దివాలాప్రక్రియకు పూర్తి సహకారం అందించాలని, దివాలా

# స్టాక్ సూచీలకు రియాల్టీ, ఫార్మా మద్దతు

ముంబై, జూలై 29: దేశీయ స్టాక్ మార్కెట్లు మంగళవారం లాభాలతో ముగించాయి. వరుసగా మూడు రోజులుగా కొనసాగుతోన్న నష్టాలకు బ్రేక్ పడింది. రియల్టీ, ఫార్మా రంగాలు సూచీలకు మద్దతుగా నిలిచాయి. ఉదయం 80,973.25 పాయింట్ల వద్ద సెన్సెక్స్ ప్రారంభమై, ఇంట్రాడేలో 80,665కు పడిపోయింది. చివరికి సెన్సెక్స్ 446పాయింట్లు పుంజుకొని 81,328 పాయింట్ల వద్ద నిలిచింది. నిఫ్టీ 140 పాయింట్ల లాభంతో 24,821 పాయింట్ల వద్ద నిలిచింది. డాలరుతో మారకంలో రూపాయి విలువ 15 పైసలు తగ్గి రూ.86.82గా ఉంది. జియో ఫైనాన్షియల్, లార్సెన్ అండ్ టూబ్రో, రిలయన్స్, ఏసియన్ పెయింట్స్, ఐషర్ మోటార్స్ వంటి షేర్లు లాభాల్లో ముగి సాయి. ఎస్‌బీఐ లైఫ్ ఇన్సూరెన్స్, యాక్సిస్ బ్యాంకు, టీసీఎస్, హెచ్‌డీఎఫ్‌సీ లైఫ్, టైటాన్ వంటి షేర్లు నష్టాల్లో ముగిసాయి. ఐటీ, మెటల్, రియల్టీ రంగాలపై ఇన్వెస్టర్లు ఆసక్తి చూపించడం ఈ లాభాలకు కారణమైంది. మార్కెట్ అస్థిరతను అంచనా వేసే విఐఎక్స్ సూచీ 2.9శాతం పడిపోయింది. యుఎస్ మార్కెట్లు లాభాల్లో ప్రారంభం అవుతాయనే సంకేతాలు ఈక్విటీ మార్కెట్లపై ప్రభావం చూపించాయి.



# మరింత వేగంగా ఐటిఆర్ రిఫండ్‌లు!

న్యూఢిల్లీ, జూలై 29: ఐటీ రిఫండ్‌లు వేగం పుంజుకొంటు న్నాయి. దీంతో, ఐటీ రిటర్నులు దాఖలు చేసి రిఫండ్‌ల కోసం నెలలు, రోజుల తరబడి ఎదురుచూపులు ఇక గతమే. ఎందుకంటే ఇప్పుడు అత్యంత వేగంగా రిఫండ్‌లు జారీ అవుతున్నాయి. ఈ ఏడాది పలువురు పన్ను చెల్లింపు దారులు తాము ఐటీ రిటర్నులు ఫైల్ చేసిన కేవలం 4గంటల వ్యవధిలోనే రిఫండ్‌లు పొందినట్లు చెబుతున్నారు. ఈ పరిణామం ఐటీఆర్ ప్రొసెసింగ్ విషయంలో పెను మార్పేనని చెప్పొచ్చు. 12ఏళ్ల క్రితం ఐటీ రిఫండ్‌లు పొందడానికి 90 రోజుల కంటే ఎక్కువ సమయం పట్టేది. కానీ, ఇప్పుడు డిజిటల్ రంగంలో మార్పులతో ఐటీఆర్ ప్రొసెసింగ్ ప్రక్రియ వేగవంతం కావడంతో ఆ సమయం రోజుల నుంచి గంటలకు తగ్గటం డటం పన్ను చెల్లింపుదారులకు ఉపశమనం కలిగించే అంశం. నోయిడాకు చెందిన అరుణ్ ప్రకాశ్ అనే వ్యక్తి ఐటీశాఖ ఈఫైలింగ్ పోర్టల్‌లో ఫారం 1 ద్వారా తన రిటర్న్ దాఖలు చేసినకేవలం 4గంటల్లోనేరిఫండ్ పొందినట్లు వెల్లడించారు. నేను సాయంత్రం 5.30గంటలకు సమయంలో నా రిటర్న్ దాఖలు చేశా. అదేరోజు రాత్రి 9.02 గంటలకు రిఫండ్ నా బ్యాంకు ఖాతాలో జమ అయింది అని పేర్కొంటూ సంబంధిత సమయాన్ని సూచించేలా స్క్రీన్‌షాట్‌ను షేర్ చేశారు. అలాగే, పన్నుల రంగంలో నిపుణుడు దీపక్ వర్మ మాట్లాడుతూ, తన క్లయింట్లలో చాలా మంది ఐటీఆర్ దాఖలు చేసిన అదేరోజు రిఫండ్ అందుకున్నట్లు చెప్పారు. ఇది ఐటీ శాఖ డిజిటల్ సామర్థ్యానికి గొప్ప ఉదాహరణ అని పేర్కొన్నారు. అయితే, ఐటీ రిటర్నులు దాఖలు చేసిన వారిలో ఎక్కువ మందికి ఇలా గంటల వ్యవధిలోనే రిఫండ్‌లు వస్తున్నాయా, లేదా? అన్న అంశంపై మాత్రం సమాచారం లేదు.




# వాణిజ్యం

# రూ.2838 కోట్లకు 'లెన్స్‌కార్ట్' ఐపిఒ

ముంబయి, జూలై 29: ఐపిఒకు వస్తున్న లెన్స్‌కార్ట్ మొత్తం కంపెనీ విలువలను రూ.10,891 కోట్లుగా నిర్ధారించిన వ్యవస్థాపకుడు పియూష్ బన్సాల్ కంపెనీ ఐపిఒ ద్వారా 2150 కోట్ల నిధులను సమీకరించేందుకు నిర్ణయించారు. 13.22 కోట్ల వాటాలను ఆఫర్‌ఫర్‌సేల్ పద్ధతిలో విక్రయించాలని నిర్ణయించారు. బన్సాల్ ఇతర ఇన్వెస్టర్ల మధ్య వాటాలు బదలీ రూ.52 చొప్పున బదలీకి కూడా నిర్ణయం జరిగింది. ఆఫర్‌ఫర్‌సేల్ కింద ఈ బదలీ రూ.688 కోట్ల విలువ ఉంది. బన్సాల్‌తో పాటు ప్రస్తుత వ్యవస్థాపకులు వాటాల్లో మొత్తం 1.53 శాతం వాటాలు కూడా ఓఎఫ్‌ఎస్‌లో ఉంటాయి. కంపెనీ మొత్తం విలువల్లో ఇప్పుడు వాటా 26శాతంగా ఉంటుందని అంచనా. బన్సాల్‌కు వాటా విక్రేతలు రూ.52 చొప్పున సెబీవద్ద డీఆర్‌హెచ్‌పీ దాఖలుకు ముందే బదలీ చేసారు. ఈ మొత్తమే రూ.688 కోట్లుగా ఉంది. దీనితో మొత్తం ఐపిఒ సొమ్ము రూ.2838 కోట్లు అని అంచనా వేసారు. గడచిన మూడేళ్లగా లెన్స్‌కార్ట్ సొల్యూషన్స్ 2943 కోట్ల ఈక్విటీనిధులను ఇన్వెస్టర్ల నుంచి సమీకరించింది. ప్రాధాన్యత షేర్ల బదలాయింపు, ఐపిఒ వంటి వాటికి ముందే ప్రమోటర్ల గ్రూపునకు 20శాతం వాటాలున్నాయి. ఈ వాటాలు బదలీ అనం తరం ఐపిఒ తర్వాత ప్రమోటర్ల వాటా కంపెనీలో 7.83 శాతా నికి తగ్గుతుంది. కంపెనీ 82.81 కోట్ల ప్రాధాన్యత వాటాలు 85.84 ఈక్విటీ వాటాలుగా బదలాయించనున్నది. ఐపిఒ ద్వారా వచ్చిన నిధుల్లో రూ.272.62 కోట్లనిధులను కంపెనీ సొంత స్టోర్లకు కేటాయిస్తోంది. లీజు చెల్లింపులకు 591.44కోట్లు, టెక్నాలజీ, క్లౌడ్ ఇన్‌ఫ్రాకు 213.37 కోట్లు, రూ.320 కోట్లు




బ్రాండ్ మార్కెటింగ్ నిర్దేశించింది. లెన్స్‌కార్ట్ రాబడులు 6652.5 కోట్లుగా ఉన్నాయి. తొలిత్రైమాసికం లో 297.34 కోట్లు ఆర్జించింది. గతసంవత్సర లాభాలకంటే పెరిగాయి.

# 32% పెరిగిన బ్యాంకు ఆఫ్ ఇండియా లాభం

ముంబయి,జూలై 29: ప్రభుత్వ రంగంలోని బ్యాంక్ ఆఫ్ ఇండియా నికరలాభాలు తొలి త్రైమాసికంలో 32శాతం పెరిగి 2252.1 కోట్లకు చేరాయి. అంతకుముందు ఏడాది ఇదేకాలంలో 1702.7 కోట్ల మాత్రమే వచ్చిన లాభాలు ఈ ఏడాది 32శాతం పెరిగాయి. నికరవడ్డీ ఆదాయం మాత్రం ఈ త్రైమాసికంలో 3శాతం తగ్గి 60681.1 కోట్లకు చేరింది. గత ఏడాది ఇదే త్రైమాసికంలో నికరవడ్డీ ఆదాయం 6275.8 కోట్లు ఆర్జించినసంగతి తెలిసిందే. బ్యాంకు స్థూల నిరర్థక ఆస్తులు 3.27శాతం నుంచి త్రైమాసికం వారీగా చూస్తే తగ్గాయి. 2.92శాతంగా నిలిచాయి. నికర నిరర్థక ఆస్తులువరుసగా చూస్తే 0.82శాతం నుంచి 0.75శాతానికి దిగి వచ్చాయి. నిర్వహణ లాభాలు 9శాతం పెరిగి 4009 కోట్లకు చేరాయి. కేటాయింపులు కూడా 15.2శాతంగా ఉన్నాయి. 1293 కోట్ల నుంచి 1096 కోట్లకు తగ్గించింది. కేటాయింపుల్లో క్షీణత 18శాతంగా ఉంది. 1338 కోట్లనుంచి 1096 కోట్లకు చేరడం వల్ల బ్యాంకు ఆర్థికపరిపుష్టిపెరిగింది. స్థూల నిరర్థక ఆస్తులు 19,640.2 కోట్లకు చేరాయి. నికర నిరర్థక ఆస్తులు కూడా 5358.49 కోట్ల నుంచి 4949.89 కోట్లకు తగ్గి బ్యాంకు ఆస్తి ఆప్పులపట్టీని పటిష్టం చేసింది.




Printed and Published by GireeshSanghi, CMD and Managing Editor on behalf of AGA Publications Ltd., at D.No. 396, Lower Tankbund, Hyderabad - 500 080 Phone : 2764 4999. Fax: 040-27642512, RNI No. 62142/95, Editor : *DamerlaSai Baba, *responsible for selection of news under the PRB Act. Regd.: No.HSD/337/21-22 Air Surcharge: Delhi : 40 Ps. Reproduction in whole or in part without written permission of the publisher is prohibited.